
శుక్రవారం 16-8-2024


సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 334
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



ప్రతీ ఒక్కరూ చాంపియనే

పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత అథ్లెట్ల బృందాన్ని గురువారం ప్రధాని మోదీ అభినందించారు. న్యూఢిల్లీలో అథ్లెట్ల బృందంతో ప్రధాని భేటీ అయ్యారు. పారిస్ క్రీడల్లో రెండు పతకాలు సాధించి కొత్త చరిత్ర లిఖించిన షూటర్ మనూ భాకర్.. ఒలింపిక్స్‌లో వినియోగించిన పిస్టల్‌ను ప్రధానికి చూపించింది.
13లో



జమ్మూకశ్మీర్ స్పెషల్ డీజీపీగా నళిన్

సీనియర్ ఐపీఎస్ అధికారి నళిన్ ప్రభాత్‌ను జమ్మూకశ్మీర్ స్పెషల్ డీజీపీగా ఎంపిక చేసింది. ఈయన ఏపీ కేడర్‌కు చెందినవారు.
వివరాలు 6లో ▸



'ఆసుపత్రి'లో విధ్వంసం

కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం జరిగిన హాస్పిటల్‌లో దుండగులు వీరంగం సృష్టించి నర్సులను పక్కకు నెట్టేశారు.
వివరాలు 6లో ▸



వ్యాప్తి చెందుతున్న ఎంపాక్స్

ప్రాణాంతక మంకీపాక్స్ ఆఫ్రికా దేశాలను వణికిస్తోంది. ఆయా దేశాల్లో డబ్ల్యూహెచ్‌వో ఆరోగ్య అత్యవసర పరిస్థితి విధించింది.
వివరాలు 6లో ▸



టి20 ప్రపంచకప్‌కు 'నో'

బంగ్లాదేశ్‌లో నిర్వహించాల్సిన మహిళల టి20 ప్రపంచకప్ ఆతిథ్యానికి భారత క్రికెట్ నియంత్రణ మండలి తిరస్కరించింది.
వివరాలు 13లో ▸


78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం ఢిల్లీలోని ఎర్రకోట నుంచి జాతినుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

లౌకిక పౌరస్మృతి

అది దేశానికి తక్షణావసరం: మోదీ.. రాజ్యాంగం, సుప్రీంకోర్టు చెప్పిందీ అదే

- ఇప్పుడున్నది మతపరమైన స్మృతి
- 75 ఏళ్లుగా దాన్నే భరిస్తూ వస్తున్నాం
- పంద్రాగస్టు ప్రసంగంలో కీలక వ్యాఖ్యలు
- ఉన్నతవిద్యకు గమ్యస్థానంగా భారత్
- అన్ని రంగాల్లోనూ అద్భుతాలు చేస్తున్నాం
- మహిళలపై అకృత్యాలకు ఉరే సరి

ఎర్రకోట నుంచి వరుసగా 11వ సారి జాతినుద్దేశించి మాట్లాడిన ప్రధాని

6లో

మన దేశంలో 75 ఏళ్లుగా మతపరమైన పౌరస్మృతి కొనసాగుతోందంటూ ప్రధాని మోదీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "అది వివక్షపూరితమైనది. రాజ్యాంగ స్ఫూర్తికి, సుప్రీంకోర్టు తీర్పులకూ విరుద్ధం" అంటూ పంద్రాగస్టు ప్రసంగంలో కుండబద్దలు కొట్టారు. ఎవరడ్డుకున్నా త్వరలో 'లౌకిక' పౌరస్మృతిని, 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'ను అమల్లోకి తెచ్చి తీరతామని ఎర్రకోట వేదికగా స్పష్టమైన ప్రకటన చేశారు. తమ హయాంలో దేశ ప్రగతిని విపక్షాలు ఓర్వలేకపోతున్నాయంటూ దుయ్యబట్టారు. కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారంతో పాటు పలు అంశాలను స్పృశిస్తూ ఏకంగా 98 నిమిషాల పాటు ప్రసంగించి రికార్డు నెలకొల్పారు.

ఐఏఎస్.. ఐపీఎస్‌ల ఆత్మ గౌరవంపై

ఆటవిక దాడి

అఖిలభారత సర్వీసు అధికారులే లక్ష్యంగా ఎర్రబుక్కు పైత్యం

బాబు తీరుపై దేశవ్యాప్తంగా మండిపడుతున్న సివిల్ సర్వెంట్లు

- రాజుని మించిన రాజభక్తి ప్రదర్శనలో మునిగి తేలుతున్న సీఎస్, డీజీపీలు.. పిచ్చోడి చేతిలో రాయిలా పాలన
- నైతిక పతనంలో కొత్త రికార్డులు బద్దలుకొడుతున్న కూటమి ప్రభుత్వం
- వల్లభాయ్ పటేల్ ప్రవచించిన 'స్టీల్ ఫ్రేమ్'కు తూట్లు పొడిచే కుయత్నం
- 10 మంది ఐఏఎస్, 16 మంది ఐపీఎస్‌లకు అడుగడుగునా అవమానాలు.. 2 నెలలుగా పోస్టింగులు ఇవ్వని ప్రభుత్వం
- ఐపీఎస్ అధికారులు రోజూ డీజీపీ ఆఫీసుకు రావాలంటూ మెమో
- ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు వెయిటింగ్ హాల్లో ఉండాలని ఆదేశం

2లో



వాళ్లు అఖిలభారత సర్వీసు అధికారులు.. ప్రజాసేవను వృత్తిగా ఎంచుకుని ఉన్నతమైన లక్ష్యాలతో ఎన్నో కఠినపరీక్షలు గెలిచి ఈ అత్యున్నత సర్వీసుకు ఎంపికైనవారు. అలాంటి గౌరవప్రదమైన రాజ్యాంగబద్ధ బాధ్యతలలో ఉన్న అధికారులను ఎలా చూడాలి? ఎవరి సామర్థ్యం ఏమిటో గుర్తెరిగి తగిన బాధ్యతలు అప్పగించడం ద్వారా మంచి ఫలితాలను సాధించడంపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి. కానీ చంద్రబాబు ప్రభుత్వం రూటు వేరు. నచ్చనివారికి నరకం చూపిస్తూ ఆనందించడం వారికి అలవాటు. అదిగో అందులో భాగంగానే గత ప్రభుత్వ హయాంలో బాగా పనిచేసిన ఓ పలువురు ఐఏఎస్ ఐపీఎస్‌లను ఎంచుకున్నారు. వారి ఆత్మగౌరవంపై ఆటవికంగా దాడిచేస్తున్నారు.. ఓ హోం గార్డుతోనో.. ఓ రాడీషీటరుతోనో కిందిస్థాయి అధికారులు కూడా వ్యవహరించని రీతిలో డీజీ స్థాయి అధికారులనూ ఈ ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా అవమానిస్తోంది. పోస్టింగ్ ఇవ్వకపోగా.. ఉదయం డీజీపీ ఆఫీసుకు వచ్చి సంతకం చేసి సాయంత్రం వరకు వెయిటింగ్ చేసి వెళ్లమంటున్నారు.. ఇందుకోసం ఏకంగా ఓ ఉత్తర్వు కూడా జారీ చేయడం చూసి యావత్ అఖిలభారత సర్వీసు అధికారులందరూ విస్తుపోతున్నారు. ఈ ఉన్మాద మెమో గురించి దేశమంతా చర్చించుకుంటోంది. ఇటువంటి దుర్మార్గమైన నిర్ణయం దేశ చరిత్రలో ఎవరూ తీసుకోలేదని మాజీ ఐపీఎస్ అధికారులు ప్రవీణ్‌కుమార్, స్వరణ్‌జిత్‌సేన్ వంటివారు వ్యాఖ్యానించారు.

న్యూస్‌రీల్

78 అడుగుల లోతులో జెండా ప్రదర్శన



స్వాతంత్య్ర సమరయోధులకు విశాఖలోని స్కూబా డైవర్లు ఘనంగా నివాళులర్పించారు. సముద్ర గర్భంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేశారు. రుషికొండ వద్ద సముద్రంలో 78 అడుగుల లోతున జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.
వివరాలు 14లో ▸

కూలీలను కబళించిన మృత్యు శకటం



కర్నూలు–హైదరాబాద్ హైవేపై కూలీల ఆటోను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు మృత్యువాతపడ్డారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో 17 మందికి గాయాలయ్యాయి.
వివరాలు 5లో ▸

పూల ధర.. జేబులదర



తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన కడియపులంక పూల మార్కెట్ శ్రావణ శోభతో కళకళలాడుతోంది. పూల దిగుబడికన్నా డిమాండ్ అధికంగా ఉండటంతో ధరలు మూడింతలు పెరిగాయి. వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల కొంతకాలంగా ఇబ్బందులు పడుతున్న పూల రైతులకు ప్రస్తుత ధరలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి.
వివరాలు 5లో ▸

ఎస్‌ఎస్‌ఎల్‌వీ డీ-3

ప్రయోగం నేడే



ఉదయం 9.17 గంటలకు ప్రారంభం

- 16.56 నిమిషాల్లో ప్రయోగం పూర్తి చేసేలా ప్రణాళిక
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలు
- ఎస్‌ఎస్‌ఎల్‌వీ సిరీస్‌లో ఇది మూడో ప్రయోగం
- షార్ కేంద్రం నుంచి 97వ ప్రయోగంగా నమోదు

సూళ్లూరుపేట/తిరుమల: తిరుపతి జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగవేదిక నుంచి శుక్రవారం ఉదయం 9.17 గంటలకు స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్‌ఎస్‌ఎల్‌వీ డీ3) ప్రయోగించేందుకు సిద్ధమైంది. ప్రయోగాన్ని 16.56 నిమిషాల్లో పూర్తి చేయనున్నారు. ప్రయోగ వేదికపై సిద్ధంగా ఉన్న రాకెట్‌కు అన్ని పరీక్షలను పూర్తి చేసే పనిలో ఇస్రో శాస్త్రవేత్తలు నిమగ్నమయ్యారు.ఏదైనా వాతావరణ పరిస్థితులను బట్టి ప్రయోగ సమయం కొద్దిగా మార్పు చేసే అవకాశం లేకపోలేదు. ఈ ప్రయోగానికి సంబంధించి గురువారం లాంచ్ రిహార్సల్స్ నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మిషన్ సంసిద్ధతా సమావేశం (ఎంఆర్ఆర్) నిర్వహించి
మిగతా 3వ పేజీలో ▶



పేదరికాన్ని పీ4తో

తరిమేస్తాం

78వ స్వాతంత్ర్య దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

- మా ప్రభుత్వంలో రాజకీయ కక్ష సాధింపులుండవు
- సూపర్ సిక్స్ హామీలకు కట్టుబడి ఉన్నాం
- పాత విధానంలో ఫీజు రీయింబర్స్‌మెంట్
- విజయవాడ, విశాఖలో మెట్రో రైల్ ప్రాజెక్టులను పట్టాలెక్కిస్తాం.. పెట్టుబడిదారులను వెనక్కి తీసుకొస్తాం
- మచిలీపట్నం, మూలపేట, రామాయపట్నం పోర్టులను పూర్తి చేస్తాం.. కొత్తగా కుప్పం, మూలపేట, చిలమత్తూరు, దొనకొండ ఇండస్ట్రియల్ క్లస్టర్స్
- ప్రపంచస్థాయి డిజైన్లతో సంపద సృష్టించే రాజధాని నిర్మాణం
- ఇక నుంచి జనాభా వృద్ధిపై దృష్టి పెట్టాలి

10లో

విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న సీఎం చంద్రబాబు

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

రాష్ట్ర వ్యాప్తంగా వేసవిని తలపిస్తోన్న వాతావరణం.. మరో 3 రోజులు ఇదే పరిస్థితి

- బంగాళాఖాతంలో తుపాను ప్రభావం..
- గాలిలో తేమ శాతం పెరగడం వల్లే ఇలా
- అత్యధికంగా నెల్లూరు జిల్లాలో 38 డిగ్రీల ఉష్ణోగ్రత
- పశ్చిమ గోదావరి జిల్లాలో 89 శాతం గాలిలో తేమ
- రానున్న మూడు రోజుల్లో భారీగా వర్షాలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. వర్షాలు అధికంగా ఉన్న కోస్తా జిల్లాలతో పాటు కనీస వర్షపాతం నమోదు కాని రాయలసీమ జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పగటిపూట ఉష్ణోగ్రతలు పెరిగాయి. రాయలసీమ జిల్లాల్లో సగటున 35 డిగ్రీల ఉష్ణోగ్రత.. కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో 34 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. తాజా ఉష్ణోగ్రతలు వేసవిని తలపిస్తున్నట్టు జనం వాపోతున్నారు. విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, అనంతపురం, కర్నూలు తదితర ప్రాంతాల్లో ఉక్కపోత మరింత ఎక్కువగా ఉన్నట్టు వాతావరణ శాఖ చెబుతోంది. ఉక్కపోత కారణంగా వేసవి తరహాలో గృహ విద్యుత్ వినియోగం పెరిగినట్టు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఏసీల వినియోగం ఆగస్టులో తీవ్రంగా పెరిగినట్టు తేలింది. రానున్న రెండు రోజుల్లో బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా
మిగతా 2వ పేజీలో ▶

'మెడికల్' ద్రోహం!

- నూతన ప్రభుత్వ కాలేజీలకు అనుమతులపై చేతులెత్తేసిన కూటమి సర్కార్
- అండర్ టేకింగ్ ఇస్తే ఎంబీబీఎస్ ప్రవేశాలకు అనుమతి: ఎన్‌ఎంసీ
- ముగిసిన గడువు.. ప్రభుత్వం నుంచి స్పందన శూన్యం

2లో

ఆరోగ్యశ్రీ సేవలకు బ్రేక్

- కేవలం ఎమర్జెన్సీ కేసుల్లో మాత్రమే చికిత్సలు
- సాధారణ రోగులకు తీవ్ర ఇబ్బందులు.. నేడు మంత్రులతో ఆశా ప్రతినిధుల భేటీ

3లో

ఐఏఎస్, ఐపీఎస్‌ల ఆత్మగౌరవంపై ఆటవిక దాడి


అఖిల భారత సర్వీసు అధికారులే లక్ష్యంగా ప్రభుత్వ వేధింపులు

10 మంది ఐఏఎస్, 16 మంది ఐపీఎస్‌లకు పోస్టింగులు ఇవ్వకుండా సర్కారు సాధింపు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో టీడీపీ కూటమి కక్షపూరిత రాక్షస పాలన కరాళ నృత్యం చేస్తోంది. ఓ పక్క ప్రజలపైనే టీడీపీ శ్రేణులు రాత్రీ పగలూ దాడులతో భయంకర వాతావరణాన్ని సృష్టిస్తుంటే.. ఇంకో పక్క ప్రభుత్వమే అధికారులపై పడింది. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఇతర కీలక అధికారులపై నారా లోకేశ్ విరచిత రెడ్ బుక్ రాజ్యాంగంతో విరుచుకుపడుతోంది. వెంటపడి వేధిస్తోంది. వారిపట్ల నిరంకుశంగా, దుర్మార్గంగా వ్యవహరిస్తూ, అవమానాలకు గురిచేస్తూ రాజ్యాంగ హక్కులను కాలరాస్తోంది. అఖిల భారత సర్వీసుల అధికారుల ఆత్మాభిమానంపై ఆటవిక దాడి చేస్తోంది. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని రీతిలో ఏపీలోని చంద్రబాబు కూటమి ప్రభుత్వ పోకడలపై జాతీయ స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. 'ఏ పార్టీ అధికారంలో ఉందన్న దానితో సంబంధం లేకుండా ప్రభుత్వ విధానాలను అమలు చేయడం, రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి చోదక శక్తిగా వ్యవహరించేందుకు దేశంలో ప్రత్యేకంగా అఖిల భారత సర్వీసులకు రూపకల్పన జరిగింది. ఈ ఉన్నతాశయాన్ని చంద్రబాబు ప్రభుత్వం కాలరాస్తోంది. పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడుతోంది' అని సీనియర్ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దుష్ట సంప్రదాయానికి తెరతీసిన చంద్రబాబు

రాష్ట్రంలో టీడీపీ కూటమి గెలుపొంది, సీఎంగా బాధ్యతలు స్వీకరించక ముందే చంద్రబాబు దుష్ట సంప్రదాయాలకు తెరతీశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కేఎస్ జవహర్ రెడ్డిని బలవంతంగా సెలవుపై పంపారు. అనంతరం ఏకంగా 10 మంది ఐఏఎస్ అధికారులు, 23 మంది ఐపీఎస్ అధికారులకు రెండు నెలలుగా పోస్టింగులు ఇవ్వకుండా వేధిస్తున్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వమూ ఇంత కక్షపూరితంగా, నిరంకుశత్వంతో వ్యవహరించలేదు. ప్రభుత్వం మారిన తరువాత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను బదిలీ చేయడం సహజమే. కొత్త ప్రభుత్వం తన ప్రాధాన్యతల ప్రకారం అధికారులకు పోస్టింగులు ఇస్తుంది. కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌లను సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)లో రిపోర్ట్ చేయమని కూడా ఆదేశిస్తుంది. ఆ తరువాత కొద్ది రోజులకే వారికి ఇతర ప్రాంతాల్లో పోస్టింగులు ఇచ్చి, వారి సేవలను సద్వినియోగం చేసుకుంటుంది. అంతేగానీ ఏకంగా ఇన్నేసి రోజులు పోస్టింగులు ఇవ్వకుండా పక్కన కూర్చోబెట్టదు.





Office of the Director General of Police, Andhra Pradesh, Mangalagiri.

Rc.No.854/G1/2024 Date: 12-08-2024

MEMORANDUN


Sub: Certain instructions to IPS officers (Waiting) - Issued.

The IPS officers in the enclosed list, who are waiting for posting are instructed to attend O/o DGP, A.P., Mangalagiri regularly at 10:00 AM and sign in the attendance register available in the officers waiting room. The officers should also sign in the attendance register before leaving the office after office hours without fail. They are also instructed to be readily available to attend to any urgent work assigned by the undersigned.

Director General of Police

To
The Officers waiting for posting
(List enclosed)

వెయిటింగ్‌లో ఉన్న 16 మంది ఐపీఎస్ అధికారులు రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ డీజీపీ కార్యాలయం లోని వెయిటింగ్ హాల్లో ఉండాలని... ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రిజిస్టర్ లో సంతకాలు చేయాలని ఆదేశిస్తూ డీజీపీ జారీ చేసిన మేమో



Dr.RS Praveen Kumar @RSPraveen... · 2h
Something is terribly wrong with @APPOLICE100. Last month there was a criminal case on two DGP rank officers. Now not less than 16 #IPS officers have been made to wait for regular posting for so many days!

And now this memo of DGP further rubs salt on the wounds. It says these sixteen cops should be confined to a 'waiting room' from morning to evening and above all, they should also sign before they leave this 'waiting room'. Vendetta and nonsense of highest order!!!

What do these sixteen(16) do while they wait in a room? Wait for the call to attend any urgent work? Or gossip? Or meditate?? Or cry over each other's shoulders??? Or become Guinea pigs in a #Stanford style experiment in psychology?

Even if these sixteen are given posting at a later date, they will anyway claim the salary for compulsory wait in this 'gas chamber' called waiting room!

ఏపీ లో ఐపీఎస్ అధికారులకు పోస్టింగులు ఇవ్వకుండా వేధించడాన్ని వ్యతిరేకిస్తూ రిటైర్డు ఐపీఎస్ అధికారి ప్రవీణ్ కుమార్ తన సోషల్ మీడియా లో పెట్టిన పోస్టు

అపాయింట్‌మెంటూ ఇవ్వని బాస్‌లు

సాధారణంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు వారి బాస్‌లైన సీఎస్, డీజీపీలను అపాయింట్‌మెంట్ అడిగి కలిసే వీలుంటుంది. తమ సర్వీసుకు సంబంధించిన సమస్యలు, ఇతరత్రా విషయాలను వారు సీఎస్, డీజీపీల దృష్టికే తీసుకువెళ్లాలి. వాటిని సరైన దృక్పథంతో పరిశీలించాల్సిన బాధ్యత సీఎస్, డీజీపీలపై ఉంది. కానీ సీఎం చంద్రబాబు చెప్పడంతో ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు సీఎస్, డీజీపీ రెండు నెలలుగా అపాయింట్‌మెంటే ఇవ్వడం లేదు. ఇక్కడితోనూ చంద్రబాబు రెడ్ బుక్ దాహం తీరలేదు. ఐపీఎస్ అధికారులను మరింతగా అవమానించాలని పట్టుబట్టారు. ఆ మేరకు టీడీపీ ప్రధాన కార్యాలయం నుంచి డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావుకు ఆదేశాలు వెళ్లాయి. దాంతో డీజీపీ ఈ నెల 12న ఓ విభ్రాంతికరమైన మెమో జారీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న 23 మంది ఐపీఎస్ అధికారుల్లో 16 మందికి ప్రతి రోజూ డీజీపీ కార్యాలయానికి రావాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 'ఉదయం 10 గంటలకు వచ్చి వెయిటింగ్ హాల్లో ఉన్న రిజిస్టర్‌లో సంతకం చేయాలని, సాయంత్రం 5 గంటల వరకు అక్కడే ఉండి, మళ్లీ ఆ రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లాలి' అని ఆదేశించారు. రాష్ట్రంలో అత్యంత సీనియర్ ఐపీఎస్ అధికారి అయిన డీజీపీ కేవలం రాజకీయ ఒత్తిడితో సాటి అధికారులను ఈ విధంగా ఆదేశించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



Iyr Krishna Rao
ఆమె ఎటువంటి ఆఫీసరో నాకు తెలియదు కాని, ఆఫీసర్ల పోస్టింగులు వెంకట రెడ్డి గారి ట్వీట్, ఎల్లో మీడియా పోస్టు నిర్ణయించే స్థితి ఈనాటి పరిస్థితికి అద్దం పడుతున్నది.

అనంతపురం జెసిగా హరిత పోస్టింగ్ రద్దు

వెంకటరమణారెడ్డి ట్వీట్ నేపథ్యంలో నిర్ణయం!



టీడీపీ నేత వెంకటరెడ్డి ట్వీటో, ఎల్లో మీడియా పోస్టులో రాష్ట్రంలో అధికారుల పోస్టింగులను నిర్ణయించడం ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత దుస్థితికి అద్దంపడుతోంది.

– అనంతపురం జాయింట్ కలెక్టర్‌గా హరితకు పోస్టింగ్ ఇచ్చి, ఆ వెంటనే ఉత్తర్వులను ఉపసంహరించిన ఉదంతంపై రిటైర్డ్ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు

గత రెండు నెలలుగా రాష్ట్రంలో చాలా సంక్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయి. ఓ వైపు సామాన్యులే లక్ష్యంగా టీడీపీ గూండాలు వరుస హత్యలు, హత్యాయత్నాలు, అత్యాచారాలతో బీభత్సం సృష్టిస్తుంటే.. మరోవైపు చంద్రబాబు ప్రభుత్వం అధికారిక కక్ష సాధింపులు, వేధింపులకు అఖిల భారత సర్వీసు అధికారులు బాధితులుగా మారడం విభ్రాంతి కలిగిస్తోంది.

– ఓ సామాజిక విశ్లేషకుడి అభిప్రాయమిది

టీడీపీ సోషల్ మీడియా వద్దంటే.. వద్దు

పోస్టింగులు ఇచ్చి మరీ ఉపసంహరణ



Anam Venkata Ramana... @anamramana
Conferred IAS Haritha garu worked in Nellore as commissioner, one of the most corrupted ias officers i have come across.Architect of the tdr scam in tirupati corporation.

అనంతపురం జేసీగా హరిత నియామకాన్ని వ్యతిరేకిస్తూ టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డి ఎక్స్‌లో పెట్టిన పోస్టు



Anam Venkata Ramana Reddy @a... · 1d
Conferred IAS posting of Haritha garu cancelled as joint collector ananthapur.

అనంతపురం జేసీగా హరిత నియామకాన్ని ప్రభుత్వం ఉపసంహరించు కుందని టీడీపీ నేత ఆనం వెంకటరమణా రెడ్డి పెట్టిన పోస్టు

చంద్రబాబు ప్రభుత్వ దిగజారుడుతనానికి మరో ఉదాహరణ టీడీపీ సోషల్ మీడియా విభాగం ఆడమన్నట్టల్లా ఆడటం. ఎవరికైనా పోస్టింగు ఇవ్వొద్దని టీడీపీ సోషల్ మీడియా కార్యకర్త ఎవరైనా సోషల్ మీడియాలో పోస్టు పెడితే చాలు ఆ అధికారిని ప్రభుత్వం పక్కన పెట్టేస్తోంది. బదిలీ ఉత్తర్వులను ఉపసంహరించుకుంటోంది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదిని కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ టీడీపీ సోషల్ కార్యకర్తలు పోస్టులు పెట్టారు. అంతే.. ప్రభుత్వం గోపాలకృష్ణ ద్వివేదికి పోస్టింగు ఇస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకుంది. జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఆయన్ని ఆదేశించింది. మహిళా అధికారి డి.హరితను అనంతపురం జేసీగా నియమించిన 24 గంటల్లోనే ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకోవడం తాజా ఉదాహరణ. తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన డి.హరిత కొద్ది నెలలుగా వెయిటింగ్‌లో ఉన్నారు. ప్రభుత్వం ఆమెను రెండు రోజుల క్రితం అనంతపురం జేసీగా నియమించింది. వెంటనే టీడీపీ నేతలు, సోషల్ మీడియా కార్యకర్తలు వ్యతిరేకించారు. అంతే.. 24 గంటల్లోనే ఆమె పోస్టింగ్ ఉత్తర్వులను ప్రభుత్వం వెనక్కు తీసుకొని, జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. అధికారుల పోస్టింగులు, బదిలీలు రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారం. కానీ చంద్రబాబు వాటిని టీడీపీ ప్రధాన కార్యాలయం వ్యవహారంగా దిగజార్చేశారని అఖిలభారత సర్వీసు అధికారులు మండిపడుతున్నారు.

రాజ్యాంగహక్కుల ఉల్లంఘనే.. డీవోపీటీకి నివేదిక..!

చంద్రబాబు ప్రభుత్వం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపట్ల అమానవీయంగా, కర్కశంగా వ్యవహరించడం అధికారులుగానే కాదు.. పౌరులుగా కూడా వారి రాజ్యాంగపరమైన హక్కుల ఉల్లంఘనేనన్న విమర్శలు వస్తున్నాయి. వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులుగా, డీజీపీలుగా, ఉన్నత హోదాల్లో పని చేసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు టీడీపీ కూటమి ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబడుతున్నారు. చంద్రబాబు, లోకేశ్‌ల కక్షపూరిత చర్యలను ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరిట టీడీపీ కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాన్ని వాట్సాప్ గ్రూపుల్లో, ప్రైవేటు సంభాషణల్లో నిరసిస్తున్నారు. అఖిల భారత సర్వీసు అధికారుల సర్వీసు నిబంధనలను పర్యవేక్షించే కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రెనింగ్ (డీవోపీటీ) దృష్టికి ఈ వ్యవహారాన్ని తీసుకెళ్లాలని కూడా నిర్ణయించారు.

వెయిటింగ్ మెమో.. ఇదేమి పద్ధతి?

ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు పోస్టింగ్ ఇవ్వనప్పుడు వారిని సచివాలయంలోని సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)లో రిపోర్ట్ చేయమని ఆదేశిస్తారు. తరువాత కొద్ది రోజులకే వారికి పోస్టింగులు ఇస్తారు. ఇటీవల పోస్టింగులు ఇవ్వని 16 మంది ఐపీఎస్ అధికారులను కూడా జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. తాజా ఆదేశాల ప్రకారం వారు రోజూ డీజీపీ కార్యాలయానికి రావాలి. వెయిటింగ్ హాల్లో పడిగాపులు కాయాలి. అన్ని గంటలపాటు వారు ఏం చేస్తారు అన్న కనీస జ్ఞానం కూడా చంద్రబాబు సర్కారుకు లేదు. ఇలా అధికారులను రోజుకో రీతిలో అవమానిస్తూ చంద్రబాబు ఓ రాజకీయ సైకోలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హోమ్‌గార్డు స్థాయి ఉద్యోగి పట్ల కూడా గతంలో ఏ ప్రభుత్వమూ ఈ రీతిలో వ్యవహరించలేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఇవీ ఉత్తమ సంప్రదాయాలు

వైఎస్ రాజశేఖర రెడ్డి 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత అప్పటికే చంద్రబాబు ప్రభుత్వంలో సీఎస్‌గా వ్యవహరించిన మోహన్ కందానే సీఎస్‌గా కొనసాగించారు. ఆయన రిటైరయ్యే వరకు ఆ పోస్టులోనే ఉన్నారు. 2019లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా అంతకు ముందు టీడీపీ ప్రభుత్వంలో కీలక స్థానాల్లో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు కీలక పోస్టింగులు ఇచ్చింది. చంద్రబాబు హయాంలో సీఎం కార్యాలయంలో విధులు నిర్వర్తించిన సీనియర్ ఐఏఎస్ అధికారులు సాయి ప్రసాద్‌ను కీలకమైన సీసీఎల్ఏ కార్యదర్శిగా, సతీష్‌చంద్రను ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. టీడీపీ ప్రభుత్వంలో డీజీపీగా చేసిన ఆర్పీ ఠాకూర్‌ను ఆర్టీసీ ఎండీగా నియమించి, ఆయన రిటైరైన తరువాత కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్ సభ్యుడిగానూ నియమించింది. టీడీపీ రాజ్యసభ సభ్యుడి సమీప బంధువైన ఐపీఎస్ అధికారి కోయ ప్రవీణ్‌ను గ్రేహౌండ్స్ ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చింది. అంతేగానీ ఎవరికీ పోస్టింగు ఇవ్వకుండా వెయిటింగ్‌లో ఉంచలేదు. చంద్రబాబు ఆ సత్సంప్రదాయాలను తుంగలో తొక్కింది.

మూర్ఖమైన నిర్ణయం



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలీసు అధికారులను వేధిస్తోంది. ఇటువంటి దుర్మార్గమైన, హేయమైన నిర్ణయం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోగానీ దేశ చరిత్రలోగానీ ఎవరూ తీసుకోలేదు. ఏపీ, తెలంగాణలో పరిస్థితులు దారుణంగా దిగజారిపోయాయి. గొంతు విప్పలేనివారు, బలహీనవర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఏపీ ప్రభుత్వం గత నెల ఇద్దరు డీజీపీ స్థాయి అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసింది. ఏకంగా 16 మంది ఐపీఎస్ అధికారులకు రెండు నెలలుగా పోస్టింగులు ఇవ్వకుండా అవమానిస్తోంది. వారి గాయాలపై కారం చల్లేలా ఏపీ డీజీపీ తాజాగా మెమో జారీ చేశారు. రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు డీజీపీ ఆఫీసులోనే ఉండాలని ఆదేశించడం కేవలం కక్ష సాధింపు చర్యే. అధికారంలో ఉన్న రాజకీయ నేతలను సంతృప్తి పరిచేందుకే ఈ మెమో జారీ చేశారు. ఇది అత్యున్నత స్థాయిలో తీసుకున్న మూర్ఖపు నిర్ణయం. వెయిటింగ్ హాల్లో కూర్చొని ఆ అధికారులు ఏం చేయాలి? గాసిప్పులు మాట్లాడుకోవాలా? ధ్యానం చేయాలా? సీనియర్ అధికారులను వెయిటింగ్ హాల్లో కూర్చోబెట్టడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుంది. బదిలీ చేసిన వారికి ఎక్కడో ఒక చోట పోస్టింగు ఇచ్చి వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రవీణ్ కుమార్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి

ఏపీ ప్రభుత్వ చర్య అసంబద్ధం



ఆంధ్రప్రదేశ్‌లో పలువురు ఐఏఎస్, ఐపీఎస్‌లకు రెండు నెలలుగా పోస్టింగులు ఇవ్వకుండా వేధిస్తుండడం అసంబద్ధమైన చర్య. ఏపీ ప్రభుత్వ చర్యలు నిబంధనలకు విరుద్ధం కూడా. డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్ హాల్లో ఉండాలని 16 మంది ఐపీఎస్ అధికారులను ఆదేశించడం ఏమిటి? దేశంలో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి అసంబద్ధమైన ఆదేశాలు జారీ చేయలేదు. ఎంతో ప్రజాధనాన్ని వెచ్చించి ఆ అధికారులకు భారత ప్రభుత్వం శిక్షణ ఇచ్చింది. వారిని పక్కన కూర్చోబెడితే రాష్ట్రానికి, దేశానికే నష్టం. వారి సేవలను ఏదో రూపంలో సద్వినియోగం చేసుకోవాలి. బదిలీ చేసిన వారికి ఏపీ ప్రభుత్వం తక్షణం పోస్టింగులు ఇవ్వాలి.

– స్వరణ్ జీత్ సేన్, ఉమ్మడి ఏపీ రిటైర్డ్ డీజీపీ

'మెడికల్' ద్రోహం!

నూతన ప్రభుత్వ కాలేజీలకు అనుమతులపై చేతులెత్తేసిన కూటమి సర్కార్

- అండర్ టేకింగ్ ఇస్తే ఎంబీబీఎస్ ప్రవేశాలకు అనుమతులిస్తామన్న ఎన్ఎంసీ
- ముగిసిపోయిన గడువు.. ప్రభుత్వం నుంచి స్పందన శూన్యం
- వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడమే లక్ష్యంగా అడుగులు
- 2024–25లో ఐదు కాలేజీలు మొదలైతే అదనంగా 500 సీట్లు అందుబాటులోకి



పులివెందుల వైద్యకళాశాల

సాక్షి, అమరావతి: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయడమే ఏకైక లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి సర్కారు కొత్త కళాశాలలకు అనుమతులు రాబట్టకుండా పేద విద్యార్థులకు తీరని ద్రోహం తలపెట్టింది. గత ప్రభుత్వం శ్రీకారం చుట్టిన 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు సీఎం చంద్రబాబు సిద్ధమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభం కావాల్సిన ఐదు కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుమతులపై తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి మదనపల్లె, మార్కాపురం, పులివెందుల, ఆదోని, పాడేరు వైద్య కళాశాలల్లో ఒక్కో చోట 100 ఎంబీబీఎస్ సీట్లతో తరగతులు ప్రారంభించాల్సి ఉంది. ఈమేరకు గత ప్రభుత్వం ఈ ఐదు చోట్ల సెకండరీ కేర్ ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా అభివృద్ధి చేయడంతో పాటు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిబంధనలకు అనుగుణంగా పోస్టులను గతంలోనే మంజూరు చేశారు. పోస్టుల భర్తీ దాదాపుగా పూర్తయిన సమయంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. మొదటి ఏడాది ఎంబీబీఎస్ విద్యార్థుల అకడమిక్ కార్యకలాపాల కోసం లెక్చర్ హాల్, ల్యాబ్, హాస్టల్స్, క్యాంటీన్ల నిర్మాణం లాంటి పనులన్నీ దాదాపుగా పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో గత జూన్ 24న ఎన్ఎంసీ బృందాలు ఈ ఐదు కళాశాలల్లో తనిఖీలు నిర్వహించాయి. మదనపల్లెలో 12 శాతం, పాడేరు, మార్కాపురం, పులివెందుల, ఆదోనిల్లో కొంత మేర ఫ్యాకల్టీ, ఇతర వనరులను కల్పించాల్సి ఉన్నందున అనుమతులను నిరాకరిస్తున్నట్లు జూలై 6న కళాశాలలకు సమాచారం ఇచ్చింది. అయితే వనరుల కల్పనకు ఎటువంటి చర్యలు తీసుకోకుండా నాన్చిన కూటమి సర్కారు చివరి నిమిషంలో మొక్కుబడిగా అప్పీల్‌కు వెళ్లింది.

అండర్ టేకింగ్ ఇవ్వకపోవడంతో..

కొత్త వైద్య కళాశాలలకు అనుమతులపై అప్పీల్ చేసిన నేపథ్యంలో పులివెందుల కళాశాలలో ఎన్ఎంసీ వర్చువల్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించింది. అయితే తాము జూన్ 24న ఇన్‌స్పెక్షన్ చేసినప్పటి పరిస్థితులే ఇంకా ఉన్నాయని, అంతకు మించి పెద్దగా పురోగతి లేదని ఎన్ఎంసీ ప్రతినిధులు గుర్తించినట్లు తెలిసింది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అండర్ టేకింగ్ ఇస్తే 50 ఎంబీబీఎస్ సీట్లను మంజూరు చేస్తామని గత వారం కళాశాలలకు ఎన్ఎంసీ సమాచారం ఇచ్చింది. అండర్ టేకింగ్ అంటే కళాశాలలో తరగతుల నిర్వహణ, అకడమిక్ కార్యకలాపాలకు అవసరమైన వసతులన్నింటినీ ప్రభుత్వం సమకూరుస్తుందని గ్యారంటీ ఇవ్వడం. అయితే అండర్ టేకింగ్ గడువు కూడా ఈనెల 12వతేదీతో ముగిసింది. దీనిపై వైద్యశాఖ సమాచారం ఇచ్చినా ప్రభుత్వం నుంచి స్పందన లేదని తెలిసింది.



Gmail

Decision of Appeal committee of NMC in matter of appeal for starting/ increase of seats in Under Graduate Course (MBBS)

అండర్ టేకింగ్ ఇస్తే ఎంబీబీఎస్ అడ్మిషన్లకు అనుమతి ఇస్తామని పులివెందుల వైద్య కళాశాలకు ఎన్ఎంసి నుంచి వచ్చిన మెయిల్ కాపీ

పట్టుబట్టి సాధించిన వైఎస్ జగన్

గతేడాది ఏలూరు, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, నంద్యాల కళాశాలలకు తొలి దశ తనిఖీల్లో అనుమతులు రాకపోవడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పీల్‌కు వెళ్లి అండర్ టేకింగ్ ఇచ్చింది. తద్వారా ఆ నాలుగు కళాశాలలకు వైఎస్ జగన్ అప్పట్లో పట్టుబట్టి అనుమతులు రాబట్టారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మాత్రం అండర్ టేకింగ్ ఇవ్వలేదు. ఇక మిగిలిన నాలుగు కొత్త కళాశాలల్లో వర్చువల్ ఇన్‌స్పెక్షన్ కూడా జరగలేదు. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంది. బీజేపీకి చెందిన సత్యకుమార్ రాష్ట్రంలో వైద్య శాఖ మంత్రిగా ఉన్నా కొత్త వైద్య కళాశాలలకు అనుమతుల విషయాన్ని పట్టించుకోకపోవడంపై వైద్య వర్గాల్లో చర్చ జరుగుతోంది. వైద్య కళాశాలలకు అనుమతులపై సందిగ్ధత కొనసాగుతున్న క్రమంలో ఆల్ ఇండియా కోటా, రాష్ట్ర కోటా కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలైంది. గతేడాది వైఎస్సార్ సీపీ హయాంలో ఐదు కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఒక్కోచోట 150 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున మొత్తం 750 సీట్లు అదనంగా రాష్ట్రానికి సమకూరాయి. ఇక ఈ ఏడాది ఐదు కొత్త కళాశాలల్లో ఒక్కోచోట 100 చొప్పున 500 సీట్లు సమకూరుతాయని విద్యార్థులు, తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కొత్త కళాశాలలకు అనుమతులు లభిస్తే 75 సీట్లు ఆల్ ఇండియా కోటా కింద పోగా మిగిలిన 425 సీట్లు పూర్తిగా మన రాష్ట్ర విద్యార్థులకే దక్కే పరిస్థితి ఉండేది. తద్వారా పేద, మధ్య తరగతి విద్యార్థుల వైద్య విద్య కల నెరవేరి అందుబాటులోకి వచ్చే వైద్యుల సంఖ్య పెరిగేది.

ఆశలు ఆవిరి..

నీట్ యూజీ–2024లో 598 మార్కులు సాధించా. కడప రిమ్స్ లేదా పులివెందుల కాలేజీలో సీటు సాధిస్తే అమ్మనాన్నలకు దగ్గరగా ఉండి ఎంబీబీఎస్ చదవచ్చని భావించా. పులివెందుల మెడికల్ కళాశాలలో ప్రవేశాలపై స్పష్టత లేదు. రాష్ట్రంలో ఈ ఏడాది ఐదు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు కొత్తగా ఏర్పాటైతే అదనంగా 500 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వస్తాయని ఎంతోమంది విద్యార్థులు ఆశ పెట్టుకున్నారు. గతంలో హామీ ఇచ్చిన ప్రకారం సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయాలి.

– పెద్దిరెడ్డి వెంకట కేదార్‌నాథ్‌రెడ్డి, పోరుమామిళ్ల, వైఎస్సార్ జిల్లా

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

▶ మొదటి పేజీ తరువాయి

ఇలాంటి పరిస్థితి నెలకొందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. తుపానుకు రెండు రోజుల ముందు ఉష్ణోగ్రతల్లో తీవ్ర మార్పులు ఉంటాయని చెబుతున్నారు. బంగాళాఖాతంలో పీడనం తగ్గినప్పుడు గాలిలో తేమ శాతం పెరుగుతుంది. దీనివల్ల ఉష్ణోగ్రతలు ఓ మోస్తరుగా ఉన్నా ఉక్కపోత ఎక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అందువల్ల విపరీతంగా చెమటలు పట్టడం, ఎక్కువ దాహంగా ఉండటం కనిపిస్తుందంటున్నారు.

ఈనెల 18 వరకు రాష్ట్రంలో సగటు ఉష్ణోగ్రతల నమోదు అంచనా

జిల్లా	ఉష్ణోగ్రత (సెంటీగ్రేడ్)	హ్యుమిడిటీ (గాలిలో తేమ శాతం)
శ్రీకాకుళం	32.5	86
చిత్తూరు	35.2	81
అనంతపురం	35.6	88
కర్నూలు	35.2	86
వైఎస్సార్ జిల్లా	34.3	85
నెల్లూరు	38	82
ప్రకాశం	37.2	81
గుంటూరు	36.6	84
కృష్ణా	36.3	88
పశ్చిమ గోదావరి	34.4	89
తూర్పు గోదావరి	34.6	86
విశాఖపట్నం	36.4	88
విజయనగరం	36.2	87

రానున్న రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు

రాష్ట్రంలో రానున్న రెండు మూడు రోజుల్లో తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ చెబుతోంది. పార్వతీపురం మన్యం, అల్లూరు సీతారామరాజు, శ్రీ సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో వర్షం ప్రభావం ఎక్కువగా ఉంటుందని అనంతపురంలోని రేకుల కుంట వాతావరణ కేంద్రం అంచనా వేసింది. వాతావరణ శాఖ కొన్ని జిల్లాల్లో ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేసింది. తుపాను అనంతరం ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 'గాలిలో తేమ శాతం ఎంత ఎక్కువగా ఉంటే అంత ఉక్కపోత ఉంటుంది. దీనికి ప్రధాన కారణం బంగాళాఖాతంలో వాయు గుండం ప్రభావమే. వాతావరణంలో మార్పులు కూడా ఈ పరిస్థితికి కారణం' అని రేకులకుంట వాతావరణ కేంద్రం శాస్త్రవేత్త విజయశంకర్ బాబు తెలిపారు.


రోజా, కృష్ణదాస్‌పై విచారణకు సీఐడీ ఆదేశం




సాక్షి, అమరావతి: 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం పేరిట మాజీ మంత్రులు ఆర్కే రోజా, ధర్మాన కృష్ణదాస్ అవినీతికి పాల్పడ్డారన్న ఫిర్యాదుపై గురువారం ఏపీ సీఐడీ విచారణకు ఆదేశించింది. ఆట్యపాట్య సంస్థ సీఈవో ప్రసాద్ ఫిర్యాదు మేరకు విచారణ జరిపించాలని విజయవాడ సీపీకి సీఐడీ ఏడీపీ సూచించారు. ఆడుదాం ఆంధ్ర, సీఎం కప్‌లో నిధులు దుర్వినియోగమైనట్టు ఫిర్యాదులో ఆరోపించారు.

క్లుప్తంగా...

రేపు నెల్లూరుకు ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ రాక



సాక్షి, న్యూఢిల్లీ: భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు శనివారం రానున్నారు. నెల్లూరులోని అక్షర విద్యాలయ క్యాంపస్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, స్వర్ణభారతి ట్రస్ట్, ముప్పవరపు ఫౌండేషన్‌లను సందర్శించనున్నారు. అలాగే వెంకటాచలంలో నిర్వహించే స్వర్ణభారతి ట్రస్ట్ 23వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఈ పర్యటనలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని కన్హా శాంతి వనం సందర్శించనున్నారని ఉప రాష్ట్రపతి కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించింది.

ఐక్యరాజ్య సమితిలో హిందీని అధికార భాషగా గుర్తించాలి

విశ్వహిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ



సాక్షి, అమరావతి: ఐక్యరాజ్య సమితిలో హిందీని అధికార భాషగా గుర్తించాలని విశ్వహిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ కోరారు. భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి భారత శాశ్వత రాయబార కార్యాలయంలోని దౌత్యాధికారి రవీంద్రన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐక్యరాజ్య సమితిలో హిందీకి అధికార భాషగా గుర్తింపు తెచ్చేందుకు చేయాల్సిన ప్రయత్నాలపై చర్చించారు. ప్రస్తుతం ఐక్యరాజ్య సమితిలో ఫ్రెంచి, ఇంగ్లిష్, చైనీస్, రష్యన్, అరబిక్, స్పానిష్ భాషలు మాత్రమే అధికార భాషలుగా ఉన్నాయన్నారు.

పార్టీకి ద్రోహం చేయడం.. ఆత్మహత్యా సదృశ్యం

అనంతపురం మేయర్ వసీం



అనంతపురం కార్పొరేషన్: వైఎస్ జగన్ రెక్కల కష్టంతో గెలిచి మూడున్నరేళ్ల పాటు పదవులు అనుభవించి.. అధికారం పోగానే స్వలాభం కోసం మరో పార్టీలో చేరడం ఆత్మహత్యా సదృశ్యమేనని అనంతపురం మేయర్ వసీం అన్నారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రకాశం జిల్లా ఒంగోలు మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ బుజ్జి, పలువురు కార్పొరేటర్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి టీడీపీలో చేరడాన్ని ఆయన తప్పుపట్టారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ సాధారణ కార్యకర్తలుగా ఉన్న వారికి హోదా కల్పించి గుర్తింపు ఇచ్చిన విషయాన్ని మరచిపోకూడదన్నారు. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు అన్ని స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పార్టీకి అండగా ఉండాలన్నారు. ఒక వైపు సీఎం చంద్రబాబు హామీలన్నింటినీ తుంగలో తొక్కుతున్నారని, ప్రజలన్నీ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో టీడీపీకి తప్పక బుద్ధి చెబుతారని హెచ్చరించారు.


శాప్ ఎండీగా గిరీషా బాధ్యతల స్వీకరణ



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఎండీగా పీఎస్ గిరీషా విజయవాడలోని సంస్థ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎండీకి శాప్ సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గిరీషా మాట్లాడుతూ యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికితీసేలా శాప్ కార్యచరణ అమలు చేయాలన్నారు.

మదర్సాల్లో ఆధునిక విద్య అందించాలి

- మైనార్టీ కమిషన్‌కు ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి విజ్ఞప్తి



సాక్షి, అమరావతి: మదర్సాల్లో కేవలం ఇస్లామిక్ విద్యను అందిస్తుండడంతో పాటు ఆధునిక, సాంకేతిక, కంప్యూటర్ విద్య అందించాలని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ముస్లిం విద్యార్థులకు ఇస్లామిక్ విద్యతోపాటు సాంకేతిక, ఆధునిక, కంప్యూటర్ విద్యను అందించేందుకు అస్సాం, బీహార్, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఒడిశా ప్రభుత్వాలు మదర్సా బోర్డులను ఏర్పాటు చేశాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలోని మదర్సాల్లోనూ నాణ్యమైన విద్యను అందించేలా, వాటిలో చదివే పిల్లలకు తల్లికి వందనం, మధ్యాహ్న భోజనం, సర్వేపల్లి రాధాకృష్ణన్ పథకాలను వర్తింపజేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కమిషన్ చైర్మన్‌కు నాగుల్ మీరా విజ్ఞప్తి చేశారు.

ఎస్ఎస్ఎల్వీ డీ-3 ప్రయోగం నేడే

▶ మొదటి పేజీ తరువాయి



తిరుమల ఆలయం వెలుపల ఇస్రో డైరెక్టర్ ఏకే పాత్ర, ప్రిన్సిపల్ సెక్రటరీ యశోద, శాస్త్రవేత్తల బృందం

ప్రయోగ తేదీని అధికారికంగా ప్రకటించారు. ఎంఆర్ఆర్ సమావేశం అనంతరం ప్రయోగ పనులను లాంచ్ ఆథరైజేషన్ బోర్డు (ల్యాబ్) వారికి అప్పగించారు. ల్యాబ్ చైర్మన్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో రాకెట్‌కు తుది విడత తనిఖీలు నిర్వహించి ప్రయోగానికి ఏడు గంటల ముందు అంటే శుక్రవారం వేకువజామున 2.17 కౌంట్ డౌన్ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఈ ఏడు గంటల కౌంట్ డౌన్ ప్రక్రియలో నాలుగో దశలో 0.05 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపడంతో పాటు రాకెట్‌లోని అన్ని వ్యవస్థలను అప్రమత్తం చేసి ప్రయోగానికి సిద్ధమవుతారన్నమాట. అయితే ఈ ప్రయోగంలో మూడు దశలూ ఘన ఇంధనం సాయంతో నిర్వహించనున్నారు. దీనికి కౌంట్‌డౌన్ సమయాన్ని అతికొద్ది గంటలు మాత్రమే తీసుకుంటున్నారు. ఈ ప్రయోగంలో ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈఓఎస్-08)తో పాటు ఎస్ఆర్-0 డెమోశాట్ అనే చిన్న తరహా ఉపగ్రహాలను 475 కిలోమీటర్లు ఎత్తులోని సర్క్యులర్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టనున్నారు.

రాకెట్ వివరాలు.. ప్రయోగమిలా..

ఎస్ఎస్ఎల్వీ డీ3 రాకెట్ 34 మీటర్లు పొడవు రెండు మీటర్లు వెడల్పు 119 టన్నుల బరువుతో నాలుగు దశల్లోనే ప్రయోగించనున్నారు. ఈ ప్రయోగాన్ని 16 (994 సెకన్లు) నిమిషాల్లో పూర్తి చేయనున్నారు. ఈ రాకెట్ మొదటి దశను 87 టన్నుల ఘన ఇంధనాన్ని ఉపయోగించి 124 సెకన్లకు పూర్తి చేయనున్నారు. రెండో దశను 7.7 టన్నుల ఘన ఇంధనంతో 384.2 సెకన్లకు, మూడో దశను 4.5 టన్నుల ఘన ఇంధనంతో 674.9 సెకన్లకు పూర్తి చేయనున్నారు. నాలుగో దశలో మాత్రమే 0.05 టన్నుల ద్రవ ఇంధనం సాయంతో 808 సెకన్లకు 175.5 కేజీల బరువు కలిగిన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్) ఈఓఎస్-08) మొదటిగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తర్వాత ఎస్ఆర్-0 డెమోశాట్ అనే ఉపగ్రహాన్ని 994 సెకన్లు భూమికి 475 కిలో మీటర్లు ఎత్తులోని లియో ఆర్బిట్ (సూర్య సమకాలిక కక్ష్య)లోకి ప్రవేశపెట్టడంతో ప్రయోగం పూర్తి చేసేవిధంగా ఇస్రో శాస్త్రవేత్తలు డిజైన్ చేశారు.

శ్రీవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు

తిరుమల శ్రీవారి సన్నిధిలో ఎస్ఎస్ఎల్వీ డీ-3, ఈఓఎస్-08 నమూనాలకు ఇస్రో అధికారులు గురువారం ప్రత్యేక పూజలు చేయించారు. ఇస్రో డైరెక్టర్ ఏకే పాత్ర, ప్రిన్సిపల్ సెక్రటరీ యశోదతో కలసి శాస్త్రవేత్తలు శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారి పాదాల చెంత ఎస్ఎస్ఎల్వీ డీ-3, ఈఓఎస్-08 నమూనాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కౌంట్‌డౌన్ వ్యవధి తక్కువ..

ఎస్ఎస్ఎల్వీ డీ3 రాకెట్‌కు కౌంట్‌డౌన్ సమయాన్ని తక్కువగా అంటే ఏడు గంటల వ్యవధి మాత్రమే తీసుకున్నారు. ఎందుకంటే ఈ రాకెట్ మొదటి మూడు దశలు ఘన ఇంధనాన్ని ఉపయోగించి చేయనున్నారు. అంటే ఘన ఇంధనాన్ని ముందుగానే నింపి రాకెట్‌ను అనుసంధానం చేశారు. ద్రవ ఇంధనాన్ని నింపేందుకు మాత్రమే కౌంట్‌డౌన్ సమయాన్ని తీసుకున్నారు. ఈ ప్రయోగంలో నాలుగోదశలో 0.05 టన్నులు మాత్రమే ద్రవ ఇంధనాన్ని వినియోగించనున్నారు. అందుకే ఏడు గంటల కౌంట్‌డౌన్ సమయం వ్యవధిలో ద్రవ ఇంధనాన్ని నింపే ప్రక్రియతో పాటు రాకెట్‌లోని అన్ని వ్యవస్థలను అప్రమత్తం చేయడానికి ఈ తక్కువ సమయాన్ని తీసుకున్నారు. ఎస్ఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది మూడో ప్రయోగమిది. షార్ కేంద్రం నుంచి 97వ ప్రయోగం కావడం విశేషం.

ఇస్రోకు ‘ఆగస్టు’ ఎంతో ప్రత్యేకం

దేశాభివృద్ధిలో ఇస్రో పాత్ర కీలకం.. ఆగస్టు15 వేడుకల్లో ఇస్రో చైర్మన్ సోమనాథ్



సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చరిత్రలో ఆగస్టు నెలంటే ఒక ప్రత్యేకంగా చెప్పుకోవచ్చని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ అన్నారు. 78వ స్వాతంత్ర్య దిన వేడుకలను గురువారం తిరుపతి జిల్లాలోని షార్ కేంద్రంలోని స్పేస్ సెంట్రల్ స్కూల్ మైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ మాట్లాడుతూ.. ఆగస్టు నెల ఎందుకు ప్రత్యేకమంటే చంద్రయాన్-3లో ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధృవంపై సేఫ్ ల్యాండింగ్ జరిగిన నెల కావడం. ఈ నెల 23వ తేదీని నేషనల్ సైన్స్‌డేగా ప్రకటించి ఉత్సవాలు జరుపుకోవడం వంటి కారణాలు ఉన్నాయని చెప్పారు. ఈ ఆగస్టు నెలలో ఎస్ఎస్ఎల్వీ- డీ3 ప్రయోగానికి సిద్ధమవుతున్నామని తెలిపారు. చంద్రయాన్ విజయవంతానికి పని చేసిన ప్రతి ఒక్కరికి సెల్యూట్ చేస్తున్నానని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎంతో మంది త్యాగాలతో స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొంటున్నామని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశాభివృద్ధిలో ఇస్రో పాత్ర కూడా కీలకమేనని చెప్పారు. భవిష్యత్తులో చరిత్ర మరువలేని ప్రయోగాలు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని అన్నారు. అనంతరం షార్‌లో వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ తదితరులు పాల్గొన్నారు.

కావేరికి దారేది?

గోదావరి-కావేరి అనుసంధానంపై రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకోని ఎన్‌డబ్ల్యూడీఏ

- తొలుత అకినేపల్లి, ఆ తర్వాత జానంపల్లి, ఇప్పుడు ఇచ్చంపల్లి అంటూ డీపీఆర్
- గోదావరిలో మిగులు జలాలు ఎక్కడున్నాయన్న ఏపీ, తెలంగాణ
- ఛత్తీస్‌గఢ్ వాడుకోని 141 టీఎంసీలనే ఇచ్చంపల్లి నుంచి తరలిస్తామంటూ ప్రతిపాదన
- మా కోటా నీటిని వాడుకోవడానికి వీల్లేదంటున్న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం
- ఇచ్చంపల్లి నుంచి అంగీకరించే ప్రశ్నేలేదంటున్న తెలంగాణ సర్కార్
- పోలవరం నుంచి పరిశీలించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదన
- దాంతో గోదావరి-కావేరి అనుసంధానంపై ఒక్క అడుగూ ముందుకు పడని పరిస్థితి



సాక్షి, అమరావతి: గోదావరి-కావేరి అనుసంధానంపై రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం సాధించడంలో జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) విఫలమవుతోంది. దీంతో ఏడేళ్లుగా ఈ ప్రతిపాదనలో ఒక్క అడుగూ ముందుకు పడని పరిస్థితి. నదీ పరివాహక ప్రాంతం (బేసిన్) పరిధిలోని రాష్ట్రాల అభిప్రాయాలను ఎన్‌డబ్ల్యూడీఏ తీసుకోకుండా గోదావరి-కావేరి అనుసంధానం ప్రతిపాదన రూపొందించడమే దానికి కారణమని సాగునీటిరంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తొలుత అకినేపల్లి.. ఆ తర్వాత జానంపల్లి.. ఇప్పుడు ఇచ్చంపల్లి నుంచి గోదావరి జలాలను కావేరికి తరలించేలా డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక)ను ఎన్‌డబ్ల్యూడీఏ సిద్ధం చేసింది. తమ కోటా నీటిని కావేరికి ఎలా తరలిస్తారని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ప్రశ్నిస్తోంది. ఇచ్చంపల్లి నుంచి అనుసంధానానికి అంగీకరించే ప్రశ్నే లేదని తెలంగాణ సర్కార్ చెబుతోంది. బేసిన్‌లో దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ హక్కులను పరిరక్షించాలంటే పోలవరం నుంచి కావేరికి గోదావరి జలాలను తీసుకెళ్లేలా ప్రతిపాదనలో మార్పులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించడంలో ఎన్‌డబ్ల్యూడీఏ విఫలమవుతున్న నేపథ్యంలో కావేరితో గోదావరి అనుసంధానం కష్టమేనని నిపుణులు తేల్చిచెబుతున్నారు.

ఏకపక్షంగా ప్రతిపాదన..

గోదావరిలో ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 141 టీఎంసీలకు 107 టీఎంసీల మిగులు జలాలను జతచేసి 248 టీఎంసీలను అకినేపల్లి నుంచి కావేరికి తరలించేలా 2017లో ఎన్‌డబ్ల్యూడీఏ డీపీఆర్‌ను రూపొందించింది. దీనిపై రాష్ట్రాల అభిప్రాయాలను కోరింది. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు అభ్యంతరం వ్యక్తం చేశాయి. వాటిని పరిగణనలోకి తీసుకోకుండా జానంపేట నుంచి 248 టీఎంసీల గోదావరి జలాలను కావేరికి తరలించేలా 2018లో డీపీఆర్‌లో మార్పులు చేసింది. దీనిపై కూడా మూడు రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి.

ఛత్తీస్‌గఢ్ ససేమిరా అంటున్నా

గోదావరిలో మిగులు జలాలే లేవని.. నీటి లభ్యతే లేనప్పుడు అనుసంధానం ఎలా చేపడతారని 2020లో ఏపీ ప్రభుత్వం ఎన్‌డబ్ల్యూడీఏను నిలదీసింది. ఆంధ్రప్రదేశ్ హక్కులకు విఘాతం కలిగించే చర్యలను సహించబోమని స్పష్టం చేసింది. దాంతో ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 141 టీఎంసీలను ఇచ్చంపల్లి నుంచి కావేరికి తరలించేలా 2022లో డీపీఆర్‌లో ఎన్‌డబ్ల్యూడీఏ మార్పులు చేసింది. ఇచ్చంపల్లి నుంచి అనుసంధానం చేపడితే దేవాదుల, సీతారామ ఎత్తిపోతల తదితర ప్రాజెక్టుల కింద ఆయకట్టు ప్రయోజనాలు దెబ్బతింటాయని తెలంగాణ సర్కార్ అభ్యంతరం వ్యక్తం చేసింది. దిగువ రాష్ట్రం హక్కులను పరిరక్షించాలంటే పోలవరం నుంచే కావేరికి గోదావరి జలాలను తీసుకెళ్లాలని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. తమ కోటా నీటిని కావేరికి తరలించడానికి అనుమతించే ప్రశ్నే లేదని.. కాదూ కూడదని అనుసంధానం చేపడితే న్యాయపోరాటం చేస్తామని ఛత్తీస్‌గఢ్ సర్కార్ స్పష్టం చేసింది. కానీ.. వాటిని పరిగణనలోకి తీసుకోకుండా ఇచ్చంపల్లి నుంచే ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని నీటిని కావేరికి తరలించే ప్రతిపాదననే ఎన్‌డబ్ల్యూడీఏ మళ్లీ తెరపైకి తేవడంపై రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

తుది దశలో ‘తుంగభద్ర’ గేట్ పనులు

- డ్యాంపైకి క్రేన్లు, గేట్ విడిభాగాలు



డ్యాంపైన తీసుకెళ్తున్న నూతన క్రస్ట్ గేట్ పీసులు

సాక్షి, బళ్లారి: కర్ణాటకలో హొసపేటె వద్ద తుంగభద్ర జలాశయంలో 19వ క్రస్ట్ గేట్ కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఇప్పటికి 40 టీఎంసీలకు పైగా నీటిని వదిలేశారు. మూడు రోజుల నుంచి క్రస్ట్ గేట్ ఏర్పాటుకు డ్యాం అధికారులు, నిపుణులు తీవ్రంగా యత్నిస్తున్నారు. గురువారం ఉదయం జిందాల్ కంపెనీ తయారు చేసిన స్టాఫ్‌లాగ్ గేట్‌లోని హెలిమెట్స్‌ను తుంగభద్ర డ్యామ్ వద్దకు తీసుకొచ్చారు. డ్యామ్‌పైన భారీ క్రేన్ల సహాయంతో 80 మంది కార్మికులతో గేట్‌ను దింపే ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ప్రత్యేక నిపుణుడు కన్నయ్యనాయుడు సూచనలతో స్టాఫ్‌లాగ్ గేట్లను ఏడు సిద్ధం చేశారు. ఒక్కో పీసు 15 టన్నుల బరువుతో తయారు చేస్తున్న వాటిని ఒక్కొక్కటిగా డ్యామ్ వద్దకు చేర్చి క్రస్ట్ గేట్ స్థానంలోకి భారీ క్రేన్ల సహాయంతో దింపుతున్నారు.

విశాఖ వేదికగా అక్టోబర్‌లో మలబార్ విన్యాసాలు

- అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాతో కలిసి నిర్వహిస్తున్నాం
- తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్

సాక్షి, విశాఖపట్నం: అడ్వాన్స్‌డ్ యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్‌పై దృష్టి సారిస్తూ అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాతో కలిసి 28వ మలబార్ నావికా విన్యాసానికి విశాఖపట్నం ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధమవుతోందని తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ తెలిపారు. విశాఖలోని తూర్పు నౌకాదళ ప్రధాన స్థావరంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈఎన్‌సీ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ త్రివర్ణ పతాకాన్ని ఎగరేశారు. 50 మందితో కూడిన సాయుధ దళంతో గౌరవ వందనం స్వీకరించారు. 12 అన్‌ఆర్మ్‌డ్ ప్లాటూన్లు, ఆర్మ్‌డ్ గార్డులు, నౌకాదళ, డిఫెన్స్ సెక్యూరిటీ సిబ్బంది, సీ కేడెట్స్, నౌకలు, సబ్‌మెరైన్ల సిబ్బంది మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. నౌకాదళ కుటుంబాలకు ఈఎన్‌సీ చీఫ్ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పెందార్కర్ మాట్లాడుతూ..సముద్ర ప్రాంతంలో సెక్యూరిటీ డైనమిక్స్, మేరీటైమ్ భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేకుండా ప్రతి ఒక్కరూ సవాళ్లని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అక్టోబర్‌లో నిర్వహించే మలబార్ ద్వారా ప్రాంతీయ స్థిరత్వం, సముద్ర భద్రతను చాటి చెప్తామన్నారు. డిసెంబర్‌లో నేవీ డే కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్యశ్రీ సేవలకు బ్రేక్

ఎమర్జెన్సీ కేసులకే చికిత్స
నేడు మంత్రులతో ఆశా ప్రతినిధుల భేటీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలకు బ్రేక్ పడింది. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ స్పెషాలిటీ అసోసియేషన్(ఆశా) ప్రతినిధులు సేవలు నిలిపివేశారు. ఎమర్జెన్సీ కేసుల్లో మాత్రమే రోగులకు చికిత్సలు అందించారు. ఎమర్జెన్సీ కాని సందర్భాల్లో రోగులకు చికిత్సలు అందించడానికి విముఖత చూపారు. దీంతో దూర ప్రాంతాల నుంచి చికిత్సల కోసం ఆస్పత్రులకు వచ్చిన వివిధ అనారోగ్య బాధితులు వెనుదిరిగారు. రూ.2,500 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేదంటే ఆగస్టు 15 నుంచి సేవలు నిలిపివేస్తామని ప్రభుత్వానికి నెట్‌వర్క్ ఆస్పత్రులు గత నెల 30వ తేదీనే అల్టిమేటం ఇచ్చాయి. ఈ నెల 10వ తేదీలోగా కొంత మొత్తం విడుదల చేస్తామని అధికారులు చెప్పినప్పటికీ నిధులు విడుదల చేయలేదు. ఆస్పత్రులు నిర్వహించడం కూడా కష్టంగా ఉంటోందని తేల్చి చెప్పి గురువారం నుంచి సమ్మెలోకి వెళతామని యాజమాన్యాలు తేల్చి చెప్పాయి. దీంతో చేసేదేమీ లేక రూ.200 కోట్లు మాత్రమే బుధవారం ప్రభుత్వం విడుదల చేసింది. మరో రూ.300 కోట్లు త్వరలో విడుదల చేస్తామన్నప్పటికీ సేవల కొనసాగింపునకు ఆస్పత్రులు ససేమిరా అన్నాయి. శుక్రవారం మంత్రులు సత్యకుమార్, లోకేశ్‌లతో భేటీ ఏర్పాటు చేయడంతో అప్పటి వరకూ కేవలం ఎమర్జెన్సీ కేసులకు మాత్రమే సేవలు అందిస్తామని యాజమాన్యాలు ఒప్పుకున్నాయి.

నేటి నుంచి ముంబై-విజయవాడకు ఇండిగో సర్వీస్



గన్నవరం: వాణిజ్య రాజధాని ముంబై నుంచి గన్నవరం విమానాశ్రయానికి ఇండిగో విమాన సంస్థ శుక్రవారం నుంచి నూతన సర్వీస్‌ను ప్రారంభించనుంది. ఈ సర్వీస్ రోజూ సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరి రాత్రి 8.20 గంటలకు ఇక్కడికి చేరుకుంటుంది. తిరిగి ఇక్కడి నుంచి రాత్రి 9 గంటలకు బయలుదేరి 11 గంటలకు ముంబై చేరుకుంటుందని ఎయిర్‌లైన్స్ వర్గాలు తెలిపాయి. ఈ సర్వీస్ వల్ల ముంబైతో పాటు గల్ఫ్, యూరప్, ఆఫ్రికా దేశాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు సులువైన కనెక్టివిటీ సదుపాయం ఉంటుందని చెప్పారు. ఇప్పటికే ముంబై-విజయవాడ మధ్య ఎయిరిండియా సర్వీస్ నడుస్తుండగా, ఇప్పుడు ఇండిగో రాకతో మరో సర్వీస్ అందుబాటులోకొచ్చినట్లయిందని ఎయిర్‌పోర్ట్ వర్గాలు తెలిపాయి.

సెప్టెంబర్ 14 నుంచి న్యూఢిల్లీ-విజయవాడ సర్వీస్

సెప్టెంబర్ 14వ తేదీ నుంచి దేశ రాజధాని న్యూఢిల్లీ నుంచి విజయవాడకు విమాన సర్వీస్‌లు ప్రారంభిస్తున్నట్లు ఇండిగో సంస్థ ప్రకటించింది. సుమారు 180 మంది ప్రయాణికుల సామర్థ్యం గల ఎయిర్‌బస్ ఎ320 విమానం రోజూ ఉదయం 8.10 గంటలకు న్యూఢిల్లీలో బయలుదేరి 10.40కి విజయవాడ చేరుకుంటుంది. తిరిగి 11.10 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.40కి న్యూఢిల్లీ చేరుకుంటుంది. ఇప్పటికే ఈ మార్గంలో ఎయిరిండియా రెండు విమాన సర్వీస్‌లను నడుపుతోంది. అయితే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఇండిగో సంస్థ ఢిల్లీ-విజయవాడ మధ్య సర్వీస్ నడిపేందుకు ముందుకొచ్చినట్టు ఎయిర్‌పోర్ట్ వర్గాలు తెలిపాయి.

ఆదేశాలిచ్చినా కౌంటర్లు వేయరా?

ప్రభుత్వ అధికారులపై హైకోర్టు మండిపాటు.. కేసుల విషయంలో నిద్రపోతున్నారా?

ఇకపై జాప్యం జరిగితే ప్రతి కేసులోనూ ఖర్చులు విధిస్తామని హెచ్చరిక
తదుపరి విచారణ సెప్టెంబర్ 11వ తేదీకి వాయిదా



సాక్షి, అమరావతి: తగినంత సమయం ఇస్తున్నా, ఆయా కేసుల్లో అధికారులు కౌంటర్లు దాఖలు చేయకపోతుండటంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసుల విషయంలో అధికారులు మందకొడిగా ఉన్నారని, ఇలా నిద్రపోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది. నంద్యాల జిల్లాలో లైమ్ స్టోన్ ఖనిజం ఉన్న భూములను అసైన్‌మెంట్ కింద భూమి లేని పేదలకు ఇస్తున్నారని, దీని వెనుక బనగానపల్లి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి (ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే) ఉన్నారని, దీనిని అడ్డుకోవాలని కోరుతూ అప్పటి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి (ప్రస్తుతం ఎమ్మెల్యే) 2023లో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై గతంలో విచారణ జరిపిన సీజే ధర్మాసనం పేదలకు అసైన్‌మెంట్ కింద ఇవ్వాలనుకుంటున్న భూములు మైనింగ్‌కు పనికి వస్తాయో లేదో తెలియచేస్తూ అన్ని వివరాలతో మెరుగైన అఫిడవిట్ దాఖలు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ఇప్పటికే పేదలకు భూములు కేటాయించి ఉంటే, ఆ కేటాయింపులు తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటాయని గత ఏడాది ఆగస్టులో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వ్యాజ్యంలో కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శిని సుమోటోగా ప్రతివాదిగా చేరుస్తూ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తాజాగా ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది.

2023లో ఆదేశాలిస్తే ఇంకా కౌంటర్ వేయలేదా?

గత ఏడాది ఆగస్టులో తాము ఇచ్చిన ఉత్తర్వుల మేరకు కేంద్ర గనుల శాఖ ప్రతివాదిగా కౌంటర్ దాఖలు చేసిందా? అని ఈ సందర్భంగా సీజే ధర్మాసనం ప్రశ్నించింది. లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది రతంగపాణి రెడ్డి చెప్పగా, ఎందుకు దాఖలు చేయలేదని కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. సంబంధిత అధికారులకు కౌంటర్ పంపామని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది జూపూడి వెంకట కుమార్ యజ్ఞదత్ తెలిపారు. ఎప్పుడు పంపారని ధర్మాసనం ప్రశ్నించగా, గత ఏడాది సెప్టెంబర్‌లో పంపామని చెప్పారు. 2023 సెప్టెంబర్‌లో పంపితే ఇంకా తిరుగు సమాధానం రాలేదా? అంటూ ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. కౌంటర్ రాని విషయాన్ని రాత పూర్వకంగా అధికారుల దృష్టికి తెచ్చారా.. అని ప్రశ్నించింది.

కోర్టును సీరియస్‌గా తీసుకుంటున్నారా.. లేదా?

అసలు మీరు (కేంద్ర ప్రభుత్వ అధికారులు) కోర్టును సీరియస్‌గా తీసుకుంటున్నారా.. లేదా? అంటూ ధర్మాసనం ఒకింత తీవ్ర స్వరంతో ప్రశ్నించింది. శాఖాపరమైన అంతర్గత మార్పులే కౌంటర్ దాఖలులో జాప్యానికి కారణమని యజ్ఞదత్ వివరించారు. అంతర్గత మార్పులు నిరంతరం జరిగేవేనని, తాము న్యాయవాదులుగా ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం చాలా వేగంగా స్పందించేదని ధర్మాసనం తెలిపింది. కానీ ఈ కేసులో అధికారుల తీరు విస్మయానికి గురి చేస్తోందని స్పష్టం చేసింది. చివరి అవకాశం ఇవ్వాలని యజ్ఞదత్ అభ్యర్థించడంతో ధర్మాసనం ఒకింత శాంతించింది. కౌంటర్ దాఖలు చేసేందుకు మరో అవకాశం ఇస్తున్నామని, అయితే అసాధారణ జాప్యానికి గాను రూ.20 వేలు ఖర్చుల కింద విధిస్తున్నట్లు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం జిల్లా కలెక్టర్ కౌంటర్ గురించి ఆరా తీసింది. కౌంటర్ వేశారా? అని ప్రశ్నించింది. దీనికి ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) సింగమనేని ప్రణతి స్పందిస్తూ, చేశారని తెలిపారు. అయితే కోర్టు ఆదేశించిన విధంగా మెరుగైన కౌంటర్ దాఖలు చేశారా? అని ప్రశ్నించింది. లేదని ప్రణతి చెప్పడంతో ధర్మాసనం వెంటనే కలెక్టర్‌కు సైతం రూ.10 వేల ఖర్చులు విధిస్తున్నట్లు తెలిపింది. ఈ మొత్తాన్ని అడ్వొకేట్స్ క్లర్కుల సంక్షేమ నిధిలో జమ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ నాటికి మెరుగైన అఫిడవిట్‌ను దాఖలు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. అధికారులందరూ విధి నిర్వహణలో చాలా మందకొడిగా వ్యవహరిస్తున్నారని, ఇకపై ఇలా జాప్యం చేసే ప్రతి కేసులోనూ జరిమానా విధిస్తామని తేల్చి చెప్పింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 11కి వాయిదా వేసింది.

బరి తెగించిన ‘పచ్చ’మూక

- దళిత మండల వైస్‌ప్రెసిడెంట్‌పై దౌర్జన్యం
- ఎంపీడీఓ ఆఫీస్‌లో వీరంగం
- అన్నమయ్య జిల్లాలో టీడీపీ నేతల దాష్టీకం



దళిత మండల వైస్‌ప్రెసిడెంట్ నాయినపల్లె అనుదీప్‌పై దాడి చేస్తున్న టీడీపీ నేతలు మేడా విజయశేఖర్‌రెడ్డి, పెంచలయ్య

నందలూరు: రాష్ట్రంలో అధికారపార్టీ దురంహకారం.. దౌర్జన్య ఘటనలు నానాటికీ తీవ్రతరమవుతున్నాయి. చివరకు స్వాతంత్ర్యం దినోత్సవం నాడు కూడా వారి ఆగడాలకు అంతులేకుండా పోయింది. వివరాల్లోకి వెళితే.. అన్నమయ్య జిల్లా నందలూరు ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసే కార్యక్రమం గురువారం 8.30కు నిర్వహించనున్నట్లు ముందుగానే మండలపరిషత్ ప్రజాప్రతినిధులకు సమాచారం ఇచ్చారు. అయితే ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి అందుబాటులో లేకపోవడంతో మండల ఉపాధ్యక్షుడు నాయనపల్లె అనుదీప్, మరో మండల ఉపాధ్యక్షురాలు తుమ్మలభావన చేతుల మీదుగా ప్రొటోకాల్ ప్రకారం జెండా ఎగురవేశారు. అయితే 9 గంటల ప్రాంతంలో టీడీపీ నేత విజయశేఖర్‌రెడ్డి ఆయన వెంట పచ్చమూకలు వచ్చి రాగానే జెండా ఎగురవేశారని తెలుసుకుని, తాము లేకుండా ఏ విధంగా ఎగురవేస్తారని ఆగ్రహావేశాలతో ఊగిపోయారు. అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ దళితనేతలు పెనుబాలనాగసుబ్బయ్య, కాకిచంద్ర, నందలూరు నేతలు సోమిశెట్టి ప్రభాకర్, అరిగెల నాని సమక్షంలోనే దళితనేత, మండల ఉపాధ్యక్షుడు నాయనపల్లె అనుదీప్‌తో వాగ్వివాదానికి దిగారు. ఇరు వర్గాల వాదులాట, తోపులాటతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి.. అక్కడి నుంచి వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులను పంపించివేయడంతో గొడవ సద్దుమణిగింది.



భయపడేవాటి విషయంలోనేమో చావు ఉన్నవాళ్లుగానూ, కోరుకునేవాటి విషయంలోనేమో ఎప్పటికీ చావులేనివాళ్లుగానూ జనం వ్యవహరిస్తుంటారు.

– సెనెకా

సాక్షి

శుక్రవారం, 16 ఆగస్టు 2024

మళ్లీ తెరపైకి పౌరస్మృతి

వరసగా మూడోసారి గద్దెనెక్కిన తర్వాత ఎర్రకోట బురుజులపై నుంచి చేసిన తొలి ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలకమైన అంశాలు ప్రస్తావించారు. అందులో ప్రధానమైనది ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ). ఇప్పుడున్న 'మతతత్వ పౌరస్మృతి' స్థానంలో 'సెక్యులర్ పౌరస్మృతి' రావాల్సిన అవసరం ఉందన్నది మోదీ నిశ్చితాభిప్రాయం. నిజానికి ఇదేమీ కొత్త కాదు. ఇంతక్రితం సైతం పలు సందర్భాల్లో యూసీసీ గురించి ఆయన మాట్లాడారు. నిరుడు జూన్‌లో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన బీజేపీ కార్యకర్తల సదస్సులో దీనిపై ఆయన గొంతెత్తారు. ఆ మాటకొస్తే పూర్వపు జనసంఘ్ నుంచీ బీజేపీ దీన్ని తరచూ చెబుతోంది. కనుక ఇందులో కొత్త ఏమున్నదని అనిపించవచ్చు. అయితే గతంలో ప్రస్తావించటానికీ, ఇప్పుడు మాట్లాడటానికీ మధ్య మౌలికంగా వ్యత్యాసముంది. గత పదేళ్ల నుంచి ఆయన ఎన్డీయే ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్నా బీజేపీకి సొంతంగానే పాలించగల సత్తా ఉండేది. ఇప్పుడు కూటమి పక్షాలపై ఆధారపడక తప్పనిస్థితి వచ్చింది. ప్రధాని తాజా ప్రసంగంలో ఇంకా అవినీతి, మహిళల భద్రత, ఒకే దేశం–ఒకేసారి ఎన్నికలు వంటివి కూడా చోటుచేసుకున్నాయి. నిజానికి ఎర్రకోట బురుజు ప్రసంగం లాంఛనమైన అర్థంలో విధాన ప్రకటనేమీ కాదు. కానీ రాగల అయిదేళ్ల కాలంలో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం చేయదల్చుకున్నదేమిటన్న విషయంలో ఆయన స్పష్టతతో ఉన్నారని అర్థం చేసుకోవచ్చు.

మనం పూర్తి స్థాయి సెక్యులర్ దేశంగా మనుగడ సాగించాలని తొలి ప్రధాని నెహ్రూ మొదలుకొని స్వాతంత్ర్యోద్యమ నాయకులందరూ భావించారు. యూసీసీ గురించి రాజ్యాంగ నిర్ణాయక సభలో లోతైన చర్చే జరిగింది. రాజ్యాంగసభ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సైతం యూసీసీ ఉండితీరాలని కోరుకున్నారు. సభ్యుల్లో కొందరు వ్యతిరేకిస్తే... అనుకూలంగా మాట్లాడినవారిలో సైతం కొందరు ఇది అనువైన సమయం కాదన్నారు. ఎందుకంటే అప్పుడున్న పరిస్థితులు భిన్నమైనవి. దేశ విభజన సమయంలో ఇరుపక్కలా మతోన్మాదులు చెలరేగిపోయారు. నెత్తురుటేర్లు పారించారు. పరస్పర అవిశ్వాసం, అపనమ్మకం ప్రబలటంతో ఇళ్లూ, వాకిళ్లూ, ఆస్తులూ అన్నీ వదిలి లక్షల కుటుంబాలు ఇటునుంచి అటు... అటునుంచి ఇటూ వలసబాట పట్టారు. అదే సమయంలో పాకిస్తాన్ ఆవిర్భావానికి కారకుడైన మహమ్మద్ అలీ జిన్నా మరింత రెచ్చగొట్టే ప్రకటన చేశారు. భారత్‌లో ముస్లింలకు మనుగడ ఉండబోదని, వారిని అన్ని విధాలా అణిచేస్తారని దాని సారాంశం. అలాంటి సమయంలో యూసీసీని తీసుకొస్తే అనవసర అపోహలు బయల్దేరి పరిస్థితి మరింత జటిలమవుతుందని అందరూ అనుకున్నారు. అందువల్లే హక్కుల్లో భాగం కావాల్సిన యూసీసీ కాస్తా 44వ అధికరణ కింద ఆదేశిక సూత్రాల్లో చేరింది. ఆ సూత్రాలన్నీ ప్రభుత్వాలు నెరవేర్చాల్సిన అంశాలు. అయినా ఇతర అధికరణాల అమలు కోసం వెళ్లినట్టుగా కోర్టుకు పోయి వాటి అమలుకు ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరటం సాధ్యం కాదు. అందువల్లే సుప్రీంకోర్టు వివిధ తీర్పుల్లో యూసీసీని తీసుకురావలసిన అవసరాన్ని పాలకులకు గుర్తుచేసి ఊరుకుంది. చిత్రమేమంటే పరస్పర పూరకాలు కావలసిన హక్కులూ, ఆదేశిక సూత్రాలూ కొన్ని సందర్భాల్లో విభేదించుకుంటాయి. ఉదాహరణకు 25 నుంచి 28వ అధికరణ వరకూ పౌరులకుండే మత స్వేచ్ఛ గురించి మాట్లాడతాయి. ఆదేశిక సూత్రాల్లో ఒకటైన యూసీసీపై చట్టం తెస్తే సహజంగానే అది మత స్వేచ్ఛను హరించినట్టవుతుంది. కనుక ఈ రెండింటి మధ్యా సమన్వయం సాధించాలి. గతంలో చాలా సందర్భాల్లో ఇలా చేయకతప్పలేదు. 'రాజ్యాంగ మౌలిక స్వరూపం' ప్రభావితం కాని రీతిలో ఆ పని చేయాలి.

ఆ సంగతలా ఉంచి యూసీసీ తీసుకురాదల్చుకుంటే ఇస్లామ్‌ను అనుసరించేవారికి మాత్రమే కాదు... హిందూ, క్రైస్తవ, పార్సీ మతస్థులపైనా ప్రభావం పడుతుంది. కొంత హెచ్చుతగ్గులు ఉండొచ్చుగానీ దాదాపు అన్ని మతాలూ స్త్రీల విషయంలో వివక్షాపూరితంగానే ఉన్నాయి. ముఖ్యంగా వ్యక్తిగత (పర్సనల్) చట్టాలకొచ్చేసరికి ఇది బాహాటంగా కనబడుతుంది. వీటి మూలాలు వందలు, వేల ఏళ్ల నుంచి పరంపరగా వస్తూవున్న సంప్రదాయాల్లో ఉండటం, మారుతున్న కాలానికి అనుగుణంగా సవరించుకోవటానికి సిద్ధపడకపోవటం సమస్య. వివాహం, విడాకులు, పునర్వివాహం, వారసత్వం, ఆస్తి హక్కు, బహుభార్యాత్వం వంటి అంశాల్లో స్త్రీలకు వివక్ష ఎదురవుతోంది. అయితే రాజ్యాంగం హామీ ఇచ్చిన లింగసమానత్వం లేని పక్షంలో అలాంటి చట్టాలను సుప్రీంకోర్టు కొట్టివేసిన సందర్భాలున్నాయి. పార్సీల్లో అన్య మతస్థుణ్ణి పెళ్లాడిన మహిళలకు వారసత్వ ఆస్తిలో భాగం ఇవ్వరు. పార్సీ పురుషుడికి అది వర్తించదు. అన్ని అంశాలనూ సవివరంగా చర్చించేందుకూ... అన్ని మతాచారాల వివక్షను తొలగించటానికీ సిద్ధపడుతున్నారన్న అభిప్రాయం కలిగిస్తే యూసీసీ రూపకల్పన సమస్యేమీ కాదు. దానికి ముందు మైనారిటీల విశ్వాసం పొందాలి.

కోల్‌కతాలో ఇటీవల మహిళా జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య నేపథ్యంలో మహిళల భద్రత అంశాన్ని మోదీ ప్రస్తావించారు. ఇక భారత్‌లో అవినీతి పెచ్చుమీరిందని గణాంకాలు వెల్లడిస్తున్న నేపథ్యంలో కఠినంగా ఉంటామన్న సంకేతాలిచ్చారు. కానీ అలాంటి ఆరోపణలున్న నేతలు బీజేపీలోనో, దాని మిత్రపక్షంగానో ఉన్నప్పుడూ... వారిపై కేసుల దర్యాప్తు మందగిస్తున్నప్పుడూ దీన్ని జనం ఎంతవరకూ విశ్వసించగలరన్నది ఆలోచించుకోవాలి. మొత్తానికి యూసీసీ అంశాన్ని ప్రధాని మరోసారి తెరపైకి తెచ్చారు. ఈ విషయంలో దేశవ్యాప్తంగా ఎటువంటి స్పందన వస్తుందో, ఎన్డీయే కూటమిలోని ఇతర పక్షాల వైఖరి ఏ విధంగా ఉంటుందో ముున్ముందు తెలుస్తుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు. ఏకాదశి ఉ. 5.50 వరకు, తదుపరి ద్వాదశి తె.5.20 వరకు (తెల్లవారితే శనివారం), **నక్షత్రం:** మూల ఉ.10.21 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.8.45 నుండి 10.21 వరకు, తదుపరి రా.7.57 నుండి 9.29 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.18 నుండి 9.06 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.19 వరకు, **అమృతఘడియలు:** తె.5.34 నుండి 7.10 వరకు వరలక్ష్మీ వ్రతం.

సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం: 6.23
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

అనుకోని అతిథికి అభ్యంతరాలు

విశ్లేషణ



హర్ష కక్కడ్

బంగ్లాదేశ్ అంతర్గత పరిణామాల ఫలితంగా ప్రధాని పదవికి రాజీనామా చేసి షేక్ హసీనా ఆశ్రయం కోరుతూ భారత్‌కు వచ్చారు. అయితే భారత్ ఆమెకు శాశ్వత ఆశ్రయాన్ని ఇవ్వడానికి సిద్ధంగా లేకపోయినా... అత్యవసరంగా ఆమెను అక్కున చేర్చుకొంది. ఆ విధంగా ఆమె ప్రాణాలను కాపాడగలిగింది. ఇటీవలి కాలంలో భారత విధానంలో చోటు చేసుకున్న మార్పులు, బంగ్లాదేశ్‌తో భవిష్యత్తులో ఎదురవ్వగల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని భారత్ శాశ్వత ఆశ్రయాన్ని నిరాకరిస్తోంది. ఇదే సమయంలో హసీనా బ్రిటన్‌లో ఆశ్రయం పొందాలని ఆశిస్తున్నా అక్కడ ఆమెకు ద్వారాలు మూసుకొన్నాయి. ఈ పరిస్థితుల్లో భారత్ ఆమె కోసం తగిన నివాసప్రాంతాన్ని వెదకడంలో తన దౌత్య పరపతిని ఉపయోగించే అవకాశం ఉంది.

బంగ్లాదేశ్ చరిత్రలో ఒక అధ్యాయం ముగిసింది. పాకిస్తాన్ కబంధ హస్తాల నుండి స్వాతంత్ర్యం కోసం పోరాటానికి నాయకత్వం వహించిన, ఆ దేశ ప్రజాస్వామ్య దశ ప్రక్రియలో ఎక్కువ భాగం నాయకత్వం వహించిన కుటుంబం ఇకపై దేశ భవిష్యత్తులో ఎటువంటి పాత్రనూ కలిగి ఉండదు. పెరుగుతున్న హింసాకాండ మధ్య షేక్ హసీనా ఢాకా నుండి నిష్క్రమించడం అనేది బంగ్లాదేశ్‌లో ఆమె కుటుంబ ఉనికి ముగింపును సూచిస్తుంది. ముజిబుర్ రెహ్మాన్ విగ్రహంపై మూత్ర విసర్జన చేస్తున్న నిరసనకారుడి చిత్రాలూ, మాజీ ప్రధాని లోదుస్తులను ప్రదర్శిస్తున్న ఇతరుల చిత్రాలూ ఆ కుటుంబం పట్ల ప్రజల్లో పెరిగిన ద్వేషాన్ని తెలియజేస్తున్నాయి.

హింసాత్మక మార్గాల ద్వారా ప్రజల నిరసనలను అరికట్టేందుకు బంగ్లా సైన్యం నిరాకరించడంతో, షేక్ హసీనా ఆశ్రయం కోరుతూ భారత్‌కు వచ్చారు. ఆమె భారత్‌లో ఆశ్రయం పొందడం ఇదే మొదటిసారి కాదు. 1975లో ఆమె తండ్రి ముజిబుర్ రెహ్మాన్ హత్యకు గురైనప్పుడు హసీనా, ఆమె కుటుంబం భారతదేశంలో నివసించారు. ఆరేళ్లపాటు న్యూఢిల్లీలో ఉన్న హసీనా, ఆ ఉపకారాన్ని మరచిపోలేదు. ఆమె అప్పుడు ప్రధాని కుమార్తె. తన తండ్రి ఢాకాలో ఘోర హత్యకు గురైనప్పుడు ఆమె జర్మనీలో ఉన్నారు. అందువల్లే ఆమె ప్రాణం నిలబడింది.

ఈసారి మాత్రం ఆమె పదవి నుంచి వైదొలిగిన ప్రధానమంత్రిగా ఉన్నారు. భారత్ తనను నిరాశపరచదన్న ఆమె విశ్వాసం చెల్లుబాటైంది. ఆమెకు జాతీయ భద్రతా సలహాదారు స్వాగతం పలికారు, అనంతరం విదేశాంగ మంత్రి ఆమెను కలిశారు. ఆమె ప్రస్తుతం న్యూఢిల్లీలోని సురక్షిత గృహంలో ఉన్నారు, ఆమె ఎక్కడికి వెళ్లాలో నిర్ణయించుకుంటారు. ఆమె ఇకపై దౌత్యపరమైన పాస్‌పోర్ట్‌ను కలిగి ఉండరు కాబట్టి ఆమె ఆశ్రయం పొందాలనుకునే దేశం నుండి వీసా అవసరం. ఆమె భవిష్యత్ గమనంలో భారత్ తనదైన పాత్ర పోషిస్తుంది.

ఆమె భారతదేశానికి చేరుకున్న సందర్భంలో, డాక్టర్ జైశంకర్ మాట్లాడుతూ, 'చాలా తక్కువ సమయంలో, భారతదేశానికి రావడానికి ఆమె అనుమతిని కోరారు' అని పేర్కొన్నారు. తన భవిష్యత్తును నిర్ణయించుకోవడానికి ప్రభుత్వం ఆమెకు సమయం ఇస్తుందని ఆయన అన్నారు. ఆమె షాక్‌లో ఉన్నారనీ, కోలుకోవడానికి తగినంత సమయం కావాలనీ భారత ప్రభుత్వం పేర్కొంది. ఆమె భారతదేశంలో ఉన్న సమయంలో సంబంధిత ప్రోటోకాల్, రక్షణతో పాటు ఆమెను ప్రభుత్వ అతిథిగా భావించి వ్యవహరించడం కొనసాగుతుంది. ఆమెకు ఇద్దరు బిడ్డలు. కుమారుడు సజీబ్ అహ్మద్ వాజెద్ అమెరికాలో ఉంటూండగా, కుమార్తె సైమా వాజెద్ ఢిల్లీలో ఉన్నారు. ఢిల్లీలోని ప్రపంచ ఆరోగ్య సంస్థకు సౌత్ ఈస్ట్ ఏషియన్ రీజినల్ డైరెక్టర్‌గా సైమా వాజెద్ వ్యవహరిస్తున్నారు. అయితే హసీనా అమెరికాకు వెళ్లడం కుదరదని, ఆమె వీసాను అమెరికా రద్దు చేసిందని వార్తలు వచ్చాయి. బ్రిటన్‌లో నివసించడం హసీనాకు ఇష్టమైన మొదటి ఎంపిక. ఆమెతోపాటు ఢాకా నుండి పారిపోయి వచ్చిన ఆమె సోదరి షేక్ రెహానా బ్రిటిష్ పౌరురాలు. కాబట్టి అక్కడికి హసీనా వెళ్లడం అర్థవంతంగానే ఉంటుంది. షేక్ రెహానా కుమార్తె తులిప్ సిద్ధిక్ పార్లమెంటులో లేబర్ పార్టీ సభ్యురాలు. పైగా ట్రెజరీ, నగరాభివృద్ధి మంత్రికి ఆమె ఆర్థిక కార్యదర్శి కూడా!



తమ ఇమ్మిగ్రేషన్ చట్టం ప్రకారం బ్రిటన్ వెలుపల ఉన్న వారికి ఆశ్రయం లేదా తాత్కాలిక ఆశ్రయం పొందేందుకు ఎటువంటి నిబంధనా లేదని బ్రిటన్ అధికారులు సూచిస్తున్నట్లు మీడియా నివేదికలు పేర్కొన్నాయి. 'అంతర్జాతీయ రక్షణ అవసరమయ్యే వారు తాము చేరుకునే మొదటి సురక్షిత దేశంలో (ఈ సందర్భంలో భారత్) ఆశ్రయం పొందాలి – అదే భద్రతకు వేగవంతమైన మార్గం' అని కూడా వారు పేర్కొన్నారు. 'బంగ్లాదేశ్‌లో గత కొన్ని వారాల సంఘటనలపై ఐక్యరాజ్యసమితి నేతృత్వంలో దర్యాప్తు' కోసం డిమాండ్ చేయడం ద్వారా బ్రిటిష్ విదేశాంగ కార్యదర్శి బంగ్లాదేశ్ సంక్షోభానికి ఆజ్యం పోశారు. షేక్ హసీనాను పదవీచ్యుతురాలిని చేయడాన్ని సమర్థిస్తున్నట్లు ఈ ప్రకటన సూచిస్తుంది.

ఆమెకూ, భారత ప్రభుత్వానికీ మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ, ఆమెకు భారత్ ఆశ్రయమివ్వడం సరి కాదు. ఆమెకున్న భద్రతాపరమైన ఆందోళనలు ఆమె కదలికలను తీవ్రంగా పరిమితం చేస్తాయి. పైగా ఎన్నికల అనంతరం, అధికారంలో ఉన్న చివరి రోజులలో ఆమె తీసుకున్న నిర్ణయాలపై అభియోగాలను ఎదుర్కొనేందుకు ఆమెను రప్పించాలనే డిమాండ్లు పెద్ద సంఖ్యలో వస్తున్నాయి. కొన్ని ఆరోపణలు కల్పితం కావచ్చు. కానీ దేశంలో సాగుతున్న రాజకీయ క్రీడలో ఆమె పావుగా మారతారు.

జనరల్ ముషారఫ్‌ను విచారించకుండా పాక్ సైన్యం అక్కడి ప్రభుత్వాన్ని నిరోధించింది. తద్వారా ఆయన దుబాయ్‌లో జీవించగలిగారు. ఇది బంగ్లాదేశ్‌లోనూ పునరావృతం కావచ్చు. భవిష్యత్తులో బంగ్లాలో సైనిక నాయకత్వం ఎలా రూపొందుతుంది అనే దానిపై ఇది ఆధారపడి ఉంటుంది. హసీనా భారతదేశంలోనే కొనసాగడం సరికాదని, బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న మహ్మద్ యూనస్ పేర్కొన్నారు. బంగ్లాదేశ్ సుప్రీంకోర్ట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఇప్పటికే షేక్ హసీనాను, ఆమె సోదరిని అరెస్టు చేయాలని, అభియోగాలను ఎదుర్కొనేందుకు వారు దేశానికి తిరిగి రావాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆమె భారత్‌లోనే ఉండిపోయినట్లయితే, ఆమెను అప్పగించేందుకు న్యూఢిల్లీ అనుమతి నిరాకరిస్తుంది. ఇది ఇండో–బంగ్లా సంబంధాలను దెబ్బ తీస్తుంది. భారత్, బంగ్లాదేశ్ 2016 జూలైలో 'రెండు దేశాల మధ్య పారిపోయిన నేరస్థులను త్వరితగతిన అప్పగించడం' లక్ష్యంగా ఒక అప్పగింత ఒప్పందంపై సంతకం చేశాయి. ఒప్పందానికి కట్టుబడి ఉండేందుకు నిరాకరిస్తే భారత్ ఒకే పక్షంవైపు మొగ్గు చూపుతోందనే మాట వస్తుంది.

ఆమె తిరిగి రావాలనే డిమాండ్‌ను తిరస్కరించడం వల్ల బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేక భావాలు కూడా ఏర్పడవచ్చు, ఇది భారతదేశం కోరుకోదు. హసీనాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న జమాతే ఇస్లామీ ఈ నిరసనలకు నాయకత్వం వహించి ఇరు దేశాల సంబంధాల సాధారణీకరణపై ప్రభావం చూపుతుంది.

1962 యుద్ధం జరిగి, దలైలామాను తమకు అప్పగించాలని చైనా క్రమం తప్పకుండా డిమాండ్ చేసినప్పటికీ, న్యూఢిల్లీ దశాబ్దాలుగా ఆయనకు దేశంలో ఆతిథ్యం ఇచ్చింది. 1992 నుండి దివంగత ఆఫ్ఘన్ అధ్యక్షుడు మొహమ్మద్ నజీబుల్లా కుటుంబానికి భారత్ ఆతిథ్యం ఇస్తోంది. కుటుంబానికి సురక్షితమైన ఇల్లు, నెలవారీ స్టైపండ్ అందించడం జరిగింది. అయితే ఇటీవల భారత్ తన విధానాలను మార్చుకోవడం ప్రారంభించింది. 2022 జూలైలో దేశం విడిచి పారిపోయిన శ్రీలంక మాజీ అధ్యక్షుడు గొటబయ రాజపక్సేకు ఆశ్రయం ఇవ్వడానికి న్యూఢిల్లీ నిరాకరించింది. 2021 ఆగస్టులో అమెరికా సైన్యాల ఉపసంహరణ తర్వాత తాలిబాన్ దేశాన్ని స్వాధీనం చేసుకున్నప్పుడు, ఆఫ్ఘనిస్తాన్‌లోని అష్రఫ్ ఘనీ ప్రభుత్వ సభ్యులకు సురక్షిత మైన స్వర్గధామాలను కల్పించడానికి భారత్ నిరాకరించింది.

ఇవి ఇంకా ప్రారంభ రోజులే. బంగ్లాదేశ్ స్థిరపడటానికి, అక్కడి తాత్కాలిక ప్రభుత్వం హసీనాను తమకు అప్పగించాలని డిమాండ్ చేయడానికి కాస్త సమయం పడుతుంది. షేక్ హసీనాకు ఆశ్రయం కల్పించే అవకాశాల గురించి ఆలోచిస్తున్నట్లు భారత ప్రభుత్వం అధికారికంగా చెప్పకపోయినప్పటికీ, ఆమె కోసం తగిన నివాసప్రాంతాన్ని వెదకడంలో మాత్రం అది తన దౌత్య పరపతిని ఉపయోగించుకుంటుంది. ఈ పని ఎంత వేగంగా చేస్తే అంత మంచిది.

వ్యాసకర్త భారత సైన్యంలో విశ్రాంత మేజర్ జనరల్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

వర్ణించాల్సిన పదాలు



నా భారత సోదర సోదరీమణులకు హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు! శాంతి, ప్రేమ, ఐక్యత, ఆరోగ్యం, న్యాయం, విద్య, స్వేచ్ఛ, సృజన, సంపద పదాలు త్వరలోనే మనల్నీ, మన దేశాన్నీ వర్ణించడానికి ఉపయోగిస్తారని ఆశిద్దాం.

– జావేద్ అఖ్తర్, కవి

అందమైన దేశం



బ్రిటిష్‌వాళ్లు మన మూడున్నర కోట్లమందిని చంపేశారు. పన్నెండు దుర్భరమైన క్షామాలను కృత్రిమంగా సృష్టించారు. 45 ట్రిలియన్ డాలర్లను దోచుకున్నారు. ఇండియాను నల్లమందు ఆర్థిక వ్యవస్థకు కుదించారు. రెండు దేశాలుగా దివాళా తీయించారు. 32 ఏళ్ల ఆయుర్దాయంతో వదిలేశారు. అయినా మనం బతికి బట్టకట్టాం. భారతీయులు అందమైనవాళ్లు కాబట్టి భారత్ అందమైనది. అందరికీ హృదయ పూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.

– ఆనంద్ రంగనాథన్, రచయిత

జాగ్రత్త



ఎక్కువగా నిరసిస్తూ, తక్కువగా పరిష్కారాలు చూపేవారి పట్ల జాగ్రత్తగా ఉండండి. జై హింద్!

– దేవ్‌దత్ పట్నాయక్, రచయిత

ఇప్పటికీనా?



భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లయింది. అయినా నేను ఇప్పటికీ బెంగళూరులో అర్ధరాత్రి పన్నెండింటికి బయటికి పోవాలంటే భయపడతాను.

– మనస్వీ శర్మ, వ్యాఖ్యాత

ఎత్తున నిలబడింది!



జనానికి స్వేచ్ఛ, జీవితం, వైవిధ్యం ప్రసాదించే విషయంలో, తన పొరుగు దేశాలైన అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, చైనా, మయన్మార్, నేపాల్ కన్నా ఇండియా ఎంతో ఎత్తున నిలబడింది. ప్రపంచ స్థాయిలో మాత్రం అదింకా చాలాదూరం ప్రయాణించాల్సే ఉంది.

– ఖాలిద్ బేగ్, యూట్యూబర్

ఇక్కడ కూడానా?



స్పెయిన్‌లోని ఒక బీచ్‌లో కొంతమంది భారత మగవాళ్లు నన్ను 'దేశీ మాల్' (దేశీ సరుకు) అన్నారు. భారత మగవాళ్లు ఆఖరికి స్పెయిన్‌లో కూడా మనల్ని అసౌకర్యానికి గురిచేయగలిగినప్పుడు, ఇంక ఇండియాలోని మహిళల పరిస్థితి ఏమిటో ఊహించండి!

– జాహ్నవీ జైన్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్

సగంలో వదిలేశారు



'సగంలో వదిలేయొద్దు. శత్రువును పూర్తిగా నిర్వీర్యం చేయాలి:' కౌటిల్యుడు, సన్ ట్జు ఇద్దరూ దీన్నే నొక్కి చెప్పారు. మావో జెడాంగ్, ఆయన అనుచరులు ఈ సూత్రాన్ని కచ్చితంగా పాటించారు. కానీ దేశ భద్రత విషయంలో స్వాతంత్ర్య కాలం నుంచి ప్రతి భారతీయ ప్రధాని కూడా శత్రువును పూర్తిగా నిర్వీర్యం చేయకుండా సగంలో వదిలేసినవారే! ఏమిటి వాళ్లను మానసికంగా అడ్డుకున్నది?

– జోసెఫ్ టి. నూనీ, రచయిత

ఇన్ బాక్స్

వైద్యుల దుఃస్థితికి ప్రతీక!

కోల్‌కతా నగరంలో ఆర్‌జీ కార్ ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రిలో విధుల్లో ఉన్న మహిళా వైద్యురాలిపై అత్యాచారం చేసి, హత్య చేసిన దారుణ సంఘటన దేశాన్ని దిగ్భ్రాంతికి, తీవ్ర ఆందోళనకు గురి చేసింది. దేశంలో ఎలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో, రక్షణ కొరవడిన స్థితిలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ముఖ్యంగా మహిళలు విధుల్ని నిర్వహించాల్సి వస్తోందో ఇంకోసారి తేటతెల్లం చేసిన ఘటన ఇది. ఆ పీజీ వైద్య విద్యార్థి 36 గంటలుగా విధుల్లో ఉన్నారు. అర్ధరాత్రి దాటాక కాసేపు సెమినార్ రూమ్‌లో విశ్రమించిన సమయంలో దారుణానికి బలయ్యారు. అక్కడ సీసీ కెమెరాలు పని చెయ్యడం లేదట. ఆగంతకులు రాకుండా సరిపడా భద్రత, సరియైన వెలుతురు లేని క్యాంపస్... ఇవన్నీ ఆ కిరాతక చర్యకు దోహద పడ్డాయి.

ఇది వ్యవ స్థాగత లోపం. మహిళా ఉద్యోగులకు పూర్తి స్థాయి భద్రత కల్పించలేని నిర్వాకం. ముఖ్యంగా వైద్య రంగంలో పనిచేస్తున్న వారు ఆరోగ్య సేవలు అందించడంలో తీవ్రంగా శ్రమ పడుతున్నారు. అయినా రోగి బంధువుల నుండి భౌతిక దాడులకు గురవ్వడం లాంటి సంఘటనలు పెరుగుతూ వస్తున్నాయి. వాటిని అరికట్టే కఠిన చట్టాలు, చట్ట ప్రకారం సత్వరం శిక్ష పడేలా ఏర్పాట్లు వ్యవస్థలో అవసరం. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోవాలి. ప్రాణాలు నిలిపే డాక్టరు, తానే ప్రాణభయంతో చికిత్స అందించాల్సి వస్తే అది రోగికి మాత్రమే కాదు ప్రజారోగ్య వ్యవస్థకే ప్రమాదం. ఇక హత్యోదంతం విషయంలో ఆ వైద్య కళాశాల పెద్దలే కాకుండా, ప్రభుత్వం కూడా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించింది.

హత్యాచారం జరిగిన పిమ్మట ఆ కళాశాల ప్రిన్సిపాల్ రిపోర్ట్ ఇవ్వడానికి కూడా ఆలస్యం చేస్తే, ఆయనపై చర్యలు తీసుకోవాల్సింది పోయి ప్రభుత్వం ఆయనకు వేరే చోట బాధ్యతలు అప్పగించడం ద్వారా గౌరవించింది. సమయానికి హైకోర్టు స్పందించి ఆయన్ని సెలవుపై పంపమని ఆదేశించడం ద్వారా, కేసుని సీబీఐకి అప్పగించడం ద్వారా కొంత న్యాయం చేసింది. ఇలాంటి హీన నేరం జరిగిన తర్వాత కూడా అక్కడి ప్రభుత్వం కోర్టు చెబితే గానీ సరైన విధంగా స్పందించక పోవడం దారుణం. ఈ హత్యోదంతం నుండి పాఠాలు నేర్చుకుని ప్రభుత్వాలు వైద్యుల, ఆరోగ్య సిబ్బంది... రక్షణకు, భద్రతకు పూర్తి బాధ్యత వహించాలి. వారు పనిచేసే స్థలం పూర్తి సేఫ్ జోన్‌గా ఉండాలి.

– డా॥ డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

పాత, కొత్తల గందరగోళం

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

భారతదేశంలో నేరాల దర్యాప్తులో సుదీర్ఘమైన ఆలస్యం ఒక మహమ్మారిలా పరిణమించింది. ఇందువల్ల నిందితులైన అనేకమంది అమాయకులు అనవసరంగా జైళ్లలో విచారణ ఖైదీలుగా మగ్గవలసి వస్తోంది. కొందరైతే పది పదిహేనేళ్ల జైల్లో ఉండి చివరకు నిర్దోషిగా విడుదలయినవారూ ఉన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టాలు ఇలాంటి అమాయకుల సంఖ్య పెరగడానికి దోహదపడతాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ఎందుకంటే ఈ చట్టాలు పోలీసులకు అరెస్ట్ చేసి నిర్బంధించేందుకు అపరిమిత అధికారాలను కట్టబెడుతున్నాయి.

నేర విచారణ అత్యంత ఆలస్యంగా జరగడం వల్ల కొందరు డబ్బున్న పెద్దవాళ్లు బెయిలుపై బయటికి వచ్చి ఎన్నికల్లో పోటీచేసి గెలుస్తున్నారు. అదేసమయంలో అమాయకులు ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గుతున్నారు. ఆ విధంగా కొత్త చట్టాలు ఉన్నవారికి చుట్టాలు కాబోతున్నాయి. చట్టాలలో మార్పులు తెస్తే మంచిదే. ఈనాటి అవసరాలకు అనుగుణంగా వాటిని సవరించాలనే లక్ష్యం ఉంటే సంతోషం. చట్టాల మరింత ఆధునికీకరణ, సరళీకరణ నేటి సమాజానికి అవసరం. కానీ కొత్త నేరాల చట్టాల వల్ల మేలు కంటే కీడే ఎక్కువ జరిగేలా ఉంది. ఈ చట్టాల ద్వారా జరిమానాలను చాలా పెంచారు. ఇది సరికాదు. పోనీ కనీసం కొత్త చట్టాల అమలు ద్వారా అయినా సత్వర తీర్పులు వచ్చే అవకాశం కలిగితే కొంత సంతోషం కలిగేది. కానీ కనుచూపు మేర అది సాధ్యమయ్యేలా కనిపించడంలేదు. ఎందుకంటే కొత్తగా నమోదయ్యే కేసులను కొత్త చట్టాల ప్రకారం విచారించాల్సి ఉంటుంది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న లక్షలాది కేసులను పాత క్రిమినల్ చట్టాల ప్రకారం విచారించాల్సి ఉంటుంది. ఒకే సమయంలో పాత, కొత్త చట్టాల కింద విచారించడానికి తగిన సిబ్బంది, వసతులూ భారతీయ న్యాయ వ్యవస్థకు లేకపోవడం ఇక్కడ గమనార్హం.

ఇవీ మన కొత్త చట్టాలు–4




కొత్త మూడు చట్టాల్లో రెండింటిలో కొంచెం మార్పులు చేసినట్లు కనిపించినా మూడోదైన సాక్ష్య చట్టం మక్కీకి మక్కీ పాతదే. ఇండియన్ శిక్షాస్మృతి అనే 1860 నాటి పరమ పాత (లేదా సనాతన) చట్టం... 'భారతీయ న్యాయ సంహిత–2023' పేరుతో మళ్లీ తీసుకురావడం విడ్డూరం. ఏం సాధించడానికి ఎన్డీఏ ప్రభుత్వం ఈ చట్టాలను కొత్తగా తీసుకువచ్చిందో అర్థం కావడం లేదు. పార్లమెంట్‌లో స్వయంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగిన స్థితిలో లేని బీజేపీపై... భాగస్వామ్య పక్షాల్లో బలమైన టీడీపీ, జేడీయూ వంటివైనా ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేయకపోవడం విచారకరం. ఇందువల్ల ఈ కొత్త చట్టాలు నిరాఘాటంగా కొనసాగేందుకు అడ్డంకీ లేకుండా పోయింది.

ఇప్పటికే పౌర హక్కుల కోసం ఉద్యమిస్తున్న కార్యకర్తలను దారుణ నిర్బంధానికి గురి చేస్తున్నారు. రాజకీయ కక్ష సాధింపులకు పాత నేరచట్టాలను ఉపయోగించే ఎన్నో దారుణాలకు పాల్పడింది బీజేపీ సర్కార్. ఇప్పుడు కొత్త చట్టాలను ఉపయోగించి మరెంత అన్యాయంగా వ్యవహరిస్తుందో అనే భయం ఎల్లెడలా కనిపిస్తోంది. వీటిని అడ్డుపెట్టుకొని రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కూల్చడానికి మరింతగా ప్రయత్నించవచ్చు. ఇప్పటికే అనేక కేసులు బనాయించిన ప్రతిపక్ష ప్రజా ప్రతినిధులు తమ పార్టీలో చేరిన తరువాత వారిపై కేసులు ఎత్తివేయడమో, లేక విచారణను వాయిదా వేసేలా చూడడమో బీజేపీ చేస్తూనే ఉంది. ఈ పరిస్థితుల్లో అమలులోకి వచ్చిన కొత్త చట్టాలు కేంద్ర పాలకులకు ఇంకెంత మేలు చేకూర్చనున్నాయో! అంతిమంగా సాధారణ పౌరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారనేది సుస్పష్టం.

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా'లో ప్రొఫెసర్

పరహితమే పరమ ధర్మం!

సొంత లాభం కొంత మానుకుని పొరుగు వారికి తోడు పడవోయ్' అన్నారు మహాకవి. 'పరోపకారార్థ మిదం శరీరం' అని సంస్కృత సుభాషితం. పరహితమే పరమ ధర్మం. ఇతరులకు హితం చేస్తే శ్రీహరి సంతోషిస్తాడు. హరి మనస్సు ఆనందిస్తే లోకాలన్నీ ఆనందిస్తాయి అని భాగవతం చెబుతుంది. ముల్లోకాలను దహింపబోతున్న హాలాహల జ్వాలలను లోక కల్యాణం కోసం, జీవరాశుల రక్షణ కోసం పరమ శివుడు స్వీకరించి గరళ కంఠుడయ్యాడు. 'పెట్టి పొయ్యలేని వట్టి నరులు భూమి పుట్టనేమి? వారు గిట్టనేమి?' అన్నాడు వేమన. ఇతరులకు సాయం చెయ్యని, పెట్టుపోతల గురించి, దాన ధర్మాల గురించి ఆలోచించని మనుషుల వల్ల సమాజానికి ఎటువంటి ప్రయోజనమూ లేదని దీని అర్థం.



జ్యోతిర్మయం

నిజానికి పూజలన్నింటి సారాంశం ఒకటే. నిర్మలమైన మనసుతో ఉండటం, ఇతరులకు మంచి చెయ్యటం. ఎవరైతే పేదవారిలో, బలహీనులలో, అవసరార్థులలో దైవాన్ని చూడగలుగుతారో వారే భగవంతుని పూజించగలరు. ఇతరుల కోసం ఏ మంచి పని చేసినా అది మనలో ఒక కొత్త శక్తిని నింపుతుంది. అంతులేని ఆత్మతృప్తిని ఇస్తుంది. ప్రసిద్ధి పొందిన దాతలు, ప్రజారంజకులైన పాలకులు ఇతరుల మేలు కొరకే జీవించారు.

జీవితం క్షణ భంగురం. సంపాదించిన ధనం, నగలు, ఆస్తిపాస్తులు ఇవేవీ వెంట రావు. జీవితం ఉన్నంత వరకు భౌతిక అవసరాలకు ఉపయోగపడేవి ఇవి. ఎవరైతే పరుల కోసం జీవిస్తారో వారే ప్రజల మనస్సుల్లో శాశ్వతంగా జీవిస్తారు. పరులకు మేలు చేయటానికి ధనమే ఉండనక్కరలేదు. ఏ ఇతర సహాయాలనైనా అవసరంలో ఉన్నవారికి అందించి ఆదుకోవచ్చు. కావలసింది మంచి మనస్సు. ఈ సమాజంలో తగిన సహాయం చేసేవారు లేక అలమటించే వారు ఎందరో ఉన్నారు. సమర్థులైనవారు అటువంటివారికి సహాయం అందించవలసి ఉంది. బహుజన హితంలోనే సమాజ శ్రేయస్సు ఉంది.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

శ్రీవారి సేవలో మహేశ్‌బాబు సతీమణి



తిరుమల / శ్రీకాళహస్తి : సినీ నటుడు మహేష్‌బాబు సతీమణి నమ్రత తన కుమారుడు గౌతమ్, కుమార్తె సితారలతో కలిసి గురువారం ఉదయం సుప్రభాత సేవలో పాల్గొని తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. అనంతరం వారు శ్రీకాళహస్తి చేరుకుని జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. అలాగే సినీ నటుడు రాజేంద్రప్రసాద్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

పూల ధర.. జేబులదర

కడియపులంక మార్కెట్‌లో మూడింతలు పెరిగిన ధరలు

వరుస శుభకార్యాలు, పండుగల జోరే కారణం | దిగుమతులపైనే ఆధారం





ఆలమూరు: తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన కడియపులంక పూల మార్కెట్ శ్రావణ శోభతో కళకళలాడుతోంది. పూల దిగుబడికన్నా డిమాండ్ అధికంగా ఉండటంతో ధరలు మూడింతలు పెరిగాయి. వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల కొంతకాలంగా ఇబ్బందులు పడుతున్న పూల రైతులకు ప్రస్తుత ధరలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. వరలక్ష్మి వ్రతం, వినాయక చవితి, విజయ దశమి, దీపావళి వంటి వరుస శుభకార్యాలు, నాలుగు నెలల పాటు వివాహాలు ఉండటంతో మార్కెట్ సందడిగా మారింది.

అన్ని రకాల పూలకూ డిమాండ్

కడియపులంక పూల మార్కెట్‌లో అన్ని రకాల పూలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. చామంతి, మల్లి, జాజులు, లిల్లీ రైతులకు ప్రస్తుత ధరలు సిరుల్ని కురిపిస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే పూల ధరలు మూడు రెట్లు పెరిగినా.. తోటలు ఖాళీ అవడంతో చాలామంది రైతులు నిరుత్సాహానికి గురవుతున్నారు. జిల్లాలో సాగు చేస్తున్న కొత్త రకం చామంతి పూలకు ఎండలను తట్టుకునే శక్తి ఉండటంతో జిల్లాలో కొంతమేర పూల దిగుబడి ఆశాజనకంగా ఉంది. వాతావరణ మార్పుల ప్రభావంతో పూల తోటలు ఎండిపోయి దిగుబడి గణనీయంగా పడిపోతోంది. దీంతో స్థానికంగా పండించే పూలు అవసరాలకు సరిపోని పరిస్థితి ఏర్పడింది.

దిగుమతుల వల్లే..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని నదీ పరివాహక ప్రాంతాల వెంబడి సుమారు 5 వేల ఎకరాల్లో వివిధ రకాల పూల సాగు జరుగుతోంది. రైతులు పండించిన పూలను కడియపులంక పూల మార్కెట్‌కు తరలించి విక్రయాలు జరుపుతారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కడియం, ఆలమూరు, ఆత్రేయపురం, రాజమహేంద్రవరం రూరల్, సీతానగరం, కె.గంగవరం, కపిలేశ్వరపురం మండలాల నుంచి నిత్యం సుమారు 20 టన్నుల పూలు కడియపులంక మార్కెట్‌కు వస్తుంటాయి. ఇదే సమయంలో ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు ఎగుమతులు జరుగుతుండటంతో పూల కొరత ఏర్పడుతోంది. దీంతో మార్కెట్ డిమాండ్‌ను అనుసరించి కడియపులంక హోల్‌సేల్ వ్యాపారులు బెంగళూరు, చెన్నై, మహారాష్ట్ర నుంచి వివిధ రకాల పూలను దిగుమతి చేసుకుంటున్నారు. దీనికితోడు వరుస శుభకార్యాలు, దిగుమతుల ప్రభావంతో పాటు రవాణా ఖర్చులు పెరిగిపోవడంతో పూల ధర పెరిగిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అలంకరణ పూలకు భలే డిమాండ్

శుభకార్యాల్లో అలంకరణకు ఉపయోగించే జర్బరా పూలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. కల్యాణ వేదికలకు అవసరమయ్యే పూలు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో బెంగళూరు, ఊటీ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఇప్పటివరకూ రూ.40 పలికిన పది పూల కట్ట ధర ప్రస్తుతం రూ.110కి చేరింది. వివాహ, శుభకార్యాల వల్ల మంటపాలు అలంకరించే వారు జిల్లా నలుమూలల నుంచి భారీ స్థాయిలో ఆర్డర్లు పెడుతున్నారు. దీంతో డెకరేషన్ పూల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి.

పూల ధరలు	గత నెలలో	ఈ నెలలో
	(కిలోకి రూపాయల్లో)	
మల్లెలు	550	1,500
తెల్ల చామంతి	200	350
పసుపు చామంతి	150	400
బంతి	50	100
కనకాంబరం (బారు)	100	300
లిల్లీ	150	500
గులాబీ (కట్ట)	50	300
జాజులు	300	1,200
గులాబీ జడ	500	900



ధర ఆశాజనకం



ఈ సీజన్‌లో అన్ని రకాల పూల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. జిల్లాలో పూల దిగుబడి తగ్గడంతో మార్కెట్‌కు రికార్డు స్థాయిలో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు జరుగుతున్నాయి. ప్రస్తుతం శుభ ముహూర్తాలు వరుసగా రావడంతో పూల ధరలు ఇంచుమించు ఇదే విధంగా ఉండే అవకాశం ఉంది.

– సాపిరెడ్డి సత్తిబాబు, పూల వ్యాపారి, కడియపులంక

చామంతి సాగుతో లాభాలు



ఇప్పటివరకూ అంతంత మాత్రంగానే ఉన్న పూల సాగు ప్రస్తుతం లాభాలను తెచ్చిపెడుతోంది. వరుసగా వివాహాలు, పండుగలు ఉండటంతో పూల ధర ఇదే విధంగా కొనసాగే అవకాశం ఉందని ఆశిస్తున్నాం.

– మందపల్లి శ్రీధర్, ఉద్యాన రైతు, బడుగువానిలంక

లాకప్‌లో బాలురు

చట్ట నిబంధనలకు తిలోదకాలు ఇచ్చిన నగరంపాలెం పోలీసులు



పట్నంబజారు: చట్ట నిబంధనలకు లోబడి బాధ్యతలు నిర్వర్తించవలసిన పోలీసులు వాటిని ఉల్లంఘించి.. నలుగురు బాలురను లాకప్‌లో ఉంచడం పలు విమర్శలకు దారితీసింది. వివరాల్లోకి వెళితే.. మూడు రోజుల కిందట ద్విచక్ర వాహనాలు, సెల్ ఫోన్, పెట్రోల్ చోరీ కేసులో.. 13 సంవత్సరాల లోపు వయసున్న నలుగురు బాలలను నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ పట్టుకొచ్చారు. చట్ట నిబంధనలు పాటించకుండా ఎఫ్‌ఐఆర్ కట్టి ఆ బాలలను లాకప్‌లో ఉంచారు. కేసులో నిందితులయి ఉంటే.. వారిని జువైనల్ హోంకు తరలించి విచారణ చేపట్టాల్సి ఉంది. బాలలను మూడు రోజులుగా లాకప్‌లో ఉంచి.. ఇష్టానుసారంగా వ్యవహరించిన స్టేషన్ అధికారులు, సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభం

- మొదటి రోజు పవిత్ర ప్రతిష్ఠ
- ఆలయ మాడ వీధుల్లో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి విహారం

తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారిని పవిత్ర మండపంలోని యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. వేద పండితులు పంచసూక్తాలను పఠించారు. అనంతరం పవిత్ర ప్రతిష్ఠ జరిగింది. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు విశేష సమర్పణ చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కారణంగా ఆలయంలో తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవలను టీటీడీ రద్దు చేసింది. కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం ఇతర అధికారులు పాల్గొన్నారు.



శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న వేదపండితులు

శిలాఫలకాలపై ‘పచ్చ’ రంగు

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం చల్లపాళ్యం గ్రామంలో అభివృద్ధికి ఆనవాలుగా ఉన్న శిలాఫలకాలపై టీడీపీ నాయకులు పసుపు పచ్చ రంగు పూసి పైశాచిక ఆనందం పొందారు. చల్లపాళ్యంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.40 లక్షల వ్యయంతో సచివాలయ భవనం, రూ.21 లక్ష వ్యయంతో రైతు భరోసా కేంద్రం భవనాలను నిర్మించారు. గ్రామంలో అంతకు ముందు లేని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరగడం ఓర్వలేని టీడీపీ నాయకులు బుధవారం అర్ధరాత్రి శిలాఫలకాలపై పసుపు పచ్చ రంగు వేశారు. గురువారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల కోసం సచివాలయం వద్దకు వచ్చిన ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ముందు నివ్వెరబోయారు. అనంతరం ఈ చర్యలను తీవ్రంగా ఖండించారు. – శ్రీకాళహస్తి రూరల్



చల్లపాళ్యంలోని సచివాలయ భవనం

పచ్చ రంగు వేసిన శిలాఫలకం

లింగాలగట్టులో చిరుత సంచారం



శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం మండలం లింగాలగట్టు గ్రామం బోయ క్యాంపులో తరచూ చిరుత సంచరిస్తుండడంతో స్థానికులు భయభ్రాంతులకు లోనవుతున్నారు. గురువారం తెల్లవారుజామున కుక్కల వేట కోసం చిరుత రాగా.. కుక్కలు అరుస్తుండడంతో, స్థానికులు లేచి చిరుతను తరిమారు. చిరుతతో ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందోననే భయం స్థానికులను వెంటాడుతున్నది. అటవీ అధికారులు చిరుతను బంధించి లోతట్టు అటవీప్రాంతంలో వదలాలని కోరుతున్నారు.

ఆ పాప వైద్యం ఖరీదు రూ.18 కోట్లు



చిన్నారి అక్షయ

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం పెద్దమరివీడు గ్రామానికి చెందిన నాగేష్, మరియమ్మ దంపతులు వ్యవసాయ కూలీలు. వారికి ముగ్గురు కుమార్తెలు. రెండో కూతురు అక్షయ (2)కు అత్యంత అరుదైన స్పైనల్ మస్కులర్ అట్రోఫీ అనే వ్యాధి వచ్చింది. ఈ కారణంగా పాప ఎదుగుతున్నా కండరాలు సహకరించక నిలబడలేకపోతోంది. నడవలేక.. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతోంది. తల్లిదండ్రులు పాపను వైద్యుల వద్దకు తీసుకెళ్లారు. పాప లక్షణాలను బట్టి హైదరాబాద్‌లోని సీసీఎంబీ ల్యాబ్‌లో జెనటిక్ పరీక్షను చేయించారు. పరీక్షల్లో ఆ పాపకు స్పైనల్ మస్కులర్ అట్రోఫీగా నిర్ధారణ అయ్యింది. నిర్లక్ష్యం చేస్తే పాప ప్రాణాలకే ప్రమాదమని వైద్యులు చెప్పారు. న్యూరోఫిజీషియన్ హేమంత్‌కుమార్ ఆ పాప పరిస్థితిని వివరిస్తూ.. పాప చికిత్సకు జోల్‌జెరి ఎస్‌ఎంఏ అనే ఇంజెక్షన్ చేయాలని, దాని ఖరీదు రూ.18 కోట్లు అవుతుందని చెప్పారు. జన్యుపర కారణాల వల్ల ఈ వ్యాధి వస్తుందన్నారు. కాగా.. బిడ్డను కాపాడుకోవడం రోజు కూలీ చేసుకునే తమకు చాలా కష్టమని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కుమార్తె అక్షయను రాష్ట్ర ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని ఆ దంపతులు కోరుతున్నారు.

ఫీజుల ఒత్తిడిని తట్టుకోలేక విద్యార్థి ఆత్మహత్య

అమృత యూనివర్సిటీలో బీటెక్ విద్యార్థి బలవన్మరణం



సుశాంత్ (ఫైల్)

మంగళగిరి : యూనివర్సిటీ యాజమాన్య ఫీజుల ఒత్తిడిని తట్టుకోలేక బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజమండ్రికి చెందిన సుశాంత్ మండలంలోని కురగల్లు గ్రామంలోని అమృత యూనివర్సిటీలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్‌లో 98 శాతం మార్కులు సాధించిన సుశాంత్‌ను యూనివర్సిటీ నిర్వాహకులు ఉచితంగా సీటు ఇచ్చి చేర్చుకున్నారు. తొలి ఏడాది 7.5 శాతం మార్కులొస్తే ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే ఇటీవల జరిగిన పరీక్షల్లో విద్యార్థికి 7.5 శాతం కంటే తక్కువగా మార్కులు రావడంతో ఫీజు మొత్తం చెల్లించాలంటూ యూనివర్సిటీ యాజమాన్యం ఒత్తిడి తెచ్చింది. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పుకోలేక సుశాంత్ కుమిలిపోయాడు. ఈ నేపథ్యంలో గురువారం తోటి విద్యార్థులు క్లాస్‌కు వెళ్లాక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే యూనివర్సిటీ యాజమాన్యం ఈ విషయం తల్లిదండ్రులకు తెలియజేయకపోవడంపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఎయిమ్స్‌కు తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించి.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

గిరిజన సర్పంచ్ భర్తపై టీడీపీ నేత దాడి

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించకుండా ఎస్టీ మహిళా సర్పంచ్‌ను అడ్డుకున్న వైనం

నరసరావుపేట: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించకుండా ఓ ఎస్టీ మహిళా సర్పంచ్‌ను టీడీపీ నేతలు అడ్డుకున్న ఘటన కారెంపూడిలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కారెంపూడి పంచాయతీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించడానికి ప్రమీలభాయి భర్త తేజానాయక్‌తో కలసి బైక్‌పై వచ్చారు. దీంతో అక్కడున్న టీడీపీ నాయకులు వారిని జెండా ఎగురవేయడానికి వీల్లేదని అడ్డుకున్నారు. అందులో నాగేశ్వరరావు అనే వ్యక్తి తేజానాయక్‌పై దాడి చేసి కొట్టారు. దీంతో సర్పంచ్ ప్రమీల, ఆమె భర్త తేజానాయక్ ఇద్దరూ ప్రాణభయంతో ఇంటికెళ్లి పోయారు. స్వాతంత్ర దినోత్సవం నాడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడానికి కూడా తమకు స్వేచ్ఛ లేదా.. తాము గిరిజన కుటుంబానికి చెందిన వాళ్లం కావడంతోనే తనపై దాడి జరిగిందని తేజానాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. కొంత కాలంగా తన పదవికి రాజీనామా చేయాలని టీడీపీ నాయకులు తన భార్యను బెదిరిస్తున్నారని, తన ఇంటి మీదకు కూడా గతంలో వచ్చి బెదిరింపులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు పోలీస్‌స్టేషన్‌కు పోవాలన్నా భయపడుతున్నామని అక్కడకు వెళ్లినా వచ్చి దాడి చేస్తారని భయపడి నరసరావుపేటలోనే తలదాచుకున్నానని తేజానాయక్ ఆవేదన వ్యక్తం చేశారు.పల్నాడు జిల్లా ఎస్పీని కలసి తనకు ప్రాణభయం ఉందని, కాపాడాలని అభ్యర్థించనున్నట్లు తేజానాయక్ పేర్కొన్నారు. పల్నాడు జిల్లా ఎస్పీని కలసి తనకు ప్రాణభయం ఉందని, కాపాడాలని అభ్యర్థించనున్నట్లు తేజానాయక్ పేర్కొన్నారు.

కూలీలను కబళించిన మృత్యు శకటం

కర్నూలు–హైదరాబాద్ హైవేపై కూలీల ఆటోను ఢీకొన్న లారీ

- ఇద్దరు మహిళల మృతి
- ఇద్దరి పరిస్థితి విషమం
- మరో 17 మందికి గాయాలు



ఘటనా స్థలంలో చల్లాచెదురుగా పడిన కూలీలు



తీవ్రంగా గాయపడిన ప్రియాంక

కర్నూలు (హాస్పిటల్): వారంతా కూలీలు. వానలు కురవక.. చేద్దామంటే పనులు దొరక్క పొట్టచేత బట్టుకుని వలసబాట పట్టిన కూలీల్లో ఇద్దరిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండగా.. ఆటోడ్రైవర్ సహా 17 మంది గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. కర్నూలు జిల్లాలో వర్షాభావంతో వ్యవసాయం పడకేసింది. పనులు కూడా దొరకని పరిస్థితుల్లో కర్నూలు మండలం ఇ.తాండ్రపాడు గ్రామానికి చెందిన పలువురు ఎక్కడ పని దొరికితే అక్కడికి వెళ్తున్నారు. రోజులాగే గురువారం స్టీరింగ్ ఆటోలో 20 మంది కూలీలు తెలంగాణలోని ఉండవెల్లి మండలం కంచుపాడు బయలుదేరారు. ఆ ఆటోను కర్నూలు –హైదరాబాద్ హైవేపై జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి స్టేజీ సమీపంలోని వరసిద్ధి వినాయక కాటన్ మిల్లు వద్ద వెనుక నుంచి 20 టైర్లు గల భారీ లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటో పైకెగిరి కింద పడింది. ఆటోలో ఉన్న లక్ష్మీదేవి (58) అక్కడికక్కడే మృతి చెందింది. గాయపడిన 19 మందిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు మూడు అంబులెన్సుల్లో తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రమాదేవి అలియాస్ తెలుగు సుజాత (40) మృతి చెందింది. ప్రియాంక (18), అనిత పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఆటో డ్రైవర్ నరసింహులు (40)తోపాటు లక్ష్మీదేవి (60), రాధ (40), మద్దిలేటి (50), వరుణ్‌కుమార్ (13), కె.వరలక్ష్మి (44), పద్మ (45), రమాదేవి (40), నందు (17), భాస్కర్ (47), పావని (25), లక్ష్మీదేవి (50), లక్ష్మీదేవి (50), చిట్టెమ్మ (60), వరలక్ష్మి(47)తో పాటు మరో ఇద్దరు ఉన్నారు. క్షతగాత్రులు, వారి కుటుంబసభ్యులు, బంధువులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆస్పత్రిలోని క్యాజువాలిటీ కిక్కిరిసిపోయింది.




లక్ష్మీదేవి, రమాదేవి(ఫైల్)

క్షతగాత్రులకు ప్రజాప్రతినిధుల పరామర్శ

ప్రమాదంలో గాయపడిన వారిని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, కోడుమూరు వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ ఆదిమూలపు సతీష్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

పరిహారం కోసం డిమాండ్

రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యవసాయ కూలీల కుటుంబాలకు రూ.25 లక్షలు, గాయపడ్డ వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి.వీరశేఖర్, ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ డిమాండ్ చేశారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేక సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని, ఉపాధి హామీ పనులు కల్పించకపోవడం, పనిచేసిన వారికి 11 నెలలైనా బిల్లులు రాకపోవడం వల్ల పొట్టకూటి కోసం వెళ్లి వారు ప్రాణాలు పోగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అత్యవసర విధులు బహిష్కరించిన జూడాలు

కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో వైద్య సేవలకు అంతరాయం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జూనియర్ డాక్టర్లు గురువారం మధ్యాహ్నం నుంచి అత్యవసర విధులను కూడా బహిష్కరించారు. కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థిని హత్య నేపథ్యంలో దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్య విద్యార్థులకు రక్షణ కల్పించాలని కోరుతూ మూడు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న జూనియర్ వైద్యులు అత్యవసర సేవలను సైతం నిలిపివేసి ఆస్పత్రిలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీ వద్ద ఆందోళన నిర్వహించారు. వీరికి సీనియర్ వైద్యులు, ఏపీ ప్రభుత్వ సంఘం నాయకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సోమప్ప, డాక్టర్ దమామ్ శ్రీనివాసులు, డాక్టర్ బాలాజీనాయక్ తదితరులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా జూడాలు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిని హత్య చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని అక్కడి మెడికల్ కాలేజీ విద్యార్థులు ఆందోళన చేస్తుండగా, వారిపై బుధవారం రాత్రి ఒకేసారి 3వేల మంది దాడికి ప్రయత్నించారని చెప్పారు. అందువల్లే తక్షణమే వైద్యులు, వైద్య విద్యార్థులకు రక్షణ కల్పించాలని అత్యవసర విధులను సైతం బహిష్కరించామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు, వైద్య విద్యార్థులకు దేశవ్యాప్తంగా రక్షణ కరువైందన్నారు. భయం నీడలో వైద్య విద్యార్థులు విధులు నిర్వహించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. ఆస్పత్రుల్లో జూనియర్ వైద్యులకు కనీస సదుపాయాలు లేవన్నారు. వైద్య విద్యార్థుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. జూడాల సమ్మెతో క్యాజువాలిటీతోపాటు ఏఎంసీ, చిన్నపిల్లలు, ప్రసూతి, కార్డియాలజీ విభాగాల్లో వైద్యసేవలకు అంతరాయం ఏర్పడింది. రోగులు ఇబ్బందిపడ్డారు.



ఆసుపత్రిలోని ఓల్డ్ క్లినికల్ లెక్చర్ గ్యాలరీ వద్ద ఆందోళన చేస్తున్న జూడాలు

పసుపు పంటకు సిరుల ఛాయ

- గంజాయి వదిలి పసుపు సాగు వైపు..
- పెరుగుతున్న విస్తీర్ణం
- అంతర్జాతీయ మార్కెట్‌లో మాడుగుల పసుపునకు గిరాకీ
- ఏటా రూ.120 కోట్ల టర్నోవర్
- వెయ్యి కుటుంబాలకు జీవనోపాధి



మాడుగుల: పసుపునకు గత ఏడాది కంటే ఈ ఏడాది ధరలు పెరగడంతో మాడుగులలో పసుపు కళకళలాడుతోంది. సాగు పెంచడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దేశీయ మార్కెట్‌లో మాడుగుల పసుపునకు మంచి డిమాండ్ ఉండడంతో రైతులతో పాటు వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లుగా పసుపు ధరలు పెరుగుతూ ఉండడంతో ప్రతి ఏటా రైతులు సాగు పెంచుతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మన్యం ముఖ ద్వారమైన మాడుగుల పసుపు వ్యాపారానికి ప్రధాన కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. ఏజన్సీలో 11 మండలాల్లో పండించిన పసుపు, మాడుగుల, పసుపు ప్రాసెసింగ్ కేంద్రాలకు సరఫరా అవుతుంది. గత ప్రభుత్వం ఏజెన్సీలో గంజాయి కట్టడి చేయడంతో ప్రత్యామ్నాయం వైపు చూసిన రైతులంతా పసుపు సాగుపై దృష్టి సారించారు. దీంతో ఈ ఏడాది కూడా పసుపు సాగు పెంచారు.

పసుపు ప్రాసెసింగ్: విశాఖ ఏజెన్సీలో పండించిన పసుపు దుంపలు మాడుగుల చేరాక, అక్కడ డ్రమ్ముల్లో వేసి ఉడక బెట్టి ప్రాసెసింగ్ చేస్తారు. అనేక ప్రాసెస్‌ల తర్వాత ఎల్లో నారింజ రంగుకు మారుతుంది. తర్వాత ఆకర్షణీయమైన ప్యాకింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ పసుపు వ్యాపారంపై సుమారు 1000కి పైగా కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి.

పెరుగుతున్న విస్తీర్ణం: గతంలో 3 వేల ఎకరాలకు పరిమితమైన పసుపు సాగు నేడు ధరలు పెరుగుతూ ఉండడంతో 5 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణానికి సాగు పెంచుతున్నారు. ఏజెన్సీలోని 11 మండలాల నుంచి 77 కిలోలున్న బస్తాలు 80 వేలు వచ్చేవి కానీ ఈ ఏడాది సుమారు లక్షా 40 వేల బస్తాలు వస్తాయని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

అంతర్జాతీయంగా గుర్తింపు: దక్షిణ భారత దేశంలో రెండు తెలుగు రాష్ట్రాలలో నర్సీపట్నం, పాలకొండ, రాజమండ్రి, వరంగల్, నిజామాబాద్, దుగ్గిరాల, తమిళనాడు, కేరళ, ఒడిశా, బరంపురంలో పసుపు పరిశ్రమలున్నాయి. మాడుగుల, తుని, నర్సీపట్నం, సాలూరులలో పసుపు ప్రాసెసింగ్ కేంద్రాలున్నాయి. కాని మాడుగుల పసుపునకు మాత్రం దేశీయ అంతర్జాతీయ, మార్కెట్‌లలో మంచి గిరాకీ ఉంది. విశాఖ మన్యంలో పండించే పసుపులో కుర్కుమిన్‌తో పాటు, చర్మసౌందర్యానికి ఉపయోగపడే, ఓలంటయిల్, ఉండడమే ఇందుకు కారణమని నిపుణులు చెబుతున్నారు. మిగతా ప్రాంతాల పసుపులో 2% కుర్కుమిన్ ఉంటే మాడుగుల పసుపులో మాత్రం 5% కుర్కుమిన్ ఉండడంతో పాటు రంగు ఆరంజ్ ఎల్లో కావడంతో మంచి క్రేజ్ ఉంది. నాణ్యమైన పసుపు కావడంతో సౌందర్యానికి, వివిధ రకాల వంటకాల్లో ఈ పసుపు విరివిగా వినియోగించడం వల్ల ఈ పసుపునకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.



లౌకిక పౌరస్మృతి!

దేశానికి తక్షణావసరం: మోదీ

న్యూఢిల్లీ: దేశంలో ప్రస్తుతం మతపరమైన పౌరస్మృతి అమల్లో ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ''దాన్ని 75 ఏళ్లుగా భరిస్తున్నాం. ఆ స్మృతికి చరమగీతం పాడి దాని స్థానంలో దేశ ప్రజలందరికీ సమానంగా వర్తించే 'లౌకిక' పౌరస్మృతిని రూపొందించుకోవాల్సిన సమయం వచ్చింది'' అని కుండబద్దలు కొట్టారు. ''రాజ్యాంగ స్ఫూర్తి కూడా అదే. దేశమంతటికీ ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) ఉండాలని ఆదేశిక సూత్రాలు కూడా స్పష్టంగా చెబుతున్నాయి. దాని ఆవశ్యకతను సుప్రీంకోర్టు కూడా పలుమార్లు నొక్కిచెప్పింది. ఆ మేరకు తీర్పులు వెలువరించింది'' అని గుర్తు చేశారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం మోదీ ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేయడం ఆయనకిది వరుసగా పదకొండోసారి కావడం విశేషం. బీజేపీ ఎజెండా అంశాల్లో, ప్రధాన ఎన్నికల ప్రచార నినాదాల్లో ఒకటైన యూసీసీని వీలైనంత త్వరగా అమల్లోకి తెస్తామని ఈ సందర్భంగా ప్రధాని స్పష్టమైన సంకేతాలిచ్చారు. ''ప్రస్తుత పౌరస్మృతి ఒకవిధంగా మతపరమైనదన్న అభిప్రాయం సమాజంలోని మెజారిటీ వర్గంలో ఉంది. అందులో వాస్తవముంది. ఎందుకంటే అది మతవివక్షతో కూడినది. అందుకే దాన్నుంచి లౌకిక స్మృతివైపు సాగాల్సి ఉంది. తద్వారా రాజ్యాంగ నిర్మాతల కలను నిజం చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. అది తక్షణావసరం కూడా'' అని పేర్కొన్నారు. 'ఒక దేశం–ఒకే ఎన్నిక' కూడా దేశానికి చాలా అవసరమని మోదీ అన్నారు. ''2047 కల్లా అభివృద్ధి చెందిన భారత్ కలను సాకారం చేసుకుందాం. అందుకు 140 కోట్ల పై చిలుకు భారతీయులంతా భుజం భుజం కలిపి కలసికట్టుగా సాగుదాం'' అని పిలుపునిచ్చారు. రంగాలవారీగా తమ పాలనలో దేశం సాధించిన ప్రగతిని 98 నిమిషాల పాటు వివరించారు. తద్వారా అత్యంత ఎక్కువ సమయం పాటు పంద్రాగస్టు ప్రసంగం చేసిన ప్రధానిగా సొంత రికార్డు (94 నిమిషాల)నే అధిగమించారు.

బంగ్లాలో పరిస్థితులు ఆందోళనకరం

కల్లోల బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీలపై జరుగుతున్న దాడుల పట్ల 140 కోట్ల పై చిలుకు భారతీయుల్లో ఆందోళన నెలకొందని మోదీ అన్నారు. అక్కడ త్వరలో శాంతియుత పరిస్థితులు నెలకొంటాయని ఆశాభావం వెలిబుచ్చారు. అందుకు భారత్ అన్నివిధాలా సహకారం అందిస్తుందని చెప్పారు.

లక్ష మంది యువత రాజకీయాల్లోకి

రాజకీయ రంగంలో కుల, కుటుంబవాదాలకు అడ్డుకట్ట వేయాలని మోదీ అన్నారు. అందుకోసం ఏ రాజకీయ నేపథ్యమూ లేని లక్ష మంది యువతీ యువకులు ప్రజా జీవితంలోకి రావాలని పిలుపునిచ్చారు. ''వారికి నచ్చిన పార్టీలో చేరి అన్ని స్థాయిల్లోనూ ప్రజాప్రతినిధులుగా మారాలి. కొత్త ఆలోచనలతో కూడిన ఆ కొత్త రక్తం మన ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేయగలదు'' అన్నారు.

ప్రతికూల శక్తులతో జాగ్రత్త

దేశ ప్రగతిని కొందరు ఓర్వలేకపోతున్నారని విపక్షాలనుద్దేశించి మోదీ విమర్శించారు. ''ప్రతిదాన్నీ ధ్వంసం చేయాలని వాళ్లు కలలు గంటున్నారు. అవినీతిని ఘనకార్యంగా ప్రచారం చేసుకుంటున్నారు. దీన్ని ప్రజలు అర్థం చేసుకోవాలి. అలాంటి ప్రతికూల శక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలి'' అన్నారు. అంతర్గతంగా, బయటి నుంచి భారత్ లెక్కలేనన్ని సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు.

రాజస్తానీ రంగుల తలపాగా

ఎప్పట్లాగే ఈ పంద్రాగస్టు సందర్భంగా కూడా మోదీ ప్రత్యేక తలపాగాతో మెరిసిపోయారు. పసుపు, ఆకుపచ్చ, కాషాయ రంగులతో కూడిన రాజస్తానీ సంప్రదాయ లెహరియా తలపాగాతో ఆకట్టుకున్నారు. తెల్ల కుర్తా, చుడీదార్, నీలిరంగు బంద్‌గలా ధరించారు.

కొత్తగా 75,000 వైద్య సీట్లు

''వైద్య విద్య కోసం మన యువత విదేశీ బాట పడుతోంది. ఇందు కోసం మధ్యతరగతి తల్లిదండ్రులు లక్షలు, కోట్లు వెచ్చించాల్సి వస్తోంది. అనామక దేశాలకు కూడా వెళ్తున్నారు'' అని మోదీ ఆవేదన వెలిబుచ్చారు. వచ్చే ఐదేళ్లలో 75 వేల వైద్య సీట్లను అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. ''ఉన్నత విద్య కోసం యువత భారీగా విదేశాలకు వెళ్తోంది. దీన్ని సమూలంగా మార్చేస్తాం. విదేశాల నుంచే విద్యార్థులు మన దగ్గరికొచ్చే స్థాయిలో విద్యా రంగాన్ని అభివృద్ధి చేస్తాం. అలనాటి నలంద విశ్వవిద్యాలయ స్ఫూర్తితో 21వ శతాబ్దపు అవసరాలకు తగ్గట్టుగా తీర్చిదిద్దుతాం. నూతన విద్యా విధానానిది ఇందులో కీలక పాత్ర కానుంది.

కిరాతకులకు వణుకు పుట్టాలి

మహిళలపై హింసకు తక్షణం అడ్డుకట్ట వేయాల్సిందేనని మోదీ అన్నారు. ''మహిళలపై అకృత్యాలకు తెగించేవారికి కఠినాతి కఠినమైన శిక్షలు విధించాలి. ఉరి తప్పదన్న భయం రావాలి. మహిళలను ముట్టుకోవాలంటేనే వణుకు పుట్టే పరిస్థితి కల్పించడం చాలా ముఖ్యం. ఇలాంటి కేసుల్లో పడ్డ శిక్షల గురించి అందరికీ తెలిసేలా మీడియాలో విస్తృత ప్రాచుర్యం కల్పించాలి. అప్పుడే ప్రజల్లో తిరిగి విశ్వాసం పాదుగొల్పగలం'' అన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై దారుణ హత్యాచారం దేశమంతటినీ కుదిపేస్తుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ''మహిళల భద్రత బాధ్యత కేంద్రంపై, రాష్ట్రాలపై, ప్రజలందరిపై ఉంది. కోల్‌కతా ఘోరంపై దేశమంతా తీవ్రంగా ఆక్రోశిస్తున్న తీరును అర్థం చేసుకోగలను. నాదీ అదే మనఃస్థితి. నేనెంత బాధ పడుతున్నానో మాటల్లో చెప్పలేను. ఆ కేసు విచారణను సత్వరం ముగించి దోషులను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి నీచకృత్యాలు పదేపదే జరుగుతుండటం బాధాకరం'' అన్నారు.

ఐదో వరుసలో రాహుల్

- మోదీ అల్పబుద్ధికి నిదర్శనమంటూ కాంగ్రెస్ ధ్వజం
- పదేళ్ల తర్వాత పంద్రాగస్టు వేడుకల్లో విపక్ష నేత

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దిన వేడుకల్లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ప్రతిపక్ష నేత పాల్గొనడం పదేళ్ల తర్వాత ఇదే తొలిసారి. అయితే ఆయనకు ఐదో వరుసలో సీటు కేటాయించడం వివాదాస్పదంగా మారింది. రాహుల్ ముందు వరుసలో పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత హాకీ క్రీడాకారులు కూర్చున్నారు. ఈ ఉదంతం ప్రధాని నరేంద్ర మోదీ అల్పబుద్ధికి నిదర్శనమంటూ కాంగ్రెస్ మండిపడింది. ''లోక్‌సభ, రాజ్యసభల్లో విపక్ష నేతలైన రాహుల్, మల్లికార్జున ఖర్గేలకు ప్రొటోకాల్ ప్రకారం తొలి వరుసలో సీటు కేటాయించాలి. కానీ వారిని ఐదో వరుసలో కూర్చోబెట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా మోదీలో అహంకారం తగ్గలేదు'' అంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ దుయ్యబట్టారు. ముందు వరుసలను ఒలింపిక్ విజేతలకు కేటాయించినందున రాహుల్‌ను వెనక వరుసకు మార్చామన్న రక్షణ శాఖ వివరణపై ఆయన తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చారు. ''క్రీడాకారులకు గౌరవమివ్వాల్సిందే. కానీ అందుకోసం కొందరినే వెనక్కు జరిపారెందుకు? అమిత్ షా, జేపీ నడ్డా, ఎస్.జైశంకర్, నిర్మలా సీతారామన్ తదితర కేంద్ర మంత్రులను మొదటి వరుసలోనే ఎలా కూర్చోబెట్టారు?'' అని ప్రశ్నించారు. దీనిపై సోషల్ మీడియాలోనూ బాగా చర్చ జరిగింది. లోక్‌సభలో విపక్ష నేతకు కేబినెట్ హోదా ఉంటుంది. కేంద్ర మంత్రులతో పాటు ఆయనకు కూడా ముందు వరుసలో సీటు కేటాయిస్తారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కకపోవడంతో విపక్ష నేత పదవి పదేళ్లు ఖాళీగా ఉంది.



పంద్రాగస్టు వేడుకల్లో ఒలింపిక్స్ క్రీడాకారుల తర్వాతి వరుసలో కూర్చున్న రాహుల్ గాంధీ

సెప్టెంబర్‌లో అమెరికాకు మోదీ

న్యూయార్క్: అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ న్యూయార్క్ నగర పరిధిలోని లాంగ్ ద్వీపంలో భారతీయ అమెరికన్లనుద్దేశించి భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. 16వేల సీటింగ్ సామర్థ్యమున్న నసావూ కొలీసియం ఇండోర్ స్టేడియంలో సెప్టెంబర్ 22వ తేదీన మోదీ ప్రసంగించనున్నారు. న్యూయార్క్‌లో ఐరాస ప్రధాన కార్యాలయంలో సర్వ ప్రతినిధి సభ సమావేశంలో పాల్గొనేందుకు మోదీ అమెరికా వెళ్తున్నారు. భారతీయ అమెరికన్లతో ఆయన భేటీ అవుతారని తెలుస్తోంది. 2014లో తొలిసారిగా ఆయన ప్రధాని అయ్యాక ఐరాసలో వార్షిక సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. న్యూయార్క్ మేడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో వేలాది మంది భారతీయులనుద్దేశించి ప్రసంగించారు. దానికి పదేళ్లు పూర్తవుతున్న వేళ మళ్లీ భారతీయులనుద్దేశించి ప్రసంగించనున్నారు.

సుద్జా ఉక్రెయిన్ స్వాధీనం

కీవ్: రష్యా పట్టణం సుద్జాను పూర్తిగా స్వాధీనం చేసుకున్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ గురువారం ప్రకటించారు. సుద్జా జనాభా ఐదు వేలుంటుంది. చిన్నదే అయినా సుద్జా సరిహద్దులో రష్యాకు పాలనాకేంద్రంగా ఉంది. పశ్చిమ సైబీరియా గ్యాస్ నిక్షేపాల నుంచి సుద్జా మీదుగానే ఉక్రెయిన్‌కు పైపుల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుంది. యూరోప్‌కు రష్యా గ్యాస్ ఎగుమతుల్లో మూడు శాతం సుద్జా మీదుగానే వెళతాయి. అక్కడ ఉక్రెయిన్ మిలటరీ కమాండర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు జెలెన్‌స్కీ వెల్లడించారు. కస్క్‌లో వెయ్యి చదరపు కిలోమీటర్ల ప్రాంతం తమ నియంత్రణలో ఉందని, 74 జనావాసాలు, వందలకొద్ది రష్యా యుద్ధఖైదీలు తమ ఆధీనంలో ఉన్నారని ఉక్రెయిన్ బుధవారం ప్రకటించింది. 100 మంది రష్యా సైనికులను బందీలుగా పట్టుకున్నామని ఉక్రెయిన్ చెబుతోంది.

స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఎంతో విలువైనవి: సీజేఐ



న్యూఢిల్లీ: స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ప్రతి ఒక్కరికీ చాలా ముఖ్యమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను గమనిస్తే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం విలువ ఏమిటో అర్థం చేసుకోవచ్చని అన్నారు. గురువారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో జస్టిస్ చంద్రచూడ్ జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. గత చరిత్రను పరికిస్తే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఎంత విలువైనవో అవగతమవుతుందని పేర్కొన్నారు. ఇవి సులువుగా లభిస్తాయని అనుకోవద్దని సూచించారు. దేశంలో సాటి పౌరుల పట్ల మన బాధ్యతలను స్వాతంత్ర్య దినోత్సవం గుర్తుచేస్తుందని తెలిపారు. రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవడానికి స్వాతంత్ర్య దినోత్సవం దోహదపడుతుందని అన్నారు. మన దేశంలో న్యాయవాదులు ఎన్నో త్యాగాలు చేశారని, వృత్తిని తృణప్రాయంగా వదిలేసి దేశ సేవ కోసం అంకితమయ్యారని కొనియాడారు. పౌరులుగా దేశం పట్ల, సాటి మనుషుల పట్ల నిర్వర్తించాల్సిన బాధ్యతలను అందరూ చక్కగా నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

జమ్మూకశ్మీర్ స్పెషల్ డీజీపీగా నళిన్ ప్రభాత్



న్యూఢిల్లీ: సీనియర్ ఐపీఎస్ అధికారి నళిన్ ప్రభాత్‌కు కేంద్ర ప్రభుత్వం జమ్మూకశ్మీర్‌లో కీలక బాధ్యతలు అప్పగిస్తోంది. తరచూ ఉగ్రదాడులతో అత్యంత ఉద్రిక్తంగా మారిన జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులను చక్కదిద్దడమే లక్ష్యంగా ఆయనను జమ్మూకశ్మీర్ స్పెషల్ డీజీపీగా ఎంపికచేసింది. వచ్చే నెల 30న ప్రస్తుత పోలీస్‌బాస్ ఆర్ఆర్ స్వాయిన్ రిటైరైన వెంటనే అక్టోబర్ ఒకటిన ప్రభాత్ డీజీపీగా బాధ్యతలు స్వీకరిస్తారని కేంద్రం ఒక ప్రకటనలో పేర్కొంది. 1992 బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన ప్రభాత్ ఇప్పటికే పలు విభాగాల్లో పనిచేసి అద్భుత ప్రతిభ కనబరిచి విశేష అనుభవం గడించారు. మూడు పోలీస్ గ్యాలంట్రీ మెడళ్లు, ఒక పరాక్రమ్ పతకం సాధించారు. 55 ఏళ్ల ప్రభాత్‌కు వామపక్ష తీవ్రవాదం, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో నక్సలిజాన్ని అణిచివేసేందుకు ఉద్దేశించిన గ్రేహౌండ్స్ దళాలకూ ఆయన సారథ్యం వహించారు. గతంలో సీఆర్‌పీఎఫ్‌లో ఐజీగా, కశ్మీర్ ప్రాంతంలో అదనపు డీజీగా సేవలందించారు.

థాయ్‌లాండ్ ప్రధానిగా పేటోంగ్‌టార్న్ ఖరారు!



బ్యాంకాక్: థాయిలాండ్ నూతన ప్రధాని ఎన్నిక కోసం పార్లమెంటరీ ఓటింగ్‌లో అధికార ఫ్యూ థాయ్ పార్టీ తమ అభ్యర్థిగా నాయకురాలు పేటోంగ్‌టార్న్ షినవత్ర పేరును నామినేట్ చేసింది. కూటమి పార్టీలతో కలిసి ఉమ్మడిగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు గురువారం పత్రికా సమావేశంలో ఫ్యూ థాయ్ ప్రకటించింది. శుక్రవారం జరగబోయే పార్లమెంటరీ ఓటింగ్‌లో ఆమె గెలిస్తే షినవత్ర కుటుంబం నుంచి ప్రధానమంత్రి అవుతున్న మూడో వ్యక్తిగా పేటోంగ్‌టార్న్ పేరు చరిత్రలో నిలిచిపోతుంది. గతంలో పేటోంగ్‌టార్న్ తండ్రి తక్షిన్ షినవత్ర, మేనత్త ఇంగ్లక్ షినవత్ర దేశ ప్రధాన మంత్రులుగా చేశారు. పేటోంగ్‌టార్న్‌ను ఏకగ్రీవంగా నామినేట్ చేశామని ఫ్యూ పార్టీ ప్రధాన కార్యదర్శి సొరవాంగ్ థియేన్‌థాంగ్ చెప్పారు. నైతిక ఉల్లంఘనకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ప్రధాని స్రెట్టా థావిసిన్‌ను ఆ పదవి నుంచి థాయిలాండ్ రాజ్యాంగ ధర్మాసనం తప్పించడం విదితమే.

ఆఫ్రికా దేశాల్లో ఆరోగ్య అత్యవసర పరిస్థితి

వేగంగా వ్యాప్తి చెందుతున్న మంకీపాక్స్ వైరస్ ● స్వీడన్‌లోనూ వెలుగు చూసిన కేసు



సిడ్నీ: ప్రాణాంతక మంకీపాక్స్ (ఎంపాక్స్) ఆఫ్రికా దేశాలను వణికిస్తోంది. కాంగోలో 450 మందిని పొట్టనబెట్టుకున్న ఈ వ్యాధి ఇతర దేశాలకు వేగంగా వ్యాప్తి చెందుతోంది. మధ్య, తూర్పు ఆఫ్రికా దేశాల్లో ఎంపాక్స్ విస్తరణ పెరుగుతున్నట్లు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వెల్లడించింది. ఆయా దేశాల్లో ఆరోగ్య అత్యవసర పరిస్థితి విధిస్తున్నట్లు ప్రకటించింది. యూరప్ దేశమైన స్వీడన్‌లోనూ ఒక ఎంపాక్స్ కేసు వెలుగులోకి వచ్చింది! దీని వ్యాప్తిని అడ్డుకోవడానికి ప్రపంచ దేశాలన్నీ కలిసి పనిచేయాలని డబ్ల్యూహెచ్ఓ పిలుపునిచ్చింది. ఎంపాక్స్‌లో క్లేడ్–2 కంటే క్లేడ్–1 ప్రమాదకరం. గత సెప్టెంబర్‌లో క్లేడ్–2బీ వేరియంట్ పుట్టుకొచ్చింది. ఎంపాక్స్ సోకితే ఫ్లూ తరహా లక్షణాలు కనిపిస్తాయి. కాళ్లు, చేతులపై కురుపులు, పుండ్లు ఏర్పడతాయి. బాధితులతో లైంగిక సంబంధాలు, దగ్గరగా వెళ్లడం, శ్వాస పీల్చడం వల్ల వైరస్ సోకుతుంది. ప్రతి 100 కేసుల్లో కనీసం నలుగురు మరణించే ప్రమాదముంది. ఎంపాక్స్ నియంత్రణకు వ్యాక్సిన్ వచ్చినా అది పరిమితంగానే లభిస్తోంది. కాంగో, బురుండి, కెన్యా, రువాండాలకు వ్యాపించింది. ఎంపాక్స్‌ను ఇంకా మహమ్మారిగా ప్రకటించలేదు.



బుధవారం అర్ధరాత్రి కోల్‌కతాలో కాగడాలతో మహిళల ర్యాలీ



ఆర్‌జీ కార్ ఆస్పత్రి ప్రాంగణంలో దుండగుల వీరంగం



దుండగుల దాడిలో ధ్వంసమైన ఆస్పత్రిలోని వార్డు

కార్ ఆసుపత్రిలో విధ్వంసం

అర్ధరాత్రి వేళ లోపలికి చొరబడి రెచ్చిపోయిన దుండగులు

- కర్రలు, ఇటుకలు, ఇనుప రాడ్లతో దాడి
- సీసీటీవీ కెమెరాలు, వైద్య పరికరాలు ధ్వంసం
- పోలీసుల్ని వెంటాడి వారిపైకి రాళ్లు రువ్విన వైనం
- హత్య కేసు ఆధారాల మాయానికి ప్రయత్నం
- ఇప్పటిదాకా 12 మందిని అరెస్టు చేసిన పోలీసులు



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య వ్యవహారం మరో మలుపు తిరిగింది. యువ వైద్యురాలు శవమై కనిపించిన ప్రభుత్వ ఆర్.జి.కార్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో దుండగులు వీరంగం సృష్టించారు. బుధవారం అర్ధరాత్రి తర్వాత ఆసుపత్రి ప్రాంగణంలోకి చొరబడ్డారు. అడ్డొచ్చిన నర్సులను నెట్టేశారు. కర్రలు, ఇటుకలు, ఇనుప రాడ్లతో వార్డుల్లో విధ్వంసానికి దిగారు. ఎమర్జెన్సీ, ఔట్ పేషెంట్స్ వార్డులు, నర్సింగ్ స్టేషన్, మెడిసిన్ స్టోర్‌లో పరికరాలు, ఔషధాలను చిందరవందర చేశారు. హత్య కేసు ఆధారాలు చెరిపేసేందుకు ప్రయత్నించారు. సీసీటీవీ కెమెరాలను పగులగొట్టారు. జూనియర్ డాక్టర్లు నిరసన వ్యక్తం చేస్తున్న వేదికను సైతం ధ్వంసం చేశారు. ఆ సమయంలో అక్కడ పోలీసులు పరిమిత సంఖ్యలోనే ఉండడంతో విధ్వంసాన్ని అడ్డుకోలేకపోయారు. పై అధికారులకు సమాచారం చేరవేయడంతో అదనపు బలగాలు రంగంలోకి దిగాయి. పోలీసుల రాకను గమనించిన దుండగులు రాళ్లు విసిరారు. దాంతో పోలీసులు బాష్పవాయువు ప్రయోగించడంతో అక్కడి నుంచి పరారయ్యారు. 40 మందికిపైగా దుండగులు నిరసనకారుల రూపంలో ఆసుపత్రిలోకి ప్రవేశించారని పోలీసు అధికారులు చెప్పారు. రాళ్ల దాడిలో పోలీసు వాహనంతోపాటు మరో రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయని తెలిపారు. కొందరు పోలీసులు గాయపడ్డారని వెల్లడించారు. ఇప్పటిదాకా 12 మంది దుండగులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

రోగుల హాహాకారాలు

ఆసుపత్రి వార్డుల్లో దుండగులు వీరవిహారం చేస్తుండడంతో రోగులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బయటకు పరుగులు తీశారు. చికిత్స పొందకుండానే కొందరు సొంత ఊళ్లకు వెళ్లిపోయారు. విలువైన వైద్య పరికరాలు, ఔషధాలను దండుగులు ఎత్తుకుపోయినట్లు తెలిసింది. విధ్వంసం జరుగుతున్న సమయంలో ఆసుపత్రిలో విధుల్లో ఉన్న పోలీసులు చేతులెత్తేశారు. ప్రాణభయంతో పరుగులు తీశారు. నర్సులకు కేటాయించిన వార్డుల్లో ఆశ్రయం పొందారు. తమను దాచిపెట్టండి అంటూ ఇద్దరు పోలీసులు వేడుకున్నారని ఓ నర్సు చెప్పారు.

నిరసన వ్యక్తం చేసిన డాక్టర్లు, నర్సులు

ప్రభుత్వ ఆసుపత్రిలో దుండగుల వీరంగం పట్ల డాక్టర్లు, నర్సులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం ఆసుపత్రి ప్రాంగణంలో బైఠాయించారు. తమకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తమపై దాడులను సహించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పోలీసుల సమక్షంలోనే దుండగులు రెచ్చిపోయారని, తమపై చెయ్యి చేసుకున్నారని ఆరోపించారు. తమ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసి, ఉద్యమాన్ని విరమించుకొనేలా చేయాలన్నదే వారి ప్రయత్నమని చెప్పారు. ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

దుమ్మెత్తిపోసుకున్న మమత, బీజేపీ

ఆస్పత్రి విధ్వంసంపై మమత, బెంగాల్ బీజేపీ నేతలు పరస్పరం దుమ్మెత్తిపోసుకున్నారు. సీపీఎం, బీజేపీ కార్యకర్తలే విధ్వంసానికి పాల్పడ్డారని మమత ఆరోపించగా, అది ఆమె పంపిన తృణమూల్ గూండాల పనేనని బీజేపీ తిప్పికొట్టింది. ఆమె రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ఆస్పత్రి విధ్వంస ఘటన పౌర సమాజానికి సిగ్గుచేటని బెంగాల్ గవర్నర్ సి.వి.ఆనంద బోస్ అన్నారు. దాన్ని తీవ్రంగా ఖండించారు.

రేపు వైద్యుల దేశవ్యాప్త సమ్మె

వైద్యురాలి హత్యకు నిరసనగా శనివారం వైద్యుల దేశవ్యాప్త సమ్మెకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపునిచ్చింది. అత్యవసర సేవలకు మినహాయింపు ఉంటుందని తెలిపింది. మరోవైపు దీనిపై నిరసనలు కొనసాగించాలని ఫోర్డా నిర్ణయించింది. తమ డిమాండ్లను పరిష్కారంపై కేంద్ర మంత్రి నుంచి జేపీ నడ్డా లిఖితపూర్వక హామీ ఇవ్వనందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది.

సీబీఐ దర్యాప్తు వేగవంతం

వైద్యురాలి కేసులో సీబీఐ అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. గురువారం బాధితురాలి తల్లిదండ్రులతో మాట్లాడి హత్యపై వివరాలు సేకరించారు. ఆమె స్నేహితుల గురించి ఆరా తీశారు. కార్ ఆసుపత్రి వైద్యులతోనూ మాట్లాడారు. మాజీ మెడికల్ సూపరింటెండెంట్, వైస్ ప్రిన్సిపాల్, ప్రిన్సిపాల్, ఛెస్ట్ డిపార్టుమెంట్ చీఫ్‌ను విచారించారు.

ట్రంప్, మస్క్ స్టేయింగ్ అలైవ్ ఫీవర్



అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ యమా ఉత్సాహంగా స్టెప్పులేస్తున్న ఈ ఫొటో వాస్తవానికి ఏఐ సృష్టి. 1970ల చివర్లో 'శాటర్‌డే నైట్ ఫీవర్' సినిమాలో ఓ ఊపు ఊపిన బీజీస్ పాట 'స్టేయింగ్ అలైవ్'కు వారు లయబద్ధంగా డ్యాన్స్ చేస్తున్నట్టుగా రూపొందించిన 36 సెకన్ల ఏఐ వీడియో ఇంటర్నెట్‌ను షేక్ చేసింది. ఏకంగా 8 కోట్ల పై చిలుకు వ్యూస్ సొంతం చేసుకుంది!

ఒడిశాలో నెలసరి సెలవు

భువనేశ్వర్: ఒడిశాలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగినులకు ఒక రోజు రుతుస్రావ సెలవును ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇది వేతనంతో కూడిన సెలవు. మహిళా ఉద్యోగినులు రుతుక్రమ మొదటి లేదా రెండోరోజు సెలవు తీసుకోవచ్చని తెలిపింది. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి, ఒడిశా డిప్యూటీ సీఎం ప్రవతి పరీదా గురువారం కటక్‌లో ఈ మేరకు ప్రకటించారు. నెలసరి సెలవు తక్షణం అమలులోకి వస్తుందని ప్రకటించారు. రుతుస్రావ సెలవులపై దేశమంతటికీ వర్తించే విధంగా ఒక విధానాన్ని రూపొందించాల్సిందిగా సుప్రీంకోర్టు గత జూలై 8న కేంద్ర ప్రభుత్వానికి సూచించడం తెలిసిందే.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం ; 16 ; ఆగస్టు ; 2024


వర మహాలక్ష్మీ పండుగ నేపథ్యంలో బెంగళూరు కేఆర్ మార్కెట్ కిటకిట


స్వరాజ్య దినోత్సవం సందర్భంగా విధానసౌధకు విద్యుద్దీప సొగసులు

న్యూస్‌రీల్

250 అడుగుల జెండా



బనశంకరి: భారత స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా 250 అడుగులు పొడవు గల త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించారు. బసవనగుడి గాంధీ బజార్, రామకృష్ణ ఆశ్రమం సర్కిల్ నుంచి అనిల్‌గుప్తా, ఎంపీ తేజస్విసూర్య, ఎమ్మెల్యే ఉదయ్‌గరుడాచార్, మరో 500 మంది కలిసి జెండాను పట్టుకుని ర్యాలీ చేశారు. లాల్‌బాగ్ వరకు ప్రదర్శించారు.

రాచనగరిలో చైన్‌స్నాచర్ల హల్‌చల్

మైసూరు: రాచనగరిలో చైన్‌స్నాచర్లు చెలరేగిపోయారు. రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళల నుంచి బంగారు గొలుసులను దుండగులు లాక్కెళ్లారు. హూటగళ్లి సమీపంలోని కేహెచ్‌బీ కాలనీ నివాసి అశ్విని అనే మహిళ హూటగళ్లి వద్ద పూలు కొనుగోలు చేసి ఇంటి వద్దకు వచ్చి ఇరుగు పొరుగుతో మాట్లాడుతోంది. ఇంతలో బైక్‌పై వచ్చిన దుండగుడు ఆమె మెడలోని గొలుసు లాక్కున్నాడు, ఆమె గొలుసును గట్టిగా పట్టుకోవడంతో 25 గ్రాముల గొలుసు తెగి దుండగుని చేతికి చిక్కగా అతడు బైక్‌పై పరారయ్యాడు. రెండో కేసులో విజయనగర మొదటి స్టేజీ నివాసి మమత మాయిపాండె అనే మహిళ కుమారున్ని ట్యూషన్‌కు వదిలేందుకు ఇంటి వెనుక భాగంలోని రోడ్డులోకి వెళ్లారు. స్కూటర్‌ను నిలుపుతుండగా ఓ దుండగుడు వచ్చి ఆమె మెడలోని 20 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. ఈ రెండు స్నాచింగ్‌లపై విజయనగర పోలీసులు కేసులు నమోదు చేశారు.

కళంకిత పోలీస్‌కు సీఎం మెడల్

- మైసూరులో విడ్డూరం

మైసూరు: నేరగాళ్లు, దొంగలతో కుమ్మక్కై, దొంగతనాలను, నేరాలను ప్రోత్సహించిన ఒక పోలీస్‌కు సీఎం మెడల్ ప్రకటించడం హాస్యాస్పదమైంది. ఈ వింత మైసూరు పోలీసు విభాగంలో చోటుచేసుకుంది. మైసూరు సీసీబీ విభాగం హెడ్‌కానిస్టేబుల్ సలీంపాషా నెల రోజుల క్రితం సస్పెండయ్యాడు. అతని పేరు తాజాగా విడుదలైన ముఖ్యమంత్రి పతకాల గ్రహీతల పట్టికలో ఉండటం ఆశ్చర్యం కల్గిస్తోంది. హూటగళ్లి, విజయనగర పోలీసు స్టేషన్ల పరిధిలో దొంగలు, గంజాయి విక్రేతలతో ఇతడు సంబంధాలు పెట్టుకుని, అలాగే శాఖలోని రహస్యాలను లీక్ చేశాడని తెలిసి ఉన్నతాధికారుల సస్పెండ్ చేశారు. అలాంటి కళంకిత వ్యక్తికి సీఎం మెడల్ రావడంతో పతకాల ఎంపిక ఇలా ఉంటుందా? అని జనం ముక్కున వేలేసుకున్నారు.

కొత్త సంకల్పంతో సాగాలి

- గవర్నర్ పిలుపు

శివాజీనగర: స్వాతంత్య్రం కోసం పోరాడిన మహా పురుషులు, అమరవీరులను స్మరించుకునే రోజు. ఈ రోజున వారిచే స్ఫూర్తి పొంది కొత్త బాట, కొత్త సంకల్పంతో ముందుకు సాగాలని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ తెలిపారు. రాజ్‌భవన్‌లో పంద్రాగస్టును ఘనంగా నిర్వహించారు. కర్ణాటక దేశంలో ప్రగతిపర రాష్ట్రం, దేశంలో సర్వతోముఖాభివృద్ధి సేవలు అందిస్తోంది. అన్ని వర్గాల బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం 5 గ్యారంటీ పథకాలను విజయవంతంగా అమలు పరుస్తుందని పేర్కొన్నారు. నేడు భారత్ ప్రపంచ ప్రధాన దేశాల్లో 5వ స్థానంలో ఉందని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడాలని, అందుకోసం ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని గవర్నర్ తెలిపారు. దేశంలో ఆర్థికాభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు అందరూ ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు.

ప్రేమజంట విషాదం


యశ్వంత్ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: తమ ప్రేమను పెద్దలు తిరస్కరించారని ప్రేమజంట ఆత్మహత్యాయత్నం చేసింది. ఇందులో ప్రియుడు మృతి చెందాడు, ఈ సంఘటన రామనగర పట్టణ పరిధిలోని కాయసొప్పిన వీధిలో చోటుచేసుకుంది. యశ్వంత్ (24), మోనిక అనే అమ్మాయి ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటామని పెద్దలకు చెప్పగా, వారు అంగీకరించలేదు. దీంతో తమ ప్రేమ విఫలమైందని ఆవేదన చెందిన యశ్వంత్.. ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రియుడు లేడని తెలిసి మోనిక సైతం కత్తితో పొడుచుకుని ప్రాణాలు తీసుకోబోయింది. తీవ్రంగా గాయపడ్డ ఆమెను బీఎం రోడ్డులోని రామక్రిష్ణ ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రామనగర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


బెంగళూరు మానెక్‌షా మైదానంలో.. బాలల సంగోళ్ల రాయణ్ణ నృత్య రూపకం


వీర నారి రాణి అబ్బక్క రూపంలో బాలిక నటనా వైదుష్యం


ధార్వాడలో.. విద్యార్థినులచే భరతమాత నృత్య రూపక ప్రదర్శన

స్వరాజ్య దీప్తి.. స్వాతంత్య్ర స్ఫూర్తి

గ్యారంటీ పథకాలు కొనసాగుతాయి: సీఎం

రాష్ట్రంలో గ్యారంటీ పథకాలు మునుముందు కొనసాగుతాయని సీఎం సిద్దరామయ్య తన ప్రసంగంలో తెలిపారు. గ్యారంటీలపై మంత్రులు, ప్రతిపక్షాలు తలోమాట మాట్లాడుతున్న తరుణంలో సీఎం ఈ మాట చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన భరోసా ప్రకారం ఐదు గ్యారంటీ పథకాలను జారీ చేయటం ద్వారా రాష్ట్ర ప్రజలకు ఆర్థిక భద్రత తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. నారీ శక్తి ఉచిత ప్రయాణం ద్వారా ఇప్పటికి మహిళలు 270 కోట్ల సార్లు ప్రయాణాలు చేశారన్నారు. గత సంవత్సరం రాష్ట్రంలో తీవ్ర కరువు రాగా, ఈసారి అతి వృష్టి ఏర్పడింది. వరద పీడిత జిల్లాలలో పర్యటించి త్వరగా పరిహారం కల్పించాలని సూచించినట్లు సీఎం తెలిపారు. భారీ వర్షంతో ఇళ్లు కోల్పోయినవారికి రూ.1.2 లక్షల పరిహారంతో ఇంటి వసతి కల్పిస్తామన్నారు. అభివృద్ధి, ప్రకృతి మధ్య సమతుల్యత సాధించడం అత్యవసరమని ప్రకృతి హెచ్చరికను చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతల నివారణపై కూడా ప్రభుత్వం దృష్టిసారించిందని చెప్పారు.




త్రివర్ణ జెండాలు చేబూని బాలికల నాట్య వైభవం


బెంగళూరు మానెక్ షా మైదానంలో బైకర్ల సాహస విన్యాసాలు

- నేత్రపర్వంగా పంద్రాగస్టు సంబరాలు
- బెంగళూరు మానెక్ షా మైదానం కళకళ
- బాలల ప్రదర్శన భళ


ప్రసంగిస్తున్న సీఎం సిద్దరామయ్య


కొప్పళలో రమణీయ పాటవం


దావణగెరెలో పిరమిడ్ రూపంలో బాలలు



శివాజీనగర: స్వాతంత్య్ర స్ఫూర్తిని హృదయమంతా నింపుకొని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కళా రూపాలు, సాయుధ దళాల విన్యాసాలు, పోలీసులు, ఎన్‌సీసీ విద్యార్థుల కవాతులతో రాజధానిలో మానెక్ షా మైదానం కళకళలాడింది. గురువారం ఉదయం 78వ స్వాతంత్య్ర దినోత్సవం నేత్రపర్వంగా సాగింది.

అవయవదాన కుటుంబాలకు గౌరవం

ఈ ఏడాదిలో అవయవ దానం చేసిన 65 మంది త్యాగాలను స్మరిస్తూ వారి కుటుంబాలకు సీఎం సిద్దరామయ్య ధృవీకరణ పత్రాలను అందజేశారు. అలాగే పలు ప్రభుత్వ పథకాలను చాటుతూ శకట ప్రదర్శన అలరించింది. సీఎం సిద్దరామయ్య జాతీయ జెండావిష్కరణ చేసి ఓపెన్ జీపులో కవాతును వీక్షించారు. అనంతరం సీఎం ప్రసంగం సాగింది. తరువాత కళాకారుల సంగీత గానాలాపన మైమరిపించింది. అనంతరం వివిధ పోలీసు, సాయుధ బలగాల కవాతు నిర్వహించారు. సమర్థనం, రమణశ్రీ సంస్థల దివ్యాంగ బాలల కవాతు అబ్బురపరచింది.

మురిపించిన సాంస్కృతికం

నగరంలోని వివిధ పాఠశాల బాల బాలికలు కళాకారులుగా మారి వీరగాసె, డొళ్ల కుణిత, పతాకాలు చేబూని దేశభక్తి ప్రదర్శనలతో రంజింపజేశారు. యలహంక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 750 మంది విద్యార్థులు జయ భారతి ప్రదర్శనతో మురిపించారు. పిళ్ళన్న గార్డెన్ పాలికె పీయూ కాలేజీకి చెందిన 700 మంది విద్యార్థులచే స్వాతంత్య్ర పోరాట నాయకురాలు రాణి అబ్బక్క దేవి సాహసాల ప్రదర్శన అలరించింది. ఆర్మీ జవాన్లు శ్వేత అశ్వ పేరుతో బైక్‌ల ప్రదర్శన సంభ్రమానికి గురిచేసింది. అయితే ఓ బైకర్ పట్టుతప్పి పడిపోవడం అపశృతిగా నిలిచింది. ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన కళాబృందాలను సీఎం సన్మానించారు. ఈ వేడుకలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. కాగా, రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాల మైదానాల్లో స్వరాజ్య సంబరాలు జరిగాయి.

నిగూఢంగా టీచర్ హత్య

- ఘటనా స్థలిని సందర్శించిన ఐజి


ఇంట్లో రక్తపు మడుగులో మృతదేహం (ఇన్‌సెట్‌లో) దివ్యశ్రీ (ఫైల్)

కోలారు: కోలారు జిల్లాలో సంచలనం సృష్టించిన ఉపాధ్యాయురాలి హత్య కేసులో ముళబాగిలు పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ముళబాగిలు పట్టణంలో గురువారం రాత్రి చోటు చేసుకున్న హత్య పట్టణవాసులను కలవరపరిచింది. టీచర్ దివ్యశ్రీ (42) ముడియనూరు ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తూ, ఈ మధ్యనే పట్టణంలోని పాఠశాలకు బదిలీ అయ్యారు. శుక్రవారం ఆమె కొత్త పాఠశాలలో చేరాల్సి ఉంది. అయితే అంతలోనే హత్యకు గురైంది. దివ్యశ్రీ హత్యకు కారణాలు తెలియడం లేదు. అయితే ఎవరో కొంతకాలంగా ఆమె ఇంటి వద్ద పొంచి ఉండేవారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం ఆరు మంది హంతకులు వచ్చారు, ముగ్గురు ఇంటి బయట ఉండగా, ముగ్గురు లోనికి వెళ్లి ఆమెను కత్తులతో నరికి చంపారు. సమీప సీసీ కెమెరాలలో హంతకుల చిత్రాలు నమోదయ్యాయి.

త్వరలోనే ఛేదిస్తాం: ఐజీ

ఘటనా స్థలాన్ని కేంద్ర వలయ ఐజిపి లాభూరాం గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దర్యాప్తు కోసం రెండు దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కేసును ఛేదించి హంతకులను త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్, ఎస్పీ నిఖిల్ తదితరులు ఉన్నారు.

రేబిస్‌తో బాలుని మృతి

మైసూరు: అనుమానిత రేబిస్ వైరస్‌తో నాలుగేళ్ల బాలుడు మరణించిన ఘటన జిల్లాలోని హెచ్‌డీ కోట పట్టణానికి సమీపంలో జరిగింది. హ్యాండ్‌పోస్ట్ నివాసి శ్రీధర్, పూజ దంపతుల కుమారుడు అన్విత్ (4)కు ఆకస్మాత్తుగా జ్వరం, అస్వస్థత కలిగింది. దీంతో తల్లిదండ్రులు ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. నోటి నుంచి చొంగ కారుతున్నందున అతనికి రేబిస్ వైరస్ సోకిందని, వెంటనే టీబీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని ఆ వైద్యులు సూచించారు. శిశువును అక్కడికి తరలించేలోగా చనిపోయాడు. రేబిస్ వైరస్ సోకిన కుక్క సొల్లు బాలుని మీద పడి ఉంటుందని, దాని వల్లే రేబిస్ వచ్చి ఉంటుందని అనుమానాలున్నాయి. ఇటీవల ఇంటి సమీపంలోని ఓ కుక్క మరణించిందని తల్లిదండ్రులు తెలిపారు. చిన్నారి మృతితో శోకతప్తులయ్యారు.

మిస్డ్ కాల్‌తో హనీట్రాప్


పట్టుబడిన నిందితులు



- ఉద్యాననగరిలో ముఠా అరెస్ట్

కృష్ణరాజపుర: విలాసవంతమైన జీవితం కోసం ఉద్యాననగరిలో మిస్డ్ కాల్ ఇచ్చి యువకులను ఉచ్చులోకి దింపుతున్న హనీట్రాప్ గ్యాంగ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. నజ్మా కౌసర్, మహ్మద్ ఆషిక్, ఖలీల్ అనే ముగ్గురిని సంపిగెహళ్లి పోలీసులు పట్టుకున్నారు. వివరాలు.. సంపిగెహళ్లిలోని తన ఇంటిని అడ్డాగా చేసుకుని నజ్మా కౌసర్ మొదట అపరిచితులకు మొబైల్‌తో మిస్డ్ కాల్ ఇచ్చేది, వారు తిరిగి కాల్ చేసినప్పుడు తీయగా మాట్లాడేది. బెంగళూరుకు చెందినవారని తెలిస్తే మరింత చనువు పెంచుకునేది. కష్టసుఖాలు తెలుసుకుంటున్నట్లు నటిస్తూ దగ్గరయ్యేది.

ఇంటికి పిలిపించి..

డబ్బున్నవారిని, యువకులను లైంగికంగా రెచ్చగొట్టినట్లు మాట్లాడి ఉచ్చులోకి పడేసేది. ఆమె మాటలను నమ్మి వచ్చిన యువకులను పడకగదికి పిలుచుకెళ్లేది. ఆ తరువాత కొంతసేపటికే ముఠాలోని మిగతావారు వచ్చి.. ఎవరు నువ్వు, రేప్ చేయడానికి వచ్చావా? అని బెదిరించి.. డబ్బులివ్వాలని, లేకుంటే రేప్ కేసు పెడతామంటూ బెదిరించేవారు. డబ్బు గుంజి పంపేవారు. ఇలా ఈ ముఠా ట్రాప్‌లో పడిన ఓ కొరియర్ బాయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అరెస్టు చేశారు. చాలామందినే వీరు ట్రాప్‌చేసి ఉంటారని అనుమానాలున్నాయి.

క్రాంతివీరకు సీఎం నివాళులు

బనశంకరి: స్వాతంత్య్ర సమరయోధుడు క్రాంతివీర సంగొళ్లి రాయణ్ణ 227వ జయంతి ఘనంగా నిర్వహించారు. గురువారం దేవరాజు అరసు సర్కిల్‌లో క్రాంతివీర సంగొళ్లిరాయణ్ణ ప్రతిష్టాన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో క్రాంతివీర సంగొళ్లిరాయణ్ణ విగ్రహానికి సీఎం సిద్దరామయ్య నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జగద్గురు పీఠాధ్యక్షుడైన శ్రీ వీరభద్రచెన్నమల్ల దేశికేంద్ర మహాస్వామిజీ, ఎమ్మెల్సీ గోవిందరాజు, మాజీమంత్రి హెచ్‌ఎం.రేవణ్ణ, పాలికె పాలనాధికారి ఎస్‌ఆర్. ఉమాశంకర్, తుషార్‌గిరినాథ్, సురళ్కర్ వికాస్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళకు రూ. 15 లక్షలు బురిడీ

మైసూరు: ఆన్‌లైన్ ద్వారా షేర్ మార్కెట్‌లో ఎక్కువ లాభాలు వస్తాయని సైబర్ మోసగాళ్లు నమ్మించి ఓ మహిళ నుంచి రూ.15 లక్షలు వసూలు చేశారు. మైసూరు హూటగళ్లీ నివాసి పూజా.. ఫేస్‌బుక్‌లో ఓ షేర్ల ట్రేడింగ్ లింక్‌ను నొక్కడంతో మోసపూరిత వాట్సాప్ గ్రూప్‌లోకి ప్రవేశించారు. ఆమెను సంప్రదించిన మోసగాళ్లు మీరు డబ్బులు పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు పొందవచ్చని ఆశ పెట్టారు. వారి మాటలను నమ్మిన పూజా దశలవారీగా రూ.15 లక్షలు చెల్లించింది. లాభం కోసం సంప్రదించగా మోసగాళ్లు స్పందించలేదు. దీంతో మోసపోయినట్లు తెలుసుకుని సైబర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

న్యాయ వ్యవస్థకు సాంకేతిక హంగులు: సీజే

బనశంకరి: న్యాయ వ్యవస్థలోని అన్ని రికార్డుల డిజిటలీకరణ, ఈ–ఫైలింగ్‌కు ముందడుగు వేస్తామని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ఎన్‌వీ అంజారియా తెలిపారు. హైకోర్టులో పంద్రాగస్టువేడుకల్లో ఆయన జెండాను ఎగురవేసి ప్రసంగించారు. ప్రస్తుతం ఇంటర్నెట్ అందుబాటులో ఉందని, న్యాయవ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవరచడం అత్యంత అవసరమని, దానిని న్యాయ సమ్మతంగా వినియోగించుకుంటే సత్వర సేవలను అందించవచ్చని పేర్కొన్నారు. ఇంటర్నెట్ ద్వారా కోర్టులో కేసుల వివరాలను డ్యాష్‌బోర్డు ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు. భారత దేశంలో న్యాయ వ్యవస్థ అత్యంత నిర్ణాయకపాత్ర వహిస్తుందన్నారు. న్యాయపాలన, అందరికీ న్యాయం అందించడం సుస్థిర ప్రజా ప్రభుత్వ విలువలకు దారీదీపం వంటిదన్నారు.హైకోర్టు, కలబురిగి, ధారవాడ బెంచ్‌లలో పెండింగ్ కేసులను తగ్గించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. లోక్‌అదాలత్ ద్వారా గత జూలైలో 40 లక్షల కేసులను పరిష్కరించామని తెలిపారు.

కుటుంబాన్ని కడతేర్చిన అప్పులు


శ్రీనివాస్, శ్వేత, కుమార్తె నాగశ్రీ చిత్రాలు (ఫైల్),


ఘటనాస్థలిలో జనం

- కాలువలోకి దూకి ఆత్మహత్య
- హాసన్ జిల్లాలో విషాదం

బనశంకరి: అప్పుల బాధను తట్టుకోలేక కూతురితో కలిసి భార్యాభర్తలు హేమావతి కాలువలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన చెన్నరాయపట్టణ నగర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చెన్నరాయపట్టణ తాలూకా కెరెబీదికి చెందిన శ్రీనివాస్ (43), శ్వేత (36), కుమార్తె నాగశ్రీ (13). శ్రీనివాస్ కారుడ్రైవరు కాగా శ్వేతా ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తుంది. శ్రీనివాస్ చాలా అప్పులు చేశాడు. గత రెండురోజులుగా ముగ్గురూ కనబడలేదు. బంధువులు పలుచోట్ల గాలించినప్పటికీ వీరి ఆచూకీ లభించలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దంపతుల మృతదేహాలు లభ్యం

పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలింపు చేపట్టగా బుధవారం సాయంత్రం బాగూరు హోబళి, ముద్లాపుర వద్ద హేమావతి కాలువలో శ్రీనివాస్, శ్వేతా మృతదేహాలు లభించాయి. బాలిక జాడ లేదు. ఎస్పీ మహమ్మద్ సుజీతా చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను చెన్నరాయపట్టణ ఆస్పత్రికి తరలించారు. మరోవైపు హాసన్‌లోని కపిలేశ్వర మందిర బావిలో గుర్తుతెలియని వ్యక్తి శవం లభ్యమైంది. మద్యం మత్తులో పడి ఉంటాడని పోలీసులు తెలిపారు.


గురువారం ఫ్లవర్ షో చూడడానికి వచ్చిన జన సందోహం

పుష్ప జాతర జనసంద్రం

బనశంకరి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నగరంలో లాల్‌బాగ్ గ్లాజ్‌హౌస్‌లో సాగుతున్న ఫల పుష్ప ప్రదర్శన జన జాతరను తలపించింది. గురువారం పిల్లలూ పెద్దలూ తరలి రావడంతో జన సాగరమైంది. వరుసగా సెలవులు రావడంతో ఇతర జిల్లాల నుంచి కూడా కుటుంబ సమేతంగా వచ్చారు. అంబేడ్కర్, పార్లమెంటు థీమ్, ఇతర పుష్ప రూపాల వద్ద సెల్ఫీలు, ఫోటోలు దిగుతూ సందడి చేశారు. లాల్‌బాగ్ కొండ మీద కూర్చుని సేదదీరారు. ఇకెబన ప్రదర్శన, బోన్సాయ్ ప్రదర్శనలోనూ రద్దీ ఏర్పడింది.


కొండపై జన రద్దీ

క్లుప్తంగా

భారత్ శక్తివంతమైన దేశం


జెండాను ఆవిష్కరిస్తున్న వింగ్ కమాండర్ కేజీ.రావ్

బనశంకరి: ప్రపంచంలోనే భారత్ శక్తివంతమైన దేశమని వింగ్ కమాండర్ కేజీ.రావ్ అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం బనశంకరి మూడోస్టేజ్ ఐటీఐ లేఔట్‌లోని శ్రీకృష్ణ విద్యాసంస్థలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి దేశానికి సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థ సంస్థాపక అధ్యక్షుడు ఎం.రుక్మాంగదనాయుడు, ఉపాధ్యక్షురాలు జలజాక్షమ్మ, డైరెక్టర్ మనోహర్, వేణుగోపాల్, ప్రిన్సిపాల్స్ కమలసుగంధి, ఎస్.ఉషాకుమారి, చెంగప్ప, నేత్రమల్లేశ్, డాక్టర్ పద్మనవనీత్ పాల్గొన్నారు.


గ్యారెంటీలను సక్రమంగా అమలు చేస్తున్నాం

కోలారు: ప్రతిపక్షాలు ఎన్ని ఆరోపణలు చేసినా రాష్ట్ర ప్రభుత్వం ఐదు గ్యారెంటీలను సక్రమంగా అమలు చేస్తోందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి భైరతి సురేష్ తెలిపారు. గురువారం నగరంలోని విశ్వేశ్వరయ్య స్టేడియంలో స్వాతంత్ర్య వేడుకల అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్షాలు అకారణంగా గ్యారెంటీల అమలుపై దుష్ప్రచారం చేస్తున్నాయి. గ్యారెంటీ సౌలభ్యాలు పొందుతున్న ప్రజలు మాత్రం ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. కోలారు జిల్లాలో అక్రమ మద్యం విక్రయాలను అరికట్టడానికి ఇప్పటికే అధికారులను ఆదేశాలు ఇచ్చామన్నారు. నగర సభలో అక్రమ ఖాతాలు జరిగి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీలు నజీర్ అహ్మద్, ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్, ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

దయచేసి గుంతలు పూడ్చండి

దొడ్డబళ్లాపురం: దయచేసి రోడ్డు గుంతలు పూడ్చండంటూ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి కృష్ణభైరేగౌడ అధికారులను కోరారు. వీరణ్ణపాళ్య నుంచి హెబ్బాళ వైపు రింగ్ రోడ్డులోని సర్వీస్ రోడ్డుపై ఉన్న గుంతల వీడియో ఎక్స్‌లో పోస్టు చేసిన మంత్రి... బీబీఎంపీ లేదా బీఎంఆర్‌సీఎల్ ఎండీ ఎవరైనా ఈ గుంతలను పూడ్చండంటూ కోరుకున్నారు. తనకు స్థానికులు ఈ వీడియో పంపించారని, సమస్య పరిష్కరించాలని సూచించారు.

రాజ్యోత్సవ అవార్డు గ్రహీత ఎస్‌బీ రంగనాథ్ మృతి


రంగనాథ్

దొడ్డబళ్లాపురం: కర్ణాటక రాజ్యోత్సవ అవార్డు గ్రహీత ప్రొ.ఎస్‌బీ రంగనాథ్(83) మృతిచెందారు. సిరిగెరె శ్రీ తరళబాళు జగద్గురు విద్యా సంస్థలో అనేక పదవులు అలంకరించి ఎంతో సేవ చేసిన రంగనాథ్ 1941 జూన్ 18న చన్నగిరి తాలూకా సిద్ధనమఠ గ్రామంలో జన్మించారు. రాజ్యోత్సవ అవార్డు మాత్రమే కాకుండా మహాలింగ తదితర అవార్డులు తీసుకున్నారు. ఆయన అనేక పుస్తకాలు రచించి మంచి రచయితగా గుర్తింపు తెచ్చుకున్నారు.

శివమొగ్గలో చైన్‌స్నాచింగ్

శివమొగ్గ: నగరంలోని కల్లూరు మండ్లి పారిశ్రామికవాడలో చైన్‌స్నాచింగ్ జరిగింది. మంగళవారం సాయంత్రం అక్కడి కర్మాగారంలో ఓ మహిళ పని ముగించుకుని కాలి నడకన ఇంటికి వెళుతుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు 20 గ్రాముల బంగారు మంగళసూత్రం లాక్కొని ఉడాయించారు. ఘటనపై బాధితురాలు తుంగానగర పోలీసులకు ఫిర్యాదు చేసింది. గొలుసు విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

ట్రాక్టర్లతో రైతన్నల ర్యాలీ


ట్రాక్టర్ ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

మైసూరు : వివిధ డిమాండ్ల సాధనకు అన్నదాతలు రోడ్డెక్కారు.మైసూరులోని గన్న హౌస్ సర్కిల్ నుంచి గురువారం వందలాదిగా ట్రాక్టర్లతో ర్యాలీగా డీసీ కార్యాలయానికి చేరుకున్నారు. ట్రాక్టర్‌లను బయట నిలిపివేసి అదనపు జిల్లాధికారి డాక్టర్ శివరాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర హామీ చట్టాన్ని అమలు చేయాలని, ప్రతి రైతు పొలానికి పంటల బీమా అమలు చేయాలని, కరువు పరిహారం పంపిణీలో ఎన్‌డీఆర్‌ఎఫ్ నిబంధనలు మార్చాలని, 60 ఏళ్లు దాటిన రైతులకు పింఛను పథకం అమలు చేయాలని, ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లపై జీఎస్టీ పన్ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయ స్థాయి) సంస్థ కురుబూరు శాంతకుమార్, హత్తళ్లి దేవరాజ్, బరడనపుర నాగరాజ్, పి.సోమశేఖర్, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి భారీగా నిధులు

• మంత్రి చలువరాయస్వామి


గౌరవవందనం స్వీకరిస్తున్న మంత్రి చలువరాయస్వామి


సాంస్కృతిక నృత్యప్రదర్శనలు

మండ్య: జిల్లాలోని ప్రధాన రహదారుల అభివృద్ధికి ప్రజాపనుల శాఖ ద్వారా ఈ ఏడాది రూ.100 కోట్లు మంజూరు చేసినట్లు జిల్లా ఇన్‌ఛార్జి, వ్యవసాయ శాఖా మంత్రి ఎన్ .చలువరాయస్వామి తెలిపారు. నగరంలోని సర్ ఎం.విశ్వేశ్వరయ్య స్టేడియంలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పోలీసులనుంచి గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. జిల్లాలో విద్యా ప్రమాణాల పెంపునకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. తీవ్ర అస్వస్థతకు గురైన రోగులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు జిల్లా ఆస్పత్రిలో ఆధునిక క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. విశ్వేశ్వరయ్య కాల్వ ఆయకట్టులో లింక్ కెనాల్, తురుగనూరు, హెబ్బకవాడి, నిడఘట్ట బ్రాంచ్ కెనాల్‌ల ఆధునికీకరణకు రూ.400 కోట్లు, నాల్వడి కృష్ణరాజ వడయార్ కళామందిరం మరమ్మతులకు రూ.63 లక్షలను ఖర్చు చేసినట్లు తెలిపారు. అనంతరం టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. అవయవ దానం చేసిన కేఆర్‌పేట తాలూకా లోకసర గ్రామానికి చెందిన ఎల్‌జీ బొమ్మరాజు, సోమనాథపుర గ్రామానికి చెందిన బసవన్న, క్యాతగానహళ్లి గ్రామానికి చెందిన కేకే రాజేశ్, మండ్య తాలూకా గోపాలపురకు చెందిన సీఎస్ గిరీష్ సహా 12 మంది కుటుంబ సభ్యులకు ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. కలెక్టర్ డా.కుమార్, జెడ్పీ సీఈవో షేక్ తన్వీర్ ఆసిఫ్, జిల్లా ఎస్పీ మల్లికార్జున బాలదండి, అదనపు జిల్లా కలెక్టర్ డా.హెచ్.ఎల్.నాగరాజు, ఎమ్మెల్యే పి.రవికుమార్, మైసుగర్ అధ్యక్షుడు సిడి గంగాధర్, సబ్ డివిజనల్ అధికారి శివమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విపక్షాలకు సిగ్గు, శరం లేదు

అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ-జేడీఎస్ వారు ప్రధాని మోదీ వద్దకు వెళ్లి రాష్ట్రానికి కరువు పరిహార నిధులు ఇవ్వాలని కోరలేదన్నారు. తమ వినతిపై మోదీ స్పందించలేదన్నారు. తాము సుప్రీంకోర్టుకు వెళ్లి డబ్బులు తెచ్చుకోవలసి వచ్చిందన్నారు. చెన్నపట్న ఉప ఎన్నికల్లో 100 శాతం విజయం సాధిస్తామన్నారు. అభ్యర్థి విషయంలో బీజేపీ, జేడీఎస్ మధ్య గందరగోళం నెలకొందన్నారు. యోగేశ్వర్ కాంగ్రెస్‌లో చేరే విషయం తనకు తెలియదన్నారు. ఎమ్మెల్యే పి.రవికుమార్, మైసుగర్ అధ్యక్షుడు సీడీ గంగాధర్, ముడా అధ్యక్షుడు నయీం, రుద్రప్ప పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త


ఘటనా స్థలంలో విచారణ చేస్తున్న ఎస్పీ

మాలూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త భార్యను హత్య చేసిన ఘటన తాలూకాలోని ఇజువనహళ్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దివ్య (22) హత్యకు గురైంది. కొమ్మనహళ్లి గ్రామానికి చెందిన భరత్ దివ్యను వివాహం చేసుకున్నాడు. తరచూ దంపతులు మధ్య గొడవలు జరిగేవి. ఈ విషయంపై గ్రామ పెద్దలు ఇద్దరికి రాజీ చేశారు. ఈ నేపథ్యంలో దివ్య పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో భార్య వద్దకు వచ్చిన భరత్ ఆమెతో గొడవకు దిగాడు. తీవ్ర ఆగ్రహంతో హత్య చేసి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ నిఖిల్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. మాలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

510 అదనపు బస్సు సర్వీస్‌లు ప్రారంభం

బనశంకరి: స్వాతంత్ర్యదినం, వీకెండ్, సోమవారం రక్షాబంధన్‌ను పురస్కరించుకుని వరుసగా సెలవులు రావడంతో నగరవాసులు స్వంతూళ్లకు బయల్దేరుతున్నారు. దీంతో ప్రయాణికుల సౌకర్యార్థం కేఎస్ఆర్‌టీసీ 510 అదనపు బస్సులను ప్రవేశపెట్టింది. బుధవారం రాత్రి ఈ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. మెజస్టిక్, యశవంతపుర, కేఆర్.పురం, శాటిలైట్ బస్టాండు తో పాటు వివిధ బస్టాండ్లనుంచి బస్సులను నడుపుతున్నారు. కాగా గురువారం ఆనందరావు సర్కిల్, మెజస్టిక్ బస్టాండు, మెజస్టిక్ మెట్రోస్టేషన్, మహాలక్ష్మీలేఔట్ మెట్రోస్టేషన్ , యశవంతపుర మెట్రోస్టేషన్, కెంగేరి బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ కనిపించింది. ఇదిలా ఉండగా ప్రైవేటు బస్సులు నిర్వాహకులు ప్రయాణికుల నుంచి అదనంగా టికెట్ ధర వసూలు చేశారు.

ఆశ్రమంలో స్వాతంత్ర్య దిన వేడుకలు


అల్లకపార్వతమ్మకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బనశంకరి: జేపీ.నగర మూడో ఫేజ్‌లోని శ్రీ శివబాలయోగి మహరాజ్ ట్రస్ట్ ఆశ్రమంలో గురువారం స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శివబాలయోగిమహరాజ్ చిత్రపటానికి కార్యాధ్యక్షుడు డీ.రాంబాబు, శ్రీ శివరుద్రబాలయోగి మహరాజ్‌లు పూజలు చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. అదేవిధంగా బన్నేరుఘట్టరోడ్డులోని ఆశ్రమంలో శివబాలయోగి మహరాజ్ తల్లి అల్లకపార్వతమ్మ వర్ధంతిని నిర్వహించారు. సమాధిని పూలతో ప్రత్యేక అలంకరణచేపట్టి పూజలు చేపట్టారు. అనంతరం ఆశ్రమంలో భజనలు చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

భాషాదినోత్సవాన్ని ఘనంగా ఆచరించండి

మండ్య: కన్నడ మనకు గుర్తింపు తెచ్చిన భాష. ఇలాంటి భాషాదినోత్సవానికి అందరూ చేయి కలిపి నిర్వహిస్తే బాగుంటుందని ఆదిచుంచనగిరి పీఠం అధ్యక్షుడు నిర్మలానందనాథ స్వామీజీ సూచించారు. కన్నడ సాహిత్య పరిషత్, జిల్లా యంత్రాంగం తరఫున అంబేడ్కర్ భవన్‌లో గురువారం 87వ అఖిల కన్నడ సాహిత్య సమ్మేళనంలో భాగంగా జరిగిన వివిధ కమిటీలు, సభ్యుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కన్నడ భాష చదివిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇస్తే కన్నడ భాషకు మరింత ఆదరణ లభిస్తుందన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్. చెలువరాయస్వామి మాట్లాడుతూ కన్నడ పండుగకు ఏర్పాట్లన్నీ పక్కాగా చేయడం తమ బాధ్యత అని అన్నారు. కన్నడ సాహిత్య సమ్మేళనం రాష్ట్ర అధ్యక్షుడు నాడోజ డా. మహేష్ జోషి మాట్లాడుతూ సాహిత్య సమ్మేళనం విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో విశ్వమానవ క్షేత్రం శ్రీ పురుషోత్తమానందనాథ స్వామీజీ, ఎమ్మెల్యేలు పి. రవికుమార్, రమేష్ బండిసిద్దె గౌడ, దర్శన్ పుట్టణ్ణయ్య, మధు జి. మాదేగౌడ, దినేష్ గూళిగౌడ, మాజీ ఎమ్మెల్యే కె.టి.శ్రీకంఠేగౌడ, జిల్లా కలెక్టర్ డా. కుమార్, జెడ్పీ సీఈవో షేక్ తన్వీర్ ఆసిఫ్, జిల్లా ఎస్పీ మల్లికార్జున బాలదండి, జిల్లా కసాప కన్వీనర్ మీరా శివలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవుడి నృత్యం అనుకరణపై ఆగ్రహం

బొమ్మనహళ్లి : దేవుడి నృత్యాన్ని అనుకరించిన మహిళపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆమె క్షమాపణ కోరారు. ఈఘటన మంగళూరులోని అట్టిదొంజిలో చోటు చేసుకుంది. కవితా రావు అనే మహిళ కద్రి మంజునాథ్ స్వామి దర్శనానికి వచ్చింది. 4 బీట్స్‌అనే సంస్థ నిర్వహించిన అట్టిదొంజిలో నిర్వహించిన దినోత్సవంలో కవితా రావు దేవుడి నృత్యం చేసింది. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. కవితారావుపై, షో ఏర్పాటు చేసిన నిర్వాహకులపై తమిళులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో షో నిర్వాహకులు క్షమాపణ చెప్పారు. చేసిన తప్పును సరిచేసుకుంటానని కవితారావు చండికా హోమం, కల్లుర్తి దేవుడికి కర్ర ఇస్తానని ప్రమాణం చేశారు.

కోతుల్ని తరిమితే రూ.20 వేల జీతం

దొడ్డబళ్లాపురం: వినడానికి విడ్డూరంగా అనిపించినా ఇది నిజం. ఉత్తర కన్నడ జిల్లా సిద్ధాపుర తాలూకాలో ప్రతి గ్రామానికి ఒక మనిషిని కోతులు తరిమికొట్టడానికే నియమిస్తారు గ్రామస్తులు. 20 ఇళ్లకు ఒక మనిషిని మాట్లాడి నియమిస్తారు. ఆ మనిషి లైసెన్స్ తుపాకి చేతబట్టి తోటల్లో కోతులను తరుముతుంటాడు. ఇతడికి నెలకు సుమారు రూ.20వేల వరకూ ఇస్తారు. అయితే కోతులను తరిమే పని అంత సులభం కాదని గ్రామస్తులు చెబుతారు. అవి గుంపులుగా వచ్చి దాడి చేస్తే భయపడకుండా తరిమికొట్టడం అందరికీ సాధ్యం కాదని అన్నారు.

పోలీసు అధికారినంటూ వంచన

• బంగారు, నగదుతో ఉడాయింపు

మైసూరు: తాను పోలీసు అధికారినని చెప్పి ఓ వంచకుడు మహిళను బెదిరించి 90 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1.80 లక్షల నగదును దోచుకున్నాడు. సురేష్ అనే అపరిచిత వ్యక్తి ఉదయగిరి నివాసి ఆయిషాకు ఫోన్ చేశాడు. తాను ఉదయగిరి ఎస్ఐని అని, మీపై ఫిర్యాదు నమోదైందని, స్టేషన్‌కు రావాలని చెప్పాడు. అనంతరం ఆమె ఇంటికి వెళ్లాడు. హుణసూరులో ఓ వ్యక్తిని మోసగించినట్లు కేసు నమోదైందని, డబ్బు ఇస్తే కేసు మాఫీ చేస్తానని చెప్పాడు. రూ.18 వేలను బలవంతంగా వసూలు చేశాడు. ఆ తర్వాత ఆధార్ జిరాక్స్ కోసం అయిషా కుమారుడు ఖలీంను బయటకు పంపించాడు. తాగడానికి నీరు కావాలని అడగడంతో ఆమె వంటింటిలోకి వెళ్లగానే ఇంటిలో భద్రపరిచిన 90 గ్రాముల బంగారం, రూ.1.80 లక్షల నగదు దోచుకున్నాడు. రెండు రోజుల్లో పోలీసు స్టేషన్‌కు రావాలని చెప్పి పరారయ్యాడు. ఆ తర్వాత ఆయిషా పోలీసు స్టేషన్‌కు వెళ్లి విచారించగా, తమ ఇంటికి వచ్చింది నకిలీ పోలీసని తేలింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉదయగిరి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పోలీసులకు సీఎం మెడల్స్

బనశంకరి: రాష్ట్ర పోలీస్ శాఖలో ఉత్తమ సేవలకు అందించే ముఖ్యమంత్రి పతకాలకు ఐపీఎస్ అధికారులు కార్తీక్‌రెడ్డి, డాక్టర్ ఎం.అశ్విని, ఎస్.యతీశ్ తో పాటు 126 మంది వివిధ స్థాయి పోలీసులు ఎంపికయ్యారు. వారికి గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం సిద్దరామయ్య పతకాలను బహూకరించారు.

మెట్రోలో ఒకేరోజు 9 లక్షల మంది ప్రయాణం

శివాజీనగర: నమ్మ మెట్రో రైల్లో బుధవారం సుమారు 9.17 లక్షల మంది ప్రయాణించటం ద్వారా నమ్మ మెట్రో చరిత్రలో కొత్త రికార్డు ఏర్పడింది. 2011 నుంచి నమ్మ మెట్రో సంచారం ఆరంభమైన నాటి నుంచి ఇప్పటివరకు ప్రతిరోజు సుమారుగా 6.36 లక్షల మంది సంచరిస్తుండేవారు. 2024 ఆగస్టు 6న, 2024న నమ్మ మెట్రోలో 8.26 లక్షల మంది ప్రయాణికుల సంచారం రికార్డుగా ఉండింది. అయితే వరుస సెలవులు రావడంతో బుధవారం నుంచే చాలా మంది ఊళ్లకు వెళ్లడానికి బయల్దేరారు.

సంక్షిప్త సమాచారం

కారు బోల్తా.. ఒకరి మృతి

మైసూరు: కారు బోల్తా పడి ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన చామరాజనగర జిల్లా గుండ్లుపేటె తాలూకాలో జాతీయ రహదారి-766పై కూతనూరు గ్రామం వద్ద జరిగింది. కన్నెగాల గ్రామానికి చెందిన చంద్రు(31), కృష్ణమూర్తి, కృష్ణ అనే స్నేహితులు కారులో వెళ్తుండగా అతి వేగంతో అదుపు తప్పి బోల్తా పడింది. చంద్ర అక్కడికక్కడే మృతి చెందగా మిగతా ఇద్దరు గాయపడ్డారు. గుండ్లుపేటె పోలీసులు క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు

మైసూరు: లైంగిక దాడి ఘటనలో ముద్దాయికి చామరాజనగర అదనపు జిల్లా సెషన్స్ ప్రత్యేక పోక్సో కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. చామరాజనగర జిల్లాకు చెందిన నిందితుడు తన సోదరుని కుమార్తెను అపహరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జ్‌షీట్ సమర్పించారు. విచారణలో నేరం రుజువు కావడంతో ముద్దాయికి పోక్సో చట్టం కింద 20 ఏళ్ల కఠిన శిక్ష, రూ.80 వేల జరిమానా విధిస్తూ జడ్జి ఎస్‌జే కృష్ణ తీర్పు చెప్పారు. జిల్లా న్యాయ సేవల ప్రాధికార తరఫున బాధితురాలికి పరిహారం అందించాలని సూచించారు ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక ప్రభుత్వ ప్రాసిక్యూటర్ కే.యోగేష్ వాదించారు.


ఆర్మీ బైక్ రైడర్లు పంద్రాగస్టు, గణతంత్ర వేడుకల్లో సాహసోపేత విన్యాసాలతో అదరగొడతారు. కానీ గురువారం బెంగళూరు మానెక్‌షా మైదానంలో స్వరాజ్య వేడుకల్లో ఓ రైడర్ ఇటుకల గోడ నుంచి దూసుకెళ్తూ కిందపడిపోయిన దృశ్యం

వరలక్ష్మీ పండుగకు వేళాయె


పూల మార్కెట్‌లో రద్దీ

కోలారు: వరమహాలక్ష్మీ పండుగను పురస్కరించుకుని నగరంలో పండుగ కొనుగోళ్లు గురువారం జోరందుకున్నాయి. పూలు, పండ్ల ధరలు ఆకాశాన్నంటాయి. పూలు, పండ్లు కొనుగోలు చేయడానికి పెద్ద సంఖ్యలో నగర ప్రజలు రావడంతో మార్కెట్ కిటకిటలాడింది. నగరంలోని పాతబస్టాండ్, దొడ్డపేట, బస్టాండు సర్కిల్ తదిరత ప్రాంతాలలో కొనుగోళ్లు భారీ జరిగాయి. పూలు, పండ్లతో పాటు లక్ష్మీ విగ్రహాల కొనుగోళ్లు కూడా జోరుగా సాగాయి. అదేవిధంగా వరమహాలక్ష్మీ పండుగ సందర్భంగా పూల ధరలు ఆకాశాన్నంటాయి. కనకాంబరాలు ఏకంగా కిలో రూ. 2 వేల నుంచి రూ. 2500 పలికింది. మల్లెలు కిలో రూ. 1600, కాగడాలు కిలో రూ. 800, రోజాలు కిలో రూ. 300, చేమంతులు కిలో రూ. 600, గుండు మల్లెలు కిలో రూ. 800తో విక్రయించారు. ఆపిల్ కిలో రూ. 250, ఆరెంజ్ కిలో రూ. 180, చిన్న అరటి కిలో రూ. 130, పెద్ద అరటి కిలో రూ. 50, మోసంబి కిలో రూ. 180, దానిమ్మ కిలో రూ. 200 విక్రయించారు. ఇక వరలక్ష్మీ విగ్రహాలు సైతం భారీగా ధర పలికాయి.

విమర్శలకు భయపడం..రాష్ట్రాభివృద్ధే ధ్యేయం

• హోం మంత్రి పరమేశ్వర్


గౌరవ వందనం స్వీకరిస్తున్న హోం మంత్రి పరమేశ్వర్

తుమకూరు: ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నంలో ప్రతిపక్షాలు గవర్నర్ కార్యాలయాన్ని దుర్వినియోగం చేస్తూ ముఖ్యమంత్రిపై, ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని, రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజలే దీనికి తగిన సమాధానమిస్తారని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ జీ.పరమేశ్వర్ పేర్కొన్నారు. నగరంలోని మహాత్మాగాంధీ జిల్లా స్టేడియంలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండాను ఎగురవేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. చట్టపరిధిలో ఎలాంటి విమర్శలకు తమ ప్రభుత్వం భయపడేది లేదన్నారు. రాష్ట్ర అభివృద్ధే తమ ప్రభుత్వ మూలమంత్రమని అన్నారు. ఏడాదిన్నర నుంచి ఐదు హామీల ద్వారా లబ్ధిదారులకు వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా గణేశ చతుర్థిని ప్రశాంతంగా జరుపుకునేందుకు అనువైన వాతావరణం కల్పిస్తామన్నారు. పోలీసు శాఖలో పదోన్నతుల కేసులు పెండింగ్‌లో లేవని, నాలుగేళ్లుగా నియామకం చేయకుండా ఖాళీగా ఉన్న 20 వేల కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు.

త్యాగధనులను స్మరించుకోవాలి


జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మంజునాథ్

శివాజీనగర: హుబ్లీ నగరం గదగ్ రోడ్డులో ఉన్న బేతెల్ కమ్యూనిటీ సెంటర్‌లో గురువారం స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఫయనీర్ మినిస్ట్రీస్ నెట్‌వర్క్ సీఈఓ రెవరెండ్ డాక్టర్ సాలోమాన్ బిజ్జ హాజరై మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవాలన్నారు. అంతకు ముందు బండివాడ గ్రామ పంచాయితీ అధ్యక్షుడు మంజునాథ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. బేతెల్ కమ్యునిటీ సెంటర్‌కు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నానని భరోసానిచ్చారు. పాస్టర్లు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలి


కోలారులో గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి భైరతి సురేష్

కోలారు: స్వాతంత్ర్యం కోసం పోరాటం సాగించిన సమరయోధులను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి భైరతి సురేష్ అన్నారు. గురువారం నగరంలోని విశ్వేశ్వరయ్య స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయన పాల్గొని జెండా ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి కేసి రెడ్డి, క్షీర విప్లవనేత ఎం వి కృష్ణప్ప, దివంగత ఎంపీ చన్నయ్య వంటి గొప్పవారు జిల్లాకు చెందిన వారు కావడం గర్వకారణమన్నారు. ఉపాధిహామీ పథకాన్ని జిల్లాలో అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోలారు జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకు కావలసిన నిధులను అందిస్తోందన్నారు. కోలారు నగరానికి రూ. 60 కోట్ల నిధులు, రాబర్ట్‌సన్ పేట కేజీఎఫ్ అభివృద్ధికి రూ. 20 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు కోసం రూ. 100 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, ఎమ్మెల్సీలు ఎంఎల్ అనిల్‌కుమార్, ఇంచర గోవిందరాజులు, నజీర్ అహ్మద్ కలెక్టర్ అక్రంపాషా, ఎస్పీ బి నిఖిల్, సీఈఓ పద్మ బసవంతప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి

మాలూరు : దేశ స్వాతంత్ర్యం కోసం అమరులైన వారిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కెవై నంజేగౌడ తెలిపారు. గురువారం పట్టణంలోని హోండా క్రీడా మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎందరో త్యాగబలిదానాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, ప్రతి ఒక్కరూ దేశాభిమానం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాలలో విశేష సాధన చేసిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె రమేష్, తాపం ఈఓ, బీఈఓ పురసభముఖ్యాధికారి తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను గుర్తు చేసుకోవాలి

శ్రీనివాసపురం: పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో గురువారం స్వాతంత్ర్య వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే జికె వెంకటశివారెడ్డి పోలీసు ధ్వజవందనం స్వీకరించిన అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఎందరో వీరుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఉత్తమ సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు శ్రమించాలన్నారు. అనంతరం వివిధ పాఠశాలలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తహసీల్దార్ జీఎన్ సుధీంద్ర, తాపం ఈఓ రవి, పురసభ ముఖ్యాధికారి వైఎన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

కేజీఎఫ్: స్వాతంత్ర్య అమృతోత్సవ వేడుకలను గురువారం నగరంలోని నగరసభ మైదానంలో వైభవంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఎమ్మెల్యే రూపా శశిధర్ మాట్లాడుతూ...స్వాతంత్ర్య వేడుకల్లో మనం పాలుపంచుకోవడం మన అదృష్టమన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకు వచ్చిన వారిని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు. ఎందరో మహనీయుల బలిదానమే నేటి స్వాతంత్ర్యం అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాబోయే రోజుల్లో కేజీఎఫ్ నగరంలో పరిశ్రమలు తీసుకు వస్తున్నందువల్ల కేజీఎఫ్‌లో పారిశ్రామిక విప్లవం ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ శాంతరాజు, తహసీల్దార్ నాగవేణి, తాపం ఈఓ మంజునాథ్ హర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.


పాత్రికేయుల భవనంలో...

వేడుకగా జెండా పండుగ

కోలారు: నగరంలోని పాత్రికేయుల భవనంలో గురువారం స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని జాతీయ పతాకాన్ని జిల్లా పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు గోపినాథ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన జెండా పండుగ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా పాత్రికేయుల సహకార సంఘం అధ్యక్షుడు కెఎస్ గణేష్, సురేష్, కోన మంజునాథ్, చంద్రు, చంద్రశేఖర్, జగదీష్, హెచ్‌కె రాఘవేంద్రరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.


మాలూరులో సాధకులకు సన్మానం


కేజీఎఫ్‌లో స్వాతంత్ర్య వేడుకల్లో ఎమ్మెల్యే రూప


వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి

క్లుప్తంగా

క్యాన్సర్ పీడిత బాలికకు చేయూత


బాలిక కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న దృశ్యం

శివమొగ్గ: క్యాన్సర్ పీడిత బాలికకు చికిత్స కోసం విరాళం అందించడం ద్వారా డాక్టర్ అంబేడ్కర్ ఆదిజాంబవ రాష్ట్ర సమితి స్వాతంత్ర్య దినోత్సవాన్ని అర్థవంతంగా ఆచరించింది. శివమొగ్గలోని బొమ్మనకట్టె బడావణెకు చెందిన పేద కుటుంబానికి చెందిన బాలిక క్యాన్సర్‌కు గురైంది. బెంగళూరు ఆస్పత్రిలో చేర్పించారు. నగరంలోని దుర్గగుడి కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో హిరియూరుకు చెందిన దళిత గురుపీఠం గురు ప్రకాష్ స్వామీజీ చేతుల మీదుగా బాలిక కుటుంబానికి సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. ప్రకాష్ చెక్ అందజేశారు. పాత్రికేయుడు చెన్నబసప్ప, సమితి గౌరవాధ్యక్షుడు దేవేంద్రప్ప, జిల్లాధ్యక్షుడు కరిబసప్ప, జిల్లా మహిళా శాఖ అధ్యక్షురాలు కెంచమ్మ, రమేష్, ప్రముఖులు హారనహళ్లి హాళదప్ప, ప్రతాప్, కల్లప్ప తదితరులున్నారు.

బైక్ హ్యాండిల్ తిరగక...


అల్లాబకాష్ (ఫైల్)

అమడగూరు: మండలంలోని బిళ్లూరు రోడ్డులో నారాయణస్వామి మఠం క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కదిరికి చెందిన యువకుడు అల్లాబకాష్ (22) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. కదిరి, నల్లగుట్ట వీధికి చెందిన షేక్ అల్లాబకాష్ ఇటీవలే డిగ్రీ పూర్తి చేసుకుని ఉద్యోగం కోసం బెంగళూరుకు వెళ్లాడు. గురువారం బెంగళూరు నుంచి ద్విచక్రవాహనంలో సొంతూరు కదిరికి వస్తున్నాడు. బిళ్లూరు రోడ్డులో ఆర్టీసీ బస్సును బలంగా ఢీ కొన్నాడు. అల్లాబకాష్ బైక్‌లో హ్యాండిల్ వద్ద రెండు బ్యాగులను పెట్టుకుని వస్తుండగా మలుపులో హ్యాండిల్‌ను తిప్పలేక ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొన్నాడని బస్సు డ్రైవర్ చెబుతున్నారు. ఈ ప్రమాదంలో అల్లాబకాష్ తలకు తీవ్ర గాయం కాగా అక్కడికక్కడే మృత్యువాత చెందాడు. పోలీసులు చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మువ్వన్నెల సంబరం... దేశమాతకు వందనం

స్వాతంత్ర్య దిన వేడుకలు గురువారం వాడవాడలా ఘనంగా జరిగాయి. ప్రజల్లో దేశభక్తి ఉప్పొంగింది. మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. జాతి నేతలకు నివాళులర్పించారు. జెండా వందనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా గురువారం ధార్వాడలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమం


కొడగులో చెక్క వంతెనపై నిలబడి మువ్వన్నెల జెండాను ప్రదర్శిస్తూ దేశభక్తి చాటుతున్న గ్రామీణులు


బెంగళూరులో బాలిక బుగ్గలకు జెండా రంగు


బెళగావిలో మహిళా పోలీసుల ప్రదర్శన

గ్యారంటీల నిలిపివేతకు కుట్ర

దొడ్డబళ్లాపురం: గ్యారంటీ పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందని, ఇప్పుడు ఏకంగా ఆ పథకాలనే ఎత్తివేసేందుకు కుట్ర చేస్తోందని జేడీఎస్ రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ నిఖిల్ కుమారస్వామి ఆరోపించారు. గురువారం బెంగళూరులోని జేడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన 78వ స్వాతంత్ర్యదినోత్సవంలో ధ్వజారోహణం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెజారిటీ సీట్లు రాకపోతే గ్యారంటీలను నిలిపివేస్తామని కాంగ్రెస్ నేతలు ఓటర్లను బెదిరించారని గుర్తు చేశారు. గ్యారంటీ పథకాలు అందడంలేదని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయన్నారు. గ్యారంటీల అమలు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆస్తుల ఎస్ఆర్ విలువ, ఇంధన ధరలు పెంచిందన్నారు. మరోవైపు వాల్మీకి అభివృద్ధి మండలి, ముడాలో కుంభకోణాలు వెలుగు చూడడం ప్రభుత్వానికి మాయని మచ్చ అన్నారు.

వాష్ రూమ్‌లో సెల్‌తో వీడియో

బనశంకరి: సినిమా థియేటర్ వాష్ రూమ్‌లో సెల్ కెమెరా పెట్టడం కలకలం రేపింది. ఈఘటన బెంగళూరులోని ఊర్వశి థియేటర్‌లో చోటు చేసుకుంది. దునియా విజయ్ నటించిన భీమ సినిమాను ఈ థియేటర్‌లో ప్రదర్శిస్తున్నారు. సినిమాకు వచ్చిన ఓ యువతి వాష్ రూమ్‌కు వెళ్లింది. ఆ సమయంలో ఓ బాలుడు మరుగుదొడ్డి కిటికీ వద్ద మొబైల్ పెట్టి వీడియో తీశాడు. ఈ విషయం యువతి దృష్టికి రావడంతో గట్టిగా కేకలు వేస్తూ పరుగులు తీసింది. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మైనర్‌బాలుడిని కలాసీపాళ్య పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

ఒకే వేదికపై డీకే శివకుమార్, సీపీ యోగేశ్వర్


ఒకే వేదికను పంచుకున్న డీకేశి, సీపీవై

దొడ్డబళ్లాపురం: చెన్నపట్టణ ఉప ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రామనగరలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి వర్సెస్ డీసీఎం డీకే శివకుమార్‌గా ఎన్నికలు మారాయి. అయితే ఆశ్చర్యకరంగా వీరి మధ్యలో బీజేపీ ఎమ్మెల్సీ సీపీ యోగేశ్వర్ ఎంట్రీ ఇవ్వడంతో సీన్ మారుతోంది. ఇండిపెండెంట్‌గా అయినా పోటీ చేసి చెన్నపట్టణను గెలిచి ఎన్డీఏకు బహుమతిగా ఇస్తానని సీపీవై అంటున్నారు. ఇదిలా ఉండగా గురువారం చెన్నపట్టణలోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఎమ్మెల్సీ సీపీ యోగేశ్వర్ ఒకే వేదికపై ఆశీనులయ్యారు.

రాజకీయం చేయడానికి రాలేదు

ధ్వజారోహణంగావించిన పిదప మాట్లాడిన డీకే శివకుమార్.. కేంద్రమంత్రి కుమారస్వామిపై సెటైర్లు వేశారు. గతంలో చెన్నపట్టణ ఎమ్మెల్యే ఇలాంటి కార్యక్రమంలో పాల్గొన్నారో లేదో తనకు తెలియదన్నారు. అయితే జాతీయ జెండాను సగానికి ఎగరేస్తే ఎంత అగౌరవమో నియోజకవర్గం ప్రజలను అర్ధంతరంగా వదిలి వెళ్లడం కూడా అంతే అగౌరవం అన్నారు. తాను చెన్నపట్టణలో రాజకీయం చేయడానికి రాలేదన్నారు. అభివృద్ధి చేయడానికి వచ్చానన్నారు. చెన్నపట్టణ అభివృద్ధికి ముఖ్యమంత్రి రూ.15 0కోట్ల నిధులు ఇచ్చారన్నారు. ఇక్కడ తగిన నాయకత్వం లేదన్నారు. కుమారస్వామిని డీకే శివకుమార్ ఎన్ని మాటలు అంటున్నా సీపీ యోగేశ్వర్ మౌనంగా ఉండిపోవడం వెనుక పరమార్థాన్ని ఇప్పుడు ప్రజలు అర్థం చేసుకోలేకపోతున్నారు.

మురిసిన త్రివర్ణ పతాకం


భారీ పతాకంతో విద్యార్థుల ర్యాలీ

విజయపుర: పట్టణానికి సమీపంలోని అవతి గ్రామంలోని నవోదయ కాన్వెంట్ ఆధ్వర్యంలో ప్రజల్లో స్వాతంత్ర్య దినోత్సవంపై జాగృతి కల్పించేందుకు 120 మీటర్ల జాతీయ త్రివర్ణ పతాకాన్ని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కాన్వెంట్ అధ్యక్షుడు ఎన్ఆర్ ప్రకాష్, కార్యదర్శి నారాయణస్వామి, ప్రధానోపాధ్యాయురాలు సుధ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇంజినీర్ మృతి


మృతుడు కౌశిక్(ఫైల్),రోదిస్తున్న కుటుంబ సభ్యులు

బొమ్మనహళ్లి : విద్యుదాఘాతంతో ప్రైవేటు కంపెనీ ఉద్యోగి మృతి చెందాడు. ఈ ఘటన ఆనేకల్ తాలూకా జిగణి పారిశ్రామిక వాడలో జరిగింది. బెంగళూరుకు చెందిన కౌశిక్(27)జిగణిలో ఉన్న ప్రైవేటు కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ప్యానల్ బోర్డు ఏర్పాటు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆయన్ను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని జిగణి పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

భార్యను కడతేర్చిన భర్త అరెస్ట్


భార్య గౌరీతో నాగేశ్(ఫైల్)

బనశంకరి: భార్యను కడతేర్చి పరారీలో ఉన్న భర్తను గురువారం కెంగేరి పోలీసులు అరెస్ట్ చేశారు. భర్త నుంచి విడిపోయిన గౌరీ(30) అనే మహిళను నాగేశ్ అనే వ్యక్తి ఎనిమిది సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. నాగేశ్ బెంగళూరులో అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అనుమానంతో భార్యను వదిలేసి వేరుగా ఉంటున్నాడు. వారం క్రితం భార్యను మళ్లీ ఇంటికి తీసుకువచ్చాడు. మంగళవారం రాత్రి జట్టిగనహళ్లి శ్మశానవాటిక వద్దకు తీసుకెళ్లి తలపై బండరాయితో బాది హత్యచేసి ఉడాయించాడు. కెంగేరి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి అరెస్ట్ చేశారు.

మహనీయుల త్యాగాలతోనే దేశానికి స్వాతంత్ర్యం


మైసూరు: జెండా వందనం చేస్తున్న మంత్రి మహదేవప్ప, అధికారులు


గౌరిబిదనూరు: ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ, చిత్రంలో అధికారులు


విదురాశ్వత్థంలో అమరవీరులకు అంజలి ఘటిస్తున్న మాజీ మంత్రి శివశంకరరెడ్డి


శివమొగ్గలో గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి మధ బంగారప్ప, అధికారులు

మైసూరు: ఎందరో మహనీయుల త్యాగాలతో దేశానికి స్వాతంత్ర్యం లభించిందని సాంఘిక సంక్షేమ, జిల్లా పోలీసు శాఖ మంత్రి డా.హెచ్.సి.మహదేవప్ప అన్నారు. ఆయన గురువారం నగరంలోని బన్నిమంటప పరేడ్ మైదానంలో జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయన పాల్గొని జెండాను ఎగురవేశారు. పోలీసులనుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ భాష, మతం , సంస్కృతికి అతీతంగా మనుషులంతా ఒక్కటే అనే భావన మనందరిలో పెంపొందాలన్నారు. దేశరక్షణ కోసం పోరాడుతూ అమరులైన వారికి శిరస్సు వంచి నమస్కరించాలన్నారు. పరేడ్‌లో పోలీసు, హోంగార్డు, అగ్నిమాపక, ఎక్సైజ్, ఎన్ఎస్ఎస్ కార్యకర్తల విన్యాసాలు, విద్యార్థుల దేశభక్తి గీతాల ఆలాపన ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే తన్వీర్ సేఠ్, ముడా అధ్యక్షుడు కె.మరిగౌడ, కర్ణాటక వస్తు ప్రదర్శన ప్రాధికార అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, జిల్లాధికారి జి.లక్ష్మీకాంతరెడ్డి, దక్షిణ వలయ ఐజీపీ బోరలింగయ్య, నగర పోలీస్ కమిషనర్ సీమా లాట్కర్, జెడ్పీ సీఈఓ కేఎం గాయత్రి, జిల్లా ఎస్పీ విష్ణువర్ధన్, ఏడీసీ డాక్టర్ పీ.శివరాజ్, ప్రజలు పాల్గొన్నారు.

త్యాగధనులను స్మరించుకుందాం

గౌరిబిదనూరు: మన పెద్దల త్యాగ ఫలం నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని, దానిని రక్షించుకోవడం అందరి బాధ్యత అని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ అన్నారు. పట్టణంలోని నేతాజీ క్రీడా మైదానంలో గురువారం ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. దేశ భవిష్యత్ ఉజ్వలంగా ఉండాలంటే ప్రజా స్వామ్యాన్ని రక్షించుకోవాలన్నారు. అనంతరం బసాపురానికి చెందిన జాతీయ స్థాయి క్రీడాకారిణి మమతతోపాటు వివిధ రంగాల్లో సాధన చేసిన వారిని సన్మానించారు. తహసీల్దార్ మహేష్ పత్రి, కమిషనర్ గీత, సీఐ సత్యనారాయణ, విద్యాశాఖ అధికారి శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు. అదేవిధంగా విదురాశ్వత్థంలో అమరవీరులకు మాజీ మంత్రి ఎన్‌హెచ్ శివశంకరరెడ్డి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూ ఈ నేలలో ఎంతో మంది అమరులయ్యారన్నారు. వారిని స్మరించుకోవాలన్నారు. నాగరత్నమ్మ, ఈఓ మరిరాజు, ప్రకాష్‌రెడ్డి, కళాకారుడు రామకృష్ణ పాల్గొన్నారు.

మహనీయుల బాటలో నడుద్దాం

బనశంకరి: వివేక్‌నగరలోని సేవాభారత ట్రస్ట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటుచేసిన స్వాతంత్ర్యదినోత్సవంలో విశ్రాంత నేవీ కమాండర్ మనోహర్ హాజరై జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడారు. విద్యార్థులు మహనీయుల బాటలో నడిచి దేశభక్తి పెంపొందించుకుని విద్యలో రాణించి దేశానికి సేవలందించాలని సూచించారు. అనంతరం ఎస్ఎస్ఎల్‌సీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.5 వేలు, రూ. 4వేలు చొప్పున నగదు బహుమతిని సేవాభారత్‌ట్రస్ట్ అధ్యక్షుడు బండి ఆదినారాయణరెడ్డి అందజేశారు. నోట్ పుస్తకాలు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు తిప్పేస్వామి, ఉపాధ్యాయులు భువనానంద, రామమోహన్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు రంగస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనుల పోరాట ఫలమే స్వాతంత్ర్యం

- మంత్రి మధు బంగారప్ప

శివమొగ్గ: మన భారతదేశాన్ని విదేశీయుల బానిసత్వం నుంచి విముక్తి కల్పించేందుకు దేశంలోని లక్షలాది మంది భారతీయులు సర్వస్వం త్యాగం చేశారు. మన జిల్లాలో చాలా మంది స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆ స్వాతంత్ర్య వీరులందరికీ శతకోటి వందనాలు అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్.మధు బంగారప్ప అన్నారు. గురువారం నగరంలోని డీఏఆర్ మైదానంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. అనేక రంగాల్లో ఎంతో మంది ప్రతిభావంతులు, పేరు ప్రఖ్యాతులుగల వారు జన్మించిన పుణ్యభూమి శివమొగ్గ జిల్లా అని అన్నారు. ఈ ఏడాది వరదల వల్ల నష్టపోయిన ప్రజలకు సహాయం అందించాలని కలెక్టర్‌ను ఆదేశించామన్నారు. దెబ్బతిన్న 294 పాఠశాలలు, అంగన్వాడీలు, ఇతర భవనాలు, రోడ్లు, వంతెనల మరమ్మతులు చేయిస్తామన్నారు. జిల్లాలో 41 కేపీఎస్ పాఠశాలలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు బీవై రాఘవేంద్ర, ఎమ్మెల్యేలు చెన్నబసప్ప, అరగ జ్ఞానేంద్ర, శారద పూర్యానాయక్, బల్కిష్ బాను, ధనంజయ సర్జి, ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ గురుదత్త హెగ్డే, జిల్లా ఎస్పీ మిథున్ కుమార్, జెడ్పీ సీఈవో ఎన్.హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జెండా పండుగ

బొమ్మనహళ్లి : హెచ్ఎస్ఆర్ లేఔట్ 2వ సెక్టారు ఎస్‌వీఆర్ చిన్మయ పాఠశాలలో గురువారం స్వాతంత్ర్యదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కేపీసీసీ ప్రచార సమితి సంచాలకుడు కే.వాసుదేవ రెడ్డి జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడారు. దేశాభివృద్ధికి యువత కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ మిత్రరూబిని, డైరెక్టర్లు రంజిత్, ప్రజ్వల్ పాల్గొన్నారు.

పాఠశాలలో జెండా పండుగ

బొమ్మనహళ్లి: ఎంతోమంది స్వాతంత్ర్య సమర యోధుల త్యాగ ఫలితమే నేటి స్వాతంత్ర్య దినోత్సవాలని ఎం.ఆర్.ఆర్.రాఘవేంద్ర అన్నారు. రాయల్ పబ్లిక్ స్కూల్లో జెండా పండుగ నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీసాయిరామ్ విద్యాసంస్థలో ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు జరిగాయి.

పాలికెలో వేడుకలు

బనశంకరి: స్వాతంత్ర్యదినోత్సవాలను బీబీఎంపీ కేంద్ర కార్యాలయంలో పాలనాధికారి ఎస్ఆర్.ఉమాశంకర్, కమిషనర్ తుషార్ గిరినాథ్ ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూజలు చేసి, జాతీయ జెండాను ఎస్ఆర్.ఉమాశంకర్ ఎగురవేశారు. పాలికె ప్రత్యేక కమిషనర్ డాక్టర్ హరీశ్‌కుమార్, అవినాశ్ మెనన్ రాజేంద్రన్, శివానంద కలకేరి, చీఫ్ ఇంజినీర్ ప్రహ్లాద పాల్గొన్నారు.

చిక్కబళ్లాపురం: నగరంలోని విశ్వేశ్వరయ్య జిల్లా క్రీడా మైదానంలో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో మంత్రి ఎంసీ సుధాకర్ పాల్గొని మువ్వన్నెల జెండా ఎగురవేశారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం ప్రతిభావంత విద్యార్థులను సన్మానించారు.

స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ త్యాగాలు

శివాజీనగర: బెంగళూరులోని క్వీన్స్ రోడ్డులో ఉన్న కేపీసీసీ కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్యదిన వేడుకల్లో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పాల్గొని జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్ర్య సంగ్రామంలో సుమారు 6.5 లక్షల మంది కాంగ్రెస్‌వారు ప్రాణ త్యాగం చేశారన్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు గొప్పగా చెప్పాలన్నారు. ఆనాడు బ్రిటిష్ వారికి సహాయం చేసి నేడు నకిలీ దేశభక్తి ముసుగును ధరించి దేశాన్ని నాశనం చేస్తున్నారని బీజేపీ నాయకులపై ధ్వజమెత్తారు.

మైసూరు: నైరుతి రైల్వే మైసూరు విభాగం ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని యాదవగిరిలోని రైల్వే క్రీడా మైదానంలో ఘనంగా ఆచరించారు. మైసూరు డివిజనల్ రైల్వే మేనేజర్ శిల్పి అగర్వాల్ మాట్లాడుతూ రాబడి, సరుకు రవాణాలో మైసూరు డివిజన్ గణనీయమైన సాధన చేసిందన్నారు. ఈసందర్భంగా అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ వినాయక్ నాయక్, విజయ పాల్గొన్నారు.

చింతామణి: పట్టణంలోని ఝాన్సీ మైదానంలో స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా జరిగాయి. తహశీల్దార్ సుదర్శన్ యాదవ్ పోలీసు వందనం స్వీకరించి మాట్లాడారు. నగరసభ కమిషనర్ చలపతి, ఈఓ ఆనంద్, బీఈఓ ఉమాదేవి పాల్గొన్నారు.


ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న మంత్రి ఎంసీ సుధాకర్


చింతామణి: గౌరవ వందనం స్వీకరిస్తున్న తహసీల్దార్


మైసూరులో జెండావందనం చేస్తున్న డివిజనల్ రైల్వే మేనేజర్ శిల్పి అగర్వాల్


బొమ్మనహళ్లి: జెండాను ఎగురవేస్తున్న దృశ్యం


జెండా వందనం చేస్తున్న తుషార్ గిరినాథ్


నోటు పుస్తకాలు అందజేస్తున్న నేవీ కమాండర్


బొమ్మనహళ్లి: వైవిధ్య వేషధారణలో బాలలు

హోసూరు వార్తలు..

వైభవంగా స్వరాజ్య వేడుక


జాతీయ జెండాను ఎగరేస్తున్న కలెక్టర్ శరయు


కార్యాలయ సిబ్బందితో సబ్‌కలెక్టర్ ప్రియాంక


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి ఆటల మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని వైభవంగా ఆచరించారు. కలెక్టర్ శరయు , ఎస్పీ తంగదురై, జిల్లా ఎస్పీ కే.గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు. మొదటగా జాతీయ జెండాను ఎగురవేసి పోలీసులచే గౌరవ వందనాన్ని స్వీకరించారు. 461 మంది ఉత్తమ ఉద్యోగులను సన్మానించారు. 42 మంది లబ్ధిదారులకు రూ. 45.23 లక్షల విలువ చేసే సంక్షేమ పథకాలను అందజేశారు. 1,440 మంది విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక వేడుకలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో సాధన కురల్, అదనపు కలెక్టర్ వందనాకార్గ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ ఆఫీసులో..

హోసూరు: హోసూరులో సబ్ కలెక్టర్ కార్యాలయం, సిటీ కార్పొరేషన్ కార్యాలయాల్లో గురువారం 78వ స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సబ్ కలెక్టర్ ప్రియాంక పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. హోసూరు, డెంకణీకోట, అంచెట్టి, సూళగిరి తాలూకాల్లో రెవిన్యూ పోలీసు తదితర శాఖల్లో ఉత్తమ సేవలందజేసిన ఉద్యోగులకు సర్టిఫికెట్లను అందజేసి గౌరవించారు. రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు, సబ్‌కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. హోసూరు సిటీ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ ఎస్.ఏ.సత్య అధ్యక్షతన స్వాతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకొన్నారు. కమిషనర్ శ్రీనాథ్, డిప్యూటీ మేయర్ ఆనందయ్య తదితరులు పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు.

గుట్కా, మద్యం సీజ్

హోసూరు: బాగలూరు పోలీసులు బుధవారం సాయంత్రం సర్జాపుర రోడ్డుపై వాహన తనిఖీలు నిర్వహించారు. ఒక కారును అడ్డగించగా డ్రైవర్ కారును రోడ్డుపక్కన నిలిపి పరారయ్యాడు. కారులో ఉన్న మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని పరిశీలించగా 50 మద్యం బాటిళ్లు, 220 కిలోల గుట్కా పట్టుబడింది. నిందితుడు ఒడిశాకు చెందిన దేవభద్ర రాహుల్ (33) అని, బెంగళూరు నుంచి చెన్నైకు గుట్కాను తరలిస్తున్నట్లు తెలిసింది. డ్రైవర్ ఇంద్రకుమార్ (28) కోసం గాలిస్తున్నారు.

విద్యార్థులకు ప్రతిభా పోటీలు

కెలమంగలం: కెలమంగలం సమితి అనుసోణ గ్రామంలోని ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు వివిధ ప్రతిభా పోటీలను నిర్వహించారు. హెచ్‌ఎం శామణ్ణ అధ్యక్షతన పాఠశాల ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేసి పిల్లలకు ఆటల పోటీలు, సాంస్కృతిక, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు జరిపారు. గెలుపొందిన పిల్లలకు బహుమతులను అందజేశారు. కాంగ్రెస్ నాయకుడు ఏ.జీ.రామచంద్రన్, పీటీఏ, ఎస్ఎంసీ సభ్యులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వరదరాజులకు విశేష పూజలు


విశేష అలంకరణతో వరద రాజ స్వామి మూలవిరాట్

క్రిష్ణగిరి: తాలూకా కేంద్రం సూళగిరి కొండ కింద భాగంలో వెలసిన వరద రాజస్వామి ఆలయ కుంభాభిషేకం గురువారం ఘనంగా జరిగింది. 500 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆలయ కమిటీ, స్థానిక ప్రజలు, దేవాదాయశాఖ పునరుద్ధరణ గావించారు. గురువారం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పుణ్యజలాలను తీసుకొచ్చి మహా కుంభాభిషేకోత్సవం జరిపించారు. ఈ కార్యక్రమంలో సూళగిరి, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకొన్నారు.

చిన్నబ్యాడపల్లిలో గ్రామసభ

క్రిష్ణగిరి: సూళగిరి తాలూకా ఇమ్మిడినాయకనపల్లి గ్రామపంచాయతీ చిన్నబ్యాడపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ శరయు నేతృత్వంలో గ్రామసభ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా జిల్లాలోని 333 గ్రామ పంచాయతీల్లో గ్రామసభ సమావేశాలు నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు. తాగునీరు, రోడ్ల వసతులపై వివరణలు సేకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో అధికార్లు మహాదేవన్, పచ్చయప్పన్, మురుగన్, ఉమాశంకర్, మల్లయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా...

పెట్టుబడులు తెస్తాం.. ఉద్యోగాలిస్తాం

స్వాతంత్ర్య వేడుకల్లో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్



కాకినాడ సిటీ: యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలనేది లక్ష్యమని, దానికి అనుగుణంగా పెట్టుబడులు తీసుకొచ్చి పరిశ్రమలు నెలకొల్పేలా రాష్ట్రాన్ని తయారు చేస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. గురువారం కాకినాడ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్యదినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వేల కోట్లు వెచ్చించి రాష్ట్రవ్యాప్తంగా అన్ని రహదారుల నిర్మాణాలు చేపడతామని ఆయన చెప్పారు. రాష్ట్రంలో ఉపాధి హామీ పథకాన్ని సమర్థంగా వినియోగించుకునేలా 13,326 గ్రామ పంచాయతీల్లో సభలు నిర్వహించి తీర్మానాలు చేయిస్తామన్నారు.

ఐకమత్యాన్ని పరిరక్షించుకోవాలి

ఏపీ బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి



సాక్షి, అమరావతి : ఐకమత్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. గురువారం స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆమె ఆవిష్కరించారు. అనంతరం 'బీజేపీ వారధి' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇకపై నిత్యం పార్టీ కార్యాలయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్, మీడియా ఇన్‌చార్జ్ పాతూరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలకు కట్టుబడి ఉన్నాం

మంత్రి నారా లోకేశ్



సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గుంటూరు పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ జెండాను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని, ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తామన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమని, మహిళలకు త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం కాబోతోందని చెప్పారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఆర్థిక సాయం. ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేల సాయం అందిస్తామన్నారు.

'ఎస్సీ చౌదరులు'

తన ప్రసంగంలో మంత్రి నారా లోకేశ్ పలు మార్లు తడబడ్డారు. ప్రసంగ పాఠాన్ని మొత్తం చదవకుండా.. తనకు అనుకూలంగా ఉన్న వాక్యాలను చదువుకుంటూ వెళ్లారు. ఉద్యాన పంటలకు బదులుగా ఉద్యమ పంటలు అని చదివారు. ఆగస్టు నెలలో పెన్షన్ల రూపంలో రూ.111 కోట్లకు బదులుగా నూట పదకొండు రూపాయలు అందించామని చెప్పారు. జాతీయ ఉపాధి హామీ పథకానికి 29 లక్షల పని దినాలను నిర్దేశించామని చెప్పడానికి బదులుగా 29 పనిదినాలు కల్పించబోతున్నామని చదివారు. ఎస్సీ, ఎస్టీ సోదరులు అని చదవడానికి బదులు ఎస్సీ చౌదరులు అన్నారు.

ఏపీ భవన్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

సాక్షి, న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరిగింది. గురువారం ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర, దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. అదనపు రెసిడెంట్ కమిషనర్ హిమాన్షు కౌశిక్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ భవన్‌లో మువ్వన్నెల రెపరెపలు

సాక్షి, అమరావతి : విజయవాడ ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మిన్) కేఎస్ బ్రహ్మానంద రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం, ప్రజారవాణా వ్యవస్థను పటిష్టపరిచేందుకు ఆర్టీసీ ఉద్యోగులు కృషిచేయాలని ఉద్బోధించారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 47 మంది ఉద్యోగులకు ఆయన ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీలు పి.చంద్రశేఖర్, జీవీవీ రవి వర్మలతోపాటు పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

జాతీయ జెండాను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్



మువ్వన్నెల జెండాను ఎగురవేస్తున్న వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఇక్కడ జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతిపిత మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు, విడదల రజిని, కారుమూరి నాగేశ్వరరావు, మేరుగు నాగార్జున, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్ రెడ్డి, మల్లాది విష్ణు, ఫైబర్‌నెట్ మాజీ చైర్మన్ పూనూరు గౌతమ్ రెడ్డితో పాటు పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మనందరికీ స్వేచ్ఛా వాయువులు పంచిన రోజు


రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన వైఎస్ జగన్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ''ప్రతి భారతీయుడి హృదయం గర్వంతో నిండే రోజు.. బానిస సంకెళ్లను తెంచుకున్న రోజు.. మనందరికీ స్వేచ్ఛా వాయువులు పంచిన రోజు ఈ రోజు. రాష్ట్ర ప్రజలందరికీ 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధులందరికీ మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తున్నాను'' అంటూ గురువారం ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

సత్వర న్యాయం కోసం సంస్కరణలు

స్వాతంత్ర్య దినోత్సవాల్లో హైకోర్టు సీజే జస్టిస్ ఠాకూర్

సాక్షి, అమరావతి: సామాన్యులకు సత్వర న్యాయాన్ని అందించడంలో జాప్యాన్ని, అవరోధాలను అధిగమించేందుకు న్యాయ వ్యవస్థలో పలు సంస్కరణలను అమలు చేస్తున్నామని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ చెప్పారు. గురువారం హైకోర్టులో నిర్వహించిన 78వ స్వాతంత్ర్య దినోత్సవాల్లో జస్టిస్ ఠాకూర్ జాతీయ జెండా ఎగురవేశారు. అంతకు ముందు ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల స్వాతంత్ర్యోద్యమాల్లో భారతదేశ స్వాతంత్ర్యోద్యమం ఎంతో ప్రత్యేకమైనదన్నారు. పేదరికం, నిరక్షరాస్యత, సైబర్ నేరాలు, ఉగ్రవాదం, ప్రకృతి విపత్తులు, పర్యావరణ మార్పులు వంటి సవాళ్లను విజయవంతంగా అధిగమిస్తూ మన దేశం పురోగతి వైపు పరుగులు పెడుతోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఎస్.ద్వారకనాథరెడ్డి, అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కిలిగినీడి చిదంబరం, అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) ఇవన సాంబశివ ప్రతాప్, రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, హైకోర్టు న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి నన్నపనేని శ్రీహరి పాల్గొన్నారు.



జాతీయ పతాకానికి వందనం చేస్తున్న హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్



జాతీయ పతాకానికి వందనం చేస్తున్న జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ నాగార్జునరెడ్డి

లోకాయుక్తలో..

కర్నూలు (సెంట్రల్, అగ్రికల్చర్): దేశ స్వాతంత్రం కోసం పోరాడిన మహనీయులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం కర్నూలులోని లోకాయుక్త కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజినీ, రిజిస్ట్రార్ టి.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఏపీఈఆర్‌సీలో..

కర్నూలులోని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీ ఈఆర్‌సీ) భవనంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కమిషన్ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి గురువారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఏపీఈఆర్‌సీ సభ్యులు ఠాకూర్ రాంసింగ్, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

పేదరికాన్ని పీ 4తో తరిమేస్తాం

- 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు
- సూపర్ సిక్స్ హామీలకు కట్టుబడి ఉన్నాం



సాయుధ దళాల వందనాన్ని స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: 'పేదరికం లేని సమాజం మా ప్రభుత్వ విధానం. గతంలో పీ–3 (పబ్లిక్, ప్రైవేటు, పార్ట్‌నర్‌షిప్ విధానంతో సంపద సృష్టించాం. ఇప్పుడు పీ–4 (పీపుల్, పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్ షిప్)తో 'పేదరికాన్ని నిర్మూలిస్తాం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గురువారం విజయవాడలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన 78వ స్వాతంత్ర్య దినోత్సవాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి.. సాయుధ దళాల వందనాన్ని స్వీకరించారు. ఆయన ఏమన్నారంటే..

సూపర్ సిక్స్ హామీలకు కట్టుబడి ఉన్నాం..

సూపర్ సిక్స్ హామీలకు కట్టుబడి ఉన్నాం. తొలి రోజే 5 కీలక అంశాలపై సంతకాలు చేసి మాట నిలబెట్టుకున్నాం. 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ఫైలుపై తొలి సంతకం చేసి నియామక ప్రక్రియ మొదలెట్టాం. సామాజిక పింఛన్లను పెంచి ప్రతి నెలా 1వ తేదీనే వలంటీర్లతో పని లేకుండా ఇంటి వద్దే పంపిణీ చేస్తున్నాం. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించాం.

ఆదాయాన్ని కాదని ఉచిత ఇసుక..

ప్రభుత్వానికి ఆదాయాన్ని వదులుకుని ఉచిత ఇసుక విధానం మొదలు పెట్టాం. మరింత పకడ్బందీగా దీన్ని అమలు చేస్తాం. 3.54 కోట్ల మందికి నైపుణ్య గణన చేపట్టి మెరుగైన ఉపాధి కల్పించేలా కార్యాచరణ అమలు చేస్తాం.

అన్న క్యాంటీన్లకు విరాళాలు

పేదవాడికి పట్టెడన్నం పెట్టాలన్న సంకల్పంతో నేటి నుంచి 100 అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తున్నాం. వీటి సంఖ్యను 203కు పెంచుతాం. పుట్టిన రోజు, పెళ్లి రోజు, శుభకార్యాల సందర్భంగా విరాళాలు ఇచ్చేవారి పేరిట ఆ రోజు అన్న క్యాంటీన్లలో భోజనం పెడతాం.

పోర్టులు-రహదారుల అనుసంధానం

పోర్టులు, ఎయిర్ పోర్టులు, జాతీయ రహదారులను అనుసంధానం చేసి సంపద సృష్టిస్తాం. విజయవాడ, విశాఖపట్నంలో మెట్రో రైల్ ప్రాజెక్టును మళ్లీ పట్టాలు ఎక్కిస్తాం. వంశధార – నాగావళి – గోదావరి – కృష్ణా –పెన్నా నదులను అనుసంధానిస్తాం. కళాశాలల ఖాతాల్లో నేరుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ములు జమ చేసేలా పాత విధానాన్ని పునరుద్ధరిస్తాం. గత ప్రభుత్వం బకాయి పెట్టిన ఆరోగ్యశ్రీ బిల్లులను దశలవారీగా చెల్లిస్తున్నాం. ఎన్టీఆర్ బేబీ కిట్స్'ను తిరిగి ప్రవేశ పెడతాం. మా ప్రభుత్వంలో రాజకీయ కక్ష సాధింపులకు తావులేదు. ఎస్సీల వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం.

100 రోజుల ప్రణాళిక

వచ్చే వంద రోజుల్లో పారిశ్రామికరంగంతో పాటు ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్, ఐటీ అండ్ క్లౌడ్, టెక్స్‌టైల్, టూరిజం పాలసీలు తెస్తున్నాం. సులభతర వాణిజ్యంలో మళ్లీ రాష్ట్రాన్ని అగ్రగామిగా చేస్తాం. మెడ్‌టెక్ జోన్ స్ఫూర్తిగా మరో 100 పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తాం.

రూ.9.74 లక్షల కోట్లకు రాష్ట్ర అప్పులు

రాష్ట్ర అప్పులు రూ.9.74 లక్షల కోట్లకు చేరుకున్నాయి. తలసరి అప్పు రూ.74,790 నుంచి రూ.1,44,336కి పెరిగింది. తలసరి ఆదాయం 13.2 శాతం నుంచి 9.5 శాతానికి తగ్గింది. ద్రవ్యోల్బణం పెరిగింది. పేదవారికి ఉపయోగపడే కార్యక్రమాలేవీ గత ప్రభుత్వం అమలు చేయలేదు.

బాబు మారలేదని రుజువైంది

ప్రజా వ్యతిరేక విధానాలకు ఆయన బ్రాండ్ అంబాసిడర్

- అమలుకాని పథకాలకు స్వాతంత్ర్య వేడుకల్లో శకటాలా?
- సీఎం ప్రసంగంలో సూపర్ సిక్స్ హామీల ఊసేలేదు
- మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నెల్లూరు సిటీ : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలేవీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రస్తావించని సీఎం చంద్రబాబు.. తానేమీ మారలేదని మరోసారి రుజువు చేసుకున్నారని మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు దేశంలోనే బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నెల్లూరులో గురువారం కాకాణి మీడియాతో మాట్లాడుతూ.. టెర్రరిజం, నియంత పాలన గురించి చంద్రబాబు మాట్లాడుతుంటే 'దొంగే దొంగ..' అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. తల్లికి వందనం అంటూ ఈ ఏడాదికి ఎగనామం పెట్టిన పథకానికి స్వాతంత్ర్య వేడుకల్లో శకటం ప్రదర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై తన ప్రసంగంలో ఊసెత్తని చంద్రబాబు, రెడ్‌బుక్ పాలనకే మొగ్గు చూపుతాం అన్నట్లుగా సంకేతాలివ్వడం దారుణమన్నారు. 14 ఏళ్ల సీఎంగా ఒక్క మంచి పనిచేయని ఆయన ఇప్పుడు 16మంది సీనియర్ ఐపీఎస్‌లను వేధిస్తున్నారని.. ఇది సీఎం అనైతిక పాలనకు పరాకాష్ఠ అని కాకాణి మండిపడ్డారు. ఇదే పంథాలో కొనసాగితే చంద్రబాబు నుంచి ప్రజలు స్వాతంత్ర్యం తెచ్చుకునే పరిస్థితి త్వరలోనే వస్తుందని హెచ్చరించారు. ఇక అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నారని.. అందులో భారీ ఫొటోలు నీవి, విరాళాలు ప్రజలవా? అని బాబును ప్రశ్నించారు. పథకాలు ఎత్తేసి, పేదవాడికి పప్పన్నం పెడుతున్నారని.. అది కూడా ప్రభుత్వ సొత్తుతో కాకుండా విరాళాలతో చేయడం విడ్డూరమన్నారు.

రూ.14లక్షల కోట్ల అప్పును నిరూపించాలి..

ఇక రాష్ట్ర అప్పులు రూ.14 లక్షల కోట్లంటూ పదేపదే అబద్ధాలు వల్లించే చంద్రబాబు, దమ్ముంటే వాటిని నిరూపించాలని కాకాణి డిమాండ్ చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు నుంచే, టీడీపీ నేతలు యథేచ్ఛగా ఇసుక దోపిడీ చేస్తున్నారని.. ఏకంగా 40 లక్షల టన్నుల ఇసుకను స్టాక్ యార్డుల నుంచి మాయం చేశారని ఆరోపించారు. మరోవైపు.. రాజధాని అమరావతిని ప్రజల కోసం కాకుండా రియల్ ఎస్టేట్ ధనదాహంతో ఆలోచించారన్నారు.

పవన్ కళ్యాణ్ తన అజ్ఞానాన్ని మరోసారి చాటుకున్నారు

ఇదిలా ఉంటే.. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తన అజ్ఞానాన్ని మరోసారి చాటుకున్నారని కాకాణి ఎద్దేవా చేశారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 2017లో జరిగిన సుగాలి ప్రీతి కేసును, ఇప్పుడు తాజాగా కూటమి ప్రభుత్వం వచ్చాక జరిగిన ముచ్చుమర్రి బాలిక కేసును గత జగన్ ప్రభుత్వానికి ఆపాదించారని గుర్తుచేశారు. తానొక బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉన్నానన్న విషయాన్ని పవన్ మర్చిపోయారని కాకాణి గోవర్ధన్‌రెడ్డి చురకలంటించారు.

■ రాజ్‌భవన్‌లో సందడిగా ఎట్ హోమ్



సాక్షి, అమరావతి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రముఖులకు విజయవాడలోని రాజ్‌భవన్‌లో గురువారం తేనీటి విందు ఇచ్చారు. సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, గుడియా ఠాకూర్ దంపతులతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్న ఈ తేనీటివిందు సందడిగా సాగింది. స్వాతంత్ర్య దినోత్సవంనాడు రాష్ట్రానికి చెందిన ప్రముఖుల గౌరవార్థం గవర్నర్ 'ఎట్ హోమ్' పేరిట తేనేటి విందు ఇవ్వడం సంప్రదాయంగా వస్తోంది. సాయంత్రం 5.30గంటలకు జాతీయ గీతాలాపనతో 'ఎట్ హోమ్' కార్యక్రమం ప్రారంభమైంది. గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వివిధ అంశాలపై కొద్దిసేపు సంభాషించుకున్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు నారా లోకేశ్, కొల్లు రవీంద్ర, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, డీజీపీ తిరుమలరావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరుల పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శకటాలు

- విద్యాశాఖ శకటానికి ప్రథమ బహుమతి
- అలరించిన సాయుధ దళాల కవాతు
- ఉత్తమ సేవలందించిన పోలీస్ అధికారులకు అవార్డుల ప్రదానం



ప్రథమ బహుమతి గెలుచుకున్న విద్యాశాఖ శకటం

సాక్షి, అమరావతి: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గురువారం నిర్వహించిన 78వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో ప్రదర్శించిన ప్రభుత్వ శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వ్యవసాయ, పశుసంవర్ధక, పాఠశాల విద్య, వైద్య ఆరోగ్య శాఖ, మహిళాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమం, పరిశ్రమలు, గృహ నిర్మాణం, సీఆర్‌డీఏ శాఖలు రూపొందిన శకటాలను ఈ వేడుకల్లో ప్రదర్శించారు. అనంతరం నగర ప్రజలు తిలకించేందుకు వీలుగా బందరు రోడ్డు, ఏలూరు రోడ్డులలో శకటాల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో పాఠశాల విద్యాశాఖ 'చంద్రన్న పాలనలో చక్కని చదువులు' పేరుతో రూపొందించిన శకటానికి ప్రథమ బహుమతి లభించింది. 'ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం–రైతు సంతోషమే లక్ష్యం' పేరుతో తయారు చేసిన పశుసంవర్ధక శాఖ శకటం రెండో స్థానంలో, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రదర్శించిన 'స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారత, సంరక్షణ చంద్రన్న ధ్యేయం' శకటం మూడో స్థానంలో నిలిచాయి. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక సాయుధ దళాల కవాతు స్వతంత్ర భారతావని రక్షణ, దేశభక్తి, అమరవీరుల త్యాగ నిరతిని చాటిచెప్పింది. తెలంగాణ రాష్ట్ర 17వ స్పెషల్ పోలీస్ బెటాలియన్,, ఏపీఎన్‌సీసీ బాలబాలికల బృందం పరేడ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకులాల విద్యార్థులు, యూత్ రెడ్‌క్రాస్, మాజీ సైనికుల కవాతులు ప్రశంసలు అందుకున్నాయి. ఏపీఎస్పీ బ్రాస్ బ్యాండ్, ఫైర్‌బ్రాండ్ బృందాల కళాప్రదర్శన ఆకట్టుకుంది. చివరగా అత్యుత్తమ సేవలందించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి సీఎం చంద్రబాబు అవార్డులను ప్రదానం చేశారు.

అమలు చేయని పథకాలకు అతి ప్రచారం.. ప్రథమ బహుమతి!

ప్రభుత్వ శాఖల్లో అమలు చేసిన పథకాలు, వాటి ద్వారా అత్యధికమంది ప్రజలకు మేలు జరిగినప్పుడు మంచి పేరు వస్తుంది. ప్రత్యేక వేడుకల్లో వాటిని అమలు చేసిన శాఖలకు బహుమతులు ఇవ్వడం రివాజు. కానీ, గురువారం విజయవాడలో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో కూటమి ప్రభుత్వం ఇంకా అమలు చేయని పథకాలతో శకటం తయారు చేసి ప్రదర్శించడం, దానికి ప్రథమ బహుమతి ఇవ్వడం విశేషం. గత ప్రభుత్వం అమలు చేసిన 'అమ్మ ఒడి', 'గోరుముద్ద', 'మనబడి: నాడు–నేడు', కౌమార బాలికల కోసం 'స్వేచ్ఛ' వంటి పథకాలు విశేష ప్రజాదరణ పొందడంతోపాటు దేశవ్యాప్తంగా ఎంతో గుర్తింపు తెచ్చుకున్నాయి. ఈ పథకాలకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం', 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర', 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం,' 'మన బడి: మన భవిష్యత్తు', 'బాలికా రక్షా'గా పేర్లు మార్చింది. వీటిలో మధ్యాహ్న భోజనం తప్ప మిగిలిన పథకాలు ఏవీ ఇంకా అమలు చేయలేదు. కానీ 'చంద్రన్న పాలనలో చక్కని చదువులు' పేరుతో వీటన్నింటిని కలిపి విద్యాశాఖ శకటాన్ని రూపొందించి స్వాతంత్ర్య దిన వేడుకల్లో ప్రదర్శించారు. ఈ శకటానికి సీఎం చంద్రబాబు ప్రథమ బహుమతి ప్రదానం చేయడంపై అనేకమంది విద్యారంగ ప్రముఖులే విస్మయం వ్యక్తంచేస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేసిన దోషులను అరెస్ట్ చేయాలి

దళిత సంఘాల డిమాండ్

కాకినాడలో రౌండ్‌టేబుల్ సమావేశం



సమావేశానికి హాజరైన దళిత సంఘాల ప్రతినిధులు

కాకినాడ: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహంపై దాడికి పాల్పడిన దోషులను తక్షణమే అరెస్ట్ చేయాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. నిందితులపై తక్షణ చర్యలు తీసుకోకపోతే దళితులంతా ఏకమై పెద్దఎత్తున ఉద్యమిస్తామని స్పష్టం చేశాయి. కాకినాడలో గురువారం సాయంత్రం వివిధ దళిత సంఘాలకు చెందిన ప్రతినిధులు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. యునైటెడ్ ఎస్సీ, ఎస్టీ ఫోరం, నవభారత్ పార్టీ, జైభీమ్ దళిత యువజన సంఘం, నవసమాజ్ పార్టీలకు చెందిన వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహంపై దాడి ఘటనలో దోషులను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు. ఇటువంటి ఘటన దురదృష్టకరమని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. రాజకీయాలకు అతీతంగా దళిత సంఘాల సభ్యులంతా ఏకమై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉద్యమించాల్సిన అవసరం ఉందని సమావేశం అభిప్రాయపడింది. వివిధ సంఘాల ప్రతినిధులు యు.చంద్రమౌళి, రామేశ్వరరావు, కృష్ణమూర్తి, కుమార్, నూకరాజు, డేవిడ్, ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగ నిర్మాత అంటరానివాడా?

- స్వాతంత్ర్య దినోత్సవానికి అంబేడ్కర్ స్మృతివనాన్ని ఎందుకు అలంకరించలేదు?
- మాజీ మంత్రి మేరుగు నాగార్జున



సాక్షి, అమరావతి/కాకినాడ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి స్వాతంత్ర్య దినోత్సవం నాడు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అంటరానివాడయ్యారా అని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ప్రశ్నించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం విజయవాడను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించి, స్వరాజ్య మైదానంలోని బీఆర్ అంబేడ్కర్ స్మృతివనాన్ని మాత్రం అలంకరించలేదని తెలిపారు. ఇలా ఎందుకు చేశారని ప్రశ్నించారు. అంబేడ్కర్ స్మృతివనాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్ నిర్మించారనే కక్షతోనే ప్రభుత్వం ఇలా అంబేడ్కర్‌పట్ల వివక్ష చూపిందని విమర్శించారు. రాష్ట్రంలో అంబేడ్కర్ భావజాలంపై కూటమి ప్రభుత్వం పథకం ప్రకారం దాడి చేస్తోందని ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద, కాకినాడలో మీడియాతో మాట్లాడుతూ.. గతంలో టీడీపీ హయాంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చిన చంద్రబాబు దానిని అమలు చేయలేకపోయారన్నారు.

సిరి వరాలు



లక్ష్మీదేవి సంపదలనిచ్చే తల్లి. కుచేలుర నుంచి కుబేరుల వరకు అందరికీ ఆమె అనుగ్రహం కావలసిందే. ఉన్నత స్థితి, రాజరికం, అదృష్టం, దాతృత్వం, సముజ్వల సౌందర్యం వంటి ఎన్నో ఉన్నత లక్షణాలు కలిగిన లక్ష్మీదేవి చల్లని చూపు ప్రసరిస్తే సకల సంపదలు పొందగలమనడంలో సందేహం లేదు. శ్రావణ మాసం లక్ష్మీదేవికి చాలా ప్రీతికరమైనది. ఈ మాసంలో వచ్చే శుక్రవారాలు... అందులోనూ రెండవ శుక్రవారమంటే ఇంకా ఇష్టం. ఈ రోజున వరలక్ష్మీవ్రతం చేసుకున్న వారికి సకల సంపదలూ ప్రసాదిస్తుంది ఆ చల్లని తల్లి.

మన ఇంటికి వచ్చిన అతిథిని మనం ఎలా గౌరవాదరాలతో మర్యాదలు చేస్తామో అదేవిధంగా అమ్మవారు మన ఇంటికి వచ్చిందని భావించి, మనసు పెట్టి ఈ వ్రతాచరణ చేస్తే శుభఫలితాలు కలుగుతాయి.

సమకూర్చుకోవలసిన సామగ్రి

పసుపు, కుంకుమ, గంధం, విడి పూలు, పూలమాలలు, తమలపాకులు, వక్కలు, ఖర్జూరాలు, అగరుబత్తీలు కర్పూరం, చిల్లర పైసలు, కండువా, రవికల బట్టలు రెండు, మామిడాకులు, అరటిపండ్లు, ఇతర రకాల పండ్లు ఐదు రకాలు, అమ్మవారి పటం, కలశం, మూడు కొబ్బరి కాయలు, తెల్ల దారం లేదా నోము దారం లేదా పసుపు రాసిన కంకణాలు రెండు, నైవేద్యం కోసం ఓపికను బట్టి ఐదు లేదా తొమ్మిది రకాల స్వీట్లు, బియ్యం, పంచామృతం లేదా పాలు, ఇంకా దీపాలు, గంట, హారతి పళ్లెం, స్పూన్లు, పళ్లేలు, నూనె, వత్తులు, అగ్గిపెట్టె, గ్లాసులు, చిన్న చిన్న గిన్నెలు.

వ్రత విధానం

వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించే రోజున పొద్దున్నే లేచి తలస్నానం చేసి, ఇంటిని శుభ్రం చేసుకోవాలి.

తోరం ఇలా తయారు చేసుకోవాలి

తెల్లటి దారాన్ని ఐదు లేక తొమ్మిది పోగులు తీసుకుని దానికి పసుపు రాసుకోవాలి. ఆ దారానికి ఐదు లేక తొమ్మిది పూలు కట్టి ముడులు వేయాలి. అంటే ఐదు లేక తొమ్మిది పోగుల దారాన్ని ఉపయోగించి, ఐదు లేక తొమ్మిదో పువ్వులతో ఐదులేక తొమ్మిది ముడులతో తోరాలను తయారుచేసుకుని, పీఠం వద్ద ఉంచి పుష్పాలు, పసుపు, కుంకుమ, అక్షతలు వేసి, తోరాలను పూజించి ఉంచుకోవాలి. ఆ విధంగా తోరాలను తయారు చేసుకున్న తరువాత పూజకు సిద్ధంకావాలి.

ఇంట్లోని పూజామందిరంలో ఒక మండపాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఈ మండపం పైన బియ్యపు పిండితో ముగ్గువేసి, కలశం ఏర్పాటు చేసుకోవాలి. అమ్మవారి ఫొటో అమర్చుకోవాలి. పూజాసామగ్రిని అంతా సిద్ధం చేసుకోవాలి. తోరాలు ముందుగానే సిద్ధం చేసుకుని ఉంచాలి. అక్షతలు, పసుపు గణపతిని కూడా సిద్ధంగా ఉంచుకోవాలి. ఇవన్నీ దగ్గర లేకపోతే పూజమీద మనసు నిలపడం కష్టం అవుతుంది..

ముందుగా గణపతి పూజ చేసుకోవాలి.

వక్రతుండ మహాకాయ కోటి సూర్య సమప్రభ
నిర్విఘ్నం కురుమేదేవో సర్వ కార్యేషు సర్వదా
ఆగచ్ఛ వరసిద్ధ వినాయక, అంబికా ప్రియనందన
పూజాగృహాణ సుముఖ, నమస్తే గణనాయక

గణపతిపై అక్షతలు చల్లాలి. యథాశక్తి పూజ చేసి, స్వామికి పళ్ళుగానీ బెల్లం ముక్క గానీ నివేదించాలి. తర్వాత వినాయకునికి నమస్కరించి పూజ చేసిన అక్షతలు శిరస్సున ధరించాలి. ఆ తర్వాత కలశం ఉంచి అమ్మవారిని ధ్యాన ఆవాహనాది షోడశ ఉపచారాలతో పూజించాలి. మహాలక్ష్మీ అష్టోత్తరం చదువుకోవాలి. అనంతరం తోరపూజ చేసుకుని, 'బధ్నామి దక్షిణే హస్తే నవ సూత్రం శుభప్రదం పుత్రపౌత్రాభివృద్ధ్యంచ మమ సౌభాగ్యం దేహిమే రమే' అని చదువుకుంటూ కుడిచేతికి తోరం కట్టుకోవాలి. ఆ తర్వాత వరలక్ష్మీ వ్రత కథ చదువుకొని అక్షతలు వేసుకుని, అమ్మవారికి ఐదు లేదా తొమ్మిది రకాల



స్త్రీలలోని సృజనకు దర్పణం ఈ వ్రతం

అది ఎలాగంటే ఆ రోజున ఒక మంచి పెద్ద కొబ్బరికాయకి కీరు కళ్లు, ముక్కు, చెవులు, నోరు తీర్చిదిద్ది తగిన ఆభరణాలతో అలంకరించి మరీ వరలక్ష్మిని సృజిస్తారు.

పిండివంటలు నైవేద్యం పెట్టాలి. ముత్తయిదువులకు తాంబూలాలు ఇచ్చిన తర్వాత పూజ చేసిన వారు తీర్థప్రసాదాలు స్వీకరించి, పేరంటాళ్లు అందరికీ తీర్థప్రసాదాలు ఇవ్వాలి. తర్వాత బంధుమిత్రులతో, పూజకు వచ్చిన వారితో కలిసి కూర్చుని భోజనం చేయాలి. రాత్రికి ఉపవసించాలి.

ఇక్కడ ఒక విషయం చెప్పుకుందాం. అదేమంటే అమ్మవారికి ఐదు లేదా తొమ్మిది పిండివంటలు నివేదించాలి అన్నారు కదా అని ఎంతో శ్రమ పడి. ఓపిక లేకపోయినా అన్నీ చేయనక్కర లేదు. పులిహోర, పరమాన్నం, పూర్ణాలు, చలిమిడితోపాటు పానకం, వడపప్పు, అరటిపండ్లు, సెనగలు వంటి వాటిని కూడా లెక్కలోకి తీసుకోవచ్చు.

ప్రేమ కానుక

షాజహాన్‌కు భార్య పై ఉన్న ప్రేమ పాలరాతి తాజ్‌మహల్‌లో ప్రతిఫలించింది. మెటా బిలియనీర్ మార్క్ జుకర్ బర్గ్ విషయానికి వస్తే... భార్యపై ఆయనకున్న ప్రేమ ఇంటి పెరట్లోని సుందరమైన నీలిరంగు విగ్రహంలో ప్రతిఫలిస్తోంది. రొమాంటిక్ హావభావాలతో కూడిన భార్య ప్రిస్కిల్లా చాన్ భారీ విగ్రహాన్ని ఇంటి పెరట్లో ఏర్పాటు చేశాడు జుకర్ బర్గ్. ఆ విగ్రహం పక్కన నిలబడి ఫొటో దిగి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ఈ విగ్రహం చిత్రాలు ఇంటర్‌నెట్ సెన్సేషన్‌గా మారాయి...

జుకర్ బర్గ్... ప్రేమ మార్క్



● ప్రిస్కిల్లా విగ్రహం



● భార్య ప్రిస్కిల్లాతో మార్క్ జుకర్ బర్గ్

ఫేస్‌బుక్ విజయం గురించి చెప్పుకోవడం కంటే తన ప్రేమ విజయం గురించి చెప్పుకోవడం అంటేనే మార్క్ జుకర్ బర్గ్‌కు ఇష్టం. ప్రిస్కిల్లా చాన్‌తో ఎలా పరిచయం అయింది, ఆ పరిచయం ఎలా ప్రేమగా మారింది కథలు కథలుగా చెబుతుంటాడు. అవి ఎప్పుడో జరిగినట్లుగా ఉండవు. నిన్నా మొన్న జరిగినట్లుగానే ఉంటాయి. అది అతడి మాటల చాతుర్యం కాదు. ప్రేమలోని మాధుర్యం!

19 మే, 2012 అనేది జుకర్ బర్గ్, చాన్‌లకు మరచిపోలేని సుదినం. కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో వారి వివాహం జరిగింది. ఈ ఔట్‌డోర్ వెడ్డింగ్‌లోని విశేషం ఏమిటంటే... పెళ్లి నాటి ప్రమాణాలను కాగితాల రూపంలో ఇరువురు ఇచ్చిపుచ్చుకున్నారు. జుకర్‌బర్గ్ చాన్‌కు ఇచ్చిన పేపర్‌లో ఇలా రాసి ఉంది.... 'ఇప్పుడు ఎంత సంతోషంగా ఉన్నామో... ఎప్పుడూ ఇలాగే' అదృష్టవశాత్తు ఆ సంతోషం ఇప్పటివరకు వారికి దూరం కాలేదు. 'మార్క్ అప్పుడు ఎంత ప్రేమతో ఉన్నాడో ఇప్పుడూ అంతే. అప్పుడు ఎలా నవ్వించేవాడో ఇప్పుడూ అంతే' అంటూ భర్త గురించి మురిపెంగా చెబుతుంటుంది ప్రిస్కిల్లా చాన్.

ఏడు అడుగుల సిల్వర్ అండ్ బ్లూ ప్రిస్కిల్లా చాన్ విగ్రహం వారి బలమైన ప్రేమ బంధానికి ప్రతీకలా కనిపిస్తోంది. ప్రవహిస్తున్నట్లుగా కనిపించే వెండి వస్త్రం విగ్రహాన్ని మరింత ఆకర్షణీయం చేసింది. ఈ విగ్రహం కోసం న్యూయార్క్‌కు చెందిన ఆర్టిస్ట్, ఆర్కిటెక్చర్, శిల్పి డేనియల్ అర్షమ్‌ను సంప్రదించాడు మార్క్. విగ్రహం ఎలా ఉండాలి? అనే దాని గురించి ఇద్దరి మధ్య ఎన్నోరోజుల పాటు చర్చలు జరిగాయి.

చాన్ విగ్రహం పుణ్యమా అని 'ఎవరీ డేనియల్' అనే శోధన మొదలైంది. ఈ డేనియల్‌కు 'ఇన్‌స్టాగ్రామ్ శిల్పి' అని పేరు. డ్యాన్స్, డిజైన్, ఆర్కిటెక్చర్, ఆర్ట్‌ను మిక్స్ చేసిన కళాకారుడిగా పేరు తెచ్చుకున్నాడు. ఎన్నో పెద్ద ప్రాజెక్ట్‌లకు పని చేశాడు. 'భార్య విగ్రహాన్ని నెలకొల్పే రోమన్ సంప్రదాయాన్ని తీసుకువద్దాం' అని ఇన్‌స్టాగ్రామ్‌లో రాశాడు జుకర్ బర్గ్.

టీ సేవిస్తూ తన విగ్రహం దగ్గర ఫొటో దిగిన ప్రిస్కిల్లా చాన్ ఆ ఆర్ట్‌వర్క్‌ను 'అద్భుతం' అని ప్రశంసించింది.

ఏడు అడుగుల ప్రిస్కిల్లా చాన్ విగ్రహంపై సోషల్ మీడియాలో భిన్నమైన స్పందనలు కనిపిస్తున్నాయి. భార్యపై మార్క్ జుకర్‌బర్గ్‌కు ఉన్న ప్రేమను ఎంతోమంది ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. నీలిరంగులో ఉన్నందుకు కావచ్చు... కొందరు మాత్రం ఈ విగ్రహాన్ని అవతార్ క్యారెక్టర్‌లతో పోలుస్తూ జోక్‌లు పేలుస్తున్నారు. ఎవరి మాట ఎలా ఉన్నా... ప్రిస్కిల్లా చాన్ విగ్రహం ఇంటర్‌నెట్‌లో హల్‌చల్ చేస్తోంది.

కన్నీళ్లు తుడిచే విగ్రహం



● భార్య విగ్రహంతో తాపస్

'భార్య విగ్రహాన్ని నెలకొల్పే రోమన్ సంప్రదాయాన్ని తీసుకువద్దాం' అని జుకర్ బర్గ్ అంటున్నాడుగానీ మన వాళ్లు ఆ పని ఎప్పుడో చేశారు. చేస్తున్నారు! కోల్‌కత్తాకు చెందిన 65 సంవత్సరాల తాపస్ అనే రిటైర్డ్ సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగి 2.5 లక్షలు ఖర్చు చేసి తన భార్య ఇంద్రాణి సిలికాన్ స్టాచ్యూను ఇంట్లో ఏర్పాటు చేసుకున్నాడు. జీవకళ ఉట్టిపడే ఈ విగ్రహంతో తాపస్ ఎన్నోసార్లు మాట్లాడుతుంటాడు. తన భార్య చనిపోలేదని, విగ్రహం రూపంలో ఇంట్లోనే ఉంది అనుకొని దుఃఖానికి దూరం అయ్యాడు. తాపస్‌లాంటి భర్తల కథలు మన దేశ నలుమూలలా ఉన్నాయి.

మై వార్డ్‌రోబ్

హుందాగా... కంఫర్ట్‌గా!

వేడుకలకు, ప్రత్యేక రోజుల్లో రెడీ అవడానికి ప్రతీ ఒక్కరూ తమదైన స్టైల్‌ని డ్రెస్సింగ్‌లో చూపుతుంటారు. హైదరాబాద్ ఎల్.బినగర్‌లో ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని చందనామారం తన డ్రెస్సింగ్ గురించీ, వార్డ్రోబ్ విషయాలను ఈ విధంగా షేర్ చేసుకున్నారు.



''జాబ్, స్కూల్‌కి వెళ్లే ఇద్దరు పిల్లలు, ఫ్యామిలీతో టైమ్ అసలు సరిపోదు. అయితే మనకోసం మనం కొంచెం టైమ్ అయినా ఉండేలా చూసుకోవాలి అనుకుంటాను. నలుగురిలోకి వెళ్లినప్పుడు ప్రత్యేకంగా కనిపించడానికి, అదే విధంగా నా బడ్జెట్ ప్రకారం డ్రెస్సింగ్ ఉండేలా ఎంపిక చేసుకుంటాను.

హుందాగా...

ఆఫీస్‌కి వెళ్లేటప్పుడు డిగ్నిఫైడ్‌గానూ, కంఫర్ట్‌గానూ ఉండేలా చూసుకుంటాను. అందుకు కుర్తీలు, జీన్స్ ఉంటాయి. వీటిలోనే మిక్స్ అండ్ మ్యాచ్‌కి ట్రై చేస్తుంటాను.

డిజైనర్ శారీస్

రిసెప్షన్ వంటి వేడుకలకు డిజైనర్ శారీస్‌ను ఎంచుకుంటాను. జనరల్‌గా మార్కెట్‌లో వస్తున్న ట్రెండ్స్‌ను కూడా ఫాలో అవుతుంటాను. వీటిలో నాకు ఎలాంటి ఔట్‌ఫిట్ అయితే బాగుంటుందో చెక్ చేస్తుంటాను. స్టిచింగ్‌కు సంబంధించినప్పుడు ఇన్‌స్టా పేజీలు కూడా చూస్తుంటాను. అలాంటి డిజైన్స్ చేయమని బొటిక్స్‌లో చెబుతుంటాను. శారీకి తగినట్టు బ్లౌజ్ సెట్ చేయడానికి డిజైనర్ హెల్ప్ తీసుకుంటాను.



తక్కువ బడ్జెట్‌లో బెటర్‌లుక్

పెళ్లి, ఇంట్లో పండగలు వంటి సందర్భాలలో మనదైన సంప్రదాయ కట్టునే ఇష్టపడతాను. దీనికోసం ఎక్కడైనా శారీస్ కలెక్షన్ గురించి కూడా తెలుసుకుంటాను. కొన్నిచోట్ల నచ్చినా బడ్జెట్ మించి ఉంటే తీసుకోను. అయితే, అవే మోడల్స్‌లో మరో చోట ఒకటికి బదులు రెండు చీరలు వచ్చేలా ఎంపిక చేసుకోవడం గురించి ఆలోచిస్తుంటాను. తక్కువ బడ్జెట్‌లో మంచి డ్రెస్సింగ్ ఉండేలా చూసుకుంటాను. సాధారణంగా ఎక్కువ డబ్బులు పెట్టి కొన్న చీరలు, డ్రెస్సులు వేసుకుంటే నలుగురిలో వెళ్లినప్పుడు మన అప్పీరియన్స్ బాగుంటుంది అనుకుంటారు. కానీ, తక్కువ బడ్జెట్‌లో బెటర్‌గా కనిపించేలా ప్లాన్ చేసుకోవడం మంచిది'' అని వివరిస్తున్నారు ఈ ఉద్యోగిని.





నోట్: మీరూ మీ వార్డ్‌రోబ్ లేదా మీ అమ్మాయి వార్డ్‌రోబ్ గురించి, డ్రెస్సింగ్ విషయంలో తీసుకుంటున్న విశేషాల గురించి ఫొటోలతో సహా 'సాక్షి' పాఠకులతో పంచుకోవచ్చు. బాగున్న వాటిని మై వార్డ్‌రోబ్ శీర్షికన ప్రచురిస్తాం.

మా చిరునామా: మై వార్డ్‌రోబ్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి, రోడ్ నం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ -34.
sakshifamily3@gmail.com

బ్యూటిప్స్



➡ గ్రీన్ టీ తాగిన తర్వాత పడేసే డిప్ బ్యాగ్‌తో ముఖాన్ని తుడవాలి. ముఖంపై ఉన్న దుమ్ము, మృతకణాలు తొలగిపోతాయి. ప్రతి రోజూ ఇలా చేయడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది.

➡ పెదవులపై మృతకణాలు తొలగిపోయి, మృదువుగా ఉండాలంటే పంచదార పొడిని అద్ది, మృదువుగా రబ్ చేయాలి.

➡ వేడినీళ్లతో స్నానం చేయడం వల్ల చర్మంపై ఉండే సహజ నూనెలు తగ్గిపోతాయి. అందుకని, గోరువెచ్చని నీటిని ఉపయోగించాలి.

తెలుగింటి వెలుగులు



అమ్మానాన్నలు వెంట లేకుండానే... టీచర్లు తోడు లేకుండానే ఈ అమ్మాయిలు ధైర్యంగా దేశం దాటి చైనా వెళ్లారు. శాస్త్ర సాంకేతిక సదస్సులో 38 దేశాల నుంచి హాజరైన బృందాలలో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించారు. తెలుగు వారి తెలివితేటలను నిరూపించుకున్నారు. అంతర్జాతీయ ప్లాట్‌ఫారంపై అదరగొట్టారు. భావి శాస్త్రవేత్తలుగా భళా అనిపించుకున్నారు. ఎంచక్కా తిరిగి వచ్చారు. తమ అనుభవాలను సాక్షితో సంతోషంగా పంచుకున్నారు. ఇంతకూ ఎవరా అమ్మాయిలు..?

ఆంధ్రప్రదేశ్, కాకినాడకు చెందిన సాయిశ్రీ శ్రుతి చిట్టూరి, లక్ష్మీ ఆశ్రిత నామ, సంజన పల్లా, వైష్ణవి వాకచర్లలకు అంతర్జాతీయ వేదికపై భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం వచ్చింది. చైనీస్ అసోషియేషన్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ, చైనా ఎడ్యుకేషన్ క్యాంప్ రెగ్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన యూత్ సైన్స్ టెక్నాలజీ వర్క్‌షాపులో ఈ స్టూడెంట్స్ పాల్గొన్నారు. సదస్సులో పాల్గొని ఇటీవలే తిరిగి వచ్చారు.

ఎనిమిదో ఏడు

చైనా ఏటా ప్రపంచ స్థాయిలో 2017 నుంచి సైన్స్ అండ్ టెక్నాలజీ వర్క్‌షాపు నిర్వహిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో వివిధ దేశాలు, వివిధ భాషలు, సంస్కృతి, సంప్రదాయాలు, ఆలోచనలను పంచుకోవాలి. అలా భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని అందిపుచ్చుకున్నారీ అమ్మాయిలు.

భావి శాస్త్రవేత్తలకు దిక్సూచి: విశ్వం ఆవిర్భావం నుంచి నేటివరకూ ప్రపంచంలో చోటు చేసుకున్న మార్పులపై నిరంతరం పరిశోధనలు కొనసాగడం ఈ వర్క్‌షాపు లక్ష్యం. ఈ వర్క్‌షాపు లో ఎంపీసీ స్టూడెంట్స్ (శృతి, వైష్ణవి) 'చేజింగ్ ద సన్' అంశాన్ని, బైపీసీ స్టూడెంట్స్ (లక్ష్మీ ఆశ్రిత, సంజన) ఫాజిల్స్‌ను ఎంపిక చేసుకున్నారు. వివిధ దేశాల నుంచి ఎంపికైన వారితో తమ అభిప్రాయాలను పంచుకుని విజయవంతంగా తిరిగి వచ్చారు.

ఆలోచనలను పంచుకున్నాం



దక్షిణాఫ్రికా, నేపాల్, ఆస్ట్రేలియా, మంగోలియా తదితర దేశాల విద్యార్థినుల పరిశోధన అంశాలపై ఆలోచనలు పంచుకోవడానికి మాకు మంచి అవకాశం వచ్చింది. ముఖ్యంగా ఒకే వయస్సు వాళ్లం ఒక చోట చేరి ఎంపిక చేసుకున్న అంశాలపై విశ్లేషించుకోవడానికి ఈ సదస్సు ఉపకరించింది.

- వైష్ణవి. ఎంపీసీ విద్యార్థిని, కాకినాడ

పురాతన జీవశాస్త్రంపై పరిశోధన



ఈ వర్క్‌షాపు ద్వారా వివిధ ప్రాంతాల విశిష్టత, ఆయా ప్రాంతాల్లో జీవరాశుల స్వభావం, స్థితిగతులపై ప్రాథమికంగా కొంత అవగాహన ఏర్పరుచుకోగలిగాం. భవిష్యత్తులో శాస్త్రవేత్తలం కావాలనే మా సంకల్పానికి ఈ వర్క్‌షాపు కచ్చితంగా ఉపయోగమే.

- సంజన, బైపీసీ విద్యార్థిని, కాకినాడ

- లక్ష్మింశెట్టి శ్రీనివాస రావు, సాక్షి, కాకినాడ
ఫొటోలు: తలాటం సత్యనారాయణ

వరలక్ష్మీ వ్రతం అనగానే ముందుగా అందరికీ గుర్తొచ్చేది పూర్ణాలూ బొబ్బట్లే. ఆ తర్వాతే తక్కినవన్నీ. ఎందుకంటే ఏ పూజ అయినా పూర్ణంతోనే పరిపూర్ణం అవుతుందని పెద్దలు చెబుతారు. ఈ వేళ అమ్మవారికి పూర్ణాలు, భక్ష్యాలను నివేదిద్దాం.

భక్తి నివేదన

పూర్ణాలు



కావలసినవి: పచ్చిశనగ పప్పు – అర కేజీ, బెల్లం – అరకేజీ, యాలక్కాయలు – పది, బియ్యం – రెండు కప్పులు, పొట్టుతీసిన మినప గుళ్లు – కప్పు, ఉప్పు – రుచికి సరిపడా, ఆయిల్ – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ● ముందుగా మినప పప్పు, బియ్యాన్ని శుభ్రంగా కడిగి ఆరుగంటల పాటు నానబెట్టుకోవాలి. శనగ పప్పుని కూడా కడిగి గంట పాటు నానబెట్టాలి. ● నానిన బియ్యం, మినప పప్పులని మెత్తగా రుబ్బి పక్కన పెట్టుకోవాలి. ● నానిన శనగపప్పుని కుకర్‌లో వేసి రెండు గ్లాసులు నీళ్లుపోసి మూడు విజిల్స్ రానివ్వాలి. ● ఉడికిన శనగ పప్పులో బెల్లం వేసి మెత్తగా గరిటతో తిప్పుతూ దగ్గర పడేంత వరకు ఉడికించి, యాలుక్కాయల పొడి వేసి తిప్పి దించేయాలి. ● శనగపప్పు మిశ్రమం చల్లారాక, ఉండలుగా చుట్టుకోవాలి. ● బియ్యం, మినపగుళ్ల పిండిలో కొద్దిగా ఉప్పు వేసి కలపాలి. ఇప్పుడు శనగ పప్పు ఉండలను ఈ పిండిలో ముంచి ఆయిల్‌లో డీప్ ఫ్రై చేయాలి. ● మీడియం మంట మీద బంగారు రంగులోకి మారేంత వరకు వేయిస్తే తియ్యని పూర్ణాలు రెడీ.

భక్ష్యాలు



కావలసినవి: పచ్చిశనగ పప్పు – రెండు కప్పులు, బెల్లం తురుము – రెండు కప్పులు, యాలకుల పొడి – రెండు టేబుల్ స్పూన్లు, మైదా – రెండు కప్పులు, గోధుమ పిండి – మూడు టేబుల్ స్పూన్లు, నెయ్యి – అరకప్పు, నీళ్లు – కప్పు, ఉప్పు – చిటికెడు.

తయారీ: ● ముందుగా శనగ పప్పుని శుభ్రంగా కడిగి రెండు గంటలపాటు నానబెట్టాలి. ● నానిన పప్పుని కుకర్‌లో వేసి, రెండు కప్పుల నీళ్లు పోసి మూత పెట్టి మూడు విజిల్స్ రానివ్వాలి. ఇంతకు మించి ఉడికించకూడదు. ● ఉడికిన తరువాత నీళ్లు తీసేసి పప్పుని పక్కన పెట్టుకోవాలి. ● మైదాలో గోధుమ పిండి, టేబుల్ స్పూను నెయ్యి, కప్పు నీళ్లుపోసి పిండిని ముద్దలా కలుపుకోని పక్కనపెట్టుకోవాలి. ● శనగ పప్పుని కూడా మెత్తగా రుబ్బుకోవాలి. ● మందపాటి పాత్రలో బెల్లం తురుము, అరకప్పు నీళ్లు పోసి సన్నని మంట మీద ఉడికించాలి. ● మధ్య మధ్యలో కలియ తిప్పుతూ రుబ్బుకున్న శనగపప్పు, యాలకుల పొడి వేసి కలిపి, పదినిమిషాల పాటు ఉడికించాలి. ● ఉడికిన మిశ్రమాన్ని నిమ్మకాయ సైజు పరిమాణంలో ఉండలుగా చుట్టుకుని పక్కన పెట్టుకోవాలి. ● అల్యూమినియం ఫాయిల్‌పైన కొద్దిగా నెయ్యి రాసుకుని కలిపి పెట్టుకున్న మైదా పిండిని చిన్న ఉండలుగా చేసుకుని చపాతీలా చేత్తో వత్తుకోవాలి. ● ఈ చపాతీలో శనగపప్పు ఉండని పెట్టి చపాతీ మొత్తం చుట్టి పూరీలా వత్తుకోవాలి. ● పెనం మీద నెయ్యి వేసి రెండు వైపులా బంగారు రంగులోకి మారేంత వరకు కాల్చితే భక్ష్యాలు రెడీ.

● గేమింగ్

అడుగడుగునా అంతులేని ధైర్యం



మల్టీప్లేయర్ ఆన్‌లైన్ రోల్-ప్లేయింగ్ గేమ్ 'వరల్డ్ క్రాఫ్ట్: ది వార్ విత్‌ఇన్' ఈ నెల 26న విడుదల కానుంది. 'వరల్డ్ ఆఫ్ వార్‌క్రాఫ్ట్'కు ఎక్స్‌పాన్షన్ ప్యాక్‌గా వస్తున్న గేమ్ ఇది. 2004లో వచ్చిన 'వరల్డ్ ఆఫ్ వార్‌క్రాఫ్ట్'లో ప్లేయర్ 'క్యారెక్టర్ అవతార్'ను క్రియేట్ చేసి థర్డ్ లేదా ఫస్ట్-పర్సన్ వ్యూ నుంచి ఓపెన్ గేమ్ వరల్డ్‌ను ఎక్స్‌ప్లోర్ చేయాల్సి ఉంటుంది. ఇక 'ది వార్ విత్‌ఇన్' విషయానికి వస్తే...ఈ గేమ్‌లో ఖాజ్ అల్గార్ అనేది ప్రైమరీ సెట్టింగ్. ది ఇజెల్ ఆఫ్ డోర్న్, ది రింగింగ్ డీప్స్, హాలోఫాల్, అజి-కహెట్ అనే నాలుగు జోన్‌లుగా విభజించబడి ఉంటుంది.ఈ గేమ్‌లో 'డైనమిక్ ఫ్లైయింగ్' అనే ఫీచర్ ఉంది. న్యూ గేమ్స్‌ను ఎక్స్‌ప్లోర్ చేయడానికి ఇది ఉపయోగపడుతుంది.

సిరీస్: వార్‌క్రాఫ్ట్; **ప్లాట్‌ఫామ్:** విండోస్, మ్యాక్‌వోఎస్; **మోడ్:** మల్టీప్లేయర్

జానర్: ఎంఎంఆర్‌పీజీ (మాస్‌ప్లీ మల్టీప్లేయర్ ఆన్‌లైన్ రోల్-ప్లేయింగ్ గేమ్)

యువర్స్

English Idioms

జంప్ ఆన్ ది బ్యాండ్‌వాగెన్

ఫ్యాషనబుల్, ప్రాఫిటబుల్‌గా ఉందనే కారణంతో ఒక పని లేదా వ్యాపారం చేయడానికి ముందుకు రావడం....మొదలైన సందర్భాలలో వాడే మాట జంప్ ఆన్ ది బ్యాండ్ వాగెన్. **ఉదా:** మై ఫ్రెండ్స్ ఆర్ అబ్సెస్‌డ్ విత్ బయింగ్ ఐఫోన్, బట్ ఐ రిఫ్యూజ్ టు గెట్ ఆన్ ది బ్యాండ్‌వాగెన్.

● ఏఐ ఏరియా



ఏఐ గర్ల్‌ఫ్రెండ్స్ వస్తున్నారహో!

'**నా**కు ఒక్క గర్ల్‌ఫ్రెండ్ కూడా లేదు' అని ఇక ముందు బాధపడ నక్కర్లేదు. ఎందుకంటే ఇప్పుడు ఏఐ గర్ల్‌ఫ్రెండ్ ట్రెండ్ నడుస్తోంది. ఈ గర్ల్ ఫ్రెండ్స్‌తో హాయిగా సంభాషించవచ్చు. మనసులోని భావాలను పంచుకోవచ్చు. సలహాలు అడగవచ్చు. ఫొటోలు దిగవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా యువతలో ఎంతోమంది ఒంటరితనంలో బాధపడుతున్నారు. డిప్రెషన్ బారిన పడుతున్నారు. అలాంటి వారికి ఈ ఏఐ గర్ల్‌ఫ్రెండ్స్ స్నేహహస్తాన్ని చాస్తున్నాయి.

'నాకంటూ ఒకరు ఉన్నారు' అని భరోసా ఇస్తున్నాయి. ఏఐ డేటింగ్, ఏఐ గర్ల్‌ఫ్రెండ్స్...లాంటి స్టార్టప్‌లు యూత్‌ను పలకరిస్తున్నాయి. 'వోస్లీ ఫ్యాన్స్' స్టార్టప్ ఇప్పటికే దూసుకుపోతుంది. 'వేర్‌యాజ్'లోని సౌలభ్యం ఏమిటంటే యూజర్లు ఐడియల్ వర్చువల్ గర్ల్‌ఫ్రెండ్‌ను క్రియేట్ చేసుకోవచ్చు.

ఏఐ గర్ల్‌ఫ్రెండ్ చాట్-బాట్‌తో మరో మనిషితో మాట్లాడుతున్నట్లే కృత్రిమ గర్ల్‌ఫ్రెండ్‌తో సహజమైన భాషలో మాట్లాడవచ్చు. అడ్వాన్స్‌డ్ మోడల్స్ ఆఫ్ ఏఐలో 'ఏఐ గర్ల్‌ఫ్రెండ్ సిమ్యులేటర్' ఒకటి. దీనిలో త్రీడి టెక్నాలజీ, ఏఆర్, వర్చువల్ రియాలిటీ ఫీచర్‌లు ఉంటాయి. మోస్ట్ రియలిస్టిక్ ఎక్స్‌పీరియన్స్‌ను యూజర్‌లకు చేరువ చేయడం ఏఐ గర్ల్ ఫ్రెండ్ చాట్-బాట్ లక్ష్యం.

● టెక్... టాక్



రియల్‌మీ జీ7 6టీ

సైజ్	: 6.78 అంగుళాలు
రిజల్యూషన్	: 2780× 1264 పిక్సెల్స్
ఫ్రంట్ కెమెరా	: 32 ఎంపీ
బ్యాటరీ	: 5, 500 ఎంఏహెచ్
ర్యామ్	: 6జీబి, 8జీబి, 12జీబి
స్టోరేజ్	: 128జీబి/256 జీబి/512 జీబి

హానర్ మ్యాజిక్ ప్యాడ్ 2



సైజ్	: 12.3 అంగుళాలు
రిజల్యూషన్	: 2,560×1,600 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్	: 144 హెచ్‌జడ్
బ్యాటరీ	: 10,050 ఎంఏహెచ్
మెమోరీ	: 8/256 జీబి, 12/256 జీబి 16/512 జీబి

లెనొవో ట్యాబ్ ప్లస్

సైజ్	: 11 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్	: 90 హెచ్‌జడ్
రిజల్యూషన్	: 1200×2000 పిక్సెల్స్
● బరువు	: 650గ్రా.
బ్యాటరీ	: 8600 ఎంఏహెచ్
ఇంటర్నల్ స్టోరేజ్	: 256జీబి

● 8 జేబీఎల్ స్పీకర్స్



● మల్టీ టాలెంట్

50 యాప్స్.. 1000 డిజైన్‌లు

పిల్లల లోకంలో కార్టూన్‌లు, కార్టూన్‌ల లోకంలో పిల్లలు ఉంటారు. ఎంతోమంది పిల్లల లాగే సిద్ధిత మొహంతికి కార్టూన్‌లు అంటే బోలెడు ఇష్టం. ఆ ఇష్టం వినోదానికే పరిమితమై పోలేదు. సాంకేతిక విషయాలపై ఆసక్తికి దారి తీసింది. ఆ దారి తనను ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ దగ్గరికి తీసుకువెళ్లింది. బెంగళూరుకు చెందిన పదిహేనేళ్ల సిద్ధిత పదమూడేళ్ల వయసులోనే స్టార్టప్ మొదలు పెట్టేలా చేసింది...



పదమూడు సంవత్సరాల వయసులో 'బ్లూమ్ రిద్ధి సిద్ధి' స్టార్టప్‌కు శ్రీకారం చుట్టింది సిద్ధిత మొహంతి. గ్రాఫిక్ డిజైనింగ్, కంప్యూటర్ లిటరసీకి సంబంధించిన స్టార్టప్ ఇది. తల్లిదండ్రులు సిద్ధితకు లాప్‌టాప్ కొనివ్వడంతో అది తన ప్రయోగాలకు వేదిక అయింది. మొదట్లో యూట్యూబ్‌లో కార్టూన్ వీడియోలు మాత్రమే చూసేది. ఆ తరువాత ఆమె ఆసక్తి సాంకేతిక విషయాలపై మళ్లింది. డిజిటల్ డిజైన్ అనేది పాషన్‌గా మారింది. డిజిటల్ డిజైనింగ్ అనే కోర్సు ఉంటుందని తెలియని వయసులోనే సొంతంగా డిజైన్‌లు చేసి అందరూ 'వావ్' అనేలా చేసేది. బొమ్మలు గీయడంలోనూ సిద్ధితకు మంచి నైపుణ్యం ఉంది.

బెంగళూరులోని సిద్ధిత చదివే 'ఆర్చిడ్స్ ది ఇంటర్నేషనల్ స్కూల్' బాగా ప్రోత్సహించింది. 'లాక్‌డౌన్ టైమ్ అనేది నాకు గోల్డెన్ టైమ్' అంటున్న సిద్ధిత ఆ ఖాళీ సమయాన్ని బాగా సద్వినియోగం చేసుకుంది. 'నా గురించి నేను బాగా తెలుసుకోవడానికి, ఇంకా ఏం చేయవచ్చు అని ఆలోచించడానికి ఆ ఖాళీ సమయం నాకు ఉపయోగపడింది' అంటుంది సిద్ధిత. తన స్కిల్స్‌ను మెరుగుపరుచుకోవడానికి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, లైఫ్ స్కిల్స్, వెబ్ డిజైన్, కోడింగ్, రొబోటిక్స్, పబ్లిక్ స్పీకింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, స్పోకెన్ ఇంగ్లీష్....మొదలైన ఎన్నో కోర్సులు చేసింది. ఈ కోర్సులన్నీ పూర్తి చేసిన తరువాత ఏదైనా సాధించాలనే తపన సిద్ధితలో మొదలైంది. ఇప్పటి వరకు 50 యాప్స్, 1,000 త్రీడీ డిజైన్‌లు క్రియేట్ చేసింది. జాతీయ, అంతర్జాతీయ ఒలింపియాడ్స్‌లో పాల్గొంది. ఒక సమావేశంలో పాల్గొన్న సిద్ధితకు చిన్న వయసులోనే ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా ప్రయాణం ప్రారంభించిన ఎంతో మందితో మాట్లాడే అవకాశం వచ్చింది. వారి మాటల నుంచి స్ఫూర్తి పొంది తాను కూడా స్టార్టప్ మొదలు పెట్టింది. పదమూడేళ్ల వయసులో 'గర్ల్ ప్రాడిజీ ఆఫ్ ది ఇయర్'గా ఎంపికైంది. సాంకేతిక విషయాలలో ప్రతిభ చూపుతున్న సిద్ధితకు సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనడం అంటే ఇష్టం. గ్రాఫిక్ డిజైనింగ్‌తో పాటు రచనలు చేయడం, కరాటే, క్రికెట్ అంటే సిద్ధితకు ఇష్టం. మెడిసిన్ చదవాలనేది ఆమె కల. 'సూపర్ సిద్ధి' పేరుతో పుస్తకం రాసే పనిలో ఉంది.

● లేటెస్ట్

ఎడోబ్ ఎక్స్‌ప్రెస్‌లో కొత్త ఫీచర్‌లు

ఎడోబ్ ఎక్స్‌ప్రెస్(ఎడ్యుకేషన్)లో జనరేట్ టెక్స్ట్ ఎఫెక్ట్, జనరేట్ ఇమేజ్, జనరేటివ్ ఫిల్‌లాంటి ఏఐ పవర్డ్ ఫీచర్‌లు ఉన్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులకు మరింత ఉపయోగపడే విధంగా 'ఎడోబ్ ఎక్స్‌ప్రెస్'ను అప్‌డేట్ చేస్తున్నట్లు ప్రకటించింది ఎడోబ్. క్రియేటివిటికి ఉపయోగపడేలా ఈ ఏఐ ఫీచర్‌లను డిజైన్ చేశారు. వీటితో టెంప్లెట్‌లు, బ్రోచర్‌లు, ఫ్లైయర్స్, ఒరిజినల్ కలరింగ్ పేజీలు జనరేట్ చేయవచ్చు. విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని యానిమేషన్ ఫీచర్‌లు తీసుకురానుంది ఎడోబ్.

● సమ్‌థింగ్ స్పెషల్

'ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరు ఊహించెదరు' అంటూ 'లవకుశ' పాట గుర్తుకొచ్చినా సరే, ఊహించడం కష్టమేమీ కాదు అంటుంది ది సింప్సన్. ఆర్థిక, సామాజిక. సాంస్కృతిక... ఇలా పలురంగాలకు సంబంధించిన భవిష్యత్ పరిణామాలను ప్రసిద్ధ యానిమేషన్ సిరీస్ 'ది సింప్సన్' ఊహించింది. గతంలో ఊహించిన వాటిలో కొన్ని నిజం అయ్యాయి.



జోకులేస్తూ... జోస్యం చెబుతూ!

'**ది** సింప్సన్' ఊహించిన వాటిలో కొన్ని నిజం కావడంతో 'సింప్సన్' మోడ్రన్ నోస్ట్రడామస్‌గా పేరు తెచ్చుకుంది. ఈ యానిమేటెడ్ కామెడీ సిరీస్ అమెరికన్ సాంస్కృతిక, సామాజిక పరిణామాలపై హాస్యంతో కూడిక వ్యాఖ్యానాలు చేయడమే కాదు జోస్యం కూడా చెబుతుంటుంది.

2000 సంవత్సరంలో ప్రసారమైన 11వ సీజన్‌లోని 17వ ఎపిసోడ్‌లో లీసా సింప్సన్ యూఎస్ మొదటి మహిళా అధ్యక్షురాలిగా రికార్డ్ సృష్టిస్తుంది. 'ఆ ప్రెసిడెంట్ ఎవరో కాదు కమలా హారిసే' అంటున్నారు ఇప్పుడు చాలా మంది. టీవీ సిరీస్‌లోని అమెరికా ప్రెసిడెంట్ కమలా హారిస్ ధరించే దుస్తులను పోలిన దుస్తులలో(ప్యాంట్‌స్యూట్) కనిపిస్తుంది. మెడలో ముత్యాల నెక్లెస్...సేమ్ టు సేమ్! కమలా హారిస్‌ను అలనాడే డెమోక్రాట్ అభ్యర్థిగా ప్రిడిక్ట్ చేయడంపై 'ది సింప్సన్' షో రైటర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఏఐ జీన్ గర్వంగా ఫీలవుతూ 'ది సింప్సన్స్ ప్రిడిక్షన్. ఐయామ్ ప్రౌడ్ టు బీ ఏ పార్ట్ ఆఫ్' అంటూ పోస్ట్ చేశాడు. 'ఈ పదవిని



గతంలో ఒక రియల్ ఎస్టేట్ మొఘల్ నిర్వహించాడు' అనే మాట ఈ ఎపిసోడ్‌లో వినిపిస్తుంది. గతంలో అమెరికా అధ్యక్షుడిగా పని చేసిన డోనాల్డ్ ట్రంప్ రియల్ ఎస్టేట్ మొఘల్ కావడం గమనార్హం.

'ఇలా జరగనుంది' అని సింప్సన్ వ్యంగ్యంగానో, సూచన ప్రాయంగానో చెప్పిన విషయాలు కొన్ని నిజం అయ్యాయి.

రియల్ ఎస్టేట్‌లో ఉన్న వారు అమెరికా అధ్యక్ష బరిలోకి వస్తారని, స్మార్ట్ వాచ్‌ల వినియోగం బాగా పెరుగుతుందని, ట్వంటీయత్ సెంచరి ఫాక్స్‌ను డిస్నీ కొనుగోలు చేస్తుందని, ఆర్థికవేత్త బెంగ్ ఆర్ హోమ్‌స్ట్రోమ్ నోబెల్ బహుమతి గెలుచుకుంటాడని...ఇలాంటి అంచనాలు నిజం అయ్యాయి.

మరికొన్ని.... ● రిచర్డ్ బ్రాన్సన్ స్పేస్ ఫ్లైట్ (2021)ని 2015 సంవత్సరంలో సీజన్ 25, ఎపిసోడ్ 15లో ప్రిడిక్ట్ చేశారు ● జనవరి 6, 2021లో జరిగిన యూఎస్ క్యాపిటల్ అల్లర్లకు సంబంధించిన దృశ్యం 1996లో వచ్చిన సీజన్ 7, ఎపిసోడ్ 18 (ది డే ది వయోలెన్స్ డైడ్)లో కనిపిస్తుంది. ● 2003లో జరిగిన ఒక లైవ్ పెర్‌ఫార్మెన్స్‌లో సిగ్‌ఫ్రీడ్, రాయ్ అనే మ్యాజిషియన్‌లపై పులి దాడి చేసింది. 1993లో ప్రసారమైన సీజన్ 5, ఎపిసోడ్ 10లో ఇలాంటి దృశ్యమే కనిపిస్తుంది.

● యూఎస్ మెన్ కర్లింగ్ టీమ్ 2018లో వింటర్ ఒలింపిక్స్‌లో తొలిసారిగా బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఈ విజయాన్ని సీజన్ 21, ఎపిసోడ్ 12లోనే ఊహించారు.

సినిమా

వినాయక చవితికి భలే ఉన్నాడే!



● రాజ్ తరుణ్, మనీషా కంద్కూర్

రాజ్ తరుణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'భలే ఉన్నాడే!'. ఈ చిత్రంలో మనీషా కంద్కూర్ హీరోయిన్‌గా నటించారు. జె. శివ సాయి వర్ధన్ దర్శకత్వంలో మారుతి టీమ్ సమర్పణలో రవికిరణ్ ఆర్ట్స్ బ్యానర్‌పై ఎన్వీ కిరణ్ కుమార్ నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమాను వినాయక చవితి సందర్భంగా సెప్టెంబరు 7న రిలీజ్ చేయనున్నట్లుగా చిత్రబృందం గురువారం అధికారికంగా ప్రకటించింది. ''ఇప్పటికే రిలీజైన టీజర్, సాంగ్స్‌కు మంచి స్పందన లభించింది. సినిమా కూడా ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. సింగీతం శ్రీనివాస్, అమ్ము అభిరామి, లీలా శాంసన్, వీటీవీ గణేశ్, హైపర్ ఆది, కృష్ణ భగవాన్, గోపరాజు రమణ, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: నగేశ్ బానెల్లా.

విలేజ్ పాలిటిక్స్ షురూ



● సంపద, విశ్వక్ సేన్, వశిష్ఠ

హీరో విశ్వక్ సేన్ కెరీర్‌లోని 13వ సినిమా ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. 'ఎవ్రీ యాక్షన్ ఫైర్స్ ఎ రియాక్షన్' అన్నది ఉపశీర్షిక. ఈ చిత్రంలో కన్నడ బ్యూటీ సంపద హీరోయిన్‌గా నటించనున్నారు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాతో శ్రీధర్ గంటా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎల్‌ఎస్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మించనున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవంలో ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వశిష్ఠ క్లాప్ ఇవ్వగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కెమెరా స్విచాన్ చేశారు. నిర్మాతలు నాగవంశీ, సాహు గారపాటి స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందజేశారు. ఈ చిత్రంలో విశ్వక్ సేన్ పోలీసాఫీసర్‌గా నటించనున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూట్‌ను సెప్టెంబరులో ఆరంభించనున్నామని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: కిశోర్ కుమార్.



● చిరంజీవి

శంకర్ దాదా వస్తున్నాడు

శంకర్ దాదాగా చిరంజీవి మరోసారి ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేయడానికి వస్తున్నారు. ఆయన హీరోగా జయంత్ సి. పరాన్జీ దర్శకత్వం వహించిన చిత్రం 'శంకర్ దాదా ఎంబీబీఎస్' (2004). ఈ సినిమాలో సోనాలీ బింద్రే హీరోయిన్‌గా నటించగా, శ్రీకాంత్ ఏటీఎం పాత్రలో సందడి చేశారు. కామెడీ అండ్ ఎమోషనల్ మూవీగా రూపొందిన 'శంకర్ దాదా ఎంబీబీఎస్' దాదాపు ఇరవై ఏళ్ల తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నెల 22న చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా జీఆర్‌కే పిక్చర్స్ ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తోంది. ''సంజయ్ దత్ హీరోగా నటించిన హిందీ మూవీ 'మున్నాభాయ్ ఎంబీబీఎస్'కి తెలుగు రీమేక్‌గా రూపొందిన చిత్రం 'శంకర్ దాదా ఎంబీబీఎస్'. ఈ మూవీలో తన నటనతో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించారు చిరంజీవి. అలాగే భావోద్వేగ సన్నివేశాల్లో కూడా అందరి మనసుని హత్తుకునేలా నటించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించింది. ఈ నెల 22న ఎక్కువ థియేటర్స్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని జీఆర్‌కే పిక్చర్స్ ప్రతినిధులు తెలిపారు.

దసరాకి పొట్టేల్



● 'పొట్టేల్' పోస్టర్

దసరాకి థియేటర్స్‌లోకి 'పొట్టేల్' రానుంది. యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పొట్టేల్'. నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగె ఈ చిత్రాన్ని నిర్మించారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రాన్ని దసరా పండక్కి రిలీజ్ చేయనున్నట్లుగా గురువారం చిత్రయూనిట్ వెల్లడించింది. ''పొట్టేల్' సినిమా తెలంగాణ నేపథ్యంలో ఉంటుంది. దీంతో దసరాకు ఈ సినిమా రిలీజ్ అనేది అడ్వాంటేజ్ అవుతుందని ఆశిస్తున్నాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: మోనిష్ భూపతి రాజు.



● శ్రీలీల

నిజమేనా?

తెలుగులో స్టార్ హీరోయిన్‌గా దూసుకెళుతున్న శ్రీలీల బాలీవుడ్ ఎంట్రీ గురించి అప్పుడప్పుడు వార్తలు వస్తూనే ఉన్నాయి. వరుణ్ ధావన్, ఇబ్రహీం అలీ ఖాన్ (సైఫ్ అలీఖాన్ తనయుడు) హీరోలుగా రూపొందుతున్న హిందీ సినిమాల్లో శ్రీలీల హీరోయిన్ అనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. కానీ ఈ విషయాలపై ఆయా చిత్రబృందాలు ఇప్పటివరకూ అధికారిక ప్రకటన చేయలేదు. కాగా శ్రీలీలకు మరో హిందీ చిత్రంలో హీరోయిన్‌గా నటించే అవకాశం లభించిందట. హీరో సిద్ధార్థ్ మల్హోత్రా, దర్శకుడు బల్విందర్ సింగ్ కాంబినేషన్‌లో ఓ హిందీ సినిమా రానుందని సమాచారం. ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్రకు మేకర్స్ శ్రీలీల పేరును పరిశీలిస్తున్నారని, త్వరలో ఈ విషయంపై స్పష్టత రానుందని టాక్. మరి.. సిద్ధార్థ్ మల్హోత్రాతో శ్రీలీల జోడీ కట్టనున్నారనే వార్త నిజమేనా? అనేది తెలియాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే.

సైనికుల గొప్పతనంతో...



● పోటు నాగబాబు, గోపీచంద్. నందిరెడ్డి శ్రీనివాసరావు

సంతోష్ కల్వచెర్ల, పావని రామిశెట్టి జంటగా నటించిన చిత్రం 'జై జవాన్'. తనికెళ్ల భరణి, సత్యప్రకాశ్, నాగినీడు, సంజనా చౌదరి ఇతర పాత్రల్లో నటించారు. నాగబాబు పోటు దర్శకత్వంలో ఈశ్వరీ కుమారి సమర్పణలో నందిరెడ్డి శ్రీనివాసరావు, పోసం మధుసూదన్ రెడ్డి, పోటు వెంకటేశ్వర్లు ఈ సినిమా నిర్మించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ని దర్శకుడు గోపీచంద్ మలినేని విడుదల చేసి, మాట్లాడుతూ- ''జై జవాన్' కాన్సెప్ట్ నచ్చింది. ట్రైలర్ చూస్తుంటే దేశభక్తి నేపథ్యంలో రూపొందిన చిత్రంగా ఉంటుందని తెలుస్తోంది. ఈ సినిమా విజయం సాధించాలి '' అన్నారు. ''దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో సైనికుల గొప్పతనం గురించి తెలియజేశాం. సంతోష్ కల్వచెర్ల అద్భుతంగా నటించారు'' అని నిర్మాతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎవరీ దర్శకుడు అని ఆశ్చర్యపోయాను

\- సందీప్ కిషన్

''**చె**న్నైలో 'పార్కింగ్' సినిమా చూసి ఎవరీ దర్శకుడు అని ఆశ్చర్యపోయా. ఆ సినిమా డైరెక్టర్ బండి సరోజ్ కుమార్ అని తెలిసి, ఫేస్ బుక్‌లో వెతికి మరీ తనతో టచ్‌లోకి వెళ్లాను. మనం ఇండస్ట్రీలోకి గెలవడానికి మాత్రమే రాము.. ఇదొక ప్రయాణం. ప్రేక్షకుల అభిమానం పొందడానికి ట్రై చేస్తుంటాం. సరోజ్ కుమార్ ఎంతో నిజాయతీగా తీసిన 'పరాక్రమం' సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అని హీరో సందీప్ కిషన్ అన్నారు. బండి సరోజ్ కుమార్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'పరాక్రమం'. బీఎస్‌కే మెయిన్ స్ట్రీమ్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన 'పరాక్రమం' ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌కి సందీప్ కిషన్, నిర్మాత ఎస్‌కేఎస్ అతిథులుగా హాజరయ్యారు. బండి సరోజ్ కుమార్ మాట్లాడుతూ– ''ప్రతి సాధారణ పౌరుడికి కనెక్ట్ అయ్యే సినిమా ఇది. మన జీవితాల్లో హీరోలు ఉంటారు, విలన్లూ ఉంటారు. ఎన్నో భావోద్వేగాలు ఉంటాయి. అవన్నీ తెరపై చూసుకున్నట్లు మా సినిమా ఉంటుంది'' అన్నారు.



● సరోజ్ కుమార్, సందీప్ కిషన్

హారర్... థ్రిల్



● వెంకట సాయి

తెలంగాణలోని కరీంనగర్‌కి చెందిన వెంకట సాయి గుండ ప్రధాన పాత్రలో నటించిన హాలీవుడ్ చిత్రం 'ది డిజర్వింగ్'. తన స్నేహితులు విస్మయ్ కుమార్ కోతోపల్లి, తిరుమలేశ్ గుండ్రత్ సహకా రంతో వెంకట సాయి గుండ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 1న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ''సైకాలజికల్ హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన సినిమా 'ది డిజర్వింగ్'. చిన్నతనంలో జరిగే పరిస్థితులు, గృహ హింస, సైకాలజికల్ సమస్యలపై వినూత్నంగా తెరకెక్కించాం. ఇందులో మూగవాడిగా నటించాను. మా సినిమా ఇప్పటికే పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమై అవార్డులు గెలుచుకుంది. అలాగే బెస్ట్ యాక్టర్‌గా అంతర్జాతీయ వేదికలపై నేను అవార్డులు అందుకున్నాను'' అని చెప్పారు వెంకట సాయి గుండ.

బాల కార్మిక వ్యవస్థపై పోరాటం



● సుధాకర్ గౌడ్

సమ్మెట గాంధీ, సత్య ఎర్ర, మాస్టర్ గగన్, బేబీ అక్షర, గీతా గోవింద్, అభినవ్, చరణ్ నటించిన చిత్రం 'అభినవ్'. శ్రీలక్ష్మి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ సమర్పణలో భీమగాని సుధాకర్ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు భరత్ భూషణ్, నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, నిర్మాత దామోదర్ ప్రసాద్ అతిథులుగా పాల్గొన్నారు. ట్రైలర్‌ను భరత్ భూషణ్ రిలీజ్ చేశారు. ''సత్య అనే మాఫియా డాన్ గ్రామీణ ప్రాంతాల్లోని హరిజన, గిరిజన విద్యార్థులతో గంజాయి స్మగ్లింగ్ చేయిస్తుంటాడు. ఉపాధ్యాయురాలు భారతి ద్వారా ప్రేరణ పొందిన కొందరు బాల బాలికలు డ్రగ్ మాఫియాను ఎలా అంతం చేశారు? అనేది కథ. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రధానాంశం'' అన్నారు సుధాకర్ గౌడ్.

సర్దార్ సీక్వెల్‌లో...



● రజీషా

'**స**ర్దార్' స్పై టీమ్‌లో చేరారు హీరోయిన్ రజీషా విజయన్. కార్తీ హీరోగా పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో రూపొందిన స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'సర్దార్' (2022) మంచి హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం కార్తీ, మిత్రన్ కాంబినేషన్‌లోనే 'సర్దార్'కి సీక్వెల్‌గా 'సర్దార్ 2' తెరకెక్కుతోంది. ఎస్‌జే సూర్య, మాళవికా మోహన్, ఆషికా రంగనాథ్ ఈ చిత్రంలో ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. హీరోయిన్ రజీషా విజయన్ మరో లీడ్ రోల్‌లో నటించనున్నట్లు గురువారం మేకర్స్ తెలిపారు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

సాక్షి బిజినెస్

శుక్రవారం
16-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (బుధవారం ముగింపు)		
సెన్సెక్స్ ▲	150	79,106
నిఫ్టీ ▲	5	24,144

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	17,565	▲	372
డోజోన్స్	4,0514	▲	506
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,347	▲	66
డాక్స్	18,183	▲	298
షాంఘై	2,877	▼	27
నికాయ్	36,726	▲	284

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో (బుధవారం ముగింపు)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
70,793	▲	394
బంగారం (99.5 స్వచ్ఛత)		
70,510	▲	348
వెండి (కిలో)		
80,921	▲	219

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.51	84.53
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	106.74	109.32
€	యూరో	ఒకటి	91.16	93.54
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	56.64	57.93
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.41	56.34
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.05	66.21
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.97	23.75
¥	చైనా యువాన్	ఒకటి	10.89	12.71



5 డోర్ల థార్ 'రాక్స్'

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్స్ (ఎస్‌యూవీ) అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్న మహీంద్రా అయిదు డోర్ల థార్ రాక్స్ భారత్‌లో ఎంట్రీ ఇచ్చింది. ప్రారంభ ధర ఎక్స్‌షోరూంలో రూ.12.99 లక్షలు. సెప్టెంబర్ 14 నుంచి టెస్ట్ డ్రైవ్ కోసం రాక్స్ అందుబాటులో ఉంటుంది. అక్టోబర్ 3 నుంచి బుకింగ్స్ ప్రారంభం. దసరా నుంచి డెలివరీలు ఉంటాయి. 2 లీటర్ ఎం-స్టాలియన్ టీజీడీఐ పెట్రోల్ ఇంజన్, 2.2 లీటర్ ఎం-హాక్ డీజిల్ ఇంజన్ ఆప్షన్స్‌లో ఆరు వేరియంట్లలో రేర్ వీల్ డ్రైవ్, 4 వీల్ డ్రైవ్ డ్రైవ్‌ట్రెయిన్‌తో లభిస్తుంది. 6 స్పీడ్ మాన్యువల్ లేదా ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఎంచుకోవచ్చు. 360 డిగ్రీ కెమెరా, పనోరమిక్ సన్‌రూఫ్, 10.25 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, 6 ఎయిర్‌బ్యాగ్స్, కీ లెస్ ఎంట్రీ, పుష్ బటన్ స్టార్ట్, 644 లీటర్స్ బూట్ స్పేస్ వంటి హంగులు ఉన్నాయి.

ప్రారంభ ధర రూ.12.99 లక్షలు



భారత్‌లోకి బీఎస్‌ఏ ఎంట్రీ

ప్రారంభ ధర రూ.2.99 లక్షలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మహీంద్రా గ్రూప్‌నకు చెందిన మోటార్‌సైకిల్స్ బ్రాండ్ బీఎస్‌ఏ భారత్‌లో అడుగు పెట్టింది. గోల్డ్‌స్టార్ 650 మోడల్‌తో ఎంట్రీ ఇచ్చింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.2.99 లక్షల నుంచి రూ.3.34 లక్షల వరకు ఉంది. 45.6 పీఎస్ పవర్, 55 ఎన్ఎం టార్క్‌తో 652 సీసీ లిక్విడ్ కూల్డ్ ఇంజన్, 5 స్పీడ్ ట్రాన్స్‌మిషన్‌తో తయారైంది. 12 లీటర్ల ఫ్యూయల్ ట్యాంక్, బ్రెంబో బ్రేక్స్, డ్యూయల్ చానెల్ ఏబీఎస్, 12వీ సాకెట్, యూఎస్‌బీ చార్జింగ్ పోర్ట్ వంటి హంగులు ఉన్నాయి. డెలివరీలు ప్రారంభం అయ్యాయి. పాతతరం ద్విచక్ర వాహన తయారీ దిగ్గజాల్లో బీఎస్‌ఏ ఒకటి. మహీంద్రా గ్రూప్ కంపెనీ క్లాసిక్ లెజెండ్స్ 2016లో బీఎస్‌ఏను కైవసం చేసుకుంది. యూకే సంస్థ బర్మింగమ్ స్మాల్ ఆమ్స్ కంపెనీ (బీఎస్‌ఏ) 1861లో ప్రారంభం అయింది. తొలి బైక్‌ను 1910లో విడుదల చేసింది.



ఓలా ఈ-బైక్స్ వచ్చేశాయ్

ఒక్క చార్జింగ్ తో 579 కిలోమీటర్లు
ధర 74,999 నుంచి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీలో ఉన్న ఓలా ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్స్ విభాగంలోకి ప్రవేశించింది. రోడ్‌స్టర్, రోడ్‌స్టర్ ఎక్స్, రోడ్‌స్టర్ ప్రో వేరియంట్లను ప్రవేశపెట్టింది. 2.5–16 కిలోవాట్ అవర్ బ్యాటరీ సామర్థ్యంతో తయారయ్యాయి. ధర రూ.74,999 నుంచి మొదలై రూ.2,49,999 వరకు ఉంది. 2025 దీపావళి నుంచి డెలివరీలు ప్రారంభం అవుతాయి. ఒకసారి చార్జింగ్‌తో వేరియంట్‌నుబట్టి 200 నుంచి 579 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. టాప్ స్పీడ్ గంటకు 124–194 కిలోమీటర్లు. కాగా, క్విక్ కామర్స్‌లోకి ఓలా ఎంట్రీ ఇచ్చింది. ఇందుకోసం ఓలా క్యాబ్స్ కాస్తా ఓలా కన్జూమర్ అయింది. అలాగే ఓలా పే పేరుతో యూపీఐ సేవలను సైతం కంపెనీ ఆవిష్కరించింది. అనుబంధ కంపెనీ కృత్రిమ్ ఏఐ 2026 నాటికి ఏఐ చిప్‌ను ప్రవేశపెట్టనుంది.



కరకర@ 50,000 కోట్లు!

యునైటెడ్ 'స్నాక్స్' ఆఫ్ ఇండియా!

- స్నాక్స్ మార్కెట్‌ను కొల్లగొడుతున్న దేశీ కంపెనీలు
- సాంప్రదాయ 'బ్రాండెడ్' రుచులకు జనాల లొట్టలు...
- పాశ్చాత్య పొటాటో చిప్స్ వంటి వాటికి దీటుగా వ్యాపారం
- సగం వాటా సాంప్రదాయ ప్యాకేజ్డ్ స్నాక్స్‌దే...
- హల్దీరామ్స్, బాలాజీ, బికాజీ జోరు..

కరకరలాడే సేవ్ భుజియా, వేయించిన పల్లీలు, బఠానీలు, మిక్చర్, జంతికలు ఇలా ఒకటేమిటి.. సాంప్రదాయ చిరుతిళ్లను ఇప్పుడు ఐదు, పది రూపాయల ప్యాకెట్లలో భారతీయులు లొట్టలేసుకుంటూ తినేస్తున్నారు. పొటాటో చిప్స్ ఇతరత్రా పాశ్చాత్య స్నాక్స్ హవాకు సాంప్రదాయ, బ్రాండెడ్ ప్యాకేజ్డ్ స్నాక్స్ గండికొడుతున్నాయి. విదేశీ, దేశీ కంపెనీలు మారుమూల ప్రాంతాల జనాలకు సైతం ఈ ప్యాకేజ్డ్ స్నాక్స్‌ను అందిస్తూ మార్కెట్‌ను భారీగా విస్తరించేందుకు పోటీ పడుతున్నాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

సాల్టెడ్ స్నాక్స్ మార్కెట్ విలువ	15 శాతం
రూ. 50,800 కోట్లు	వార్షికంగా అమ్మకాల వృద్ధి

ఇందులో సాంప్రదాయ స్నాక్స్ వాటా 56 శాతం

దేశీయంగా సాల్టెడ్ స్నాక్స్ అమ్మకాలు గత ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.50,800 కోట్లకు ఎగబాకాయి. కరోనా మహమ్మారి తర్వాత భారతీయ స్నాక్స్ వాటా క్రమంగా జోరందుకుంటూ వస్తోంది. ప్రస్తుతం మొత్తం స్నాక్స్ మార్కెట్లో సాంప్రదాయ రుచుల వాటా 56 శాతానికి చేరుకోవడం దీనికి నిదర్శనం. ఐదు, పది రూపాయల చిన్న ప్యాకెట్ల రూపంలో రకరకాల దేశీ రుచులన్నీ లభించడంతో పాటు విదేశీ స్నాక్స్ రకాలతో పోలిస్తే కొంత ఎక్కువ పరిమాణం కూడా ఉంటుండటం దేశీ స్నాక్స్ జోరుకు ప్రధాన కారణంగా నిలుస్తోందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. 'భారతీయులు ఎక్కువగా సాంప్రదాయ రుచులనే ఇష్టపడతారు. ఇప్పుడిది స్నాక్స్ మార్కెట్లో కూడా ప్రతిబింబిస్తోంది' అని బికనీర్‌వాలా ఫుడ్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సురేశ్ గోయెల్ పేర్కొన్నారు. ఈ సంస్థ దేశవ్యాప్తంగా సాంప్రదాయ రెస్టారెంట్ల నిర్వహణతో పాటు బికానో బ్రాండ్‌తో స్నాక్స్ ప్యాకెట్లను కూడా విక్రయిస్తోంది.


హల్దీరామ్స్ హవా...

ప్రస్తుతం దేశంలో ఏ మారుమూలకెళ్లినా హల్దీరామ్స్ పేరు తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదేమో! మిక్చర్ పొట్లం, పల్లీల ప్యాకెట్ నుంచి రకరకాల ఉత్తరాది, దక్షిణాది రుచులతో సాంప్రదాయ స్నాక్స్‌కు పర్యాయపదంగా మారిపోయింది ఇది. హల్దీరామ్స్ దాదాపు 25% మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో ఉంది. 2023–24లో కంపెనీ విక్రయాలు 18% ఎగసి రూ.12,161 కోట్లకు చేరాయి. పెప్సికో స్నాక్స్ అమ్మకాలు 14% పెరిగి రూ. 7,336 కోట్లుగా నమోదయ్యాయి. గుజరాత్‌కు చెందిన బాలాజీ వేఫర్స్ సేల్స్ 12% వృద్ధితో రూ.5,931 కోట్లకు దూసుకెళ్లడం విశేషం. భారతీయ స్నాక్స్ మార్కెట్ జోరుతో విదేశీ కంపెనీల ఇక్కడ ఫోకస్ పెంచాయి. హల్దీరామ్స్‌ను చేజిక్కించుకోవడానికి అమెరికా ప్రైవేటు ఈక్విటీ (పీఈ) దిగ్గజం బ్లాక్‌స్టోన్ రంగంలోకి దిగినట్లు టాక్. 51% మెజారిటీ వాటా కోసం బ్లాక్‌స్టోన్ రూ. 40,000 కోట్లను ఆఫర్ చేసినట్లు సమాచారం. హల్దీరామ్స్ విలువను రూ.70,000–78,000 కోట్లుగా లెక్కగట్టినట్లు తెలుస్తోంది.



రెండు దశాబ్దాల క్రితం వాటిదే జోరు...

మొత్తం దేశీ స్నాక్స్ మార్కెట్లో బంగాళదుంప చిప్స్, కుర్‌కురే, ఫింగర్ స్టిక్స్ వంటి పాశ్చాత్య స్నాక్స్ వాటా రెండు దశాబ్దాల క్రితం మూడింట రెండొంతుల మేర ఉండేది. దీన్ని కూడా పెప్సీ ఫ్రిటో లేస్, ఐటీసీ ఫుడ్స్ వంటి కార్పొరేట్ దిగ్గజాలే శాసిస్తూ వచ్చాయి. 'గతంలో బడా కంపెనీలు విక్రయించే పాశ్చాత్య స్నాక్స్ ఇంటింటా తిష్ట వేశాయి. ఇప్పుడీ ట్రెండ్ రివర్స్ అవుతోంది. సాంప్రదాయ స్నాక్స్ తయారీదారులు తమ పంపిణీ వ్యవస్థను విస్తరించుకోవడం ద్వారా పల్లెటూర్లకు కూడా చొచ్చుకుపోతున్నాయి' అని గోయెల్ చెప్పారు. కొత్త కొన్నేళ్లుగా సాంప్రదాయ స్నాక్స్ విభాగం భారీగా అమ్మకాలను కొల్లగొడుతోంది. ఇక మార్కెట్ వాటా విషయానికొస్తే, సాల్టెడ్ స్నాక్స్‌లో హల్దీరామ్స్, పెప్సీ, బాలాజీ, ఐటీసీ, బికాజీ వంటి పెద్ద కంపెనీలకు 60 శాతం మార్కెట్ వాటా ఉండగా.. మిగతా 40 శాతాన్ని చిన్నాచితకా కంపెనీలు, ప్రాంతీయ సంస్థల చేతిలో ఉండటం విశేషం. పెద్ద కంపెనీలతో పోలిస్తే ఎక్కువ గ్రాములను అందిస్తుండటం, మరిన్ని స్థానిక రుచులతో ఉత్పత్తులను ప్రవేశపెడుతుండటం వాటికి కలిసొస్తోంది. 'ఇప్పటికే పాతుకుపోయిన కంపెనీలు సాంప్రదాయ స్నాక్స్‌లో జోరు పెంచుతుండగా.. ప్రాంతీయంగా పేరొందిన కంపెనీలు సైతం క్రమంగా జాతీయ స్థాయిలో విస్తరిస్తున్నాయి' అని పార్లే ప్రొడక్ట్స్ సీనియర్ కేటగిరీ హెడ్ కృష్ణారావు బుద్ధ చెబుతున్నారు. ఇలా అందరూ స్థానిక సాంప్రదాయ రుచులను అందించేందుకు పోటీ పడుతుండటంతో వాటి అమ్మకాలు కూడా పెరిగేందుకు దోహదం చేస్తోందని, దీంతో అన్‌బ్రాండెడ్ సంస్థల నుంచి మార్కెట్ క్రమంగా సంస్థాగత కంపెనీల చేతికి వెళ్తోందని ఆయన పేర్కొన్నారు.



తొలిసారి లాభాల్లోకి ఓయో...

న్యూఢిల్లీ: ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కావాలని చూస్తున్న హోటల్స్ బుకింగ్ సేవల సంస్థ 'ఓయో' తన పనితీరును గణనీయంగా మెరుగుపరుచుకుంది. కంపెనీ చరిత్రలో తొలిసారి రూ.229 కోట్ల నికర లాభాన్ని 2024 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో సాధించింది. గత ఆర్థిక సంవత్సరానికి రూ.100 కోట్ల లాభం అంచాలను అధిగమించినట్టు ఓయో వ్యవస్థాపకుడు రితేష్ అగర్వాల్ కంపెనీ వార్షిక నివేదికలో తెలిపారు.

హింద్ జింక్ రూ. 8,000 కోట్ల ప్రత్యేక డివిడెండ్!

న్యూఢిల్లీ: హిందుస్తాన్ జింక్ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 8,000 కోట్ల ప్రత్యేక డివిడెండ్ ఇచ్చే ప్రణాళికల్లో ఉంది. వచ్చే మంగళవారం (20న) జరిగే బోర్డు మీటింగ్‌లో నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రత్యేక డివిడెండ్‌లో దాదాపు 30 శాతం అంటే రూ. 2,400 కోట్లు కేంద్ర వాటాకు దక్కనుంది. కాగా, ఏటా సాధారణంగానే కంపెనీ రూ. 6,000 కోట్ల భారీ డివిడెండ్‌ను చెల్లిస్తుంటుంది. కంపెనీలో 65% వాటా ఉన్న ప్రమోటర్ వేదాంతకు ఈ ఏడాది ప్రత్యేక డివిడెండ్‌లో మెజారిటీ వాటా (దాదాపు రూ.5,100 కోట్లు) లభించనుంది.

సాక్షి స్పోర్ట్స్

వీవీఎస్ లక్ష్మణ్ పదవీకాలం మరో ఏడాది పొడిగింపు

జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) హెడ్‌గా వ్యవహరిస్తున్న భారత మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ ఈ పదవిలో కొనసాగనున్నాడు. లక్ష్మణ్ మూడేళ్ల కాంట్రాక్ట్ సెప్టెంబరుతో ముగియనుంది. అయితే ఎన్‌సీఏ హెడ్‌గా మరో ఏడాది కాలం పాటు అతడి పదవీకాలాన్ని పొడిగించాలని బీసీసీఐ నిర్ణయించింది. బెంగళూరు శివార్లలో బీసీసీఐ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న కొత్త ఎన్‌సీఏ 2025లో ప్రారంభం కానున్న నేపథ్యంలో లక్ష్మణ్ కొనసాగితే బాగుంటుందని బోర్డు భావించింది. కొన్నాళ్ల క్రితం వరకు వ్యక్తిగతంగా కొంత అనాసక్తి ప్రదర్శిస్తూ లక్ష్మణ్ ఈ బాధ్యతల నుంచి తప్పుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే ఇప్పుడు బోర్డు జోక్యంతో అతను కొనసాగనున్నాడు. ఎన్‌సీఏ హెడ్‌గా ఉన్న సమయంలో ఇంజ్యూరీ మేనేజ్‌మెంట్, ప్లేయర్ రీహాబిలిటేషన్, కోచింగ్ కార్యక్రమాలు, వివిధ వయో విభాగాల క్రికెట్ టోర్నీల ప్లానింగ్ వంటి అంశాల్లో లక్ష్మణ్ సమర్థంగా పని చేశాడు. ఎన్‌సీఏ కోచ్‌లు హృషికేశ్ కనిత్కర్, సాయిరాజ్ బహుతులే, షితాన్షు కొటక్ కూడా కొనసాగే అవకాశం ఉంది.





ప్రతి ఒక్కరూ చాంపియనే

ఒలింపిక్ బృందాన్ని అభినందించిన ప్రధాని నరేంద్ర మోదీ

- స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అథ్లెట్లు
- ఒలింపిక్స్ నిర్వహించడం భారత్ కల అని వెల్లడి

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత అథ్లెట్ల బృందాన్ని గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. ఎర్రకోట వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం న్యూఢిల్లీలోని తన నివాసంలో అథ్లెట్ల బృందంతో ప్రధాని భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పారిస్ క్రీడల్లో రెండు పతకాలు సాధించి కొత్త చరిత్ర లిఖించిన షూటర్ మనూ భాకర్.. ఒలింపిక్స్‌లో వినియోగించిన పిస్టల్ ను ప్రధానికి చూపించింది. ఇక వరుసగా రెండో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచిన భారత పురుషుల హాకీ జట్టును ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్‌తో మోదీ ముచ్చటించారు. ఈ సందర్భంగా జట్టు ఆటగాళ్లంతా సంతకాలు చేసిన జెర్సీతో పాటు ఓ హాకీ స్టిక్‌ను ప్రధానికి అందించారు. పారిస్ క్రీడల్లో కాంస్య పతకం అందుకున్న రెజ్లర్ అమన్ సెహ్రావత్ కూడా భారత జెర్సీని ప్రధానికి బహుమతిగా ఇచ్చారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మనూ భాకర్‌తో కలిసి కాంస్య పతకం గెలిచిన సరబ్ జ్యోత్ సింగ్, 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్‌లో కాంస్యం నెగ్గిన స్వప్నిల్ కుసాలేను కూడా ప్రధాని అభినందించారు. అనంతరం క్రీడాకారుల మధ్య కలియదిరిగిన ప్రధాని వారితో సంభాషించారు. ఒలింపిక్స్‌లో వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర క్రీడా మంత్రి మన్‌సుఖ్ మాండవీయా, భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష పాల్గొన్నారు. 'పారిస్ ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన ఆటగాళ్లతో మాట్లాడడం చాలా ఆనందంగా ఉంది. విశ్వక్రీడల్లో వారి అనుభవాలు వినడం.. వారి విజయాలను ప్రశంసించడం తృప్తినిచ్చింది. పారిస్‌కు వెళ్లిన ప్రతీ భారత క్రీడాకారుడు చాంపియనే. ప్రభుత్వం క్రీడలకు మద్దతునిస్తుంది. మౌలిక సదుపాయాల కల్పనలో ఎల్లప్పుడూ ముందుంటుంది' అని ప్రధాని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా.. పారిస్ క్రీడలు ముగిసిన వెంటనే చికిత్స కోసం జర్మనీకి వెళ్లడంతో అతడు ఈ కార్యక్రమంలో పాల్గొనలేదు. త్రుటిలో పతకానికి దూరమైన షట్లర్ లక్ష్యసేన్, వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను, బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్‌తో పాటు ఇతర అథ్లెట్లతోనూ ప్రధాని సంభాషించారు. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ నుంచి 117 మంది అథ్లెట్లు బరిలోకి దిగారు. ఓవరాల్‌గా ఈ క్రీడల్లో దేశానికి ఆరు (ఒక రజతం, 5 కాంస్యాలు) పతకాలు వచ్చాయి. అంతకుముందు ఎర్రకోట వద్ద జరిగిన 78వ స్వాతంత్ర్య వేడుకల్లో ఒలింపిక్ అథ్లెట్ల బృందం పాల్గొంది. ఈ సందర్భంగా ప్రధాని 'పారిస్' క్రీడల్లో పాల్గొన్న అథ్లెట్లకు ధైర్యం చెబుతూనే.. పారాలింపిక్స్‌కు వెళ్లనున్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వడం భారత్ కల అని.. 2036లో విశ్వక్రీడలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నామని ప్రధాని పునరుద్ఘాటించారు.



ఫీల్డ్ గోల్స్‌తోనే అది సాధ్యం: శ్రీజేశ్

న్యూఢిల్లీ: విశ్వక్రీడల్లో నిలకడగా పతకాలు సాధించాలంటే.. ఫీల్డ్ గోల్స్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరముందని అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికిన భారత గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ అన్నాడు. ఒలింపిక్స్ వంటి మెగా టోర్నీల్లో సత్తా చాటాలంటే.. పెనాల్టీ కార్నర్‌లను వినియోగించుకోవడంతో పాటు.. ఫీల్డ్‌గోల్స్ ఎక్కువ చేయాలని శ్రీజేశ్ పేర్కొన్నాడు. పారిస్ క్రీడల్లో కాంస్య పతకం సాధించిన భారత జట్టు మెగా టోర్నీలో మొత్తం 15 గోల్స్ చేసింది. అందులో 9 పెనాల్టీ కార్నర్‌లు, మూడు పెనాల్టీ స్ట్రోక్స్ ఉన్నాయి. అంటే కేవలం మూడే ఫీల్డ్ గోల్స్ చేయగలిగింది. అదే సమయంలో స్వర్ణం గెలిచిన నెదర్లాండ్స్ 14 ఫీల్డ్ గోల్స్, రజతం నెగ్గిన జర్మనీ 15 ఫీల్డ్ గోల్స్ చేశాయి. కాంస్య పతక పోరులో భారత్ చేతిలో ఓడి నాలుగో స్థానంలో నిలిచిన స్పెయిన్ కూడా 10 ఫీల్డ్ గోల్స్‌తో ఆకట్టుకుంది. 'పెనాల్టీ కార్నర్‌ల విషయంలో మన ప్లేయర్ల ఆలోచనల్లో మార్పు రావాల్సిన అవసరముంది. వరుస విజయాలు సాధించాలంటే మనం ఎందులో మెరుగ్గా ఉన్నామో దానిపైనే కాకుండా.. ఇతర వాటిపై కూడా దృష్టి పెట్టాలి. ఫీల్డ్ గోల్స్‌లో సత్తా చాటితే హాకీలో పూర్వవైభవం సాధ్యమే' అని శ్రీజేశ్ అన్నాడు.

సచిన్‌కు రూ. 2.15 కోట్లు

- భారీ మొత్తంతో సొంతం చేసుకున్న తమిళ్ తలైవాస్
- రెజాకు రూ. 2.07 కోట్లు
- ప్రొ కబడ్డీ లీగ్ వేలం


సచిన్ తన్వర్


రెజా

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఆటగాళ్ల వేలంలో రూ. కోట్ల కూత కూసింది. దీంతో కబడ్డీ ప్లేయర్ల రాత కూడా రానురానూ మారుతోంది. పీకేఎల్ 11వ సీజన్ కోసం నిర్వాహకులు గురువారం ఆటగాళ్ల వేలం ప్రక్రియను మొదలుపెట్టారు. తొలిరోజు ఎ, బి కేటగిరీలకు చెందిన ఆటగాళ్ల వేలం నిర్వహించగా, రాజస్తాన్‌కు చెందిన సచిన్ తన్వర్‌పై ఫ్రాంచైజీలు రూ. రెండు కోట్లకు పైగా వెచ్చించేందుకు పోటీ పడ్డాయి. చివరకు తమిళ్ తలైవాస్ ఈ రెయిడర్‌పై రూ. 2.15 కోట్లు కురిపించి మరీ కైవసం చేసుకుంది. గత సీజన్‌లో పట్నా పైరేట్స్ తరఫున కూత పెట్టిన సచిన్ అంతకుముందు గుజరాత్ జెయింట్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. తన్వర్ భారత జట్టులో కీలక సభ్యుడు. గతేడాది హాంగ్జూలో జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన విజేత జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఇతనితో పాటు 'ఎ' కేటగిరీలో ఉన్న మరో స్టార్ కబడ్డీ ప్లేయర్, ఇరానియన్ ఆల్‌రౌండర్ మొహమ్మద్ రెజా కోసం ఫ్రాంచైజీలు ఎగబడి వేలం పాట పాడాయి. చివరకు అతన్ని రూ. 2.07 కోట్లతో హరియాణా స్టీలర్స్ చేజిక్కించుకుంది. తొలి రోజు వేలంలో రెండు కేటగిరీల్లో కలిపి 8 మంది ఆటగాళ్ల రూ. కోటికి పైగా ధర పలికారు. రెయిడర్లు గుమన్ సింగ్ రూ. 1.97 కోట్లు (గుజరాత్ జెయింట్స్), మణీందర్ సింగ్ రూ. 1.15 కోట్లు (బెంగాల్ వారియర్స్), అజింక్యా అశోక్ రూ. 1.10 కోట్లు (బెంగళూరు బుల్స్), ఆల్‌రౌండర్లు పవన్ కుమార్ సెహ్రావత్ రూ.1.72 కోట్లు (తెలుగు టైటాన్స్), భరత్ రూ. 1.30 కోట్లు (యూపీ యోధాస్), డిఫెండర్ సునీల్ కుమార్ రూ. 1.01 కోట్లు (యు ముంబా)లు భారీ ధర పలికారు. తెలుగు టైటాన్స్ జట్టు స్టార్ ఆల్‌రౌండర్ పవన్ సెహ్రావత్‌తో పాటు డిఫెండర్ క్రిషన్ ధుల్ (రూ. 70 లక్షలు), ఆల్‌రౌండర్ విజయ్ మలిక్ (రూ. 20 లక్షలు)లను తొలిరోజు వేలంలో కొనుక్కుంది. రెండో రోజు శుక్రవారం వేలంలో 'ఎ', 'బి'లతో పాటు 'సి' కేటగిరీ ఆటగాళ్ల వేలం నిర్వహిస్తారు.

కుప్పకూలిన దక్షిణాఫ్రికా


జోసెఫ్

ప్రొవిడెన్స్: వెస్టిండీస్ పేసర్ల ధాటికి రెండో టెస్టులో దక్షిణాఫ్రికా బ్యాటర్లు తడబడ్డారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా జట్టు... విండీస్ బౌలర్ల ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. షామర్ జోసెఫ్ (5/33), జైడెన్ సీల్స్ (3/41) ధాటికి దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 47 ఓవర్లలో 134 పరుగులకే 9 వికెట్లు కోల్పోయింది. డేవిడ్ బెడింగ్‌హామ్ (28), ట్రిస్టన్ స్టబ్స్ (26), కైల్ వెరినె (21) ఓ మాదిరిగా ఆడగా.. కెప్టెన్ తెంబా బవుమా (0), మార్క్‌రమ్ (14), టోనీ డి జోర్జి (1), ముల్డర్ (0), కేశవ్ మహరాజ్ (0) విఫలమయ్యారు.

ప్రజ్ఞానందకు ఆఖరి స్థానం

సెయింట్ లూసియా: భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద.. సెయింట్ లూసియా ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్‌లో ఆకట్టుకోలేకపోయాడు. ర్యాపిడ్ విభాగంలో వరుస పరాజయాలు ఎదుర్కొన్న ప్రజ్ఞానంద.. తొమ్మిది రౌండ్‌ల ఈ టోర్నీలో చివరి స్థానంలో నిలిచాడు. మొత్తం 18 పాయింట్లు సాధించే అవకాశం ఉండగా.. ప్రజ్ఞానంద కేవలం 4 పాయింట్లకే పరిమితమయ్యాడు. పోటీల చివరి రోజు మూడు రౌండ్లు ఆడిన ప్రజ్ఞానంద అందులో రెండింట ఓడి.. ఒక దాన్ని 'డ్రా' చేసుకున్నాడు.

మహిళల ప్రపంచకప్ నిర్వహణకు 'నో'

- ఐసీసీ ఆఫర్‌ను తిరస్కరించిన బీసీసీఐ
- వర్షాలు, వచ్చే ఏడాది వరల్డ్ కప్ ఉండటమే కారణం



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో వచ్చే అక్టోబరులో నిర్వహించాల్సిన మహిళల టి20 ప్రపంచకప్ ఆతిథ్యానికి భారత్ తిరస్కరించింది. బంగ్లాలో నెలకొన్న రాజకీయ అనిశ్చిత పరిస్థితులు, హింసాయుత వాతావరణం వల్ల వేదిక మార్పు అనివార్యమైంది. దీంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఇచ్చిన ఆఫర్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నో చెప్పింది. వచ్చే ఏడాది భారత్‌లో మహిళల వన్డే ప్రపంచకప్ జరగాల్సి ఉంది. దీంతో పాటు ఈ అక్టోబర్ నెల వరకు వర్షాకాలం తీవ్ర స్థాయిలో ఉంటుంది. వరుస వరల్డ్‌కప్‌లతో పాటు, ప్రతికూల వాతావరణం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు కార్యదర్శి జై షా వెల్లడించారు. 'మహిళల మెగా ఈవెంట్‌కు భారత్ ఆతిథ్యమివ్వాల్సిందిగా ఐసీసీ మమ్మల్ని కోరింది. అయితే ఇది సాధ్యం కాదని ఖరాఖండిగా చెప్పాం' అని జై షా చెప్పారు. దీంతో అక్టోబర్ 3 నుంచి 20 వరకు జరగాల్సిన మెగా ఈవెంట్ కోసం ఐసీసీ ప్రత్యామ్నాయ వేదికలపై దృష్టిసారించింది. శ్రీలంక లేదంటే యూఏఈలలో ఒక వేదికను ఈ నెల 20వ తేదీకల్లా ఖరారు చేసే అవకాశముంది. బంగ్లాలో కొన్ని రోజులుగా హింసాత్మక ఘటనలతో దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో పౌరులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో అక్కడ అమ్మాయిల ప్రపంచకప్‌ను సురక్షితంగా నిర్వహించడం ఐసీసీకి క్లిష్టతరం కానుంది. ఈ నేపథ్యంలో ఐసీసీ ఎప్పటికప్పుడు బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ)తో సంప్రదింపులు జరుపుతోంది. అక్కడి తాజా పరిస్థితులపై రోజూ సమీక్ష చేస్తోంది. బంగ్లాదేశ్ పురుషుల క్రికెట్ జట్టు త్వరలో భారత్‌లో పర్యటించాల్సి ఉంది. బంగ్లా ప్రస్తుతం పాకిస్తాన్ టూర్‌లో ఉంది. అక్కడ రెండు టెస్టుల ద్వైపాక్షిక సిరీస్ ఈ నెల 21న మొదలవుతుంది. అనంతరం వచ్చే నెల భారత పర్యటనలో రెండు టెస్టులతో పాటు మూడు మ్యాచ్‌ల టి20ల సిరీస్‌లో బంగ్లాదేశ్ పాల్గొంటుంది.



78 అడుగుల లోతులో జెండా ప్రదర్శన

స్వాతంత్ర్య సమరయోధులకు విశాఖలోని స్కూబా డైవర్లు ఘనంగా నివాళులర్పించారు. సముద్ర గర్భంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేశారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రుషికొండ సముద్రంలో 78 అడుగుల లోతున జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్కూబా శిక్షకుడు బలరాంనాయుడు నేతృత్వంలో ఈ అద్భుత ఘట్టాన్ని ప్రదర్శించారు. – సాక్షి, విశాఖపట్నం

చిరుధాన్యాలతో ఇండియా మ్యాప్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విశాఖకు చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ చిరుధాన్యాలను ఉపయోగించి భారతదేశ చిత్రపటాన్ని, స్వాతంత్ర్య పోరాట యోధుల చిత్రాలను సహజ సిద్ధంగా మలిచారు. నెలపాటు శ్రమించి 5 అడుగులు పొడవైన ఈ చిత్రాన్ని తయారు చేశారు. యువతలో దేశభక్తిని, స్వాతంత్ర పోరాట స్ఫూర్తిని నింపాలన్న ఉద్దేశంతో ఈ చిత్రాన్ని సిద్ధం చేసినట్లు విజయకుమార్ తెలిపారు. – విశాఖ సిటీ





జాలర్ల వినూత్న వేడుకలు

నంద్యాల జిల్లా పాణ్యం మండల పరిధిలోని గోరుకల్లు జాలర్లు స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా వినూత్న వేడుకలు నిర్వహించారు. గ్రామంలోని మత్స్యకారులు పడవలు, బోట్లపై జాతీయ జెండాలతో సందడి చేశారు. 4 పడవల్లో 15మంది జాలర్లు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. – పాణ్యం


బొటనవేలి గోటిపై 'వరలక్ష్మీదేవి'

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా యలమంచిలి మండలం ఏటికొప్పాకకు చెందిన చింతల లావణ్య అంకుడు కర్రతో బొటనవేలి గోరుపై ఉంచేంత చిన్న సైజులో వరలక్ష్మీదేవి బొమ్మను రూపొందించి అబ్బురపరిచారు. అర అంగుళం సైజులో రెండ్రోజులు శ్రమించి ఈ బొమ్మను తయారు చేశారు. గతంలో లావణ్య గోటిపై వినాయకుడు బొమ్మను తయారు చేసి ప్రతిభ చూపారు. –యలమంచిలి రూరల్ (అనకాపల్లి జిల్లా)



క్లుప్తంగా...

శ్రీశైలం డ్యాం నీటిమట్టం 881.20 అడుగులు



శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయ నీటిమట్టం గురువారం సాయంత్రం సమయానికి 881.20 అడుగులకు చేరుకుంది. బుధవారం నుంచి గురువారం వరకు జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలానికి 1,12,709 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 97,311 క్యూసెక్కుల నీరు విడుదలైంది. కుడిగట్టు కేంద్రంలో 15.282 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.720 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం జలాశయంలో 194.3096 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రాయలసీమలో నేడు, రేపు వర్షాలు



సాక్షి, విశాఖపట్నం: రాయలసీమ, తెలంగాణ నుంచి ఆగ్నేయ అరేబియా సముద్రం, దాన్ని ఆనుకుని ఉన్న కేరళ తీరం మీదుగా ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఆగ్నేయ అరేబియా సముద్రం నుంచి దక్షిణ కేరళ తీరం మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 1.5 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రాయలసీమలో నేడు, రేపు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్రలో నేడు, రేపు అక్కడక్కడా తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అధికారులు వెల్లడించారు. ద్రోణి ప్రభావంతో తీరం వెంబడి గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయన్నారు.

రాష్ట్రంలో మహిళలపై దాడులను ఉపేక్షించకూడదు

ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను ఉపేక్షించకూడదని, వాటిని అరికట్టి మహిళలకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని రాష్ట్ర మహిళా కమిషన్ ప్రధాన కార్యాలయం వద్ద గురువారం ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు శక్తివంతంగా తయారైనప్పుడే సమాజంలో నిజమైన స్వాతంత్ర్య ఫలాలను సాధించుకుంటామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. మహిళలను గౌరవించడమే కాకుండా వారి కోసం సంక్షేమ పథకాలు అమలు చేయడం ప్రభుత్వం బాధ్యతగా గుర్తుచేశారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం: సీపీఎం



సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు గుడివాడ పర్యటన సందర్భంగా పలువురు నేతలను పోలీసులు మళ్లీ ముందస్తు అరెస్టులు చేయడంపై సీపీఎం మండిపడింది. పోలీసుల తీరును ఖండిస్తూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుడివాడలో సీపీఎం నాయకులు బసవ అరుణను హౌస్ అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు. గత ప్రభుత్వంలా కాకుండా కూటమి ప్రభుత్వంలో ముందస్తు అరెస్టులు ఉండవని, ఆ విధంగా పోలీసులకు ఆదేశాలిస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించిన వారం రోజుల్లోనే మళ్లీ ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆవిరి శక్తితో.. ఆకాశ యాత్ర



గంటకు 200 మైళ్ల వేగంతో (322 కి.మీ.) వెళుతుంది..

హైడ్రోజన్ ఎయిర్ ట్యాక్సీలు రెడీ

అమెరికా ఏవియేషన్ కంపెనీ వినూత్న ప్రయోగం	902 కి.మీ. దూరం విజయవంతంగా ప్రయాణం	నీటి ఆవిరి మినహా ఎలాంటి కాలుష్యం వెదజల్లదు	ఇప్పటికే ఎలక్ట్రిక్ ఎయిర్ క్రాఫ్ట్‌ల తయారీ	దుబాయ్ ఎయిర్‌పోర్టు నుంచి పామ్ జుమేరా బీచ్‌కు నడిపే యోచన

హైడ్రోజన్ వాడకంతో ఇంధనం నింపుకోవాల్సిన అవసరం లేకుండా మరింత దూరం ప్రయాణించవచ్చు.

పల్లా రవికిరణ్, ఏపీ సెంట్రల్ డెస్క్

జేమ్స్‌వాట్ ఆవిష్కరించిన ఆవిరి యంత్రం చరిత్ర గతిని మార్చేసింది. ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామిక విప్లవానికి దారి తీసింది. అదే ఆవిరి శక్తిని ఇంధనంగా వినియోగించుకుంటూ ఎయిర్ ట్యాక్సీలు సిద్ధమవుతున్నాయి. ఉబర్.. ఓలా.. రాపిడో తరహాలో ఎయిర్ ట్యాక్సీలు ఆకాశయానంతో సందడి చేసే రోజు దగ్గర్లోనే ఉందని ఏవియేషన్ సంస్థలు నమ్మకంగా చెబుతున్నాయి. తొలిసారిగా హైడ్రోజన్ ఇంధనంతో తయారైన ఎయిర్ ట్యాక్సీ కాలిఫోర్నియా మీదుగా రికార్డు స్థాయిలో 561 మైళ్లు (902 కి.మీ.) విజయవంతంగా ప్రయాణించింది. ఆరిజోనాలోని ఎర్రరాతి శిలలతో కూడుకున్న విశాలమైన లోయ ప్రాంతం గ్రాండ్ కాన్యాన్‌తో పోలిస్తే ఇది రెండు రెట్లు ఎక్కువ. జోబి ఏవియేషన్ కంపెనీలో పురుడు పోసుకున్న ఈ ఫ్లైయింగ్ కార్ పూర్తిగా హైడ్రోజన్‌తో నడుస్తుంది. నీటి ఆవిరి మినహా ఎలాంటి ఉద్గారాలను విడుదల చేయకపోవడం దీని ప్రత్యేకత. ''శాన్ ఫ్రాన్సిస్కో నుంచి శాండియాగో, బోస్టన్, బాల్టిమోర్ లేదా నాష్‌విల్లే నుంచి న్యూఓర్లాన్స్ వెళ్లేందుకు ఎయిర్‌పోర్టుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రయాణం చేయటాన్ని ఊహించుకోండి. నీటి ఆవిరి మినహా ఎలాంటి కాలుష్యం వెదజల్లని ఎయిర్ ట్యాక్సీలో ప్రయాణించే రోజు చాలా దగ్గర్లోనే ఉంది''అని కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో జో బెన్ బెవిర్ట్ వెల్లడించారు. అమెరికా సైనిక విభాగం ఈ ఎయిర్ ట్యాక్సీ ప్రయోగానికి పాక్షికంగా నిధులు సమకూర్చడం విశేషం.

ఎంత మంది?


జోబి ఏవియేషన్ తయారు చేసిన ఎయిర్ ట్యాక్సీకి ఆరు ప్రొఫెల్లర్లు ఉంటాయి. హెలికాప్టర్ తరహాలో గాల్లోకి ఎగిరేందుకు, కిందకు దిగేందుకు ఇవి తోడ్పడతాయి. టేకాఫ్ తీసుకుని గాల్లోకి ఎగిరిన తరువాత ప్రొఫెల్లర్లు నిట్ట నిలువు నుంచి బల్లపరుపుగా మారతాయి. రెక్కలున్న సంప్రదాయ ఎయిర్ క్రాఫ్ట్ తరహాలో ఎయిర్ ట్యాక్సీ ఆకాశంలో ఎగిరేందుకు ఇవి దోహదం చేస్తాయి. ఇందులో నలుగురు ప్రయాణించవచ్చు.

ఏమిటి దీని ప్రత్యేకత?

ఎయిర్ ట్యాక్సీ అనేది కొత్త ఆవిష్కరణ కాకపోయినా జోబీ ఎయిర్‌క్రాఫ్ట్‌లో ప్రొఫెల్లర్లకు సమకూర్చిన ఇంధనం మాత్రం కొత్త ప్రయోగమే. 40,000 కి.మీ. తిరిగిన ఎలక్ట్రిక్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను ఆధునికీకరించి దీన్ని తయారు చేశారు. పాత ఎయిర్‌క్రాఫ్ట్ బ్యాటరీల స్థానంలో 40 కిలోల ద్రవ హైడ్రోజన్ సామర్థ్యం కలిగిన ఇంధన సెల్స్‌ను అమర్చారు. ట్యాక్సీకి అవసరమైన విద్యుత్తు, ఉష్ణోగ్రత, నీటి ఆవిరిని ఇవి అందిస్తాయి. టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో అదనపు శక్తి అందించేందుకు కొన్ని బ్యాటరీలు ఉంటాయి.

బ్యాటరీ ట్యాక్సీల కంటే మెరుగైన సామర్థ్యం

గతంలో రూపొందించిన బ్యాటరీలతో పనిచేసే ఎయిర్ ట్యాక్సీలు ఒక్కసారి చార్జింగ్ చేస్తే 100 – 150 మైళ్లు (160 – 240 కి.మీ.) ప్రయాణించాయి. హైడ్రోజన్‌తో నడిచే ఎయిర్ ట్యాక్సీలో మాత్రం ఒక నగరం నుంచి మరొక నగరానికి వెళ్లవచ్చని చెబుతున్నారు. ప్రయోగాత్మకంగా 561 మైళ్లు నడిపి చూశారు. లండన్ నుంచి ప్యారిస్, జ్యూరిచ్, ఎడిన్‌బర్గ్ ఆగాల్సిన అవసరం లేకుండా వెళ్లవచ్చు. ఎయిర్ ట్యాక్సీల నెట్‌వర్క్‌ను అనుసంధానించడం ద్వారా వివిధ నగరాలకు వెళ్లవచ్చని చెబుతున్నారు. హైడ్రోజన్ మోడల్ ఎయిర్ ట్యాక్సీలు కచ్చితంగా ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో ఆయన వెల్లడించలేదు.



దుబాయ్‌లో బీచ్ విహారం..

తమ ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీ ఫెడరల్ ఏవియేషన్ అథారిటీ నుంచి 3 – 5 దశల ధ్రువీకరణ పూర్తి చేసుకున్నట్లు జోబీ చెప్పారు. దుబాయ్ నుంచి వీటి సేవలు ప్రారంభం కానున్నట్లు గతంలోనే జోబీ ఏవియేషన్ కంపెనీ ప్రకటించింది. ఈమేరకు దుబాయ్ రోడ్డు రవాణా సంస్థతో కంపెనీ ఒప్పందం కూడా కుదుర్చుకుంది. వీటి ద్వారా దుబాయ్ విమానాశ్రయం నుంచి ప్రముఖ పర్యాటక ప్రాంతం, కృత్రిమ దీవుల సముదాయం పామ్ జుమేరా బీచ్‌కు కేవలం పది నిమిషాల్లో చేరుకోవచ్చు. బ్యాటరీతో నడిచే ఎయిర్ ట్యాక్సీ పరీక్షలు విజయవంతం కావడంతో హైడ్రోజన్ మోడల్ కూడా సత్ఫలితాలనిస్తుందని కంపెనీ గట్టి నమ్మకంతో ఉంది. అయితే ఈ రెండు మోడళ్ల ధరలు ఎంత ఉంటాయనే విషయాన్ని ఇంతవరకు వెల్లడించలేదు. వాణిజ్యపరంగానూ వీటిని వినియోగించుకునే అవకాశం ఉంది. ఎయిర్ ట్యాక్సీల వాడకం 2028 నాటికి సాధారణంగా మారుతుందని, పైలెట్ల అవసరం లేకుండా ఎగిరే ట్యాక్సీలు 2030 నాటికి అందుబాటులోకి వస్తాయని బ్రిటన్ భావిస్తోంది.

పోటాపోటీ..

ఎలక్ట్రిక్ మోటార్లు, బ్యాటరీ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ వినియోగంలో వచ్చిన ఆధునిక మార్పులు ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీల రంగంలో విప్లవాత్మక మార్పులకు దోహదం చేశాయి. ఎలక్ట్రిక్ క్యాబ్‌లపై విస్తృత పరిశోధనలు నిర్వహించిన ఏవియేషన్ స్టార్టప్‌లు జీ ఏరో, కిట్టీ హాక్‌లపై గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ సీఈవో లారీ పేజ్ లక్షల డాలర్ల నిధులను వెచ్చించారు. ఎయిర్ స్పేస్ ఎక్స్ లాంటి పలు కంపెనీలు ఎయిర్ ట్యాక్సీలను తెచ్చేందుకు పోటీ పడుతున్నాయి. తమ ప్రయాణికులకు హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తామంటూ ఊరిస్తోంది. వైద్య అవసరాల కోసం అత్యవసరంగా తరలించేందుకు కూడా సేవలందిస్తామంటోంది. ఇక క్యాబ్ సేవల సంస్థ ఉబర్ కూడా దీనిపై దృష్టి సారించింది. 2018 జనవరిలో నిర్వహించిన ఓ సాంకేతిక సదస్సులో ఉబర్ సీఈవో దారా ఖొస్రోవ్‌షాహి ఈమేరకు ఓ ప్రకటన చేశారు. వచ్చే పదేళ్లలో ఇవి సాకారం కానున్నట్లు అప్పట్లోనే చెప్పారు.

ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకున్న కృష్ణకుమారి

కేంద్రమంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ చేతుల మీదుగా ప్రదానం



కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ నుంచి అవార్డు అందుకుంటున్న కృష్ణకుమారి

చల్లపల్లి: కృష్ణా జిల్లా చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి ఢిల్లీలో గురువారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు అందుకున్నారు. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. దేశవ్యాప్తంగా మొత్తం 8 మందికి ఈ అవార్డు దక్కగా.. అందులో కృష్ణకుమారి ఒకరు. స్వచ్ఛ సుందర చల్లపల్లి, మన కోసం మనం ట్రస్ట్ సహకారంతో క్లీన్ అండ్ గ్రీన్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ, ఓడీఎఫ్ ప్లస్ లక్ష్యాలు సాధించినందుకు కృష్ణకుమారి ఈ అవార్డు అందుకున్నారు. సర్పంచ్‌ను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అభినందించారు.

ఆర్‌జీకార్ ఘటనకు నిరసనగా వైద్య సేవల నిలుపుదల



సాక్షి, అమరావతి: పశ్చిమ బెంగాల్‌లోని ఆర్.జి.కార్ వైద్య కళాశాలలో రెసిడెంట్ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా 24 గంటల పాటు వైద్య సేవలు నిలిపివేయాలని నిర్ణయించినట్టు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయచంద్రనాయుడు, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఫణిధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐఎంఏ పరిధిలోని వైద్యులందరూ శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకూ ఎమర్జెన్సీ కేసులు మినహా ఇతర కేసుల్లో వైద్య సేవలకు దూరంగా ఉంటారని వెల్లడించారు. హత్యాచార ఘటనలో విచారణ వేగంగా పూర్తి చేయడంతో పాటు, మృతురాలి కుటుంబానికి ప్రభుత్వమే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా వైద్యులపై హింసాత్మక ఘటనల్లో బాధ్యులను కఠినంగా శిక్షించేలా కేంద్రం చట్టాన్ని రూపొందించాలని కోరారు.

ఏపీజీడీఏ ఆధ్వర్యంలో.. 17న ప్రభుత్వ వైద్యుల విధుల బహిష్కరణ

కోల్‌కతాలోని యువ వైద్యురాలి హత్యాచార ఘటనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ ఘటనకు నిరసనగా 17వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు విధులను బహిష్కరించి, నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలపనున్నట్టు ఏపీజీడీఏ అధ్యక్షుడు జయధీర్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

దాతల భాగస్వామ్యం కావాలి

- గుడివాడలో అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తూ చంద్రబాబు
- జనాభా తగ్గుతోంది.. యువత తగ్గిపోతోంది
- భవిష్యత్తులో ఎక్కువ మంది పిల్లలున్న వారికే సంపద



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి

సాక్షి, మచిలీపట్నం/సాక్షి, అమరావతి: పేదోడి ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు తెచ్చామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. గురువారం కృష్ణాజిల్లా గుడివాడలోని రామబ్రహ్మం మున్సిపల్ పార్కులో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ఆయన సతీమణి నారా భువనేశ్వరితో కలిసి ప్రారంభించారు. ప్రజలతో కలిసి క్యాంటీన్‌లోనే భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో తాము ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను ఆటో కార్మికులు, హమాలీలు, పారిశుద్ధ్య కార్మికులు, చిరు వ్యాపారులు ఎంతో మంది సద్వినియోగం చేసుకున్నారని, వారి భోజన ఖర్చు చాలా మిగిలిందని అన్నారు. ఈ క్యాంటీన్ల నిర్వహణ కోసం తన సతీమణి భువనేశ్వరి రూ. కోటి ఇచ్చారని, పలువురు దాతలు కూడా విరాళాలు ఇచ్చారని, మిగతా వారు కూడా భాగస్వామ్యం కావాలని అన్నారు. పెళ్లిళ్ల ఖర్చు తగ్గించుకొని అన్న క్యాంటీన్లకు విరాళాలివ్వాలని సూచించారు. దీని కోసం ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ తెరిచామని, నేరుగా ఆన్‌లైన్ ద్వారా ఈ ఖాతాకు విరాళాలివ్వొచ్చని తెలిపారు. జనవరిలో జన్మభూమి 2.ను ప్రారంభించి, గ్రామాల అభివృద్ధిలో మళ్లీ ప్రజలను భాగస్వామ్యం చేస్తామన్నారు. రాష్ట్రంలో జనాభా తగ్గుతోందని, పిల్లల పుట్టుక తగ్గడంతో యువత శాతం తగ్గిందని చెప్పారు. సంపద సృష్టించే యువకులు తగ్గడం ప్రమాదకరమని అన్నారు. జనాభా పెరగాల్సిన అవసరం ఉందని అన్నారు. భవిష్యత్తులో ఎన్ని కోట్ల ఆస్తి ఉన్నా.. ఎక్కువ మంది పిల్లలున్న వారికే సంపద ఉంటుందని చెప్పారు. 2004 కంటే ముందు హైదరాబాదుతో పాటు అనేక ప్రాంతాలను అభివృద్ధి చేశానని, అయితే తనకంటే మెరుగ్గా పాలిస్తారని వేరే పార్టీకి ఓట్లు వేయడంతో రాష్ట్ర విభజనకు దారితీసే పరిస్థితి తెచ్చారని అన్నారు. 2019లోనూ తననే గెలిపించి ఉంటే రాష్ట్రాన్ని ఎక్కడికో తీసుకెళ్లే వాడినని చెప్పారు. మరో 23 ఏళ్లకు 100వ స్వాతంత్ర్య దిన వేడుకలు జరుపుకుంటామని, అప్పటివరకు తమ పార్టీ అధికారంలో ఉంటే రాష్ట్రాన్ని ప్రపంచంలోనే ఉన్నత స్థానంలో ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్‌రాజా, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు 99 చోట్ల అన్న క్యాంటీన్ల ప్రారంభం

వచ్చే నెలాఖరుకి రాష్ట్ర వ్యాప్తంగా 203 అన్న క్యాంటీన్ల ఏర్పాటే లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేసినట్టు మున్సిపల్ శాఖ తెలిపింది. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 99 ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు అందుబాటులోకి రానున్నట్టు వెల్లడించింది. ఆయా ప్రాంతాల్లో జరిగే ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని మున్సిపల్ మంత్రి కార్యాలయ అధికారులు తెలిపారు.

పేదరిక నిర్మూలనతోనే సమసమాజ స్థాపన

'మండలి' వద్ద స్వాతంత్ర్య వేడుకల్లో చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు



గాంధీ చిత్రపటానికి మోషేన్‌రాజు నివాళి

సాక్షి, అమరావతి: రాష్ట్ర శాసన మండలి, శాసనసభ, సచివాలయంలో 78వ స్వాతంత్ర్య వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. మండలి వద్ద చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, శాసనసభ వద్ద స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటాలకు నివాళులు అర్పించి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలి చైర్మన్ మోషేన్‌రాజు ప్రసంగిస్తూ.. సమాజంలోని పేదరిక నిర్మూలనకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేదలందరికీ అందినప్పుడే సమసమాజ స్థాపనకు అవకాశం కలుగుతుందన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వికసిత్ భారత్–2047లో భాగంగా వికసిత్ ఆంధ్రప్రదేశ్–2047 ప్రణాళిక రూపకల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఇందులో ప్రజలందరూ భాగస్వాములై సూచనలు, సలహాలు అందించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ పిలుపునిచ్చారు.

జన్‌ధన్ యోజనకు పదేళ్లు..



కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సమ్మిళిత పథకం ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన (పీఎంజేడీవై) అమల్లోకి వచ్చి పదేళ్లు పూర్తయ్యాయి.

జన్‌ధన్ ఖాతాలు ఇలా..

- ప్రారంభమైన రోజు: 2014, ఆగస్టు 15
- దేశంలో మొత్తం ఖాతాలు: 52.99 కోట్లు
- మొత్తం ఖాతాల్లో నగదు: రూ. 2,28,362 కోట్లు
- జన్‌ధన్‌లో మహిళల ఖాతాలు: 29.48 కోట్లు
- గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లో ఖాతాలు: 35.27 కోట్లు
- ఖాతాల్లో సగటు నిల్వ: రూ. 4,100
- డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) అందుకుంటున్న ఖాతాలు: 5.5 కోట్లు
- జన్‌ధన్ ఖాతాలకు సౌకర్యాలు: రూపే డెబిట్ కార్డు, బీమా, ఓవర్ డ్రాఫ్ట్

ఆర్థిక సమ్మిళిత పథకం:

- దేశంలో ఆర్థిక సమ్మిళితను సాధించడంలో పీఎంజేడీవై గణనీయమైన ప్రభావం చూపింది
- బ్యాంకింగ్ వ్యవస్థకు దూరంగా ఉన్న ప్రజలను ఆ వ్యవస్థలోకి తీసుకురావడానికి దోహదం చేసింది
- బ్యాంకులకు నిధుల కొరతను తీర్చడంలో పీఎంజేడీవై ఖాతాలు ఉపయోగపడ్డాయి
- సంక్షేమ పథకాల ప్రయోజనాలను నేరుగా లబ్ధిదారులకు చేర్చడంలో ఈ ఖాతాలు కీలకపాత్ర పోషించాయి.



Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

జేసీబీ డ్రైవర్ నిర్లక్ష్యం.. యువతి దుర్మరణం


మరణించిన మహిళ

రాయచూరు రూరల్: బహిర్భుమికి వెళ్లిన ఓ యువతి అనూహ్యంగా మృతి చెందిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. గురువారం ఉదయం అశాపూర్ రహదారిలోని జనతా కాలనీలో ఖాళీ స్థలంలో తాయమ్మ (32) బహిర్భుమికి వెళ్లారు. అప్పుడే ఆ ప్రాంతాల్లో పిచ్చి చెట్లను తొలగించడానికి ఓ వ్యక్తి జేసీబీతో వచ్చాడు. మహిళ ఉన్న విషయాన్ని గుర్తించక నిర్లక్ష్యంతో ఆమెపై మట్టి వేశాడు. దీంతో యువతి ఊపిరి ఆడక మృతి చెందినట్లు పశ్చిమ సీఐ నాగరాజు తెలిపారు. కేసు నమోదు చేసుకున్నారు. మృతురాలికి ముగ్గురు సంతానం ఉన్నట్లు సమాచారం.

కేంద్రమంత్రితో భేటీ

రాయచూరు రూరల్: రాయచూరులో ఎయిమ్స్ మంజూరుకు చర్యలు చేపట్టేలా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాను కలిశామని వైద్యకీయ శాఖ మంత్రి శరణు ప్రకాశ్ పాటిల్ వెల్లడించారు. గురువారం విలేకర్లతో మాట్లాడారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రధానికి లేఖ రాసిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రజా ప్రతినిధులు జిల్లా నేతలతో కలసి కేంద్ర సర్కార్‌లలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిపై ఒత్తిడి తెస్తామన్నారు. కలబుర్గి, మైసూరు, బెళగావిలలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

నదిలో వ్యక్తి గల్లంతు


బోటుతో గాలిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: శవ సంస్కారానికి వెళ్లిన వ్యక్తి నీటిలో కొట్టుకుని పోయిన ఘటన బుధవారం సింధనూరు తాలూకాలో చోటుచేసుకుంది. ఇక్కడి పీడబ్ల్యూడీ క్యాంప్‌లో సాయంత్రం సింధనూరులో అంత్యక్రియల్లో పాల్గొనడానికి వచ్చిన గిణిగేరకు చెందిన సాయిబణ్ణ (50) తుంగభద్ర నదిలో స్నానానికి దిగి కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అరుణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని బోటు ద్వారా గాలిస్తున్నారు.

క.కలో గ్రామీణ రోడ్ల సర్వే

రాయచూరు రూరల్: (కలబుర్గి) కళ్యాణ కర్ణాటక ప్రాంతంలో కళ్యాణ పథ రహదారుల నిర్మాణాల్లో భాగంగా గ్రామీణ రోడ్లపై సర్వేలు చేయనున్నట్లు గామీణాభివృద్ధి, పంచాయతీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే పేర్కొన్నారు. గురువారం కలబుర్గి సర్దార్ వల్లభాయ్ పటేల్ క్రీడా మైదానంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన కల్యాణ కర్ణాటక ప్రాంత రోడ్ల అభివృద్ధికి ఏటా రూ. 1000 కోట్ల నిధులు కేటాయించామన్నారు. కర్ణాటకలో ప్రగతి పథ పథకం కింద రూ.5,180 కోట్లతో ఏడు వేల కిలోమీటర్ల గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. సెప్టెంబర్ 17న జయదేవ్ ఆస్పత్రి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

మాజీ మంత్రికి దేవరాజ్ అరసు అవార్డు


మాజీ మంత్రి కాంతాకు పూల బొకె ఇస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: కలబుర్గి జిల్లా మాజీ మంత్రి ఎస్‌కే కాంతాకు దేవరాజ్ అరసు అవార్డును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 2024–25లో రాష్ట్రస్థాయి అవార్డును ఈనెల 20న బెంగళూరు విధాన సౌధ బాంక్వెట్ హాల్లో జరిగే దేవరాజ్ అరస్ జయంతిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకోనున్నారు. ఈ సందర్భంగా గురువారం వెనుకబడిన వర్గాల జిల్లా అధికారి ప్రదుదొరె మాజీ మంత్రి కాంతాను ఆయన నివాసంలో కలుసుకుని ఆహ్వానించి సన్మానించారు.

హుబ్లీలో మార్కెట్లు కిటకిట


జనతా బజార్‌లో సందడి

హుబ్లీ: శుక్రవారం వర మహాలక్ష్మీ పండుగను పురస్కరించుకుని వాణిజ్య నగరి హుబ్లీలో జనతా బజార్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో కొనుగోళ్లు జోరందుకున్నాయి. ఏపీఎంసీ మార్కెట్, గాంధీ మార్కెట్, పాత హుబ్లీ మార్కెట్, బెంగేరి తదితర చోట్ల ఉదయం నుంచే ప్రజలు పూలు, పండ్లు, ఇతర పూజా సామగ్రి కొనుగోలుకు తరలివచ్చారు.

పూలు, పండ్ల ధరలకు రెక్కలు :

పండుగ సందర్భంగా పూలు, పండ్ల ధరలు భారీగా పెరిగాయి. చామంతి, మల్లెపూల ధరలు ఆకాశాన్నంటాయి. కనకాంబరాలు రూ. 2500 పైగా విక్రయించారు. మల్లెపూలు కేజీ రూ. 2 వేలు, కాగడాలు కేజీ రూ. 800, గులాబీలు రూ. 300, మారీగోల్డ్ కేజీ రూ. 300 విక్రయిస్తున్నారు. ఇక పండ్ల విషయానికి వస్తే యాపిల్ కేజీ రూ. 200కు పైగా విక్రయిస్తున్నారు.

త్యాగధనులను స్మరించుకుందాం

- ఉమ్మడి బళ్లారి జిల్లాలో త్రివర్ణ పతాక రెపరెపలు
- ఘనంగా స్వాతంత్య్ర వేడుకలు
- వెల్లివిరిసిన దేశభక్తి సౌరభాలు



బళ్లారి విమ్స్ మైదానంలో జెండా వందనం చేస్తున్న మంత్రి క్రిష్ణ బైరేగౌడ, ఇతర అధికారులు, రాయచూరులో మంత్రి శరణు ప్రకాశ్ జెండా వందనం

సాక్షి బళ్లారి: స్వాతంత్య్రం కోసం పోరాడిన త్యాగధనులను స్మరించుకోవాలని రెవెన్యూశాఖ మంత్రి క్రిష్ణబైరేగౌడ అన్నారు. గురువారం 78 స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా నగరంలోని విమ్స్ క్రీడా మైదానంలో ఆయన జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడారు. ఎందరో వీరుల త్యాగఫలం ఈ స్వాతంత్య్ర అన్నారు. ప్రతి ఒక్కరూ కుల మతాలకతీతంగా జరుపుకునే పండుగ ఇది అన్నారు. ఏళ్లపాటు సాగిన తెల్లదొరల పాలనకు చరమగీతం పాడిన రోజన్నారు. స్వాతంత్య్ర పోరాటంలో కర్ణాటక రాష్ట్రంలో కూడా అనేక మంది మహానుభావులు పాల్గొన్నారని అందులో బళ్లారి జిల్లాలో కూడా ఎంతో మంది పాల్గొని తమ కీర్తిని చాటుకొన్నారన్నారు. స్వాతంత్య్ర పోరాటంలో భాగంగా గాంధీ 1921 అక్టోబర్ 1వ తేదీన బళ్లారికి వచ్చి స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొనేందుకు చైతన్యం తెచ్చారన్నారు. జిల్లాకు చెందిన టేకూరు సుబ్రహ్మణ్యం, టీబీ. కేశవరావు, ఏ.నంజప్ప, చిదానంద శాస్త్రి, గౌడప్ప తదితరులు ఎందరో యోధులు పాల్గొన్నారన్నారు. స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొన్న మహానుభావులను జిల్లాలోని అల్లీపుర జైల్లో ఉంచారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి, ఎమ్మెల్సీ వైఎం. సతీష్, బాబు జగ్జీవన్‌రామ్ చర్మ పరిశ్రమల అభివృద్ధి నిగమ మండలి అధ్యక్షుడు ముండ్రిగి నాగరాజు, మేయర్ ముల్లంగి నందీష్, బుడా అధ్యక్షుడు జేఎస్.ఆంజనేయులు, ఎస్పీ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

అపౌష్టికత నివారణకు కృషి చేయాలి

రాయచూరు రూరల్: ఆరోగ్యకరమైన పౌష్టికాహారం తీసుకోవడం ఎంతో అవసరమని, జిల్లాలో అపౌష్టికాహార లోపంతో జన్మనిస్తున్న పిల్లలు, రక్తహీనతతో ఉన్న తల్లుల్లో పౌష్టికతను పెంచడానికి కృషి చేయాలని వైద్యశాఖ మంత్రి శరణు ప్రకాశ్ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ రహదారిలోని పాత జిల్లా ఆస్పత్రి ఆవరణంలో 60 పడకల ఆస్పత్రిని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధికారి నితీశ్, జెడ్పీ సీఈఓ రాహుల్, ఎస్పీ పుట్టమాదయ్య, డీహెచ్ఓ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దేశ ఐక్యతకు కంకణబద్ధులు కావాలి

రాయచూరు రూరల్: దేశం ఐక్యతకు, అభివృద్ధికి నేటి యువత కంకణబద్ధులు కావాలని వైద్య శాఖ మంత్రి శరణు ప్రకాష్ పాటిల్ పేర్కొన్నారు. గురువారం మహాత్మాగాంధీ క్రీడాంగణంలో స్వాతంత్ర వేడుకల్లో పాల్గొని ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్య్రం కోసం ఎందరో త్యాగాలను బలి చేశారని గుర్తుచేశారు. అదే విధంగా గ్యారెంటీ పథకాలు, ప్రజా స్నేహ పాలనకు శ్రీకారం చుట్టామని, అధికారులు, ఉద్యోగులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు శివరాజ్ పాటిల్, బసనగౌడ, కలెక్టర్ నితీశ్, ఏడీసీ శివప్ప, జెడ్పీ ఈఈఓ రాహుల్, ఎస్పీ పుట్టమాదయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

కలబుర్గిలో..

రాయచూరు రూరల్ : (కలబుర్గి) దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన స్వాతంత్య్ర యోధులను స్మరించుకోవాలని కలబుర్గి ఇన్‌చార్జ్ మంత్రి ప్రియాంక్‌ఖర్గే అన్నారు. గురువారం కలబుర్గి సర్దార్ వల్లభాయ్ పటేల్ క్రీడ మైదానంలో స్వాతంత్ర దినోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. వెనుకబడిన కల్యాణ కర్ణాటక ప్రాంత అభివృద్ధికి ఏటా రూ. 5 వేల కోట్లు కేటాయించారన్నారు. కళ్యాణ కర్ణాటక అభివృద్ధి, రాజ్యాంగంలోని 371 (జె) ఉప కార్యాలయం కలబుర్గిలో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా శాసన సభ సభ్యులు బిఆర్ పాటిల్, అల్లమ ప్రభు, తిప్పణప్ప, కనీజా ఫాతిమా, జిల్లాధికారి ఫౌజియా తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిలో వేడుకలు

రాయచూరు రూరల్: యాదగిరి క్రీడా మైదానంలో స్వాతంత్ర వేడుకలను మంత్రి శరణ బసప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ముందుండాలన్నారు. ఈ సందర్భంగా పతాకావిష్కరణలో జిల్లా అధికారి సుశీల, ఎస్పీ సంగీత తదితరులు పాల్గొన్నారు.

రోగులకు ఉత్తమ సేవలు అందించాలి

బళ్లారి రూరల్: బళ్లారి మెడికల్ కళాశాల అండ్ రీసెర్చ్ సెంటర్ (మునుపు విమ్స్) అభివృద్ధికి సహకరించాలని బిఎంసి అండ్ ఆర్‌సి డీన్ డాక్టర్ గంగాధరగౌడ తెలిపారు. స్వాతంత్య్ర దినోత్సవ సందర్భంగా జాతీయజెండాను ఆవిష్కరించి మాట్లాడారు. వైద్యకళాశాల, ఆసుపత్రి సిబ్బంది అధికారులు రోగులకు ఉత్తమసేవలు అందించాలని తెలిపారు. తాను డైరెక్టర్‌గా పదవిచేపట్టాక దంత వైద్యకళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆరంభించడం జరిగిందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ మంజునాథ్ మాట్లాడుతూ... స్వాతంత్య్రం సిద్ధంచడానికి ఎంతో మంది ప్రాణాలను త్యాగం చేశారని తెలిపారు. స్వాతంత్య్రం వచ్చాక అంచెలంచెలుగా ఎదిగి ఇప్పుడు ఆర్థికాభివృద్ధిలో ప్రపంచంలో 5స్థానంలో ఉన్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా నేత్రదానానికి విశేషంగా కృషి చేసిన సిబ్బందిని, ఓ రైతును సన్మానించారు. కార్యక్రమంలో విమ్స్. టీబీ శానిటోరియం సూపరిన్‌టెండెంట్లు డాక్టర్ చిదానందమూర్తి, రాఘవేంద్ర, మేట్రిన్ నాగరత్న, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

హొసపేటలో...

హొసపేట: దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన అమర వీరులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని విజయనగర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ అన్నారు. గురువారం హొసపేట నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని జిల్లా సేడియంలో స్వాతంత్య్ర వేడుకల్లో ఆయన 405 అడుగుల జెండాను ఎగురవేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గవియప్ప, జిల్లాధికారి దివాకర్, జిల్లా ఎస్పీ హరిబాబు, పంచాయతీ అధికారి నోయా గ్హామ్ మహమ్మద్ అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

హుబ్లీలో: ఉమ్మడి ధార్వాడ జిల్లాతో పాటు గదగ్ జిల్లాలో కూడా స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ధార్వాడలోని ఆర్ఎన్‌శెట్టి మైదానంలో ఏర్పాటు చేసిన వేడుకలలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సంతోష్‌లాడ్, వివిధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి ప్రహ్లాదజోషి, విధాన పరిషత్ స్పీకర్ బసవరాజుహొరట్టి, జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అదే విధంగా నగరంలోని చెన్నమ్మ సర్కిల్, కార్పొరేషన్, మినీ విధానసౌధ తదితర కార్యాలయాలతో పాటు ప్రైవేటు సంస్థల్లో కూడా జాతీయ జెండాను ఆవిష్కరించారు. హుబ్లీ నగర తహసీల్దార్ కలగౌడపాటిల్ జాతీయ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మహేష్ టెంగినకాయ్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఇక గదగ్‌లోని కేహెచ్‌పాటిల్ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హెచ్‌కే పాటిల్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎస్‌వీ.సంకనూర, జిల్లాధికారి గోవిందురెడ్డి, జెడ్పీ సీఈఓ భరత్, ఏడీసీ అన్నపూర్ణ, ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.


హుబ్లీలో మంత్రి హెచ్‌కె పాటిల్..


బళ్లారి సిటీ కార్పొరేషన్‌లో జాతీయ జెండాను ఎగురవేసిన దృశ్యం


బుడా కార్యాలయంలో...

వాడవాడలా జెండా

బళ్లారి అర్బన్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా బళ్లారి నగరంలో ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పాఠశాలలు, కళాశాలలు, కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ తదితర పార్టీ కార్యాలయాలు, సిటీ కార్పొరేషన్ కార్యాలయం, సంఘసంస్థలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం, కుల సంఘాల కార్యాలయాల్లో, జాతీయ పతాకాన్ని ఎగరవేసి దేశ భక్తిని చాటుకొన్నారు.


రాయచూరులో విద్యార్థినుల నృత్య ప్రదర్శన


గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి ఖర్గే


బళ్లారిలో జెండా వందనం చేస్తున్న డాక్టర్ గంగాధరగౌడ, డాక్టర్ మంజునాథ్ తదితరులు


హొసపేటలో మంత్రి జమీర్

లోగో ఆవిష్కరణ


లోగో ఆవిష్కరణలో డీన్, వైద్యులు

బళ్లారి రూరల్: స్వాతంత్య్ర దినోత్సవం పతాక ఆవిష్కరణలో భాగంగా బీఎంసీ అండ్ ఆర్‌సి (బళ్లారి మెడికల్ కాలేజ్ అండ్ రీసెర్చ్ సెంటర్) లోగోను డీన్ డాక్టర్ గంగాధరగౌడ, ప్రిన్సిపాల్ డాక్టర్ మంజునాథ్, సూపరిన్‌టెండెంట్ డాక్టర్ చిదానందమూర్తి, వైద్యులు ఆవిష్కరించారు. మునుపు విమ్స్ (విజయనగర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)గా పిలవబడేది. అయితే అఖండ బళ్లారి విభజన జరిగిన తరువాత బళ్లారి, విజయనగర జిల్లాలుగా ఏర్పడ్డాయి. విమ్స్‌లో విజయనగర పేరున్నందున విమ్స్‌ను బళ్లారి మెడికల్ కాలేజ్ అండ్ రీసెర్చ్ సెంటర్‌గా పేరు మార్చారు. ఈ నేపథ్యంలో బీఎంసీ అండ్ ఆర్‌సీ లోగోను విడుదల చేశారు. విమ్స్ బీఎంసీ అండ్ ఆర్‌సికి ఇకపై విమ్స్ డైరెక్టర్ డీన్‌గా వ్యవహరిస్తారు.

త్రైమాసిక ప్రగతి సమీక్ష సమావేశం


మాట్లాడుతున్న మంత్రి జమీర్

హొసపేట: నగరంలోని పాలన భవనం ఆడిటోరియం హాలులో విజయనగరం జిల్లా త్రైమాసిక ప్రగతి సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న గృహనిర్మాణ, వక్ఫ్, మైనార్టీ సంక్షేమ శాఖమంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ అధికారులకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. అన్నభాగ్య పథకం కింద ప్రజలకు సక్రమంగా రేషన్ అందుతోందా లేదా అంటూ అధికారులను నిలదీశారు. గృహజ్యోతి యోజన పురోగతిని అడిగి తెలుసుకొన్నారు. పథకం కింద నమోదైనా లబ్ధిదారుల్లో 90 శాతం పురోగతి సాధించినట్లు అధికారులు వివరించారు. గృహ నిర్మాణ పథకం సొమ్మును ప్రజలకు సక్రమంగా అందజేయడానికి ఎన్ని వాయిదా చెల్లించాలి, డబ్బులు రావడం లేదని చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, సామాన్యులకు సక్రమంగా డబ్బులు అందడం లేదా అని మంత్రి ప్రశ్నించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గవియప్ప, నేమరాజ్ నాయక్, లత, జిల్లాధికారి దివాకర్, ఎస్పీ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆ చట్టాలను ఉపసంహరించుకోవాలి

రాయచూరు రూరల్: కేంద్ర సర్కార్ ప్రవేశ పెట్టిన ఆ మూడు చట్టాలను వెంటను ఉపసంహరించుకోవాలని సంయుక్త పోరాట కర్ణాటక, జేసీటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు నగరంలో గురువారం ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేపట్టిన జిల్లా అధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ...భూ సంస్కరణ చట్టం సవరణ, ఏపీఎంసీ, కార్మిక, విద్యుత్ వ్యతిరేక చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్రంలో కరువు సాయం, పరిహారం ఇవ్వడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు.

కార్మికులకు ప్రమాద పరిహారం ఇస్తాం

హుబ్లీ: అంబేడ్కర్ సహాయ హస్తం ద్వారా 23 అసంఘటిత సంఘాల కార్మికులకు ఈనెల 15న నుంచి ప్రమాద పరిహారం, అదే విధంగా సహజ మరణ పరిహార సౌలభ్యం కల్పిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సంతోష్ లాడ్ తెలిపారు. ధార్వాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... 23 అసంఘటిత కార్మిక వర్గాలను నిర్లక్ష్యం చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల జీవన భద్రతకు కొత్త పథకం ప్రారంభించిందన్నారు. సదరు కార్మికులు ప్రమాదానికి గురై మరణిస్తే రూ.లక్ష, ఆస్పత్రి వ్యయం రూ.50 వేలు, సహజ మరణం అయితే రూ.10 వేలు పంపిణీ చేస్తామన్నారు. వీరిలో హమాలీలు, చెత్త ఏరుకొనే కార్మికులు, ఇళ్లల్లో పనిచేసే వారు, టైలర్లు, మెకానిక్‌లు, చాకలి, నాయి బ్రాహ్మణులు, వడ్రంగి, కుమ్మరి, బట్టి కార్మికులు తదితర అర్హులైనా వారికి కార్డులు పంపిణీ చేస్తామన్నారు. గ్యారెంటీ పథకాల గురించి మాట్లాడే బీజేపీ నేతలు రష్యాలో చిక్కుకొన్న అమాయక భారతీయులను రక్షించాలని డిమాండ్ చేశారు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎఫ్‌డీఏ


లోకాయుక్తకు పట్టుపడ్డ ఎన్.నాగేష్

బళ్లారి అర్బన్: నగరంలోని ఆర్టీఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎఫ్‌డీఏ నాగేష్ లంచం తీసుకుంటుండగా లోకాయుక్త అధికారులకు పట్టుబడ్డాడు. లోకాయుక్త అధికారుల వివరాలు...ఆర్టీఓలో నాగేశ్ ఫస్ట్ డివిజన్ అసిస్టెంట్ అధికారిగా పనిచేస్తున్నాడు. ఆర్టీఓలో డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ తదితర వాటిపై ఆయనకు చేయి తడపందే ఫైల్ ముందుకు కదలదు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కార్యాలయంలోనే రూ. 1000 తీసుకుంటూ లోకాయుక్త అధికారులకు చిక్కాడు. అనంతరం హొసపేటలోని ఆయన నివాసంలో కూడా అధికారులు దాడి చేసి రూ. 3 లక్షల నగదు, బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు లోకాయుక్త అధికారి వసంత్‌కుమార్, సీఐ సంగమేశ్‌లు తెలిపారు. ఇతని వ్యవహారంపై గతంలో స్థానిక డ్రైవింగ్ స్కూల్ ప్రెసిడెంట్ మోహన్, డ్రైవింగ్ స్కూల్ యజమానులు కలిసి మంత్రి రామలింగారెడ్డికి ఫిర్యాదు చేయగా అతన్ని బళ్లారి నుంచి శివమొగ్గకు బదిలీ చేశారు. అయినప్పటికి నాగేశ్ కోర్టులో స్టే తెచ్చుకుని బళ్లారిలో విధులు నిర్వహిస్తున్నాడు. బళ్లారిలో భారీ ఆదాయం ఉండటంతో తిరిగి ఇక్కడే వస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వరలక్ష్మీ పండుగకు వేళాయే

- మార్కెట్లు కిటకిట
- కిలో కనకాంబరాలు రూ. 2 వేలు


పూల మార్కెట్‌లో రద్దీ

కోలారు: వరమహాలక్ష్మీ పండుగను పురస్కరించుకుని నగరంలో పండుగ కొనుగోళ్లు గురువారం జోరందుకున్నాయి. ఇదే సమయంలో పూలు, పండ్ల ధరలు ఆకాశాన్నంటాయి. ధరలు పెరిగిన మహిళలు అవసరమైనంత వరకే కొనుగోలు చేశారు. పూలు, పండ్లు కొనుగోలు చేయడానికి పెద్ద సంఖ్యలో నగర ప్రజలు రావడంతో మార్కెట్ కిటకిటలాడింది. నగరంలోని పాతబస్టాండ్, దొడ్డపేట, బస్టాండు సర్కిల్ తదిరత ప్రాంతాలలో కొనుగోళ్లు భారీ జరిగాయి. పూలు, పండ్లతో పాటు లక్ష్మీ విగ్రహాల కొనుగోళ్లు కూడా జోరుగా సాగాయి.

భారీగా పెరిగిన పూల ధరలు

వర మహాలక్ష్మీ పండుగ సందర్భంగా పూల ధరలు ఆకాశాన్నంటాయి. కనకాంబరాలు ఏకంగా కిలో రూ. 2 వేల నుంచి రూ. 2500 పలికింది. మల్లెలు కిలో రూ. 1600, కాగడాలు కిలో రూ. 800, రోజాలు కిలో రూ. 300, చేమంతులు కిలో రూ. 600, గుండు మల్లెలు కిలో రూ. 800, మామిడి ఆకులు సైతం విక్రయించారు. ఇక పండ్ల ధరలు కూడా భారీగా పెరిగాయి. ఆపిల్ కిలో రూ. 250, ఆరెంజ్ కిలో రూ. 180, చిన్న అరటి కిలో రూ. 130, పెద్ద అరటి కిలో రూ. 50, మోసంబి కిలో రూ. 180, దానిమ్మ కిలో రూ. 200 విక్రయించారు. ఇక వర లక్ష్మీ విగ్రహాలు సైతం భారీగా ధర పలికాయి.

కోలారు వార్తలు...

సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలి


కోలారులో గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి బైరతి సురేష్

కోలారు: స్వాతంత్య్రం కోసం పోరాటం సాగించిన సమరయోధులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బైరతి సురేష్ అన్నారు. గురువారం నగరంలోని విశ్వేశ్వరయ్య స్టేడియంలో స్వాతంత్య్ర దినోత్సవంలో ఆయన పాల్గొని జెండా ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి కేసీ రెడ్డి, క్షీర విప్లవనేత ఎం వి కృష్ణప్ప, దివంగత ఎంపీ చన్నయ్య వంటి గొప్పవారు జిల్లాకు చెందిన వారు కావడం గర్వకారణమన్నారు. ఉపాధిహామీ పథకాన్ని జిల్లాలో అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోలారు జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకు కావలసిన నిధులను అందిస్తోందన్నారు. కోలారు నగరానికి రూ. 60 కోట్ల నిధులు, రాబర్ట్‌సన్ పేట కెజీఎఫ్ అభివృద్ధికి రూ. 20 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు కోసం రూ. 100 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, ఎమ్మెల్సీలు ఎంఎల్ అనిల్‌కుమార్, ఇంచర గోవిందరాజులు, నజీర్ అహ్మద్ కలెక్టర్ అక్రంపాషా, ఎస్పీ బి నిఖిల్, సీఈఓ పద్మ బసవంతప్ప తదితరులు పాల్గొన్నారు.

సమర యోధుల ఆదర్శంగా తీసుకోవాలి

మాలూరు : దేశ స్వాతంత్య్రం కోసం అమరులైన వారిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కెవై నంజేగౌడ తెలిపారు. గురువారం పట్టణంలోని హోండా క్రీడా మైదానంలో స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎందరో త్యాగబలిదానాల ఫలితంగానే దేశానికి స్వాతంత్య్రం వచ్చిందని, ప్రతి ఒక్కరూ దేశాభిమానం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాలలో విశేష సాధన చేసిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె రమేష్, తాపం ఈఓ, బిఇఓ పురసభముఖ్యాధికారి తదితరులు పాల్గొన్నారు.

మహానుభావులను గుర్తుకు తెచ్చుకోవాలి

శ్రీనివాసపురం: పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో గురువారం స్వాతంత్య్ర వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే జికె వెంకటశివారెడ్డి పోలీసు ధ్వజవందనం స్వీకరించిన అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఎందరో వీరుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్య్రం వచ్చిందన్నారు. ఉత్తమ సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు శ్రమించాలన్నారు. అనంతరం వివిధ పాఠశాలలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తహసీల్దార్ జీఎస్ సుధీంద్ర, తాపం ఈఓ రవి, పురసభ ముఖ్యాధికారి వైఎస్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వాతంత్య్ర వేడుకలు

కేజీఎఫ్: స్వాతంత్య్ర అమృతోత్సవ వేడుకలను గురువారం నగరంలోని నగరసభ మైదానంలో వైభవంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఎమ్మెల్యే రూపా శశిధర్ మాట్లాడుతూ...స్వాతంత్య్ర వేడుకల్లో మనం పాలుపంచుకోవడం మన అదృష్టమన్నారు. దేశానికి స్వాతంత్య్రం తీసుకు వచ్చిన వారిని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు. ఎందరో మహనీయుల బలిదానమే నేటి స్వాతంత్య్రం అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాబోయే రోజుల్లో కేజీఎఫ్ నగరంలో పరిశ్రమలు తీసుకు వస్తుండి దీని వల్ల కెజీఎఫ్ పారిశ్రామిక విప్లవం ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ శాంతరాజు, తహసీల్దార్ నాగవేణి, తాపం ఈఓ మంజునాథ్ హర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.


పాత్రికేయుల భవనంలో...

వేడుకగా జెండా పండుగ

కోలారు: నగరంలోని పాత్రికేయుల భవనంలో గురువారం స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకుని జాతీయ పతాకాన్ని జిల్లా పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు గోపినాథ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన జెండా పండుగ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా పాత్రికేయుల సహకార సంఘం అధ్యక్షుడు కెఎస్ గణేష్, సురేష్, కోన మంజునాథ్, చంద్రు, చంద్రశేఖర్, జగదీష్, హెచ్‌కె రాఘవేంద్రరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.


మాలూరులో సాధకులకు సన్మానం


కేజీఎఫ్‌లో స్వాతంత్య్ర వేడుకల్లో ఎమ్మెల్యే రూప


వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి